పు — 16 ఫోన్ నెం.

సం — 6 36959

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (సప్లిమెంట్ లేదా పత్రిక) 26 రూపాయలు

30-3-'74 తేదీలోగా చేరేవారికి 18 రూపాయలు.

ఉచిత చందా డిపాజిట్టు 120 రూపాయలు.

జనవరి, 1974

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల

ఆర్టు ఎడిటర్:
సి. వి. అంజాదాస్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఉప్పలూరి ఉషారాణి
వాసవదత్త
ఎ. వి. మోహన్రావ్
మల్లాది వెంకటకృష్ణమూర్తి

తొలిమాట

నమస్కారము. జనవరి '74 నెల "అపరాధ పరిశోధ సప్లిమెంట్" వెలువడింది. ఇందులో—మల్లాది వెంకటకృష్ణ మూర్తిగారి "బ్లూఫిలింస్", ఉప్పలూరి ఉషారాణిగారి "విష వలయం", కె. శివరామ్‌గారి "నన్ను ఉరితీయండి", వాసవదత్త గారి "ఏడు హత్యలు?" నవలలు ప్రచురించబడ్డాయి.

ఇవి కాక పాఠకులకు ఒక బాలెట్ కూడా ప్రవేశపెట్టాము. పై నాలుగు నవలల్లో ఏది అత్యుత్తమమైన నవలనో పాఠకుల్లే ఎన్నుకోవలసి వుంది. అత్యుత్తమమైన నవలకు రు. 116/- లు బహుమతి. నాలుగు నవలలను సరియైన ఎన్నికచేసిన పాఠకులకు పదేసి రూపాయల చొప్పున బహుమతి లభించగలదు. యీ బాలెట్ ప్రతి నెలా వుంటుంది.

"సప్లిమెంట్"కు మొత్తం ఏడుగురు రచయితలను తీసుకున్నాము. ప్రతినెలా వీరే మీకు చక్కటి క్రైమ్ నవలలు అందిస్తారు. అప్పుడప్పుడు కొత్త రచయితలకు కూడా అవకాశం లభిస్తుంది. చక్కటి రచనలతో, పాఠకుల అభిమానం బాగా చూరగొన్న రచయితలకు ఆ అవకాశం ఇవ్వబడుతుంది.

"చివరి పేజి వినోదం" అనే మరో వినోదకరమైన శీర్షిక కూడా వుంది దీనిలో. ఇది పాఠకుల హాస్య రచనల శీర్షిక. దీనిలో రచనలు ప్రచురింపబడ్డ వారికి ఆ నెల "సప్లిమెంట్" బహుమతిగా పంచబడుతుంది. మరి మా కృషి ఎంతవరకు నెరవేరినదో! చదివి మీ అభిప్రాయాలు వెంటనే తెలుపుతారుకదూ?

సెలవా మరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ సంచికలో ....

కథలు

4. అనాథ రక్షకుడు—ఏ. వీ. మోహన్రావ్.
23. విషపు గుండునూది—మిస్. మధుబాల.
64. పారిపోయిన ఖైదీలు—మల్లాది వెంకటకృష్ణమూర్తి.
118. మరణానికి భరణం—రమణశ్రీ.
150. జీడిపప్పు పకోడీలు—శ్యాంబాబు.
182. నిప్పుతో చెలగాటం—వి. యస్. చెన్నూరి.
204. శత్రువులున్నారు జాగ్రత్త—కె. శివరామ్.

శీర్షికలు

11. అపరాధ పరిశోధన పోటీ_66.
21. పాఠకుల ప్రశ్నలు.
24. మీ తీర్పు ఏమిటి?
58. ఈ నెల జోక్స్—ఎమ్. జయంత్.
69. చెప్తా వినండి?
90. హామేషా_హంగామా.
117. చెప్పుకోండి చూద్దాం?
144. పాఠకుల పరిశోధన పోటీ.
153. మీకు తెలుసా?
174. ఈ నెల జోక్స్—ఎస్. వాహిద్.
181. అపరాధ పరిశోధన పోటీ_64 (ఫలితాలు).
197. రీడర్స్ క్లబ్.
200. క్రైమ్‌లో తమాషాలు.
221. ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ.
222. లేఖలు.

—గొప్ప కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

అనాధరక్షకుడు

పి.వి. మోహనరావ్

రామగోపాలరావు లక్షాధికారి. భార్య చనిపోయి పదహారేళ్ళ యింది. ఉన్న ఒక్క కొడుకూ ఉద్యోగం చేసుకుంటూ ఢిల్లీలో వుంటున్నాడు. లంకంత బంగళా పైభాగంలో తనొక్కడే వుంటూంటాడు.

క్రింది భాగమంతా అనాథలు, అభాగినులు, మొదలైన తర గతులకు చెందిన స్త్రీలు వుంటుంటారు.

వాళ్ళందరికీ తిండీ, గుడ్డా, రావుగారే అమరుస్తూంటారు. కాలక్షేపం చేసుకునేందుకు వీలుగా పగటిపూట వాళ్ళు గుడ్డలు కుట్టడం, బొమ్మలు చేయడం లాంటి చిన్నచిన్న చేతిపనులు చేస్తుంటారు.

రావుగార్ని ఊరంతా గోపికాలోలుడనీ, పరమకాముకుడనీ, పెట్టుబడి లేకుండా, చేతి తడి తగలకుండా, అందమైన స్త్రీలను ఇష్టం వచ్చినట్లు అనుభవిస్తుంటాడనీ, చెవులు కొరుక్కుంటూంటారు.

ఆ వూరి ఎం. ఎల్. ఎ గారుకూడా, ప్రజల అనుమానంలో తనూ ఏకీభవిస్తున్నాననీ, ఎలాగైనా పరిశోధించి, వల విసిరి, రావుగార్ని పట్టుకొని వారి అసలు రూపం అందరికీ బట్ట బయలు చెయ్యమని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చెయ్యటంతో, పోలీసు గూఢచారిణొకటి 'అనాధ' నంటూ రావుగారి ఆశ్రమంలోకి జొరపడింది.

ఆమె తనపేరు హైమావతని నమోదుచేయించుకొంది. భర్త కారాక్సిడెంటులో మరణించినాడనీ, దిక్కెవ్వరూ లేరనీ, మొర పెట్టుకొంది.

రావుగారు ఆమె కథ విని జాలిపడ్డారు. కంట తడిబెట్టారు. కళ్ళద్దాలు తుడుచుకుంటూ తన ఆశ్రమంలో వుండమన్నారు.

హైమ ఆశ్రమంలో చేరిన వెంటనే తనపని ప్రారంభించింది.

"రావుగారు మంచివారేనా?" అడిగింది ఇరవై ఆరు సంవత్స రాల విధవరాలు అనంతమ్మను.

"ఏం మంచి! నా మొహం! ఉత్త ముదరష్టపోడు. ఇంత తిండీ, గుడ్డా పడేసినందుకు మమ్మల్ని పశువుల్లాగూడా చూడడు. రాళ్ళలా భావిస్తాడు" అంది ఓ మారు రొమ్ములమీది పైట కొంగు కావాలని తీసి సరదాగా చూసుకొని మళ్ళీ వేసుకుంటూ.

"అంటే నా కర్థంకావటంలేదు!" అంది హైమ. నిజంగానే ఆమెకు అనంతమ్మ మాటల్లోని అర్థం స్ఫురించలేదు.

"అదేదో వివరంగా చెప్పి, నలుగురిలోనూ అల్లరిపాలు కావటం నా కిష్టంలేదు. ఇక్కడున్న వాళ్ళల్లో మంచి వయ స్సులో వున్న వాళ్ళంతా పడే అవస్థే అది. అయినా ఎవరికి వాళ్ళు గుట్టు చప్పుడుకాకుండా లోలోపలే దాచుకుంటున్నారు. నువ్వూ మంచి వయసులో వున్నావు. ఇక్కడే వుండబోతు న్నావ్. నాల్రోజులుబోతే నే చెప్పకుండా నీకే అర్థమవుతుందిలే!" అంటూ అక్కడ్నుంచి కదలివెళ్ళిపోయింది.

కూరల గంప నెత్తికెత్తుకొని ముందు హాల్లోకి అడుగు బెట్టిన ముసలిదాన్ని చూసి పది మంది ఆడవాళ్లు పరుగెత్తు కొచ్చారు. అందరూ సాయంబట్టి బుట్ట క్రిందకు దించారు.

బుట్ట ముందెట్టుకొని కూర్చుంది ముసల్ది.

"ఏం రావులమ్మా! ఏమిటి విశేషాలు?" అడిగిందో తల చెడిన తలిరుబోడి.

"ఏవుంది? ఇంకమీద ఈ బజారంట కూరలు అమ్ముకోను రాదలచుకోలేదు!" అంది చిన్నగా.

"ఏం? ఏమయింది?" అడిగారందరూ ముక్తకంఠంతో.

"ఆ హాస్టలు పిల్లలు నన్ను తిట్టిపోస్తున్నారు. 'ఎన్నాళ్లు చీటిల్ప్రేమ. చీకటి రాత్రులు వస్తున్నాయి. పోతున్నాయి. ఓప

లేక భరిస్తున్నాం. ఎలాగో లాగ ఒక్కొక్కర్నీ తీసుకురా' అంటున్నారు. మీరేమో అతనేమన్నాడు?ఇతనేమన్నాడు? అంటూ నా గంపచుట్టూ చేరుతారు తప్ప కాసంత ధైర్యం చెయ్యరు. రెండ్రోజులాగితే నన్ను తన్నేట్టున్నారు" అంది రావులమ్మ.

"చీకటి పడింది మొదలు తెల్లారేదాకా మా చుట్టూ కత్తుల బోనుపెట్టి కాపలాకాస్తున్నా డా ముసలిడొక్కు. ఎలాచావటం!"

తన బాధ ఒలకబోసిందో పూలు అలంకరించుకునేందుకు నోచుకోని పూబోణి.

"ఏమోనమ్మా! మీ బాధ, వాళ్ళ బాధ చూస్తుంటే నాకు బాధగా వుంది" అంది రావులమ్మ.

అంతలో హైమవతి అక్కడి కొచ్చింది.

ఆమె రాక గమనించి అందరూ మౌనం వహించేరు. గబ గబ రావులమ్మ బుట్టలోంచి కూరలేరుకోవటం ప్రారంభించారు. కూరలు తీసుకోవటం కాగానే ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్ళిపోయారు.

2

అందరూ మధ్యాహ్నం భోజనాలకి లేచారు.

వంటమనిషి అందరి విస్తళ్ళల్లోనూ పండు మిరపకాయల కారం వడ్డించింది.

"ఇలాంటి సాధకాలు ఎందుకు చేస్తారో?" అంది హైమావతి ఎక్కువ తింటే, సెక్స్ కోరికలు ఎక్కువవుతాయని, తనెప్పుడో చదువుకున్న విషయాల్ని గుర్తుచేసుకుంటూ.

"ఇంకెందుకు? మనప్రాణాలు తీసేందుకు. మనం చస్తుంటే వాళ్ళు చూచి ఆనందించేందుకు" అంది అనంతమ్మ.

అంతలో రావుగారు హాల్లోకి వచ్చారు.

అందరి నోళ్ళకూ తాళాలు పడ్డాయి. తిండి తినటం ప్రారంభించారు.

రావుగారు దగ్గిరుండి ఎవరెవరికి, ఏ కూర కావాలో, వడ్డించమని పురమాయించసాగారు.

హైమావతి కెంత ప్రయత్నించినా ఏ విషయమూ తెలియలేదు. రాత్రి భోజనాలయినాక, అందరూ పడకలు సర్దుకోవడం ప్రారంభించారు. వాళ్ళల్లో రకరకాల జట్లున్నాయి. ఇద్దరిద్దరుగా పడుకోవడం అలవాటు చేసుకున్నా రనుకుంది హైమ.

పాటలు పాడేవాళ్ళు, కథలు చెప్పేవాళ్లు, జోకులు చెప్పుకొని నవ్వుతూ నవ్వించేవాళ్ళు, రకరకాలుగా వున్నారు. ఒకరిమీద ఒకరు కాళ్లేసుకుంటూ, చేతులు వేసుకుంటూ, తమ భర్తలతో పొందిన ఆనందాల్ని, అనుభవాల్ని, లజ్జ విడిచి చెప్పుకొంటూ, ప్రక్కవాళ్ళకు చేపి చూపిస్తూ అల్లరి చెయ్యడం చూస్తే హైమకు కంపరం పుట్టుకొచ్చింది.

పది గంటలు కాగానే రావుగారు లోనికొచ్చారు. అందరూ నిశ్శబ్దంగా పడుకున్నారు. చేతి కర్రతోనే అందర్నీ లెఖపెట్టుకున్నారు.

తెరచివున్న కిటికీలను మూసి, తలుపులు గడియబెట్టి తాళం వేసుకుని వెలుపలకు వెళ్ళిపోయారు.

"రావణుడు వెళ్ళాడా?" అడిగింది అనంతమ్మ.

"ఆఁ!" అంది మరో స్త్రీ.

"వెలుపల కాపలావాళ్లకు సూచనలిచ్చిగదా మేడమీదకు వెళ్లేది" అంది మరోకామె.

"వెలుపల కాపలా వుంటారా?" అడిగింది హైమ.

"ఆఁ! ఇద్దరు ముసలి రాక్షసులు" అంది అనంతమ్మ.

అందరూ నిద్రలోకి ఒరిగిపోయారు.

హైమమాత్రం మేల్కొనే వుంది. ఆ రావుగారు మళ్ళీ ఏ అర్ధరాత్రప్పుడో వచ్చి, తనకు నచ్చిన అనాధని మేడమీదకు పిలుచుకునిపోతాడేమోనన్న అనుమానంతో తెల్లారిందాకా మేలు కొని వుండేందుకే నిర్ణయించుకుంది.

బయట కారాగిన శబ్దమైంది. తలుపు తెరచినట్లు చప్పుడు. వెంటనే టకటకమంటూ బూట్ల సవ్వడీ వినిపించాయి హైమకు.

ఎవరొచ్చి వుంటారని ఆలోచించసాగింది.

లేచి వెళ్ళి కిటికీ తలుపుతీసి చెవులు రిక్కించి వినసాగింది.

మేడ పైనుండి పెద్దపెద్దగా కేకలు వినిపించసాగాయి. ఏ మరచుకుంటున్నదీ ఆమెకు అర్ధంకాలేదు.

ఆ తర్వాత రెండు నిముషాలకు "మీరు చచ్చాకే నేను ఆస్తిని అనుభవించాల్సివుంటే, అంతదాకా ఆగే వీలూ, ఓపికా నాకు లేవు. నా అవసరాల ఒత్తిడికొద్దీ మిమ్మల్ని చంపవలసి వస్తుందేమోనన్న అనుమానంగా వుంది. మీరు మళ్ళీ ఆలో చించుకోండి. అడ్డమైన ఆడవాళ్లను చేరదీసి శృంగార కార్య కలాపాలు సాగిస్తూ, నాకూ తలవంపులు తెచ్చిపెట్టడమే గాకుండా, నే ననుభవింపవలసిన ఆస్తినంతా హారతి కర్పూ రంలా హరిస్తూంటే చూస్తూ ఊరుకునే వాజమ్మను కాలేను. వస్తా!" నంటూ వినిపించింది.

ఆ వచ్చింది రావుగారి ఏకైక పుత్రుడని సులభంగానే తెలుసు కొంది హైమ.

కారు కదిలి వెళ్ళిపోయింది.

తిరిగి అంతా నిశ్శబ్దంగా వుంది.

కిటికీ తలుపు మూసి వచ్చి నడుం వాల్చింది హైమ. చుట్టూ వున్నవాళ్ళను, వాళ్లు పడుకున్న తీరుతెన్నుల్ని చూసి ఆమెలో అసహ్యం పుట్టుకొచ్చింది. క్షణకాలం తన ఉద్యోగాన్నికూడా తిట్టుకొంది.

హైమకు తెలియకుండావే. ఆమె కళ్ళు మగతగా మూత పడ్డాయి. అలసిపోయిన శరీరం వెంటనే నిద్రలో కూరిగి పోయింది.

పెద్దగా అరుపులు, కేకలు, మనుషులు పరుగెత్తుతున్న ఛప్పుడు కోలాహలంగా విన్పించాయి.

హైమ వులిక్కిపడి లేచింది. ఆమెతోపాటు మిగిలిన వాళ్లందరూ లేచారు. లైటు వెలిగించారు. తలుపులు తెరచేందుకు ప్రయత్నించారు.

వెలుపల తాళం వేసివుండటంతో, లోపలనుంచి వాటిపైన చేతుల్తో దబదబ బాదటం మినహా మరేమీ చెయ్యలేకపోయారు.

ఐదు నిముషాలకు వెలుపలినుండి తలుపులు తెరిచారు. లోపలున్న అనాధలంతా మూకుమ్మడిగా వెలుపలకు పరుగెత్తారు.

"ఏమైంది? ఏమైంది?" అడిగారు ఆతృతగా.

కాపలావున్న కోటయ్య ఏం మాట్లాడలేదు. మేడపైనుంచి దిగొచ్చిన గంగయ్య "ఒరే కోటా! అయ్యగార్నెవరో సంపేశార్రా!" గుండెలు బాదుకుంటూ చెప్పాడు.

అందరూ మెట్లెక్కి పైకి వెళ్ళారు.

రావుగారి పడకగది ఖాళీగావుంది. బాత్‌రూం తలుపు తెరచి వుంది.

హైమ వెళ్ళి చూచింది. బాత్ టబ్ వెనుక టాప్ కింద కూలబడి వున్నాడు రావుగారు. ఆయన తల టబ్‌పైన పడి లోనికి వ్రేలాడుతూంది. తలపైనుండి బొటబొట రక్తం కార సాగింది.

3

ఒక అరగంటలో రావుగారి మేడ పోలీసువాళ్ళతో, బూట్ల టకటకలతో హడావుడిగా తయారైంది.

అపరాధ పరిశోధన పోటీ-66

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక తెల్లకాగితంపై వ్రాసి, దానితో 50 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక సంవత్సరముపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక, లేదా "సప్లిమెంట్" ఏది కోరితే అది పంపగలము.

ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 50 పైసల పోస్టలు స్టాంపులు జతపర చాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనక మీ పూర్తి చిరునామా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-1-'74 తేదీలోగా మాకు చేరే టట్లు పంపండి. తుది నిర్ణయం సంపాదకులదే. ఫలితాలు మార్చి' 74 నెల సంచికలో ప్రకటిస్తాము.

1. భారతదేశంలో పెట్రోలుధర విపరీతంగా పెరిగి పోడానికికారణం_?(అరబ్ దేశాలు,ఎక్సైజ్ సుంకం.)

2. పోలీసు ఉద్యోగానికి ఇది ముఖ్యమైన అర్హత__? (చురుకుదనం, గుండె ధైర్యం.)

3. ఈ దేశంలో నీటితో నడిచే కారును తయారు చేశారు__? (ఇటలీ, రష్యా.)

4. పెద్ద పెద్ద పట్టణాలలో ఫుట్ పాత్ లమీద వీరెక్కువగా కనిపిస్తారు__? (అడుక్కుతినేవారు, అమ్ముకునేవారు.)

5. ఈమధ్యమనదేశంలో వీరినిఅపహరించుకెళ్ళటం ఎక్కువగా కనిపిస్తున్నది__? (పిల్లలు, యువతులు.)

ఇన్‌స్పెక్టర్ రాయుడు స్థూలకాయాన్ని అతికష్టంపైన మెట్లమీదుగా పైకెక్కించాడు. బుర్రమీసాలు దువ్వుకుంటూ అక్కడున్న అనాథల్ని మిగిలిన జనాన్నీ పరిశీలనగా చూశాడు.

హైమవచ్చి రాయుడితో రెండు నిముషాలు మాట్లాడింది. రాయుడు వింటూ తలూపాడు.

ఫొటోలు తీయటం, వేలిముద్రలకోసం వెతకటంలాంటి తతంగం ప్రారంభమైంది.

"ఏమైంది? ఏమైంది?" అంటూ వచ్చాడు ముప్ఫయి సంవత్స రాల యువకుడు రాయుడివద్దకు.

"మీ రెవరు?" అడిగాడు రాయుడు మీసాలు దువ్వుకుంటూ.

"రావుగారబ్బాయిని. నేను పదకొండు గంటలదాకా నాన్న గారితో మాట్లాడుతూనే వున్నాను. వారు ఆరోగ్యంగానే వున్నారు. ఇంతలో ఏం ముంచుకొచ్చింది?" అడిగా డతను.

"విధి ముంచుకొచ్చింది. ఎవరో వార్ని దారుణంగా హత్య చేశారు. కాస్త ఆగాక, కావాలంటే వెళ్ళి మీ నాన్నగారి శవాన్ని చూసి వచ్చి ఇక్కడే కూర్చోండి! మిమ్మల్ని కొన్ని విషయా లడిగి తెలుసుకోవాలి!" అన్నాడు రాయుడు.

రావుగారబ్బాయి బదులు పలక్కుండా నిలబడ్డాడు.

పోలీసు డాక్టరు వెలుపలకువొచ్చాడు ముందు. "ప్రాథమిక పరిశోధన చేసి చూశాను. ఆయన చనిపోయి గంటకూడా కాలే దనిపిస్తుంది. వారి తలపైన ఎవరో సీసాతో బలంగా మోదారు. దాంతో తల చిట్లి రక్తం విపరీతంగా పోయింది. ఆ తర్వాత ఆయన తలను గుడ్డతోకప్పి, టాప్ క్రిందపెట్టి నీళ్ళు వదిలారు. టబ్ సగం నిండాక తలను అందులో ముంచి, అదిమి వుంచి వట్టుంది. ఆ దెబ్బకు ఊపిరాడివుండదు, అందువల్లే చనిపోయి వుంటారనిపిస్తుంది" అన్నాడు రాయుడితో.

"వ్రేలిముద్రలెవరివైనా దొరికాయా?" అడిగాడు రాయుడు ఎదురొచ్చిన ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్ట్‌ని.

"ఏవీలేవుసార్! దొరికిన నాలుగైదు ముద్రలు వారివిలాగానే వున్నాయి. అదైనా కాస్త పరిశోధించి చూడాలి" అన్నాడు.

రాయుడు మెల్లిగా లేచి బాత్‌రూంలోనికి పోబోయాడు. కానీ దానిద్వారం సన్నదికావటంతో తను వెలుపలే నుంచుని చూడసాగేడు.

అంతకుముందే లోనికి దూరిన హెడ్‌కానిస్టేబులు ఏడుకొండలు టబ్బుమీద కూర్చుని, నిదానంగా చూడసాగాడు.

శవం ప్రక్కనే పగిలి పడున్న సీసా పెంకుల్నిచూసి అతని కళ్లు మెరిశాయి.

"సార్! సీసాపెంకులున్నాయి, తీసేదా?" అడిగాడు.

"తాకొద్దు. వాటిమీద వ్రేలిముద్రలుండొచ్చు. ఇంకేమైనా ఉన్నాయేమో చూడు" అన్నాడు.

మళ్లీ వెతకడం ప్రారంభించాడు ఏడుకొండలు.

బాత్‌టబ్‌లో నల్లకళ్లజోడు కనుపించింది. దానికి ఒక అద్దం లేదు. దాని తాలూకు పగిలిన పెంకులు నీళ్ళలో అక్కడక్కడా కనుపించాయి.

వాటి విషయంకూడా రాయుడికి చెప్పాడు ఏడుకొండలు.

లోనికి వెళ్లి చూసేందుకు వీల్లేకుండాచేసిన తన స్థూలకాయాన్ని లోలోపలే తిట్టుకున్నాడు. అక్కడ్నుంచి కదలి నెమ్మదిగా హాల్లోకి వచ్చాడు.

పోస్ట్‌మార్టం చేసేందుకు శవాన్ని అక్కడ్నుంచి తరలించే ఏర్పాట్లు చకచక జరిగిపోయాయి.

రాయుడు సోఫాలో చేరగిలబడి కూర్చున్నాడు. హైమ ఆయనకు దగ్గరలో కూర్చుంది. ఎదురుగా వున్న సింగిల్

సోఫాలో రావుగారబ్బాయి కూర్చున్నాడు. అతని వెనుక గంగయ్య, కోటయ్య నిలబడ్డారు.

అనాథ లందర్నీ క్రింది హాల్లోకి వెళ్ళిపొమ్మన్నాడు రాయుడు. అందరూ అయిష్టంగా అక్కడ్నుంచి కదలి వెళ్ళారు.

రాయుడు మీసాలను ఓ మారు దువ్వుకొని, "మీ నాన్న గారికి జరిగిన ఘోరాన్ని చూశారుగా? ముందు మీరేం చెప్ప దలచుకున్నారో విందామనుకుంటున్నాను. చెప్పండి" అన్నాడు.

రావుగారబ్బాయి పెదిమలు కదిలిస్తూ "చెప్పేందు కిందులో ఏముంది? జరిగింది నిజంగా ఘోరం. ఆ దుర్మార్గులను పట్టు కొని మీరే ఉరికంబ మెక్కించాలి" అన్నాడు.

"వారి మరణం ఎక్కువగా లాభించేది మీకేనని విన్నాను. నిజమా?" అడిగాడు రాయుడు.

"తెలీదు!"

"ఇంతకుముందు మీ రొచ్చి మీ నాన్నగారితో ఘర్షణ పడ్డా రనీ, వెళ్ళిపోతూ అవసరమైతే చంపైనా ఆస్తిని పొందుతాననీ మీరు గట్టిగా చెప్పినట్లు తెలిసింది. నిజమేనా?"

"నిజమే! మాటామాటా పెరిగింది. ఆయన మొండిగా మాట్లాడాడు. నాకూ కోపం ముంచుకొచ్చింది. కాస్త గట్టిగా ఘర్షణపడ్డాను. అలాగని కొంపదీసి ఆయన్ను నేనే చంపానను కుంటున్నారేమిటి?"

"అసలు హంతకుడు తెలిసిందాకా అందరితోపాటు మీరూ అనుమానితులే" అన్నాడు రాయుడు.

"ఇది అన్యాయం?" అన్నాడు రావుగారబ్బాయి కోపంగా.

"న్యాయం చేసేందుకే ఇదంతా!" అన్నాడు రాయుడు.

"మీరు ఇక్కడ్నించి వెళ్ళింది మొదలు, తిరిగి ఇక్కడకు వచ్చిందాకా ఎక్కడున్నదీ, చెప్తారా?"

"నాన్నగారితో మాట్లాడి తిన్నగా హోటల్ రాయల్‌లోని ఆరోనెంబరు గదికి వెళ్లాను. అక్కడే పడుకొని నిద్రబోయాను. ఇక్కడ్నుంచి ఎవరో ఫోన్ చేశారంటూ హోటల్ బాయ్ వచ్చి చెప్పాడు. వెంటనే బయలుదేరి వచ్చాను. అంతే!" అన్నాడు రావు గారబ్బాయి.

"అంతే అయితే ఫరవాలేదు. మీరు హోటల్లోనే వుండండి. అవసరమైతే మళ్లీ కలుస్తాను" అన్నాడు రాయుడు.

ఆ తర్వాత గంగయ్యను, కోటయ్యను మార్చిమార్చి ప్రశ్నలు వెయ్యసాగాడు. వాళ్లు వంగి వంగి, నంగి నంగి, సమాధానాలు చెప్పసాగారు.

గంగయ్య టీ త్రాగేందుకు ఆ రోడ్డు కొసనున్న అంగడికి వెళ్లాడట. కోటయ్య క్రిందవైపు అమ్మాయిలున్న హాలుకెదురుగా మెట్లమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటూ వుండిపోయాడట.

అంతలో పరుగెత్తుతున్నట్లు బూట్ల శబ్దమయిందట. లేచి పరుగెత్తాడట. ఏమీ కనుపించలేదట.

ఇంతలో గంగయ్య వచ్చాడట. తను ఆ విషయం గంగయ్యతో చెప్పగానే, గంగయ్య మేడమీదకు వెళ్లాడట. ఆ తర్వాత రెండు నిమిషాలకు పైనుంచి అయ్యగార్ని చంపేశారని చెప్పాడట.

అంతకుమించి వాళ్ళిద్దరివద్ద మరే సమాచారం తెలీలేదు.

4

రాయుడికెంత ఆలోచించినా, ఈ హత్యకేసులో పరిశోధన ఎటువైపునుంచి ప్రారంభించాలో అర్థం గాలేదు. వ్రేలిముద్రలెవ్వరివీ దొరకలేదు. పగిలిపోయిన విస్కీ సీసా, నల్ల కళ్ళద్దాలు తప్ప మరేవిధమైన క్లూలు లేవు.

"హైమగారూ! అనాధలున్న హాలుకు వేసిన తాళాలు ఎవరి వద్ద వుంటాయి?" అడిగాడు.

"రావుగారి దగ్గరే వుంటాయిట."

"అక్కడున్న అనాధుల్లో ఎవరికైనా వెలుపలి వాళ్ళతో ఏదైనా సంబంధమున్నట్లు మీకు అనుమానమేసిందా?"

"లేదండీ! కానీ కూరలమ్మే రావులమ్మ రాగానే అందరూ చుట్టుముట్టి ఏమేమో మాట్లాడుకోసాగారు. నేను వాళ్ళ మధ్యకు రాగానే సంభాషణ ఆపేశారు. అందువల్ల నాకు వాళ్ళే విషయాలు మాట్లాడుకున్నారో అర్ధం గాలేదు" అంది.

హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండల్ని పిలిచి, వెళ్ళి రావులమ్మని లాక్కురమ్మన్నాడు. అతను హెడ్ ఊపి వెళ్ళిపోయాడు.

రావుగారి బాంక్ కు ఫోన్ చేసి అంతకు ముందురోజు వారు బాంక్ నుంచి పదివేలరూపాయలు డ్రా చేసినట్లు తెలుసుకున్నాడు.

జీపెక్కి మళ్ళీ రావుగారింటికెళ్ళి ఆ డబ్బుకోసం వెతికాడు. ఎక్కడా చిక్కలేదు.

వారు రాసే అకౌంటు బుక్ చూశాడు. అందులో ఎవ్వరికీ డబ్బిచ్చినట్లుగా ఎంట్రీలు లేకపోవటంతో ఆయన్ని చంపినవాళ్ళెవరో, ఆ డబ్బుగూడా తీసుకెళ్ళి వుంటారనుకున్నాడు.

ఒకవేళ ఆ డబ్బుకోసమే ఈ హత్య జరిగినా జరిగివుండ వచ్చు ననుకున్నాడు.

పరిశోధన చేసేకొద్దీ అనుమానితుల లిస్టు పెరుగుతూందే తప్ప, తరగడంలేదు. రాయుడికంతా గందరగోళంగా వుంది.

5

రాయుడు జీపెక్కి హోటల్ రాయల్ లోని ఆరో నెంబరు గది కెళ్ళాడు.

రావుగా రబ్బాయి ముక్కుదాకా మందు బిగించి, మంచం పైన పొక్కి సోలిపోయాడు.

దగ్గరగావేసి వున్న తలుపుల్ని నెట్టుకొని లోని కెళ్లాడు రాయుడు. తట్టి లేపాడు రావుగా రబ్బాయిని.

రాయుడుగారి స్థూలకాయాన్ని చూడగానే అతడికి మైకం వదలింది.

"మీరా!" అన్నాడు.

"ఆఁ నేనే!" అంటూ టేబుల్ కేసి చూశారు.

టేబుల్ పైన చిన్న బాండ్ సూట్ కేస్ వుంది. దాని ప్రక్కనే గ్లాసులు, మంచినీళ్లు, సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టి వున్నాయి. వాటి నానుకుని అద్దాలు పెట్టుకునే కవరుంది. దాన్ని చేతిలోకి తీసుకొని పరిశీలనగా చూస్తూ "చాలా బావుంది! దీన్లో అద్దాలేవి?" అడిగాడు,

"అవి ఎక్కడో మరచిపోయాను" అన్నాడు రావుగా రబ్బాయి.

"ఇవేనా?" అంటూ కోటు జేబులోంచి ఒక జత తీసి చూపించాడు. రెండద్దాల్లో ఒకటి పగలిపోయి వుంది.

"అవే! మీదగ్గర కెలా వచ్చాయి?"

"మీ నాన్నగార్ని హత్య చేసేప్పుడు అవి బాత్ టబ్ లో పడి పోయాయి. నాకు చిక్కాయి" అన్నాడు.

"నేను మా నాన్నను హత్య చెయ్యలేదు. అవి నావే! కానీ వాట్ని రాంప్రసాద్ రూంలో మర్చిపోయాను" అన్నాడు.

"అత నెవరు?"

"మా నాన్నగారుండే వీథిలోనే వున్న హాస్టల్ లో వుంటాడు. ఏదో చదువుకుంటున్నానని చెప్పాడు."

"అతను నీకెలా తెలుసు?"

"గంగయ్య తీసుకెళ్ళాడు."

"అక్కడేం జరిగింది?"

"మా నాన్నను కాస్త భయపెట్టమని చెప్పాను. ఆస్తి నాకు అప్పగిస్తే అనాధ శరణాలయానికి అతన్ని ట్రస్టీగా పెడతానని చెప్పాను. అంతే! నేను మా నాన్నను చంపమనలేదు. నన్ను మీరే రక్షించాలి" అన్నాడు అతను ఏడుస్తూ.

అతన్ని వెంట బెట్టుకొని జీపెక్కి రావుగారింటికి చేరాడు.

జీపు దిగుతూండగానే ఎదురొచ్చిన ఏడుకొండలు "సార్! ఆ గంగయ్య టీ త్రాగనే లేదట. టీ కొట్టు యజమాని చెప్పాడు" అన్నాడు.

"గంగయ్యేడి?" అడిగాడు రాయుడు.

"వాణ్ణి పట్టుకు రమ్మని పోలీసుల్ని పంపించాను. ఈ పాటికి లాక్కొస్తుండాలి" అన్నాడు.

అంతలో నలుగురు పోలీసులు ఒక ముసలిదాన్ని లాక్కొచ్చి నిలబెట్టారు.

"ఇదెవరు?" అడిగాడు రాయుడు.

"రావులమ్మ సార్! దీనింట్లోనే గంగయ్య వుంటున్నాడు. మమ్మల్ని చూసి పరుగెత్తాడు. మనవాళ్లు వాడి వెంటబడ్డారు. ఈ ముసలిదాని క్కూడా ఈ హత్య సంగతి తెలిసుంటుంది సార్!" అన్నాడొక కానిస్టేబుల్.

రాయుడు రావులమ్మని తంతానని బెదిరించేసరికి తనకు తెలిసిన విషయాలు చెప్పసాగింది.

ఆ వీధిలోనే వున్న హాస్టలులో వుండే కొంతమంది రౌడీ పిల్లలు, తన్ను పిలిచి చీటిలు రాసి యిచ్చేవాళ్ళనీ, అవి తెచ్చి అనాధులకిచ్చి, వాళ్ళు రాసిచ్చినవి తీసుకెళ్ళి తిరిగి ఇస్తుండేదనీ,

కలుసుకునేందుకు ఎన్ని రకాల ప్రయత్నించినా వీలుగాక వాళ్లూ, వీళ్ళూ రావుగార్ని తిట్టిపోయసాగారని చెప్పింది.

రావులమ్మ ద్వారా ఆ రౌడీల పేర్లు సేకరించి, వెంటనే హాస్టలుపైన బడ్డారు బలగంతో.

అందరికీ నాయకుడిలాంటి రాంప్రసాద్ రాయుడిగారి రాక జూచి బెంబేలు పడ్డాడు.

బుర్ర మీసాలు దువ్వుతూ, "రావుగార్ని హత్య చేసింది నువ్వేకదూ! రావులమ్మ నీ భాగవతం మొత్తం చెప్పిందోయ్!" అన్నాడు.

రాంప్రసాద్ ఠిక్కచచ్చిపోయాడు.

"సార్! నాకేం తెలియదు. రాత్రంతా రావుగారబ్బాయి నంటూ ఇక్కడికి వచ్చాడొకతను. అతని వెంట కాపలాకాసే గంగయ్యనే మనిషి ఒకడున్నాడు. మేము పడుతున్న అవస్థలు వాళ్ళకు తెలుసనీ, గంగయ్య రావుగార్ని హాలీమనిపిస్తాడనీ అందుకు అతని వెంట సాయంగా వెళ్ళిరమ్మనీ, ఈ నేరం ఎవ్వరిపైకీ రాకుండా అన్నీ కట్టుదిట్టాలు చేశామనీ చెప్పారు. ఈ సాయం చేసినందుకు అనాధల్ని మెయింటెయిన్ చేసే అధికారం నాకే ఇస్తామన్నారు. ఆవేశంలో వున్నాను. అలాగేనని ఒప్పుకొన్నాను.

"అర్థరాత్రి గంగయ్య నా దగ్గరి కొచ్చాడు. రావుగారబ్బాయి ఇచ్చిన ఎర్రకళ్ళద్దాలు గంగయ్యకు ఇచ్చి వెంటవెళ్ళాను. నేను గదిబయట వున్నాను. గంగయ్య లోనికెళ్ళాడు. ఆ తర్వాత జరిగింది మీకు తెలిసే వుంటుంది."

"ఆ డబ్బు ఏమైంది?"

"ఏ డబ్బండీ! నాకేం తెలీదు."

"అయితే ఆ పదివేల రూపాయలు నీవు తీలేదా?"

"లేదండీ! గంగయ్యే తీసుంటాడు."

"సరే, నువ్వు, నా వెంటరా!" అంటూ అతన్ని వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత గంగయ్యను డబ్బులతోసహా పట్టుకునేందుకు పట్టుమని పది నిముషాలు పట్టలేదు రాయుడికి.

గంగయ్య చేసిన నేరం ఒప్పుకున్నాడు. రావుగా రబ్బాయితో గంగయ్య ఉత్తరాల ద్వారా అంతకుముందు నుంచే పథకం ప్రారంభించాడని తెలుసుకొన్నాడు రాయుడు.

"ఆయన్ను డబ్బుకోసం చంపావా?" అడిగాడు రాయుడు.

"కాదు! కక్ష! ఒకరోజు నేను ఒక అనాధతో తోటలో ఆనందం అనుభవిస్తున్నాను. రావుగారు అది చూసి చేతి కర్రతో చితక బాదాడు. తన దగ్గర్నుంచి వెళ్లిపొమ్మన్నాడు ఆయన కాళ్లుపట్టుకుని బ్రతిమిలాడి ఉద్యోగంలోనే వుండిపోయాను. అది మొదలుకొని ఆయనపైన పగ పెరిగింది. అవకాశం కోసం ఎదురుచూచాను. చిక్కగానే కసితీరా చంపాను" అన్నాడు. గంగయ్య.

అభాగినులను ఆదరించే ఒక మహానుభావుడ్ని తమ స్వార్థం కోసం. బలిచేసిన రాక్షసులను తలచుకొని కంపరమెత్తింది హైమకు.

రావుగారి పైన వేసిన వన్నీ అభాండాలనీ, వారు ఎంతో మంచివారనీ ఉత్తములని తెలియచేస్తూ రిపోర్టు పంపింది హైమ పై అధికారులకు. ★

"రోజూ నీ వెంటపడేవాడు. అతను ఈ మధ్య కనపడటం లేదే?" అడిగింది హేమ.

"ఏముందీ అతనికి ఓ పదిరూపాయలు అప్పిచ్చాను, అంతే! కనబడలేదు!!" చెప్పింది రాణి. —నాదెళ్ళ లక్ష్మీదాసు.

పాఠకుల ప్రశ్నలు

బి. రాజేంద్రప్రసాద్, గూడూరు.

రివాల్వర్‌కు, పిస్టల్‌కు గల తేడా ఏమిటి? వీటితో ఎంత దూరాన్నుంచి కాల్చవచ్చు?

రివాల్వర్‌లో గుండ్లు గుండ్రంగా తిరిగే చక్రంలాంటిదాంట్లో అమర్చబడతాయి. వెంటవెంటనే కాల్చేందుకు వీలవుతుంది. పిస్టల్‌లో అలా వీలుండదు. ఒకదాని తర్వాత మరొకటి నింపాలి. పిస్టల్ అతి దగ్గర్నుంచి కాల్చాలి. కాని రివాల్వర్ దాని కాలిబర్ నెంబరునిబట్టి దూరంయొక్క పరిమితి మారుతుంటుంది.

ఆర్. కె. యోగానంద్, బళ్ళారి.

శ్యామ్‌జీ! ప్రభుత్వం పెట్రోలు ధరలను దాదాపు రెట్టింపుకు పెంచటం సమంజసమే నంటారా?

ఇది నిజంగా ఆలోచనలేకుండా తీసుకొన్న చర్యతప్ప మరేం కాదు. అరబ్బుదేశాలు మనకు సప్లై చేస్తున్న నూనెలో ఎటువంటి కోతా విధించలేదు. ధరకూడా అంతగా పెంచలేదు. సప్లై యధాప్రకారంగా కొనసాగుతూనే వుంది. అయినా ప్రభుత్వం తమ ఆదాయంకోసం విపరీతంగా ఎక్సైజ్ విధించింది. దీని ప్రభావం ప్రతి వస్తువుపైన, ప్రతివారిమీద వుంటుంది. రోజు రోజుకీ పెరిగిపోతున్న ధరలు మరింత పెరగటానికి దోహదం చేస్తుంది యీ చర్య!

సి. రామక్రిష్ణ, నెల్లూరు.

నూతన సంవత్సర కానుకగా మీరు, మాకు అందించ బోతున్న "సప్లిమెంట్" కొత్త తరహాలో వుంటుందని ఆశించ వచ్చా?

తొలి "సప్లిమెంట్" వెలువడింది కదా. చదివి మీరే తెలియ జేయండి, మీ అభిప్రాయం.

కేయార్స్, యూత్ సొసైటీ, కొత్తపాలెం.

దయచేసి తెలుగువైనా, ఇంగ్లీషువైనా కొన్ని డిటెక్టివ్ మాసపత్రికల అడ్రసులు తెలుపండి.

తెలుగులో "అపరాధ పరిశోధన" తప్ప మరేదీ నెలనెలా వస్తున్నట్లు మాకు తెలీదు. ఇక ఇంగ్లీషులో కూడా మనదేశంలో ఏవీ ప్రచురితమవుతున్నట్లు లేదు. ఫ్రంట్ పేజి డిటెక్టివ్, ట్రూ డిటెక్టివ్‌లాంటి ఫారిన్ పత్రికలకు ప్రయత్నించండి.

కూచిభొట్ల శ్రీనివాసశాస్త్రి, గుడివాడ.

అన్నయ్యా! 'ఆరు సూత్రాల పథకం' పై మీ అమూల్యాభి ప్రాయం ఏమిటి?

ఆరు సూత్రాల పథకమైనా, అరువది సూత్రాల పథకమైనా వాటిని చిత్తశుద్ధితో అమలు జరిపే సమర్థవంతమైన నాయకత్వం కావాలి. అది వుంటే మనకు ఇన్ని గొడవలు, ఇంత రచ్చబండ జరిగేది కాదు.

డి. నిర్మలాదేవి, విద్యానగర్.

ఎడిటర్జీ! "సప్లిమెంట్" లో కూడా కొన్ని పోటీలు, శీర్షి కలు నిర్వహిస్తే బావుంటుంది కదా?

"సప్లిమెంట్" ఉద్దేశం పాఠకులకు మంచి క్రైమ్ నవలలు అందించాలనే. నవలలకు తప్ప దీనిలో మరే ఇతర రచనలకు ప్రాధాన్యత లేదు. అయినా మీ కోరికనుబట్టి ఒక బాలెట్

పోటీని, ఒక హాస్యశీర్షికను మాత్రం ప్రవేశపెట్టాము. అవి తప్ప మరే శీర్షికలకు దీనిలో తావులేదు.

కె. సుభాష్, సికింద్రాబాద్.

ప్లీజ్! సుప్రసిద్ధ డిటెక్టివ్ రచయిత శ్రీ కొమ్మూరి సాంబ శివరావుగారిని పరిచయం చేయండి?

కొమ్మూరి సాంబశివరావుగారి పరిచయం అక్టోబర్ '71 నెల సంచికలో ఇచ్చాము. చూడండి.

కుమారి మీనా, కాకినాడ-3.

'మీ తీర్పు ఏమిటి?' శీర్షికకు వేసే బొమ్మ 'తుగ్లక్' ది వేస్తున్నారు. అందులో మీ వుద్దేశ్యం?

తుగ్లక్‌ది ఒక్క మనస్తత్వం కాదు. వివిధ మనస్తత్వాలకు ప్రతినిధి—తుగ్లక్. అందువలన వివిధరకాల తీర్పులు వచ్చే ఆ శీర్షికకు ఆ బొమ్మను ఎన్నుకొన్నాం.

ఎమ్. వీరస్వామి, మల్కాజిగిరి.

శ్యామ్‌గారూ! ప్రశ్నలు అడిగే మేము గొప్పవాళ్ళమా? జవాబులు ఇచ్చే మీరు గొప్పవారా?

మన ఇరువురికంటే మనలను సృష్టించిన ఆ దేవుడు గొప్పవాడు.

కరణం శివానందరావు, బెర్హాంపూర్ం.

"అపరాధ పరిశోధన" లో ఇప్పుడు చాలా మార్పులొచ్చాయి. కారణం, పత్రిక సేల్సు ఎక్కువ కావడంవల్లనా?

ఏ పత్రికలోనైనా, ఏ వ్యక్తిలోనైనా ఎప్పటికప్పుడు మార్పులు వస్తుండటం సహజం. లేకపోతే 'కూపస్థ మండూకం' అంటారు. రోజురోజుకూ మారుతున్న సమాజంలో, మారే పాఠకుల అభిరుచుల కనుగుణంగా పత్రికను తీర్చిదిద్దటం మా బాధ్యత.

★

(బహుమతి రు. 50/ లు నగదు)

1

రవాణా శాఖాధికారి, ఒక లారీలో ఉన్న బస్తాల బరువును. లారీలో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణీకుల బరువును కూడా చేర్చి, మొత్తంపైన లారీని ఓవర్‌లోడ్‌తో తోలినట్టు. డ్రైవర్ బాబుమీద కేసుపెట్టాడు.

లారీలో వున్న బస్తాల బరువును మాత్రమే లెక్క తీసుకోవాలని, ప్రయాణీకుల బరువు లెక్కకురాదని, డ్రైవరు బాబు వాదించాడు కోర్టులో.

మీరే న్యాయనిర్ణేతలుగా కోర్టులో తీర్పేమని చెప్తారు?

2

సంపూర్ణ, సంజయ్ ఇరువురూ భార్యాభర్తలు. ఇరువురూ ప్రేమానురాగాలతో ఎంతో అన్యోన్యంగా వుంటున్నారు.

కానీ సంజయ్, లత అనే మరో యువతిని కూడా వివాహం చేసుకున్నాడు.

అందుకు సంపూర్ణ, తన భర్త తనవద్ద ఎంత ప్రేమానురాగాలతో వున్నప్పటికీ తను సుఖపడటం కష్టమని, తనకు నెలనెలకు జీవనభృతి ఇప్పించవలసినది, అని దావా వేసింది.

ఈ కేసులో మీరేమని తీర్పు ఇస్తారు?

3

టీ స్టాల్ కోసం కణ్ణన్ ఒక కొట్టును అద్దెకు తీసుకొని, దానిలో టీ స్టాల్‌ను నడుపుకొంటూ వచ్చాడు. కొన్ని నెలల తరువాత ఇడ్లీ, గారెలు, బోండాలు మున్నగు తినుబండారాలను బయట కొని తెచ్చుకొని, తన టీ స్టాల్‌లో పెట్టి అమ్ముకోవడం ప్రారంభించాడు.

అది గమనించిన ఇంటి యజమాని కోర్టు కెక్కాడు.

"టీ స్టాల్‌కు మాత్రమే నేను కొట్టును అద్దెకిచ్చాను. కొట్లో ఇడ్లీలు, గారెలు, బోండాలు అమ్మకూడదు. అతను అద్దెకు తీసుకొన్నది ఒకదానికైతే చేసేది మరొకటిగా వుంది. కావున కణ్ణన్ వెంటనే కొట్టును ఖాళీచేయాలి" అని వాదించాడు.

మరి, మీ తీర్పేమిటి?

* * *

[పై మూడు కేసులకు మీరేమని తీర్పు ఇస్తారో, సవివరంగా ఒక (పోస్ట్) కార్డుపై వ్రాసి, యీ నెల 15 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. సరియైన తీర్పు ఇచ్చిన పాఠకుల పేర్లు మార్చి' 74 నెల సంచికలో ప్రకటిస్తూ, అత్యుత్తమ తీర్పు నిచ్చిన న్యాయనిర్ణేత ఒకరికి రు. 50/- లు బహుమతి పంపగలము. తుదినిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్.]

నవంబర్ '73 నెల మీ తీర్పు?

(1) రాజారావుకు పరిహారం చెల్లించ నక్కరలేదు!

చట్టబద్ధమైన చర్య తీసుకొంటున్న సమయంలో జరిగే

ప్రమాదాలకు ఏ విధమైన చర్య తీసుకొనే అవకాశంలేదు. కనుక రమణమూర్తి నిర్దోషి. రాజారావుకు పరిహారంచెల్లించ నక్కర లేదు.

(2) మదన్ నిర్దోషి!

ఒక ప్రమాదం జరగవచ్చని తెలిసినప్పుడు, ఆ ప్రమాదాన్ని తప్పించే ఉద్దేశంతో చేసిన పనిలో ప్రమాదం వాటిల్లితే అది నేరంకాదు. కనుక మదన్ నిర్దోషి.

(3) డాక్టర్ దోషి కాడు!

ఐ. పి. సి. సెక్షన్-93 ప్రకారం, సదుద్దేశంతో ఇతరులకు చెప్పే ఏ వార్త వలనకాని ప్రమాదం జరిగితే, ఆ చెప్పిన వ్యక్తి అందుకు బాధ్యత వహించ నవసరంలేదు. కావున డాక్టర్ దోషి కానేరడు.

పై విధంగా అత్యుత్తమ తీర్పు నిచ్చిన పాఠక న్యాయ నిర్ణేత—డాక్టర్ ఐ. ఎస్. మూర్తి, డివిజినల్ ఇంజనీర్, ఎల క్ట్రికల్ ఆపరేషన్, మింట్ కాంపౌండ్, హైద్రాబాదు–500004 గారికి బహుమతి పైకం రు. 50–00 లు యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

పై మూడు కేసులకు సరియైన తీర్పు చెప్పగలిగిన ఇతర పాఠక న్యాయనిర్ణేతలు:

1. కొండపల్లి వెంకటేశ్వరరావు, (పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్) హైద్రాబాదు. 2. పి. వి. బి. కృష్ణమూర్తి, (బి.ఎస్.సి. బి. ఎల్., అడ్వొకేట్) కందుకూరు. 3. శ్రీమతి కురు మద్దాలి విజయలక్ష్మి, (రచయిత్రి) విజయవాడ. 4. శ్రీమతి కె. కల్యాణి, (సేల్స్ గరల్) హిమాయత్ నగర్ 5. కె. బి. నారాయణశర్మ, (ఎల్. ఇ. ఇ.) నిజామాబాద్. 6. పి. ధర్మా రావు, (రచయిత) మచిలీపట్టణం. 7. శ్రీమతి కాళంగి ఇందు మతి, గుంటూరు, 8. వజ్రాల రాజా, (బి.ఏ) కడప. 9. శ్రీమతి

పి. సుశీలారాణి. (లెక్చరర్) సికింద్రాబాద్. 10. యస్. ఆర్. ఆంజనేయులు. (కండక్టర్) గౌలీగూడ.

11. పి. గోపాలరావ్, (అడ్వొకేట్) నెల్లూరు. 12. శ్రీమతి ఎమ్. వి. సుబ్బలక్ష్మి, (బి. ఏ.) చిక్కడపల్లి. 13. పి. వి. డి. సోమశేఖర్, (బి. ఇ.) తిరుపతి. 14. శ్రీమతి పి. సుందరమ్మ, (ఎం. ఏ.) బర్కత్‌పురా. 15. శ్రీమతి కోకా అన్నపూర్ణ, (టీచర్) ఖైరతాబాద్. 16. సి. హెచ్. శేషగిరిరావు, గుడివాడ. 17. ఎన్. వాసుదేవాచార్, (ఉడిపి హోటల్) ఆలూరు. 18. బి. నసీర్‌ఖాన్, (బి. కాం.) ప్రొద్దుటూరు. 19. ఆర్. నరసింహం, అడ్వొకేట్, బెంగుళూరు. 20. ఆర్. లక్ష్మీనారాయణ, గుంటూరు.

21. శ్రీమతి జొన్నలగడ్డ రమాదేవి (బి. ఎస్. సి., టీచర్, రచయిత్రి) రాజమండ్రి. 22. మిస్. మధుబాల, రచయిత్రి విజయవాడ. 23. శ్రీమతి పీసపాటి నవనీతం, (టైపిస్ట్)కటక్. 24. డాక్టర్ కె. సర్వోత్తమరావు. (ఎమ్. బి. బి. ఎస్.) హైద్రాబాద్. 25. పెంటకోట సోమినాయుడు, యలమంచిలి. 26. శ్రీమతి ఏ. వి. ఎల్. శోభారాణి, విశాఖపట్టణం. 27. శ్రీమతి ఎమ్. ఆర్. కె. తులసి, (లెక్చరర్) మలక్‌పేట. 28. డి. దయానంద్, (క్లర్క్) బరంపురం. 28. శ్రీమతి ఆర్. అనసూయ, (టీచర్. బి. ఎస్. సి.) వాల్తేరు. 30. జడిగం రంగనాయకులు, (సేల్స్ రిప్రజెంటేటివ్) బొంబాయి.

31. కోనే నాగవెంకట ఆంజనేయులు. (బి.కాం.) ఏలూరు. 32. మిస్. కోహినూర్ (ఇంటర్మీడియెట్, రైటర్) గుంటూరు. 33. డాక్టర్ బి. కేశవరావ్, సికింద్రాబాద్. 34. శ్రీమతి జి. కె. శైలా (టీచర్) రాజమండ్రి. 35. ఆర్. అప్పలాచారి. (బి.ఇ., జూనియర్ ఇంజనీర్, హైద్రాబాద్. 36. శ్రీమతి కాశీ అనంత లక్ష్మి, విశాఖపట్టణం. 37. ఆర్. కె. యోగానంద్, (ఎమ్. ఎస్. పి.) బళ్ళారి.

★

మిస్. మధుబాల

ఈజీచేర్‌లో విశ్రాంతిగా వెనక్కి వాలి నిర్మలంగా, మేఘ రహితంగా వున్న వినీలాకాశం కేసి చూస్తూ కూర్చున్నాడు డాక్టర్ శ్రీనివాస్. అతనికి కొద్ది దూరంలో అతని లాగే వెనక్కి వాలి పైపు పీలుస్తూ కూర్చుని వున్నాడు డిటెక్టివ్ శ్యాంకుమార్.

"ఏమిటి ఆలోచిస్తున్నారు డాక్టర్?" శ్యాంకుమార్ శ్రీనివాస్‌ని అడిగాడు.

"ఊఁ! ఏమీలేదు."

"ఆలోచిస్తూనే ఏమీ లేదంటారే! మీ శ్రీమతిగారిని గురించి ఆలోచిస్తున్నట్లున్నారు. నిజం! ఇలాంటి స్థలాలల్లో, వారితో గడిపిన క్షణాలు మధురమధురంగా వుంటాయి."

"ఊఁహూఁ! నేనలాంటి దేమీ ఆలోచించటంలేదు" శ్రీనివాస్ చిన్నగా నవ్వుతూ అన్నాడు. "కాని మీలాంటి బిజీ వ్యక్తి పదిరోజులపాటు ఊటీలో గడిపిన తరువాత స్వంత ఊరికి వెళ్ళేమాట తలపెట్టడేమిటా అని ఆలోచిస్తున్నాను."

"అపరాధులు, అపరాధాలు, హత్యలు, నెత్తురు, దొంగతనాలు ఇలాంటి వాటితో బాగా విసిగిపోయాను డాక్టర్. ఇంకా కొన్నాళ్లు ఇక్కడ పూర్తిగా విశ్రాంతి తీసుకున్న తరువాత ఆ విషయం ఆలోచిస్తాను."

శ్యాంకుమార్ పోలీస్ డిటెక్టివ్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లపాటు విశ్రాంతి తీసుకోవాలని అతను ఊటీ బయలుదేరాడు. శ్రీనివాస్ అంతకుముందే ఒక మెడికల్ కాన్ఫరెన్స్ అటెండవడానికి బెంగుళూర్ వెళ్ళాడు. ఇద్దరూ మంచి మిత్రులు కావటంతో బెంగుళూర్‌లో దిగి అతన్ని వెంటబెట్టుకుని ఊటీ చేరుకున్నాడు శ్యాంకుమార్.

ఊటీలో ఏ హోటల్లోనో దిగడానికి మారుగా 'కాంతి నిలయం'లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని వుంటున్నారు.

కాంతినిలయం కాంపౌండులో నలువైపులా నాలుగు ఫ్లాట్లు న్నాయి. కాంపౌండులో పచ్చగా హరితం పరుచుకున్నట్లుగా వున్న లాన్ చెప్పుకోదగ్గది. కాంపౌండ్ వాల్ వారగా పెరిగిన క్రోటన్, రోజ్, చెట్లు చెప్పుకోదగ్గవి.

నాల్గు ఫ్లాట్లకి మధ్యగా ఒక క్లబ్ వుంది. అందులో బిలి యర్డ్స్, టేబిల్ టెన్నిస్, బ్రిడ్జ్ ఆడటానికి కావలసిన సరం జామా వుంది.

క్లబ్‌లోనే ఒక వైపున్న ఫైర్‌ప్లేస్ చుట్టూరా కేన్ చేర్స్ వున్నాయి. ఆ ఉష్ణతలో అక్కడ కూర్చుని సరదాగా పిచ్చా పాటీ మాట్లాడుకుంటే సరదాగా వుంటుంది.

ఆ ఫ్లాట్స్ కేర్‌టేకర్ శంభూదాస్ యువకుడు. అతను వీరి సౌకర్యాలను గురించి ఎప్పుడూ వాకబు చేస్తుండేవాడు.

శ్యాంకుమార్ ఇక్కడికి రాకముందే రెండు ఫ్లాట్లలో ఎవరో వున్నారు, నాల్గు రోజుల క్రితం విఘ్నేశ్వర్ పట్వారీ, శశి కాంత్ బెనర్జీ అనే ఇద్దరు మిత్రులు నాల్గవ ఫ్లాట్‌ని అద్దెకు తీసుకున్నారు.

క్లబ్, ఫైర్‌ప్లేస్ మూలంగా ఒకరికొకరు పరిచితులయ్యారు.

''నిన్నరాత్రి చాలా చలిగా వుండిందికదూ?'' డాక్టర్ శ్రీని వాస్ అడిగాడు.

''అవును; ఈ సంవత్సరం చాల త్వరగా మొదలయింది. సెప్టెంబర్ మాసంలో ఇంత చలి ఎప్పుడు ఎరగను.''

శ్రీనివాస్ ఏదో చెప్పబోయి ఆగాడు. అతని దృష్టి ననుసరించి తనూ చూశాడు శ్యాంకుమార్.

ఎదురుగా సుధేంధురాయ్ వస్తూ కనిపించాడు. అతనికి ముప్ఫయి అయిదు సంవత్సరాలుంటాయి. ఆరోగ్యవంతంగా, దృఢంగా వుంటా డతను. ఆగ్రాలో పారిశ్రామికవేత్త అతను.

దక్షిణ భారతదేశం చూడాలని భార్య పట్టుబడితే భార్య మాలతితో బయలుదేరా డతడు.

దగ్గరగా వచ్చి వీరిద్దరికి విష్‌చేసి ఆ ప్రక్కనే వున్న ఖాళీ కుర్చీలో కూర్చున్నా డతను.

"మిస్టర్ శ్యాంకుమార్! ఒక వింత సంఘటన జరుగుతూం దండీ. ఈ విషయంలో నాకు మీ సహాయం కావాలి" అన్నా డతను.

"ఏమిటండీ అది?"

"ప్రతి ఫ్లాట్‌లోనూ ఒక లెటర్ బాక్స్ వుందన్న విషయం మీకు తెలుసు. నేను ఇరవయి రోజులుగా ఇక్కడ వుంటు న్నాను. మా వాళ్లనుండి ఈ మధ్య నాలుగయిదు ఉత్తరాలు కూడా వచ్చాయి. సర్వసాధారణంగా లెటర్ బాక్స్‌లోంచి వుత్తరాలను మాలతే తీస్తుంది, కాని నిన్న లెటర్‌బాక్స్ నేను తెరిచాను. అందులో పేరు, అడ్రస్ లేకుండా ఒక కవరుంది. ఆశ్చర్యంతో విప్పిచూస్తే అందులో ఒక చిత్రం తప్ప ఇంకేమీ లేదు. ఆ చిత్రంకూడా ఏదో పత్రికలోంచి కత్తిరించినట్లుంది."

సుధేంధురాయ్ కవరందించాడు. శ్యాంకుమార్ అందులోని చిత్రాన్ని తీసి చూశాడు. శ్రీనివాస్ కూడా తొంగి చూచాడు.

నిజంగానే అది ఏదో పత్రికలోంచి కత్తిరించినట్లుంది.

అందులో ఒక వ్యక్తి అస్తవ్యస్తంగా రోడ్డుపై పడి వున్నాడు. అది చూస్తుంటే ఆ మధ్య కలకత్తాలో జరిగిన రాజకీయ హత్యల దృష్టాంతంలా వుంది.

"ఇవాళ మళ్లీ ఒకటుంది చూడండి" అంటూ సుధేంధురాయ్ మళ్లీ ఇంకోకవరు అందించాడు.

అందులో కూడా ముందులాగే ఒక కత్తిరింపు చిత్రముంది. ఇందులో ఒక మృతదేహం ఒక చెరువు ప్రక్కగా పడివుంది.

శ్యాంకుమార్ భృకుటి ముడిచి కొన్ని క్షణాలు ఆ చిత్రాన్ని చూస్తూండిపోయాడు.

శ్యాంకుమార్ తన వైపు చూడగానే రాయ్ చెప్పసాగాడు:

"వీటిని చూసి మాలతి చాలా భయపడుతూంది.ఏదో అమంగళం జరుగుతుందేమోనని అంటుంది. నాకేమో ఇది ఎవరో నవ్వులాటకు చేశారేమో ననిపిస్తుంది."

"ఇక్కడ వున్నవారిలో ఎవరయినా మీకు పరిచయస్తు లున్నారా?"

"లేరు. అందరూ ఇక్కడే పరిచయమయ్యారు."

"మీ పరిచయస్తులుగాని, స్నేహితులుగాని ఎవరయినా ఊటీలో వున్నారా?"

"లేరు. నేనిక్కడ ఎవరిని ఎరుగను."

"మరైతే మీతో నవ్వులాటకు దిగేది ఎవరు?"

"నేను మీ వద్దకు వచ్చిందందుకే. ఈ విషయంలో మీరు పరిశోధించి ఏదయినా చెప్పారంటే నా భార్య మాలతికి కొంచెం మనశ్శాంతి వుంటుంది."

శ్యాంకుమార్ పరిచయం పోలీస్ డిటెక్టివ్‌గా తెలియడంతో అతనా విషయం అడిగాడు.

"ఇప్పుడే ఏమీ చెప్పలేను" శ్యాంకుమార్ చెప్పాడు."ఈ కవర్లు నా వద్ద ఉండనీయండి. నేను ప్రయత్నం చేస్తాను."

మరి కొంతసేపు మాట్లాడిన తరువాత సుధేంధురాయ్ వెళ్ళిపోయాడు. శ్యాంకుమార్ ఆలోచనలో పడిపోయాడు.

2

శ్యాంకుమార్, శ్రీనివాస్‌లు క్లబ్‌లోకి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఆ కాంపౌండులోని మిగిలిన సభ్యు లున్నారు. పట్వారీ, బెనర్జీలు బిలియర్డ్స్ ఆడుతున్నారు. ఆ యిద్దరూ కూడా

యువకులు. ఎవరికీ ముప్పయి ఏళ్ళకు మించి వుండదు. బిలి యర్ప్ ఆటలో నిపుణులని చూడగానే తెలుస్తుంది.

సుధేంధురాయ్, మాలతి, ఉమాశంకర్, ఆయన భార్య శశి కళాదేవి ఫైర్‌ప్లేస్ వద్ద కూర్చుని వున్నారు.

ఉమాశంకర్‌కి యాభై ఏళ్ళుంటాయి. బట్టతల, గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళద్దాలు, చిరుబొజ్జ....అతను దక్షిణ రైల్వేలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

ఆయన భార్య శశికళకు నలభై ఏళ్ళుంటాయి. కాని ఇంకా తక్కువగా కనిపిస్తుంది.

ఒకవైపు మాలతి కూర్చుని స్వెటర్ అల్లుతోంది. ఆమెకు పాతికేళ్లుంటాయి. సుధేంధురాయ్‌కి తగిన జోడీ అనిపిస్తుంది. అందమయిన ఆమె ముఖంలో కళాకాంతులులేవు. అలసిపోయి నట్లుగా, వాడిపోయినట్లుగా ముడుచుకుపోయి వుంది. ఇద్దరు మగవాళ్లు సరదాగా మాట్లాడుకుంటున్నారు. వారి సంభాషణలో అప్పుడప్పుడు శశికళ కూడా పాలుపంచుకుంటోంది.

శ్యాంకుమార్, శ్రీనివాస్‌లను, ఆ ఇరువురు మగవాళ్లు చిరు నవ్వుతో ఆహ్వానించారు. కేర్‌టేకర్ శంభూదాస్ బిలియర్డ్సు టేబుల్‌వద్ద నిలబడివున్నాడు.

ఉమాశంకర్ అతణ్ణి పిలిచి తన తరపున, అక్కడ వున్న వారందరికీ ఒక్కో లార్జ్‌పెగ్ విస్కీ ఇవ్వమన్నాడు. మాలతి తను తాగనంది. ఆమెకోసం ఆరంజ్ జూస్ తెప్పించాడు.

"శ్యాంకుమార్‌జీ!" ఉమాశంకర్ విస్కీ సిప్ చేస్తూ అన్నాడు. "మీరు ఎప్పటికప్పుడు తప్పించుకుంటున్నారు. ఇవాళ, ఏమయినా సరే మీ అనుభవ మొకటి వినిపించి తీరాల్సిందే....!"

శ్యాంకుమార్ నవ్వుతూ అన్నాడు-"కేస్ హిస్టరీ వినాలను కుంటున్నారా? మీ కందరికి హత్యలు, నెత్తుటి వరదలు, అంటే అంత ఇష్టమా??"

అందరూ అవునన్నట్లుగా తలూపారు.

"నేను ఎనిమిదేళ్ళుగా ఈ లైన్‌లో పనిచేస్తున్నాను. అసంఖ్యాకమయిన రకరకాల కేసుల్లో తల మునకలుగా ఇరుక్కున్నాను.ఒడలు జలదరించే అనుభవం ఒకటి చెబుతాను వినండి."

విఘ్నేశ్వర్ పట్వారీ, శశికాంత్ బెనర్జీలు కూడా వచ్చి కూర్చున్నారు. డిటెక్టివ్ స్టోరీ, అందులోనూ స్వానుభవం ఆతృత కలుగని దెవరికి? మాలతి కూడా కొంచెం ముందుకి వంగింది.

శ్యాంకుమార్ తన అనుభవం చెప్పసాగాడు. అతను తన కథనం పూర్తి చేసేసరికి ఒక గంట పట్టింది. అందరూ ఊపిరి బిగపట్టి శ్యాంకుమార్ చెప్పిందాన్ని విన్నారు. అందరూ అతణ్ణి 'వాహ్!' అంటూ ప్రశంసించారు.

శ్యాంకుమార్ వెనక్కి వాలి పైపు అంటించుకున్నాడు.

అప్పుడే గడియారం ఠంగున గంట కొట్టింది. అందరూ తల త్రిప్పి చూశారు. ఏడున్నర అయింది.

మాలతి ముందులాగే వెనక్కివాలి అల్లుతోంది. ఉన్నట్లుండి ఆమె 'కెవ్వు'న అరిచి సోఫాలో ఒక వైపుకే ఒరిగి, అటు నుండి క్రిందకు దొర్లింది. ఈ ఆకస్మిక సంఘటనతో అందరూ స్తబ్ధులయ్యారు.

మరుక్షణమే సుధేంధురాయ్ మాలతివద్దకు ఉరికాడు. శ్యాంకుమార్ కూడా ఆమెవద్దకు వెళ్ళాడు.మాలతి పక్కకు తిరిగి పడి వుంది. కాళ్ళు ముడుచుకుని వున్నాయి.

"సారీ! ఈమె మరణించింది"అప్పటికి అక్కడకు చేరుకున్న డాక్టర్ శ్రీనివాస్ ఆమెను పరీక్షించి అన్నాడు.

"చనిపోయిందా? నా మాలతి చనిపోయిందా?" సుధేంధురాయ్ నిర్లిప్త స్వరంతో అన్నాడు.

"ఈ చావు స్వాభావికమయినదిగా కనిపించటం లేదు. దయచేసి పోలీసులు వచ్చేవరకు ఎక్కడి వాళ్ళక్కడే వుండండి. మిస్టర్, శంభూదాస్: టెలిఫోన్ చేయండి...."అన్నాడు శ్యాం కుమార్.

కేర్ టేకర్ శంభూదాస్ టెలిఫోన్ స్టాండ్ వున్న వైపుకి పరుగెత్తాడు.

3

ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ తన బలగంతో వచ్చి అరగంటకు పైగా అయింది. మాలతి మరణం నిజంగానే స్వాభావికమైనది కాదు. ఆమె మెడపై చిన్న గుండుసూది గుచ్చుకుని వుంది.

ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ డాక్టర్‌కి, ఫోటోగ్రాఫర్‌కి తమ తమ పనులు పూర్తిచేయమని చెప్పాడు. శవ పరీక్ష తరువాత శవాన్ని మార్చురీకి పంపేముందు గుండుసూదిని తీసేసి భద్రంగా దాచాడు. గుండుసూది మొనవైపు కొంచెం భాగం ఎర్రగా వుంది.

ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ ఒకరి తర్వాత ఒకరుగా అందరి స్టేట్‌మెంట్స్ తీసుకున్నాడు. కాని దానివల్ల అతను ఒక నిర్ణయానికి రాలేకపోయాడు. కనీసం అక్కడున్న వారిలో ఏ ఒక్కరిపై అనుమానాన్ని కూడా ఏర్పరచుకోలేకపోయాడు.

నిజానికి అక్కడున్న వారిలోనే ఎవరో హంతకు లన్నది యదార్థం. ఇన్స్పెక్టర్‌కి శ్యాంకుమార్ డిటెక్టివ్ అని తెలిసింది. అదీగాక హత్య జరిగినప్పుడు అతను అక్కడే వున్నాడు కాబట్టి, అతనే తనకేమయినా సహాయం చేయవచ్చు అనుకున్నాడు.

"ఈ సంఘటన ఎలా జరిగింది? ఈ విషయంలో మీరు ఏమయినా సహాయం చేయగలరా?"ఇన్స్పెక్టర్ శ్యాంకుమార్‌ని ఒక వైపుకి తీసుకెళ్ళి అడిగాడు.

"ఈ విషయం నాకూ ఆశ్చర్యంగా వుంది ఇన్స్పెక్టర్. ఈ సంఘటన నా కళ్ళముందే జరిగింది. అయినా నాకేమీ అర్థం కాలేదు. మాలతిగార్కి కూడా ఈ విషయంలో ఏ అనుమానం లేదనుకుంటాను. ఈ గుండుసూదిని ఎటువైపునుండి విసిరాడు అన్నది తేలాలి."

"ఈ మిస్టరీని భేదించడంలో మీ సహాయం నాకు లభించుతుందనే అనుకుంటాను."

చిన్నగా నవ్వుతూ అన్నాడు శ్యాంకుమార్. "ఈ క్రిమినల్ లైఫ్‌నుండి దూరంగా వుండి ప్రశాంతంగా వుండాలని హైద్రాబాద్‌నుండి ఇక్కడకు వచ్చాను ఇన్స్పెక్టర్. కాని అపరాధమన్నది, ఎక్కడయినా ఎప్పుడయినా, ఎంతటి ప్రశాంత వాతావరణంలోనయినా జరుగుతుందన్నది తేలుతుంది. ఆ గుండుసూది ఇలా ఇవ్వండి....ఒకసారి చూసిస్తాను."

విష్ణువర్ధన్ తన జేబులోంచి చిన్న కాగితం పొట్లం తీసిచ్చాడు. శ్యాంకుమార్ దానిని పరీక్షగా చూశాడు. అది మామూలు గుండుసూది. ప్రతిచోట మామూలు వాడకంలోని గుండుసూదది. దానిని ఒకసారి ముక్కువద్ద వుంచుకుని వాసన చూశాడు.

"దీనిమొన ఏదో తీవ్రమయిన విషంలో ముంచి తీయబడింది. కాకుంటే మృత్యువు ఇంత త్వరగా సంభవించదు. ఆమెను ఎవరు ఎందుకు చంపారో తెలియాలంటే, ఆమె గత జీవితాన్ని గురించి తిరగేయించండి" అన్నాడు శ్యాంకుమార్.

"మంచిది."

"ఇక మీరు ఒకరొకరిని వేరువేరుగా పిలిచి ప్రశ్నించండి."

ఇన్స్పెక్టర్ తన స్థానంలోకి వచ్చాడు. శ్యాంకుమార్ కూడా వచ్చి కూర్చున్నాడు. సుధేంధురాయ్ ముందుకి వంగి అర

చేతుల్లో ముఖం దాచుకున్నాడు. మిగిలినవాళ్ళు ఎక్కడివాళ్ళక్కడ శిలామూర్తుల్లా కూర్చుని వున్నారు.

"రాయ్‌గారూ! మీ దుఃఖాన్ని నే నర్థం చేసుకోగలను. నా కర్తవ్యాన్ని పూర్తి చేయడానికి మిమ్ములను కష్టపెడుతున్నందుకు క్షంతవ్యుణ్ని. నే నడిగిన ప్రశ్నలకు జవాబు లిస్తారా?" ఇన్స్పెక్టర్ సుధేంధురాయ్‌ని సంబోధిస్తూ అన్నాడు.

సుధేంధురాయ్ చేతుల్లోంచి ముఖాన్ని లేపాడు. దుఃఖంవల్ల అతని ముఖం కందిపోయి ఎఱ్ఱబడింది. కళ్ళలో ఎఱ్ఱని జీరలు కమ్ముకున్నాయి.

"అడగండి...." జేబురుమాలుతో ముఖం తుడుచుకుంటూ అన్నాడు రాయ్.

ఇన్స్పెక్టర్ అందర్నీ ప్రక్కగదిలోకి వెళ్ళమని కోరాడు. శ్యాంకుమార్ తప్ప మిగిలిన అందరూ వెళ్ళిపోయారు.

"మిస్టర్ రాయ్! మాలతిగారు ఇతర రోజుల్లాగా, ఉత్సాహంగానూ, ఉల్లాసంగానూ లేరని, ఆమె వదనంలోని ఉదాసీన భావాలు తాను స్పష్టంగా చూశానని శ్యాంకుమార్‌గా రన్నారు. ఎందుకో మీకేమైనా తెలుసా?"

"ఒక్క ఇవాళనే కాదు, మాలతి మొన్నటినుండి అలాగే వుంది. ఉదాసీనత, గాంభీర్యం ఆమెలో చోటు చేసుకుంది. ఎంత అడిగినా కారణంమాత్రం చెప్పలేదు."

"మీది లవ్ మారేజా?"

"అవును. ఢిల్లీలోని చాందనీచౌక్‌లో మొదటిసారిగా కలుసుకున్నాం. ఆ తరువాత చాలాసార్లు కలిశాం. వివాహ ప్రసక్తి వచ్చినప్పుడు వాళ్ళ నాన్నగార్ని అడగమంది మాలతి. వాళ్ళ నాన్నగారు వెంటనే ఒప్పుకున్నారు."

"మరోలా అనుకోనంటే ఒక్క విషయం....మీ పెళ్ళికి ముందు ఆమె మరెవరినయినా....?"

"అయామ్ సారీ! ఆ విషయం నాకు తెలియదు."

"ఆమె మీకు చెప్పకపోవచ్చు. కాని మీరు అప్పుడప్పుడు మాలతివాళ్ళ నాన్నగారింటికి వెళ్ళుంటారు. అక్కడ అలాంటి దేమీ మీ దృష్టిలో పడలేదా?"

"వివాహం తరువాత నే నెప్పుడూ వాళ్ళింటికి వెళ్ళలేదు. మాలతికూడా ఎప్పుడూ పుట్టింటికి వెళ్లలేదు. అప్పుడప్పుడు ఆమె తలిదండ్రులు ఆగ్రావచ్చి కూతుర్ని చూసి వెళ్ళేవాళ్లు."

"ఈ కాంపౌండులో వున్నవారిలో మీ పరిచితు లెవరయినా వున్నారా?"

"ఉహూఁ! ఎవరూ లేరు."

"మీ మిసెస్‌కి తెలుసా?"

"అలా అని నేననుకోను. ఒకవేళ ఆమె పూర్వపరిచితు లెవరయినా వుంటే ఆ విషయం నాకు తెలియదు."

"అకారణంగా ఒక హత్య జరగదు. మాలతిగారి హత్య ఎందుకు జరిగింది....ఆ విషయంలో మీ కేమయినా అనుమానా లున్నాయా?"

"ఉహూఁ! దానికే నేనూ జవాబు ఆలోచిస్తున్నాను."

"ఇంకేమీ అడగాల్సింది లేదు. మీరు వెళ్ళవచ్చు."

ఇన్‌స్పెక్టర్ అనగానే రాయ్ వెళ్ళిపోయాడు.

ఆ తరువాత విఘ్నేశ్వర్ పట్వారీ వచ్చాడు. అతను మిలిటరీ అధికారి. సిలిగురినుండి వచ్చాడు.

అతని మిత్రుడు శశికాంత్ బెనర్జి ఒక నెలరోజులు బెంగుళూర్ మైసూర్, ఊటీ, నీలగిరిలు చూడాలని అనుకున్నట్లు వ్రాయడం చేత, విఘ్నేశ్వర్‌పట్వారీ సిలిగురినుండి అమృతసర్ వెళ్లి మిత్రుడు శశికాంత్‌తో ఇక్కడికి నాలుగురోజులక్రితం వచ్చాడు.

"మీ కళ్ళముందే ఈ హత్య జరిగింది. ఈ సంఘటన ఎలా

జరిగింది. ఈ విషయంలో మీరేమయినా చెప్పగలరా?'' ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ తీక్షణంగా అతణ్ణి చూస్తూ అడిగాడు.

''తెలియదు. నేను ఈ విషయమే ఆలోచిస్తున్నాను. ఏమీ అంతుపట్టడంలేదు. కళ్ళముందు జరిగింది కాబట్టి నమ్మాల్సి వస్తూంది. లేకుంటే అసలు నమ్మేవాణ్ని కాదు.''

''ఈ కాంపౌండులో మీకు ఫ్లాట్ ఎలా దొరికింది?''

''శశికాంత్ బెనర్జి ఇంతకుముందు వేసవిలో ఇక్కడ గడిపాడు. అతనే ముందు లెటర్ వ్రాసి రిజర్వ్ చేయించాడు.''

''రైట్; మీరు వెళ్ళి బెనర్జి గారిని పంపండి.''

పట్వారీ వెళ్ళగానే బెనర్జి వచ్చాడు. బక్కపలుచగా వున్నా అతను అందగాడు. భయం వల్ల అతని ముఖం పాలిపోయి వుంది, స్థిరత్వం లేకుండా రెప్పలల్లారుస్తున్నాడు.

''బాగా భయపడ్డట్లున్నారు?'' ఇన్స్పెక్టర్ అడిగాడు.

''అవును;ఎప్పుడూ ఇలాంటిది నా జీవితంలో జరుగలేదు.''

''మాలతిగారు మీ కెంతదూరంలో వున్నారు?''

''నాలుగయిదడుగుల దూరంలో....''

'' ఆ సూదిని ఎటునుండి ఎలా వదిలివుంటారు?''

''ఏమో నేనెలా చెప్పగలను. అందరి దృష్టిలో పడేటటువంటి వస్తువు మాత్రం కాదని తెలుస్తూంది. కాకుంటే అంత మందిలో ఎవరో ఒకరు చూసివుండే వాళ్లు కదా?''

''మీరింతకు ముందు కూడా ఊటీ చూశారు కదా; మళ్ళీ అంత దూరంనుండి ఎందుకు వచ్చారు?''

''ఇక్కడి వాతావరణం నాకు బాగా నచ్చింది. పట్వారీ ఈసారి లీవులు ప్రశాంతంగా గడపాలని రాయడంవల్ల ఇది సీజన్ కాకున్నా ఇక్కడికి వచ్చాం.''

ఆ తరువాత ఇన్స్పెక్టర్ అతణ్నింకేమీ అడగలేదు. బెనర్జి

తరువాత ఉమాశంకర్, అతని సతీమణి శశికళ వచ్చి ఇన్స్పెక్టర్ ముందు కూర్చున్నారు. ఇద్దరిముఖాలు వాడిపోయి వున్నాయి.

"మిసెస్ రాయ్ హత్య విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

"స్తబ్ధులుగా వుండిపోవడం తప్ప మాకేం అర్థంకాలేదు" శశికళ అంది.

"అంతా మా కళ్ళముందే జరిగింది. అయినా ఇంకా చీకట్లోనే వున్నాం. ఏమీ తోచడంలేదు" ఉమాశంకర్ అన్నాడు.

"మాలతిగారి వ్యక్తిత్వ మెటువంటిది?"

"చాలా కలుపుగోరు మనిషి" శశికళ అంది. "ఎప్పుడూ నవ్వుతూ....ఆంటీ....ఆంటీ ...అంటూ నా వెంట వుండేది.... కాని...."

"ఊఁ! చెప్పండి...."

"కాని ఈ మూడు నాలుగు రోజులుగా మాలతి చాలా సీరియస్‌గా, ఏదో ఆలోచిస్తున్నట్లుగా పరధ్యానంగా వుంటోంది."

"కారణమేమిటో మీరు కనుక్కోవడానికి ప్రయత్నం చేయలేదా!"

"లేదు! కాని ఇవాళ వుదయం మాలతి వద్దకు వెళ్ళి ఈ విషయం అడగా లనుకున్నాను. అడిగానుకూడా! అందుకామె తన స్వస్థత దెబ్బ తింటుందని, భర్తను ఒప్పించి వెళ్ళి పోవా లనుకుంటున్నట్లు కూడా చెప్పింది."

"అంత ముఖ్యమయిన కారణమేమిటో మీరడగలేదా?"

"అడిగాను కాని ఆమె మొదట చెప్పిన కారణాన్నే మళ్ళీ మళ్ళీ చెప్పింది."

"మేమూ ఉండాలనుకోవటంలేదు. రేపే వెళ్ళిపోతాం" ఉమాశంకర్ అన్నాడు.

"సారీ! అది కుదరదు;" ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ నవ్వుతూ అన్నాడు. "ఈ కేస్ విషయం తేలే వరకు మీలో ఎవరూ ఎక్కడికి వెళ్ళలేరు."

"మీరు శంభూదాస్తో మాట్లాడండి. ఆలోగా నేను ఒక సారి హత్యాస్థలాన్ని పరిశీలించి వస్తాను" అంటూ లేచాడు శ్యాంకుమార్.

"రైట్" అంటూ ఇన్స్పెక్టర్ శంభూదాస్ని పిలిపించాడు.

ఫైర్ప్లేస్ వద్ద మాలతి కూర్చున్న స్థలాన్ని, ఆ చుట్టు ప్రక్కల భాగాన్ని తీక్షణంగా పరికించాడు శ్యాంకుమార్. ప్రతి సోఫావద్ద ఒక చిన్న మూడుకాళ్ళ స్టూల్ వుంది. ప్రతీ స్టూల్పై ఖాళీ బీర్ గ్లాసులు సిగరెట్లతో నిండివున్న అష్ట్రేలు వున్నాయి. సిగరెట్ పాకెట్లపైన వుండే ఆయిల్ పేపర్ ముండలు అక్కడక్కడ పడివున్నాయి.

వున్నట్లుండి శ్యాంకుమార్ దృష్టి ఫైర్ప్లేస్ దగ్గర ఒక ఇటుకకూ, మరో ఇటుకకూ మధ్య ఇరుక్కున్న ఒక ముండపై పడింది. దాన్ని అందుకుని చూశాడు. అదికూడా సిగరెట్ పాకెట్ పైనుండే ఆయిల్ పేపరే! దాన్ని సరిచేశాడు. అది రెండు అంగుళాల పొడవున వుంది. దానిపై రెండు వరుసల్లో ఇంగ్లీష్ అక్షరా లున్నాయి. పై వరుసలో KIM అనీ క్రింద వరుసలో MADE అని వుంది. మిగిలిన ముక్క వుంటేనే కాని దానిపై రాసి వుండేదేమిటో అర్థమవుతుంది.

అది సిగరెట్ పాకెట్ లేబిల్ అని తెలుస్తూంది. ఎవరో దాన్ని చింపి మంటలో వేయాలనుకున్నారుకాని ఆ సందులో ఇరుక్కుంది.

అంతకుమించి ఇంకేమీ దొరకలేదు. దానిని జేబులో వేసుకుని డాక్టర్ శ్రీనివాస్ని కలిశాడు.

''ఏమయినా అర్థమయిందా?'' శ్యాంకుమార్‌ని అడిగాడు.

''ఊహుఁ! సమస్య జటిలంగానే వుంది.''

''అంతా కళ్ళముందే జరిగింది. అయినా ఏమీ అర్థంకావడం లేదు.''

''మాలతి నానుకుని ఎవరూ కూర్చోలేదు. సూదిని దూరం నుండి విసిరారు. కాని ఎటువైపు నుండి....?''

4

రెండవరోజు దినమంతా శ్యాంకుమార్ ఆలోచిస్తూనే గడిపాడు. శ్రీనివాస్‌తో ఎక్కువగా మాట్లాడలేదు. ఉదయం ఒకసారి ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ వచ్చి క్లబ్‌ని చూచి వెళ్ళిపోయాడు.

సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో శ్యాంకుమార్, శ్రీనివాస్‌లు ఒకచోట కూర్చున్నారు.

ఒక వెయిటర్ ఒక ట్రేలో టీకెటిల్‌తో వచ్చాడు. అప్పుడే శంభూదాస్ లోపలకు ప్రవేశించాడు.

''రండి....రండి...''శ్యాంకుమార్ అతన్ని ఆహ్వానించాడు.

''డిస్టర్బ్ కలిగిస్తే క్షమించాలి'' కూర్చుంటూ అన్నాడతను.

వెయిటర్ ముగ్గురికీ టీ సర్వ్‌చేశాడు. ఆ తరువాత కొంత సేపటివరకు నిన్నటి విషయమై మాట్లాడుతూ కూర్చున్నారు. మాట్లాడుతూండగానే శంభూదాస్ జేబులోంచి ఒక లైటర్ తీసి శ్యాంకుమార్‌కి ఇస్తూ ''శ్యాంకుమార్‌జీ! ఇదిగో!'' అన్నాడు.

''ఓహ్! చివరకు ఎలాగయితేనేం సంపాదించారన్నమాట'' దాన్నందుకుంటూ అన్నాడు. ''బ్యూటిఫుల్....ధర ఎంత?'' అడిగాడు.

''పాతిక రూపాయలు. సిగరెట్, సిగార్, పైపు వెలిగించుకోవడానికి మూడు రకాల వ్యవస్థ లున్నాయి. మూడు రకాల మంటలుకూడా వస్తాయి.''

"ఈజిట్?"

శంభూదాస్ దానిని తిరిగి అందుకుని ఎక్కడ నొక్కితే ఏ రకమయిన మంట వస్తుందో చూపించాడు. శ్యాంకుమార్ డబ్బు తీసి అతని కిస్తూ "ఎక్కడ సంపాదించారు....?" అడిగాడు.

"ఇక్కడ ఒక భూటాన్ దేశస్తుడున్నాడు. అతనే స్మగుల్ చేస్తా డిలాంటివి.... నేపాల్, భూటాన్‌ల నుండి స్మగుల్‌చేసి ఇక్కడ అమ్ముతుంటా డనుకుంటాను...." అంటూ శంభూదాస్ కిటికీలోంచి బయటకు చూసి.... "అరే! జిగ్మి ఇక్కడెందుకు వచ్చాడు?" అన్నాడు.

అతని దృష్టి ననుసరించి శ్యాంకుమార్, శ్రీనివాస్‌లు కూడా చూశారు. ప్రౌఢావస్తలో పొట్టిగా, దృఢంగావున్న ఒక వ్యక్తి కాంపౌండు గేటు తీసుకుని బయటకు వెళుతున్నాడు. వేష ధారణను బట్టి చూస్తే, అతను భూటానీయునిలాగే వున్నాడు.

"మీరు చెబుతున్నది ఇతని గురించే అనుకుంటాను. మీరెందుకు ఉత్తేజితులవుతున్నారు?" శ్రీనివాస్ అడిగాడు.

"అత నెప్పుడూ కాంపౌండులోకి రాడు. అతన్ని చూచి ఆశ్చర్యపోతున్నాను. ఇక్కడి కొనుగోలు దార్లతో అతనికి పరిచయమెందుకుంటుంది...."అన్నాడు చింతిత స్వరంతో శంభూదాస్.

కొత్త లైటర్‌తో పైపు వెలిగించుకుంటూ...."ఒకసారి నన్నతని వద్దకు తీసుకెళతారా?" అడిగాడు శ్యాంకుమార్.

"మిమ్మల్నా?"

"అవును! ఒక కెమెరా కొనాలనుకుంటున్నాను."

"అందుకు నేనున్నానుకదా? మీరు అక్కడకు వెళితే నా కమీషన్ దెబ్బ తింటుంది" శంభూదాస్ అన్నాడు.

"నేను కేవలం వస్తువుని చూసివస్తాను. కొనడం మీ ద్వారానే కొంటాను. దానివల్ల మీ కమీషన్ దెబ్బ తినదు. ఒక విషయం చెప్పండి....ఈ కాంపౌండులోకి చదవడానికి ఏమయినా పత్రికలు కొంటారా?"

"అవును, ఒక వారపత్రిక....ఒక మాసపత్రిక వస్తాయి."

"కాంపౌండులో ఇప్పుడున్నవారిలో ఎవరెవరు పత్రికలు తీసుకెళతారో చెప్పగలరా?"

"యస్;"

శ్యాంకుమార్ గబగబా లోపలకు వెళ్ళి సుధేంధురాయ్ తనకిచ్చిన కవర్లతో తిరిగి వచ్చాడు...కవర్లలోంచి కత్తిరింపు చిత్రాలు చూపుతూ "బాగా చూడండి ఇవి ఏ పత్రికలోంచి చింపారో చెప్పగలరేమో...?"

శంభూదాస్ వాటిని పరీక్షించి... "అరే! ఇది ఈ వారం వచ్చిన వారపత్రికలోనివి.ఈ వారం ఈ రెండు చిత్రాలనుచూశాను నేను....కాని....కాని...."

"ఈ వారం పత్రిక ఎవరెవరి వద్దవుందో రహస్యంగా వాకబు చేయండి....చేయగలరా?"

"చేయవచ్చు....కాని...."

"మొదట మీరాపని చేయండి. విషయాలన్నీ నెమ్మదిగా మీకే అర్థమవుతాయి. కేవలం చూస్తూ వుండండి, ఏమీ మాట్లాడకండి అంతే" అన్నాడు శ్యాంకుమార్ శంభూదాస్‌తో.

5

మరోరోజు గడిచింది. ఆ ఉదయం ఉమాశంకర్ ఫ్లాట్‌లో అందరూ కూర్చుని వున్నారు. క్లబ్ హాలువద్ద పోలీస్ కాపలా వుండటంవల్ల అక్కడ కూర్చోవడానికి వీల్లేకుండా వుంది. అందరికందరూ చింతానిమగ్నులయి వున్నారు. మానసికోల్లాసం

లేకుండా హత్య జరిగిన స్థలంలో ఎవరుమాత్రం వుండగలరు.

"శ్యాంకుమార్ జీ! మీకేమయినా అర్థమయిందా?" ఉమా శంకర్ అడిగాడు.

నోట్లోని పైపుని చేతపట్టుకుంటూ "ప్రయత్నం చేస్తున్నాను. చూడాలి ఫలితం ఎలా వుంటుందో."

"ఈ హత్య మనలోనే ఎవరో చేశారు....కాని ఎందుకు, ఎవరు చేశారన్నది తేలటంలేదు...." శశికాంత బెనర్జీ అన్నాడు.

"నువ్వు చెబుతున్నది నిజం..." విఘ్నేశ్వర పట్వారీ అన్నాడు. "మనందరిలో ఎవరయినా చేసివుంటే ఎవరి కళ్ళలో అయినా పడాలికదా....ఆ సమయంలో అక్కడ మరో వ్యక్తి కూడా వున్నాడు. అతని విషయం ఎవరూ పట్టించుకోవడం లేదు."

"నువ్వు చెబుతున్నది...."

"...కేర్ టేకర్ శంభూదాస్ విషయం..." మధ్యలోనే బెనర్జి మాటను ఆపుతూ అన్నాడు పట్వారీ.

"కాని, శంభూదాస్..." శశికళ అంది.

"మీరే ఆలోచించండి. ఆ సమయంలో అతనక్కడే వున్నా ఎవరి దృష్టికూడా అతనిపై లేదు" అన్నాడు పట్వారీ.

చాలాసేపటి తర్వాత సుధేంధురాయ్ అన్నాడు. "నాకు అర్థంకాని దొక్కటే. మాలతి అనవసర విషయాలలో జోక్యం కలిగించుకోదు. ఆమె నెందుకు చంపాడు హంతకుడు. నన్ను చంపినా ఒక అర్థముంది."

"మిమ్ములను మాత్రం ఎందుకు చంపాలి?" బెనర్జి అడిగాడు.

"నేను పారిశ్రామికుణ్ని. ఇష్టా ఇష్టాలతో పనిలేకుండా ప్రతి పారిశ్రామికునికి ప్రతిద్వంది ఉంటారు. కాని మాలతిని చంపినందువల్ల వాళ్ళకి ఒరిగిం దేమిటో తెలియడం లేదు."

"ఒక హత్య జరిగిందంటే పరిశోధకుని ముందుగా కలవరపరిచే ప్రశ్న ఒక్కటే....హత్యకు మోటివ్ ఏమిటి? నేను కూడా అదే చిక్కులో ఇరుక్కున్నాను" శ్యాంకుమార్ అన్నాడు. "మీతో ఒక విషయం అడగాలి."

"అడగండి" సుధేంధురాయ్ అన్నాడు.

"ఆగ్రానుండి ఢిల్లీ ఎక్కువ దూరం లేదుకదా! అయినా మాలతిగారు పుట్టింటికి ఢిల్లీకి వెళ్ళకుండా, తల్లిదండ్రులని ఎందుకు పిలిపించుకునే వారో తెలుసా?"

"ఆమె ఈ చర్య నాకూ ఆశ్చర్యాన్ని కలిగించింది" ఒక నిమిషం తర్వాత రాయ్ అన్నాడు. "ఒకసారి ఈ విషయం నే నడిగాను కూడా. ఇక జీవితంలో ఢిల్లీ ముఖం చూడనని చెప్పిందామె."

"ఎందుకు? ఢిల్లీ అంటే అంత అసహ్యా మెందుకు?"

"ఆ ప్రశ్న నేనూ అడిగాను.కాని నా మాటను చిరునవ్వుతో తోసిపారేసింది. ఆ తరువాత ఒకసారి మాటల మధ్య గడచిన తన గతజీవితంలో తాను తిరిగి అడుగుపెట్ట దలచుకోలేదు అన్నట్లు చెప్పింది. అంతే."

ఆ తరువాత ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

మరో అరగంట తరువాత శ్యాంకుమార్, శ్రీనివాస్‌లు తమ ఫ్లాట్‌లోకి వచ్చారు. అప్పుడు ఉదయం పదకొండు గంట లయింది. శ్రీనివాస్ ఒక మెడికల్ జర్నల్ అందుకుని కూర్చుంటే, శ్యాంకుమార్ దుస్తులు మార్చుకుని బయటకు నడిచాడు.

క్లబ్ హాలు నానుకుని వున్న ఒక గదిలో శంభూదాస్ వుంటు న్నాడు. శ్యాంకుమార్ అతణ్ని పిలువగానే బయటకు వచ్చా డతను.

"ఇక్కడ పోలీస్‌స్టేషన్ ఎటుందో తెలియదు. మీరు నా వచ్చి చూపిస్తారా?" అడిగాడు.

"వస్తాను, పదండి...."

కాంపౌండునుండి బయలుదేరి ఆ ఇరువురూ పల్లంలోకి దిగసాగారు. రెండువైపులా మనోహరమూ, హర్షోల్లాసమూ కలిగించే దృశ్యాలు నయనానందకరంగా వున్నాయి.

ఇరవయి నిముషాల తర్వాత వారు పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు. శ్యాంకుమార్ని సాదరంగా ఆహ్వానించాడు విష్ణువర్ధన్.

"పోస్టుమార్టమ్ రిపోర్ట్ వచ్చిందా?"

"యస్; ఒక గంట క్రితమే వచ్చింది. చూడండి" ఇన్స్పెక్టర్ రిపోర్ట్ అందించాడు.

శ్యాంకుమార్ రిపోర్ట్‌ని జాగ్రత్తగా చదివాడు. తను అనుమానించిన విషయాలకంటే ఇంకా ఎక్కువేమీ లేదందులో. రిపోర్టు తిరిగి ఇచ్చేసి ఏదో చెప్పబోతుండగానే ఒక కానిస్టేబుల్ వచ్చి ఇన్స్పెక్టర్‌తో ట్రంకాల్ వచ్చిందని చెప్పాడు. ఇన్స్పెక్టర్ వెంటనే ప్రక్క గదిలోనికి వెళ్ళాడు.

"ఆ వారపత్రిక విషయం ఏమయినా తేలిందా?" శ్యాంకుమార్, శంభూదాస్‌ని అడిగాడు.

"కనుక్కున్నాను. న్యూస్‌పేపర్ బాయ్ కాంపౌండులో వారపత్రిక ఎవరికి అమ్మలేదట. కాని ఒక విషయం జరిగిపోయింది. క్లబ్‌కి అవసరముంటుందని ప్రతి వారం వారపత్రిక కొంటాను. అందులోంచి ఈ రెండు బొమ్మలు కత్తిరించబడివున్నాయి."

"పత్రికను మీరెక్కడ వుంచారు?"

"టేబిల్ టెన్నిస్ టేబుల్ ప్రక్కన వున్న కప్‌బోర్డ్‌లో వుంచాను. మాగజైన్లు అన్నీ అక్కడే వుంటాయి."

శ్యాంకుమార్ ఇంకేమీ అడగలేదు. పైపు పీలుస్తూ ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు. కొద్దిసేపట్లో ఇన్స్పెక్టర్ తిరిగి వచ్చాడు.

"మీరు మిసెస్ మాలతిగారి అవివాహిత జీవితం గురించి తెలుసుకోమన్నారు. ఆ విషయమై ఢిల్లీ పోలీసులని కాంటాక్ట్ చేశాను. ట్రంకాల్ ద్వారా జవాబిచ్చారు" విష్ణువర్ధన్ కూర్చుంటూ అన్నాడు.

"ఏం తెలిసింది?"

"ఢిల్లీలో కరోల్‌బాగ్ ప్రాంతంలో మాలతి అందచందాల ఖ్యాతి ఎక్కువగా వుంది. కాలేజీలో ఆమెకు చాలా మంది రోమియోలున్నారు. కాని అందరిలో ఒకతణ్ని మాలతి ప్రేమించింది. పెళ్ళి మాటలు కూడా జరిగాయి. కాని ఈలోగా సుధేంధురాయ్ లాంటి ధనవంతుడు లభించటంతో ఆ విషయం మరుగున పడిపోయింది."

"ఆ యువకు డెవరో తెలిసిందా?"

"తెలియదు; మాలతి అతని విషయం ఒక్క తండ్రికి తప్ప ఇంకెవరికి చెప్పలేదు. పరిచయంకూడా చేయించలేదు, అందుకని అతనెవరన్నది ఎవరికీ తెలియదు. ఈ మధ్య మాలతి తండ్రి మరణించటంతో ఇక ఆ విషయం తెలుసుకొనే అవకాశంకూడా లేదు."

"ఊఁ!"

కొద్దిసేపటి తరువాత శ్యాంకుమార్ లేచాడు.

"భూటానీ 'జిగ్మి' ఇక్కడ నుండి ఎంత దూరంలో వుంటాడు?"

"ఇక్కడనుండి దగ్గరే!"

"ఒకసారి అక్కడికి వెళ్ళివద్దాం."

"ఇప్పుడా?"

"మీకేమయినా పనులుంటే వద్దులెండి. ఒకసారి వెళ్ళి అతని వద్ద ఎలాంటి కెమెరాలుంటాయో చూద్దామనుకున్నాను" శ్యాం కుమార్ అన్నాడు.

"పదండి," శంభూదాస్ దారితీసాడు.

కొద్దిసేపట్లోనే వారిరువురూ ఒక ఫాన్సీస్టోర్ ముందాగారు. స్టోర్‌లో జిగ్మి కూర్చుని వున్నాడు.

శంభూదాస్‌ని చూపి చిరునవ్వుతో ఆహ్వానించాడు. శంభూ దాస్ శ్యాంకుమార్ని అతనికి పరిచయంచేసి తాము ఎందుకు వచ్చిందీ చెప్పాడు.

జిగ్మి ఆ ఇరువురిని స్టోర్ వెనుక వున్న చిన్న గదిలోకి పిలుచుకు వెళ్ళాడు.

గదిలో నేలపై తివాచీ పరిచివుంది. తివాచీ ఒక కొసను పక్కకు తొలగించి క్రిందవున్న ఒక చెక్కపెట్టె మూతను పైకి లేపాడు. ఆ చెక్కపెట్టె నేలలో పాతిపెట్టబడివుంది. ఆ పెట్టెలో రకరకాల వస్తువు లున్నాయి.

జిగ్మి రకరకాల కెమెరాలు నాలుగు తీసి చూపుతూ "సాధార ణంగా ఈ గదిలోకి నేనెవరినీ రానీయను. శంభూదాస్ మీ వెంట వున్నాడు కాబట్టి మీరిక్కడివరకు రాగలిగారు" అన్నాడు.

ఆ తరువాత జిగ్మి కెమెరాల విశేషతలను గూర్చి విడమర్చి చెప్పాడు. శ్యాంకుమార్ ఒక కెమెరా పక్కనపెట్టి డబ్బు ఇప్పుడు తను తేలేదని, తరువాత శంభూదాస్ వచ్చి తీసుకెళతా డని చెప్పాడు.

మిగిలిన కెమెరాలను జిగ్మి లోపల పెడుతున్నపుడు ఉన్న ట్లుండి శ్యాంకుమార్ దృష్టి హటాత్తుగా ఒక సిగరెట్ పాకెట్ పైపడింది. అతను ముందుకి వంకి దానిని అందుకుని చూశాడు.

దానిపై నున్న క్లాప్‌ని తానింతకుముందు చూసినట్లు అనిపించిందతనికి. దానిపై 'కిమ్‌సన్ అండ్ కం; మేడ్ ఇన్ హాంకాంగ్' అని వుంది.

శ్యాంకుమార్ దానిని అటు ఇటు పరిశీలిస్తుండగానే జిగ్మి ఒక్క ఉదుటున దాని నందుకుని పెట్టెలోపెట్టి మూతమూశాడు.

"అరె! ఇదేమిటి?" విస్మిత స్వరంతో అడిగాడు శ్యాం.

"దానిని నే నమ్మను."

"అమ్మకండి; అందుకని...."

జిగ్మి ఏమీ అనలేదు. ముగ్గురూ బయటకు వచ్చారు. "సారీ! ఏమీ అనుకోకండి. ఉండివుండి నేను ఉత్తేజితుణ్ని అయిపోతాను" బయటకు వచ్చిన తరువాత అన్నాడు జిగ్మి.

"మరేం ఫర్వాలేదు." శ్యాంకుమార్ అడిగాడు- "ఇవాళ ఉదయం మీరు కాంపౌండులోకి వచ్చారు కదూ?"

"అవును."

"ఎవరివద్దకు, ఎందుకు వెళ్ళారో తెలుసుకోవచ్చా?"

జిగ్మి శ్యాంకుమార్‌ని చూశాడు. ఒక నిమిషం తర్వాత "నా వద్దకు వచ్చేవాళ్ళ గురించి ఇతరులకు చెప్పడం వ్యాపారరీత్యా మంచిది కాదు. మీ రిక్కాడికి వచ్చిన విషయం కూడా నేనెవరికీ చెప్పను."

శ్యాంకుమార్ ఇంకేమీ అనలేదు. అతనూ, శంభూదాస్‌లు ఫాన్సీ షాప్‌నుండి బయటకువచ్చి ముందుకు సాగారు. కొద్ది దూరం వెళ్లిన తరువాత శ్యాంకుమార్...."శంభూదాస్‌గారూ! మీరు వెళ్ళండి. నేనొకసారి మళ్ళీ పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళివస్తాను" అన్నాడు.

శంభూదాస్ ఏమీ మాట్లాడలేదు.

"మరో విషయం.ఇక్కడ జిగ్మి షాప్‌లో జరిగిన విషయం మన కాంపౌండులో అందరికి మరికొంచెం మసాళా తగిలించి చెప్పండి."

"సరే!" అన్నాడు శంభూదాస్.

6

శ్యాంకుమార్ ఓపికగా కిటికీవద్ద కూర్చుని బయటకు చూస్తు న్నాడు. కిటికి రెక్కలు దగ్గరకు చేరవేసి, కొద్దిగా ఏర్పడివున్న ఖాళీలోంచి చూస్తున్నాడు. కాంపౌండు గేటు స్పష్టంగా కని పిస్తూంది.

గదంతా చీకటిగా వుంది.

శ్రీనివాస్ ఇంతసేపటివరకు ప్రక్కనేవుండి కొంచెం సేపటి క్రితమే వెళ్ళి మంచంపై వాలాడు.

శ్యాంకుమార్ రిస్ట్‌వాచీ చూసుకున్నాడు. రేడియం డయల్ ఒకటీ ఇరవయి చూపించింది. పైపు వెలిగించి తిరిగి బయటకు చూడసాగాడు.

రెండయింది మూడయింది. తూర్పుదిశనుండి ప్రభాత కిరణాలు పృధ్విపై ప్రసరించాయి. ఇక లాభంలేదు. శ్యాంకుమార్ లేచి వెళ్ళి మంచంపై వాలగానే నిద్ర పట్టేసింది. తిరిగి లేచేసరికి పగలు పన్నెండు గంటలయింది.

"పిట్ట వలలో చిక్కలేదు కదూ?" డాక్టర్ శ్రీనివాస్ అడి గాడు.

"ఉహూఁ! ఇవాళ రాత్రి చూడాలి."

"అంటే ఇవాళ రాత్రి కూడా మేలుకోవాలా?"

"అవును."

సాయంత్రం ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ వచ్చి చాలాసేపు

మాట్లాడి వెళ్ళాడు. శ్యాంకుమార్, శ్రీనివాస్ ఏవేవో మాట్లా డుతూ పుస్తకాలు తిరగేస్తూ కూర్చున్నారు. ఏడు గంటల ప్రాంతంలో బయటకి వచ్చినవారికి ఆ కాంపౌండు నిర్జనంగా అని పించింది. ఒకరి తర్వాత ఒకరుగా అందరూ బయటకు వెళ్ళా రని తోటమాలి చెప్పాడు.

"గందరగోళం జరిగిపోయింది" శ్యాంకుమార్ అన్నాడు.

"ఏమయింది?"

"హంతకుడు తన పనిని పూర్తిచేయడానికి రాత్రి సమ యాన్ని కాకుండా ఈ సమయాన్ని ఎన్నుకున్నట్లున్నాడు. కమాన్ క్విక్...." అంటూ బయటి వైపుకి సాగాడు శ్యాం కుమార్.

ఆ ఇరువురూ పరుగెత్తుతున్నంత వేగంగా జిగ్మి ఫ్యాన్సీ షాపువద్దకు వెళ్ళారు. కొద్దిదూరంలో వారికి ఇన్స్పెక్టర్ విష్ణు వర్ధన్ కనిపించాడు.

"మీ రెప్పుడు వచ్చారు?"

"అరగంట క్రితం...."

"అంతా సవ్యంగా వుంది కదూ?"

"యస్."

ముగ్గురూ కలిసి జిగ్మి షాపుకి కొద్దిదూరంలో వున్న ఒక చెట్టు క్రిందికి చేరుకున్నారు. చలికాలం కావటంతో ఏడు గంట లకే దట్టంగా చీకట్లు అలుముకున్నాయి. ఆ చుట్టుప్రక్కల ప్రాంతమంతా నిర్మానుష్యంగా వుంది.

అరగంట గడిచింది.ఈ ముగ్గురి వ్యాకులదృష్టులు షాపువైపే కేంద్రీకరించి వున్నాయి. అలా ఆ చలిలో ఎంతసేపు నిలబడాలో వారికే తెలియదు.

మరో కొంచెం సేపటి తరువాత దూరంగా ఒక వ్యక్తి అటు

వస్తూ కనిపించాడు. శరీరంపై పొడుగాటి వులన్‌కోటు వుంది. తలపై ఈవినింగ్ హాటు ముందుకి లాక్కోవడంవల్ల అతణ్ణి గుర్తించటం కష్టంగా వుంది. అతను నేరుగా షాపులోనికి వెళ్ళాడు.

"ముందుకి వెళ్దామా?" అడిగాడు ఇన్స్‌పెక్టర్.

"అతను మరెవరో మామూలు కస్టమర్ కావచ్చు. ఇంత దూరంనుండి మనమతణ్ణి గుర్తించలేకపోయాం. అయినా వెళ్దాం పదండి" ముందుకి సాగాడు శ్యాంకుమార్. మిగిలిన ఇరువురూ అతణ్ణి అనుసరించారు.

షాపు ముందు భాగంలో జిగ్మి కాని, ఆ ఆగంతకుడు కాని అగుపించలేదు. శ్యాంకుమార్ వెనుక ద్వారంవేపు నడిచాడు. తలుపువద్దకు వెళ్ళగానే అతను తక్కున ఆగాడు. గది మధ్య తివాచీపై జిగ్మి వెల్లికిలా నిర్జీవంగా పడివున్నాడు. ఫెల్ట్‌హాట్ అతను భూమిలో పాతివున్న పెట్టెలోంచి ఏదో తీస్తున్నాడు.

తలుపువద్ద చప్పుడు విని తలెత్తాడు అతను. అతణ్ని గుర్తించిన శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్లు ఆశ్చర్యపోయారు. అతను విఘ్నేశ్వర్‌పట్వారీ.

పట్వారీ.బెనర్జీలలో ఎవరో హంతకులని వూహించిన శ్యాం కుమార్ మాత్రం ఆశ్చర్యపోలేదు.

వీరిని చూసిన పట్వారీ తన చేతిని జేబువైపు పోనిచ్చాడు. "ఊహుఁ! ఆ పని చేయకండి మిస్టర్ పట్వారీ!" శ్యాంకుమార్ రివాల్వర్ అతనిపై గురిపెడుతూ అన్నాడు.ఇన్స్‌పెక్టర్ రివాల్వర్ కూడా అతనిపై గురి పెట్టబడి వుంది.

"ఇన్స్‌పెక్టర్! ఇద్దరిని హత్యచేసిన ఈ మిలిటరీ హంతకుణ్ణి అరెస్ట్ చేయండి"అన్నాడు శ్యాంకుమార్.

ఇన్స్‌పెక్టర్ పట్వారీ చేతులకి బేడీలు తొడిగాడు. పట్వారీ మౌనంగా తలదించుకున్నాడు.

7

"విశ్వేశ్వర పట్వారీ హత్య చేసివుంటాడని నేననుకో లేదు" డాక్టర్ శ్రీనివాస్ అన్నాడు.

"మొదట నాకూ అర్థం కాలేదు. పట్వారీ, శశికాంత్ బెనర్జీ లపై అనుమానం వుండింది."

"అలాకాదు మొదటినుంచి చెప్పు" శ్రీనివాస్ అన్నాడు.

ఆ రాత్రి వాళ్ళిద్దరూ భోజనాలు పూర్తయిన తరువాత కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"కళ్ళముందు హత్య జరిగిం తరువాత కూడా నాకేమీ అర్థం కాలేదు" శ్యాంకుమార్ అన్నాడు. "ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ అడిగిన ప్రశ్నలు, దానికి వారిచ్చిన జవాబులు నన్ను రెండు విషయాలు ఆలోచించేలా చేశాయి. ఒకటి మిసెస్ మాలతి పుట్టిం టికి వెళ్ళేదికాదు. వాళ్ళనే తనవద్దకు రప్పించుకునేది. రెండవది ఆమె చాలా కలుపుగోరు మనిషి. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుంటుంది. ఇక్కడకూడా అలాగే వుండింది. కాని ఈ నాలుగు రోజులుగా ఉదాసీనంగా వుంటూంది."

'ఎందుకూ?' అన్న ప్రశ్న ఉదయిస్తుంది. దాని కంటే ముందు ఆ విషపు సూదిని దేనితో విసిరారు అనేది ముఖ్యం.

తప్పకుండా అది మామూలు వాడకంలో ఉపయోగపడే వస్తువై వుండాలి. అప్పుడే హంతకుని చేతిలో ఆ వస్తు ఉన్న పుడు కూడా ఎవరికి అనుమానం కలుగలేదు.

ఆ సూదిని వాసన చూస్తే ఒక విధమయిన వాసనవేస్తుంది. ఆ తరువాత హత్యాస్థలంలో నాకో లేబిల్ దొరికింది. ఆ లేబిల్ ఏదో సిగరెట్పై నుండే ఆయిల్ పేపర్ లాగుంది. దానికి విషం అంటుకుని వుంది. దానిపై నాకు దొరికిన ముక్కపై 'కిమ్' 'మేడ్' అనే పదాలున్నాయి.

మానాన్నగారు చెప్పినట్టుగా వింటే - మనం బాగుపడేవాళ్ళమండీ!
మీనాన్నగారు బాగుపడ్డ తరువాత చెప్పమను!! వింటాను!!

పోలీస్ స్టేషన్‌కి వెళితే ఢిల్లీ నుండి రిపోర్ట్ వచ్చింది.

మాలతి ఢిల్లీలో ఒక యువకుడ్ని ప్రేమించిందనీ, పెళ్ళి కూడా చేసుకోవాలనుకున్నారనీ తెలిసింది. కాని ఈ లోగా సుధేంధురాయ్ తటస్థపడటంతో ధనవంతుడు, అందగాడు అయిన సుధేంధురాయ్‌ని వివాహం చేసుకుంది.

పుట్టింటికి ఢిల్లీ వెళితే తన పాత ప్రేమికుడ్ని కలవాల్సి వస్తుందనీ, ఏదయినా గందరగోళం జరగవచ్చని ఆమె పుట్టింటికి వెళ్ళేది కాదు. ఇక్కడ ఈమె హత్యకు నాలుగు రోజులు ముందు పట్వారీ, బెనర్జీలు ఇక్కడకు వచ్చారు. ఈ మూడు రోజులు మాలతి నర్వస్‌గానూ, ఉదాసీనంగానూ వుండింది. అంటే ఇద్దరిలోనే ఒకరు ఆమె ప్రేమించిన వ్యక్తని తేలుతుంది.

మాలతిని ఇక్కడ చూడగానే ప్రేమికుని మనస్సు భగ్గుమని, ఆమెను హత్య చేయడానికి నిశ్చయించుకుని వుంటాడు. అందుకే అతను రెండు పేపర్ కటింగ్స్ పంపాడు. దానిని చూచి భయపడిన మాలతి భర్తని ఒప్పించి ఇక్కడ్నుంచి వెళ్ళిపోవాలనుకుంది. కాని ఈలోగానే ఆమె హత్య జరిగింది.

జిగ్మి ఎప్పుడూ కాంపౌండులోకి రాడు. అటువంటివాడు వచ్చాడనగానే నాకెందుకో మనస్సు వుండబట్టలేదు. ఫారిన్ సిగరెట్ లేబెల్. సూదిలో పొగాకువాసన.ఎన్నడూ రానివాడు ఇక్కడికి రావడం. నా కనుమానం కలిగించింది.

నేను శంభూదాస్‌తో అతని వద్దకు వెళ్ళాను. కెమరా చూస్తూ చూస్తూ ఒక సిగరెట్ పాకెట్‌పై పడింది దృష్టి. దానిపై 'కిమ్‌సన్ అండ్‌కో మేడ్ ఇన్ హాంకాంగ్' అని వుంది. నాకు దొరికిన లేబిల్ దానిదేనన్న మాట. నేను దానిని కొందామనుకుంటుండగానే జిగ్మి దానిని నా చేతుల్లోంచి లాక్కుని అమ్మనని దాచేసుకున్నాడు.

నిజానికి మాలతి హత్య కుపయోగింపబడిన అస్త్రం అదే. ఆ సిగరెట్టులో ఒకవైపు విషంలో వుంచిన సూది వుంటుంది. నోట్లో పెట్టుకుని ఉఫ్‌న ఊదితే సూది బయటకు వెళ్ళి గుచ్చు కుంటుంది. ఆ తరువాత మామూలుగా సిగరెట్ వెలిగించుకుని త్రాగవచ్చు.

ఆ ఇద్దరిలో ఒకరు హంతకులు. కాని ఎవరు? దానికి బల మయిన సాక్ష్యాలు కావాలి. జిగ్మి షాపులో ఆ సిగరెట్ బాక్స్ విషయంలో జరిగిన విషయాన్ని చాటింపు చేసినట్లుగా అందరికి చెప్పమని శంభూదాస్‌కి చెప్పాను.

ఆ విషయం విని పట్వారీ కంగారుపడి వుంటాడు. హంతకు డెప్పుడూ క్లూలు వదలకూడదనే అనుకుంటాడు. తను ఆ పాకెట్ కొన్న విషయం జిగ్మి చెబుతాడేమోనని పట్వారీ అతడ్నికూడా తొలగించుకోవాలనుకున్నాడు. దాంతోపాటే అలాంటి పాకెట్లు ఎన్నివున్నా తెచ్చేసుకోవాలని నిర్ణయించుకుని వుంటాడు. అంతే. ఆ తరువాత ఏం జరిగిందో నీకు బాగా తెలుసు'' అని పూర్తి చేశాడు శ్యాంకుమార్. ★

జైల్లో ఇద్దరు ఖైదీలు మాట్లాడుకుంటున్నారు.

మొ. ఖైదీ:—ఏం నేరం చేశావ్? ఎంతకాలం శిక్ష వేశారు?

రెం. ఖైదీ:—రాజలక్ష్మి బాంక్‌లో దొంగతనం చేసినం దుకు మూడేళ్ళ శిక్ష వేశారు. మరి నీకు?

మొ. ఖైదీ:—ఏడేళ్ళు.

రెం. ఖైదీ:—ఏం చేశావ్?

మొ. ఖైదీ:—ఆ బ్యాంక్ మేనేజర్ని నేనేనయ్యా!!?

—నాదెళ్ళ లక్ష్మిదాసు.

ఈనెల జోక్స్

—ఎమ్. జయంత్

ఒక ప్రముఖుడు చనిపోయిన సందర్భంగా ఉత్తర క్రియలపై ఒక పత్రికలో వార్తా నివేదిక:

"....బంధు మిత్రులంతా వచ్చారు. నిన్న సాయంకాలం.... వారి ఆస్తిని మజ్జనం జరిగింది."

♦ ♦ ♦

యుద్ధకాలంలో, ఒక సేనాధిపతి గాయపడి ప్రమాద పరిస్థితిలో ఉన్నట్టు వార్త వచ్చింది.

సాయంకాలానికి ఎలాగా చనిపోతాడులే అన్న ధీమాకొద్దీ ఒక దినపత్రిక సంపాదకుడు ఆ సేనాని మరణించినట్లుగా పతాక శీర్షిక పెట్టి వార్త ప్రచురించాడు.

సేనాని ఆ పూట చనిపోలేదు. మర్నాడు మధ్యాహ్నం అతడు పోయినట్టు వార్త వచ్చింది.

అందరితోపాటు తిరిగి ఆ వార్తను తాను ఎలా ప్రచురించాలో కుదరక చాలా ఆలోచించి చివరకి ఇలా వ్రాశాడు సంపాదకుడు:

"సేనాని....నేడు పూర్తిగా మరణించాడు."

♦ ♦ ♦

హెడ్‌క్లర్క్ వేడి చూపుకు తట్టుకోలేక ఆయన అడక్కుండానే ఆలస్యానికి కారణం చెప్పేశాడు కోనేటిరావు—"వెధవది ఇవాళ నిద్ర లేచేసరికే బాగా పొద్దెక్కిపోయింది." అని.

"ఊ. నువ్వు ఇంట్లోకూడా నిద్దరోతున్నావన్న మాట!"

అన్నది హెడ్‌క్లర్క్ హెడ్ ఆశ్చర్యంగా.

♦ ♦ ♦

ఒక పెద్దమనిషి చనిపోతూ ఆస్తిలో కొంత భాగం ముగ్గురు మిత్రులకు వ్రాశాడు. అయితే ఆ ముగ్గురూ తన చితి మీద ఐదేసి రూపాయలు పడెయ్యాలని షరతుపెట్టాడు.

చితిమీద ఒక ఆసామి ఐదువిచ్చు రూపాయలు పడేశాడు. కరిగాక వెండి తీసుకోవచ్చుగా అనుకుంటూ.

వెంటనే రెండో అతను పదిరూపాయల కాగితం పడేసి, చితిమీది రూపాయలైదూ తీసుకున్నాడు.

మూడో అతను, చచ్చిన సుబ్బారావు పేర పదిహేను రూపాయలకి చెక్కు రాసి, అది చితిమీద పడేసి, పదిరూపాయల నోటు తీసుకున్నాడు.

మర్నాడు సాయంకాలానికి ఆ చెక్కు బాంకుకి వచ్చిందని సుబ్బారావు స్వయంగా వచ్చి మార్చి 15 రూపాయలు తీసుకున్నాడని తెలిపి ఆశ్చర్యపోయారు మిత్రులు ముగ్గురూ.

♦ ♦ ♦

ముసలాయన రైలాగినప్పుడల్లా దిగి స్టేషనులోకి పరుగెత్తి రైలు కదిలేసరికి ఒగురుస్తూ వచ్చి పడుతున్నాడు రైల్లో.



"ఏం కావాలో చెబితే నే తెస్తాను. మీరు హైరాణ పడ

కండి,'' అన్నాడో యువకుడు.

''అబ్బే, రైలు టిక్కెట్లు కొంటున్నా'' అన్నాడాయన.

''ప్రతి స్టేషనులోనా?''అన్నాడు యువకుడు ఆశ్చర్యపోతూ.

''మరే బాబూ. సుస్తీ చేసింది. బతకడం కష్టమనీ ప్రాణం ఎప్పుడు పోయినాపోవచ్చనీ చెప్పాడు డాక్టరు. ఒక్కసారి చివరకంటా టిక్కెట్ కొనేశాక తీరా మధ్యలోనే హరీమంటే? అందుకని—పక్క పక్క స్టేషన్లకి కొంటున్నా'' అన్నాడాయన ఆయాసపడుతూ.

♦ ♦ ♦

''హలో కులాసా?'' అన్నాడు అప్పారావు.

''అరె, మళ్ళీ ఎలా వచ్చావురా! నువ్వా మధ్య చచ్చిపోయావుగా, మళ్లీ ఎలా వచ్చావు? నువ్వు చావలేదా?'' అన్నాడు రెడ్డి గాభరాపడి.

''చావకేం నిక్షేపంగా చచ్చాను. నా దహనానికీ దానికీ నువ్వేగా అప్పిచ్చావు మా అన్నయ్యకి?''

''మరి, మరి మళ్ళీ ఎలా వచ్చావు?''

''నేను రాలేదు. నువ్వే వచ్చావు....నువ్వు చచ్చిపోయి గంటయింది'' అన్నాడు అప్పారావు.

♦ ♦ ♦

''నా కొత్త నవలమీద పత్రికలో విమర్శ వేయించండి'' అంటూ రచయిత ఒక పుస్తకం అందించాడు సంపాదకుడికి.

పుస్తకం బాగా నలిగి చినిగిపోయింది.

''పబ్లిషర్ నాకు ఒకటే కాపీ ఇచ్చాడు. మా అబ్బాయి దాన్ని పొద్దున్నే నలిపి చింపేశాడు. అంతే మరోలా అనుకోకండి,'' అన్నాడు రచయిత.

''అయితే ఇంకా మా విమర్శ ఎందుకు? మీ అబ్బాయి అభి

ప్రాయం తెలుస్తూనే ఉందిగా'' అన్నాడు సంపాదకుడు.

♦ ♦ ♦

నిగనిగ లాడుతున్న కొత్త కారులోంచి చెయ్యి ఒకటి ఇవతలికి వచ్చింది. ''బాబూ పైస'' అంది లోపలి కంఠం.

''ఇదేవి టీ వరుస?'' అన్నాడు దానయ్య తెల్లబోయి.

''లాట్రీలో కారొచ్చిందిగాని, పెట్రోలికి డబ్బుల్లేవు. అందుకని యిక్కడే కూకొని మామూలుగా ముష్టెత్తుకుంటున్నాను'' అన్నాడు కారులోని యాచకుడు.

♦ ♦ ♦

న్యాయమూర్తి ఒక కేసులో ముద్దాయికి శిక్ష విధించబోతూ ''నిన్నెక్కడో చూచినట్టుందే. ఎక్కడ చెప్మా'' అన్నాడు.

''చిత్తం! మీరు ప్లీడరుగా వున్నప్పుడు మీ రెండో అమ్మాయికి సంగీతం చెప్పడాని కొచ్చేవాడ్ని...''

''అలాగా! అయితే యిరవై యేళ్ళు ఖైదు విధిస్తున్నాను నీకు!!''

♦ ♦ ♦

ముందు వరుసలో చిలకాగోరింక జంట ఒక్కలా ఎడతెరిపి లేకుండా మాట్లాడుకుని నవ్వుకుంటున్నారు. వెనక వరుసలో

పెద్దమనిషికి కొంతసేపయ్యాక ఓపిక చచ్చిపోయింది.

''బాబూ, ఇందాకట్నించి చూస్తున్నాను. మీరేం మాట్లాడు

కుంటున్నారో నాకు ఒక్కమాట వినబట్టంలేదు." అన్నాడు కోపంగా ముందుకి వంగి.

♦ ♦ ♦

"ఏవండీ విన్నారా? పొరుగింటి సుశీలా, మొగుడూ ఈ వేసంగులికి రేపు ఊటి వెళ్ళిపోతున్నారట?"

"భేష్, ఇంకేం. మనం ఎల్లుండి కొడై కెనాల్ వెళ్తున్నామని చెప్పు. వాళ్ళు రేపు పోతారు కాబట్టి, ఎల్లుండి మనం కొడై కెనాల్ వెళ్ళలేదని వాళ్ళకి తెలీదుగా?"

♦ ♦ ♦

తల్లి దగ్గరుండి కొడుకుచేత కూరలు తరిగిస్తోంది.

"అదేమిటే-నేను వంట చేస్తున్నానుగదాని వాడిచేత కూడా చేయిస్తావా!" అన్నాడు భర్త తటపటాయిస్తూ.

"బావుందండి. రేపు వాడికిమటుకు పెళ్ళికాదా ఏమిటీ?"

♦ ♦ ♦

"అవునుగానీ, అమ్మడూ! నీ చేతిలో ఎప్పుడూ డబ్బు ఆడుతుంది గదా,మీ ఆయనన్నలా చెప్పుచేతల్లో ఎలా పెట్టుకున్నావే?"

"ఏంలేదు పిన్నీ, నాకు కోపం వచ్చినప్పుడల్లా మా పుట్టింటికెళ్ళిపోతా నంటాను. అన్నప్పుడల్లా ఆయన రైలు చార్జీలకని పాతిక రంగున తీసిస్తారు. ఆ తరవాత నేను వెళ్ళడం మానేస్తాను. ఎప్పుడూ ఇంతే."

♦ ♦ ♦

"పదిహేనుగురు కలిసి ఒక పొలాన్ని అయిదు గంటలలో దున్నారు. అదే పొలాన్ని ఏభై మంది కలిసి ఎంతసేపట్లో దున్నగలరు?" అని ప్రశ్నించాడు టీచర్.

"వాళ్ళేమీ చేయలే రసలు."అన్నాడో కుర్రాడు వున్నట్లుండి.

"అదేం జవాబురా?"

"అవును సార్! ఆ పొలాన్ని అంతక్రితమే ఓ పదిహేను

మంది దున్నేసిపోయారు గదా! ఈ యాభై మంది దున్నడానికి ఇంకేం వుంటుం దక్కడ?'' అన్నాడా కుర్రాడు.

♦ ♦ ♦

రొప్పుతూ, రోజుతూ గదిలో కూలబడ్డ అతన్ని చూచి, "ఏమిటిలా ఒగురుస్తున్నావ్, ఏం జరిగింది మళ్లీ?'' అన్నాడు డాక్టర్.



"దిట్టంగా తిని, పరిగెత్తాను'' అన్నాడతను.

"అరి నీ అసాధ్యం కూలా! తిన్నాక విశ్రాంతి తీసుకోవాలని నీ కెన్నిసార్లు చెప్పేదయ్యా?''

"ఏం చేసేది డాక్టరుగారు! తిన్నదానికి బిల్లు చెల్లించ లేదని ఆ హోటల్‌వాళ్లు వెంటబడ్డారు. పరుగెత్తక తప్పలేదు!'' అన్నాడతను ఆపసోపాలు పడుతూ.

♦ ♦ ♦

రాజుగారు, విదూషకుడూ అడవి మధ్యకు చేరుకున్నారు. అక్కడ నేలమీద పెద్దపులి అడుగుల గుర్తులు కన్పించాయి. అది ఓ వైపునుండి మరోవైపుకు పోయినట్లు వాటివల్ల తెలుస్తోంది.

రాజుగారేదో అనబోయేంతలోనే అందుకుని, "రాజా! మీరు అలా ముందుకువెళ్ళి, అది ఎక్కడకు పోయిందో చూడండి; నేనిలా వెనక్కిపోయి, అది ఎక్కడినుండి వచ్చిందో చూచి వస్తాను—సరేనా?'' అన్నాడా విదూషకుడు, గంభీరంగా. ★

పారిపోయిన
ఖైదీలు
మల్లాది
వెంకట కృష్ణమూర్తి

సీరియల్

[జరిగిన కథ: అబ్దుల్, రాజారావ్, మరిదేశ్వర్, బిక్షపతి — నలుగురు ఖైదీలు కలిసి, ఒక పటిష్టమైన ప్లాను వేసి జైల్లోంచి తప్పించుకున్నారు. వారితోపాటు మరో ఖైదీ కూడా తప్పించుకున్నట్లు జైలు అధికారులు గుర్తించారు. ఆ నలుగురు ఖైదీలు, పోలీసులు వెంట తరుమగా 'శాలివాహన' టూరిస్ట్ బస్‌లో పారిపోసాగారు. అందులోని ప్రయాణీకుల క్షేమం దృష్ట్యా పోలీసులు దానిని వెంబడించడం విరమించుకున్నారు. బిక్షపతి, రమణిపై అత్యాచారం జరుపబోయి చావుదెబ్బ తిన్నాడు. రాజారావ్, అబ్దుల్ బస్‌ని ఒకచోట వదిలేసి, దూరంగా వస్తున్న రైలువేపు పరుగెత్తారు. వారి వెనుకనే మరో వ్యక్తి పరిగెత్తాడు.

—ఇక చదవండి.]

(గతసంచిక తరువాయి)

15

అది గూడ్సుబండి. రైలుబండి కాదు.

"ఫర్వాలేదు ఎక్కుదాం. ముందర ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది ఇక్కడనుంచి. పోలీసులు ఈ ప్రాంతంలో గాలిస్తే కష్టం" అన్నాడు రాజారావు, అబ్దుల్‌తో.

చాలా పెద్ద గూడ్స్ బండి అది.

ఇద్దరూ ఓ ఓపెన్ కేరేజ్ ప్రక్కనే పరిగెత్తుతూ, క్రమంగా తమ పరుగులో ఆ రైలు స్పీడ్ అందుకుని దాంట్లోకి ఎగిరారు.

పట్టు చిక్కింది ఇద్దరికీ.

లోపలకి దూకారు.

ఐరన్ ఓర్ వుంది ఆ గూడ్సు బండినిండా. ఇనుము గనుల నుంచి వస్తోంది ఆ కేరేజ్.

"మంగుళూరు వెళ్తుందనుకుంటాను ఇది" అన్నాడు అబ్దుల్.

"ఎలా తెలుసు?" అడిగాడు రాజారావు.

"ఇనుప గనినుంచి వెళ్తోంది. ఇనుముని జపాన్‌కి ఎగుమతి చేస్తారని విన్నాను. ఏదో పోర్ట్‌కే వెళ్తోంది ఇది. మంగుళూరు కావచ్చు."

"మంగుళూరు అయినా, కాకపోయినా దీంట్లోంచి కదిలేది లేదు ఈ రాత్రికి. నిద్రలేదు సరిగా. హాయిగా పడుకుందాం," అన్నాడు రాజారావు.

"అలాగే" అన్నాడు అబ్దుల్.

రాజారావు అప్పటికే తన చొక్కా చింపి వీపుమీద, కుడిచేతి కింద, మరిడేశ్వర్ పేల్చిన గుండు తగిలినచోట రక్తస్రావం అవకుండా కట్టు కట్టుకున్నాడు.

ఓసారి ఆ కట్టువిప్పతీసి మళ్ళీ బిగించి కట్టాడు. రక్తం గడ్డకట్టిపోయింది అప్పటికే.

"వాడికి తుపాకి ఎలా వచ్చిందో ఆ నక్సలైట్‌కి?" అన్నాడు రాజారావు ఆలోచనగా.

"ఏమో?"

కళ్ళు మూసుకుని అన్నాడు అబ్దుల్.

"మొదటినుంచి వుండివుండచ్చా?"

"వుందేమో."

"మొదటినుంచీ వుండివుంటే, జైల్లోంచే వుండాలి. ఎలా సంపాదించగలిగాడు జైల్లో? ఎవరూ చూడకుండా ఎలా దాచ గలిగాడు?"

"ఏమో?"

"గట్టిదెబ్బే కొట్టాడు వెధవ."

కుడిభుజం నలుపుతూంటే అన్నాడు రాజారావు, బాధగా మూలిగి.

"మనం వాడిమీద అబద్ధాలు చెప్పాం, లేనిపోనివి కల్పించి అనేకం వాళ్ళకి. ఆ కోపం మనసులో పెట్టుకుని మనల్ని ఏమయినా చేస్తే వాడు?" అన్నాడు అబ్దుల్ కొంచెంసేపాగి.

"ఏం చేస్తాడు. అసలు వాణ్ణి పట్టుకుని పోలీసులకి అప్ప గించే వుంటారు ఈ పాటికి."

"నక్సలైట్ కదా? ఒకవేళ తప్పించుకుంటే? నువు అబద్ధం చెప్పకుండా వుండాల్సింది."

"నాకు నక్సలైట్స్ అంటే ఇష్టంలేదు. అందుకనే కావాలని చెప్పాను అబద్ధం," అన్నాడు రాజారావు, మబ్బుల చాటున చంద్రుణ్ణి చూస్తూ.

"ఎందుకు ఇష్టంలేదు?"

"నిద్రొస్తోంది. ఇంక పడుకో."

కళ్ళు మూసుకున్నాడు అబ్దుల్.

"ఆ డబ్బు ఎక్కడ దాచావు? బెంగుళూరులోనేనా? బయటా?" అడిగాడు రాజారావు కాస్సేపాగి.

"నిద్రొస్తోంది. ఇంక పడుకో" అన్నాడు అబ్దుల్.

రేపు ఎక్కడికి పోతాడు అనుకున్నాడు రాజారావు. ఓసారి నిక్కరు జేబులోని తన పిస్తోలుని తడుముకున్నాడు. పక్కకి తిరిగి అబ్దుల్ భుజాలమీద చెయ్యివేసి పడుకున్నాడు కళ్ళు మూసుకుని.

కాస్సేపయ్యేటప్పటికి నిద్రపట్టింది రాజారావుకి, బస్ డ్రయివింగ్‌వల్ల, ఆలోచనలవల్ల, నిద్రలేమివల్ల కలిగిన శ్రమవలన, వేగంగా పోతున్న ఆ ఓపెన్ గూడ్స్ కారేజిమీద తగిలే చల్లటి గాలివల్ల, రైలు లయ చప్పుడువల్ల.

నిద్ర పోవాలనుకోలేదు రాజారావు. అసలు నిద్ర పోకూడ

దనే అనుకున్నాడు. కాని తనకి తెలియకుండానే నిద్రపట్టింది.

16

ఎవరో లేపితే మెలకువ వచ్చింది రాజారావుకి. ఒళ్ళు విరుచుకుంటూ కళ్లు తెరచిచూసాడు రాజారావు.

ఎదురుగ్గా ఒక మొహం కనిపించింది. ఆ మొహం నెత్తిమీద టోపీ. భుజాలుకూడా కనిపించటంలేదు. కాని భుజంమీద వేలాడే తుపాకీ గొట్టం కనపడుతోంది తలప్రక్కన.

"ఏమిటి?"

"లే, ఎవరు నువ్వు?" అడిగాడు అతను.

నిద్రమత్తు కొద్దిగా వదిలింది రాజారావుకి.

"ఏమిటి?" అడిగాడు లేచికూర్చుని.

రాజారావు లేచి కూర్చోగానే కనబడింది అతని పూర్తి స్వరూపం. యూనిఫారంలో వున్న పోలీస్ అని గుర్తించాడు వెంటనే.

"ఏమిటి?" అడిగాడు ఖంగారుగా నిక్కరుజేబులు తడుముకుంటూ.

నిక్కరుజేబులో తన పిస్తోలు మాయమయిందని గ్రహించాడు రాజారావు. ప్రక్కన చూసాడు. అబ్దుల్ లేడు. అబ్దులే కాదు. తనజేబులో డబ్బులేదు. తను మూట కట్టుకున్న వస్తువుల సంచీకూడా లేదు.

"ఎక్కడనుంచి వస్తున్నావు?" అడిగాడు ఆ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కి చెందిన పోలీస్.

సమాధానం చెప్పలేదు రాజారావు. నిజానికి సమాధానం తెలియదు కాబట్టి.

"టిక్కెట్టు వుందా?" అడిగాడు మళ్ళీ.

నవ్వి అన్నాడు రాజారావు.

చెప్తా వినండి?

(1) మోటారుకార్ల ప్రమాదాలలో మరణించేవారి సంఖ్యలో ఇండియాదే అగ్రతాంబూలం. ప్రతి 1000 కార్లకూ 8 మంది చనిపోతున్నారు.

(2) భారతదేశం చైనా, పాకిస్తాన్‌లతో సాగించిన 4 యుద్ధాలలో మరణించిన, గాయపడినవారి సంఖ్యకంటె, ప్రతిసంవత్సరం కారు ప్రమాదాలలో (ఇండియాలో) మరణించిన, గాయపడిన వారి సంఖ్య చాలా ఎక్కువ.

(3) ఒక పెనుతుఫానులో అంతర్గతంగా ఉండేశక్తి 20 మెగాటన్నుల హైడ్రోజను బాంబులను నాలుగు వందలింటిని ఏకకాలంలో ప్రేలిస్తే బహిర్గతమయే శక్తికి సమానం.

(4) ప్రపంచంలో ఉన్న మొత్తం ప్రింటింగ్ ప్రెస్‌లన్నీ కలిపి ప్రతి సెకండుకూ 260 పుస్తకాలు, 4500 న్యూస్ పేపర్లు ప్రింట్ చేస్తున్నాయి.

(5) జపాన్ నేషనల్ రైల్వేవారి సూపర్ ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ గంటకు 130 మైళ్ళ వేగంతో నడుస్తుంది. ఈ ట్రెయిన్ గడువుదాటి ఒక్క నిముషం ఆలస్యమైనా, టికెట్ ఛార్జిలో కొంత భాగం తిరిగి ఇచ్చేస్తారు.

(6) ప్రపంచంలోకల్లా కల్మషవంతమైన నగరం కరాచీ.

(7) ఒక గ్రాము యురేనియమ్-235 నుండి కేంద్రక విచ్ఛిత్తి ద్వారా ఒక మెగావాట్ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయవచ్చు. ఆ లెక్కన 2 కిలోగ్రాములతో ఆంధ్రప్రదేశ్‌కు ఒక సంవత్సరమంతా సరిపడిన విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. —ఎ. కల్యాణి.

''వుంటే ఈ ఖర్మేం?''

''లే. నాతో రా'' గదమాయించాడు.

''దేనికీ? ఇదే స్టేషన్?''

''ముందు దిగు చెబుతాను.''

''ఇది మంగుళూరు పోతుందా?''

''దిగు. చెప్తాను.''

బెదిరింపుగా తుపాకీ తీసాడు ఆ పోలీస్ వుద్యోగి.

రాజారావు లేచికూర్చున్నాడు. ఓసారి ఐరన్ ఓర్ మీద అంతా చేత్తో తడిమిచూసాడు. తన పిస్తోలు, డబ్బు నిక్కరు జేబులోంచి పడిపోయి వుండచ్చనే వుద్దేశంతో.

''ఆ కట్టేమిటి?'' అడిగాడు రాజారావు కుడిభుజం దగ్గర వున్న కట్టువంక చూస్తూ.

''దెబ్బ తగిలింది'' చెప్పాడు రాజారావు.

కిందకి దిగాడు పోలీస్ సహాయంతో.

''నాతో రా'' అన్నాడు పోలీస్.

''దేనికీ?'' అడిగాడు రాజారావు.

''జైల్లోపెట్టి తర్వాత కోర్టులో హాజరు పరుస్తాము. ఇలా వేగన్‌లలో తిరగడం నేరం.''

''అంతేగా నా నేరం.''

''అంతే.''

''బ్రతికించావ్.''

''ఇంకా మరేమయినా నేరం చేసావా?'' అడిగాడు పోలీస్ చటుక్కున.

''అవును'' చెప్పాడు రాజారావు.

''ఏమిటది?''

''హత్యలు.''

''హత్యలు!''

''అంతే కాదు. జైల్లోంచి పారిపోయిన నేరం.''

వింతగా తెల్లబోతూ చూస్తాడు ఆ పోలీస్ వుద్యోగి రాజా రావు వంక.

''నీ టోపీ బావుంది. నా కిస్తావా?''

రాజారావు ఆ పోలీస్ నెత్తిమీద టోపీ తన నెత్తిమీద పెట్టుకుని, వేగన్ మీదనుంచి దిగుతున్నప్పుడు, తనతోపాటు తెచ్చిన పెద్ద ఇనపరాయితో ఆ పోలీస్ నెత్తిమీద బాదాడు గట్టిగా రెండుసార్లు.

కిక్కురుమనకుండా నేల కూలాడు పోలీస్.

''వెధవ, మంచి నిద్ర చెడకొట్టాడు.''

గొణుక్కుంటూ బయటకి నడిచాడు రాజారావు. పట్టాలు దాటుకుంటూ. దూరంగా కనబడుతున్న స్టేషన్‌వంక చూసి, అదేదో పెద్దవూరే అయివుండచ్చని గ్రహించాడు.

నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

అబ్దుల్ ఏమయినట్లు? తనని మోసంచేసి వెళ్ళిపోయాడు రూఢిగా. తన దగ్గరున్న పిస్తోలు, డబ్బు లాక్కుని వెళ్ళి పోయాడు.

ప్చ్!

అంతఇదిగా తను నిద్రపోకుండా వుండాల్సింది. ఇంకా నయం. తనని కాల్చేసి వెళ్ళలేదు. అసలు తనని ఎందుకు కాల్చనట్లు? కాల్చక్కరలేదు. పరిగెత్తుతున్న ఆ రైల్లోంచి కిందకి తోసేస్తే చాలు.

ఒకవిధంగా మేలే చేసాడు తనని బ్రతికించి. ఒకవిధంగా కీడుచేసాడు తనని వదిలిపెట్టి పారిపోయి.

ఏం చెయ్యాలి ఇప్పుడు?

ఎలాగయినా అబ్దుల్‌ని కనుక్కోవాలి. బెంగుళూరు వెళ్ళాలి. అంతే.బెంగుళూరువెళితే తేలికగా కనుక్కోవచ్చు అబ్దుల్ ఎడ్రసు.

తర్వాత చేయాల్సింది చాలా వుంది.

అన్నిటికన్నా ముందర చేయాల్సిన ముఖ్యమయిన మరో విషయం తన ఆరోగ్యం సంగతి చూసుకోవటం. వెంటనే ఎవ రయినా మంచి డాక్టర్ దగ్గరకి వెళ్ళి కట్టు కట్టించుకోవాలి.

సెప్టిక్ అయి తర్వాత చెయ్యి తీసేసెయ్యాల్సి వస్తే కష్టం!

నడుస్తున్నాడు రాజారావు చకచకా. వంటిమీద చొక్కా అయినా లేకుండా అలాగే.

17

అబ్దుల్ కి నిద్ర పట్టలేదు. కళ్ళు మూసుకుని ఆలోచిస్తూండి పోయాడు రాజారావు గురించి.

రాజారావు ఇంక ఎంత వరకు వుపయోగపడతాడు తనకి!

రాజారావుని వదిలించుకోవాలంటే ఇంత కంటే మంచి సమయం మళ్ళీ దొరకదు.

రాజారావు తనతోవుంటే తనకే ప్రమాదం. తననుంచి బల వంతంగా ఆ రహస్యం సంపాదించాలని విశ్వప్రయత్నం చేస్తాడు. తనని చంపెయ్యచ్చుకూడా నిజానికి.

ఓసారి కళ్లు తెరచి చూసాడు రాజారావు వంక తల త్రిప్పి.

కళ్ళు మూసుకుని నిద్రపోతున్నాడు రాజారావు గాఢంగా.

"రాజారావు."

అబ్దుల్ కదిపాడు రాజారావుని రెండుసార్లు.

మెలకువ రాలేదు రాజారావుకి. మొద్దునిద్రపోతున్నాడు ఆ క్రితం రెండు రాత్రులు నిద్రలేకపోవడంవల్ల.

అబ్దుల్ రాజారావు నిక్కర్ జేబులు తడిమి అతని జేబు లోంచి పిస్తోలు, సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె, డబ్బు తీసి తన జేబులో వేసుకున్నాడు.

లేచి కూర్చున్నాడు. వెళ్తోంది గూడ్స్ బండి. వేగంగానే వెళ్తోంది.

ఏదయినా స్టేషన్‌లో ఆగేదాకా వేచి వుందామనుకున్నాడు అబ్దుల్. ఆ వేగంగా వెళ్లే రైల్లోంచి కిందకి దూకితే దెబ్బలు తగలచ్చు. తర్వాత నడిచి వెళ్లాలి ఎంతదూరమయినా. వూరు ఎంత దూరం వుందో తెలియదుకూడా.

అరగంట తర్వాత ఆగింది గూడ్స్‌బండి ఓ సిగ్నల్ పోల్ ముందు. సిగ్నల్ ఇవ్వలేదు ఇంకా. అందుకనే ఆగిందని గ్రహించాడు అబ్దుల్. దూరంగా లైట్లు కనబడుతున్నాయి.

బహుశ అవుటర్ సిగ్నల్ దగ్గర ఆగివుండచ్చు. స్టేషన్ యార్డ్‌లోకి వెళ్తుంది సిగ్నల్ ఇవ్వగానే. ఈ లోపలే వదిలించుకోవాలి రాజారావుని.

దింపి పట్టాకడ్డంగా, రైలుపట్టాలక్రింద పడుకోపెట్టాలనే ఆలోచన వచ్చింది. కాని మెలకువవస్తే ఈ లోపల? తన ప్లాన్ గమనిస్తే బ్రతకనివ్వడు. తన దగ్గరున్న పిస్తోలు గుళ్ళు వృథా చేయటం ఇష్టంలేదు. వాటి అవసరం ముందు ముందు చాలా వుంటుంది.

నాలుగు గుళ్లే ఉన్నాయి పిస్తోలులో. చివరకి జైల్లో పోలీస్‌ల నుంచి దొంగిలించి తెచ్చిన తుపాకీతో కాల్చి చంపాలనే నిర్ణయానికి వచ్చాడు అబ్దుల్. అంతపెద్ద తుపాకీ కూడాతీసుకు వెళితే తను అందరిలో ఎబ్బెట్టుగా కనిపిస్తాడు.

అబ్దుల్ ఓ స్థిరనిర్ణయానికి వచ్చి లేచాడు.

ఆ వేగన్‌లోంచి దిగి ప్రక్క వేగన్‌లోకి ఎక్కాడు. దాని మీద పడుకుని తుపాకి గురిపెట్టాడు ఐరన్ ఓర్ మీద పడుకుని నిద్రపోతున్న రాజారావు మీదకి.

వెనకాల క్లిక్‌మన్న చప్పుడు వినిపించింది. చల్లగా తాకింది మెడకి ఏదో...గుర్తించాడు అది పిస్తోల్ బేరల్ అని.

ఒళ్ళు ఝల్లుమంది. ఎవరు?

"కాల్చి చంపుతున్నావా?" వినిపించింది ఓ కంఠం.

కొత్త కంఠం అది. ఇదివరకు ఎప్పుడూ విన్న గుర్తులేదు. అపరిచితం పూర్తిగా.

మౌనంగా ఉండిపోయాడు అబ్దుల్, తుపాకీమీదనుంచి పడుకుని నిద్రపోతున్న రాజారావు గుండెని సూటిగా చూస్తూ.

ట్రిగర్ నొక్కితే చాలు. ఒక్క గుండు. బస్. రాజారావు శాశ్వతంగా ఈ లోకాన్ని వదిలేస్తాడు.

"కాల్చకు."

మరింత గట్టిగా అదిమాడు వెనకా లతను అబ్దుల్ మెడకి పిస్తోలు గొట్టాన్ని.

"ఎవరు నువ్వు?" అడిగాడు అబ్దుల్.

"నీలాంటి వాడినే."

బహుశ ఆ గూడ్స్‌బండి గార్డ్ తమనిచూసి వచ్చివుంటాడని అనుకున్నాడు అబ్దుల్. అంతకంటె ఎవరొచ్చేందుకూ ఆస్కారం లేదని తెలుసు.

కాని గార్డ్‌కి పిస్తోలు వుంటుందా? డ్యూటీ చేసేటప్పుడు పిస్తోలు ఇస్తారా? ఇచ్చినా దాన్ని వుపయోగించవచ్చా??

ఆలోచిస్తున్నాడు అబ్దుల్.

"రాజారావుని చంపకు."

వులిక్కిపడ్డాడు అబ్దుల్.

రాజారావ్‌ని చంపకు!

"నీకు పేరెలా తెల్సు?" అడిగాడు.

"నీ పేరు అబ్దుల్."

లీలగా నవ్వు వినిపించింది.

"ఎవరు నువ్వు?"

అబ్దుల్‌కి రైల్వేస్టాఫ్ కాదని తేలిపోయింది అతను. మరెవ రయి వుండవచ్చు?

"నువు పోలీస్‌వా?" అడిగాడు.

"కాదు. నీలాంటి వాడినేనని చెప్పలా ఇందాక."

"అంటే?"

"నీ జాతికి చెందిన వాడిని."

"దొంగవా?"

"అవును."

"ఎలా వచ్చావు ఇక్కడికి?"

"దిగు. చెప్తాను."

"ఎక్కడికి?"

"కిందకి దిగు."

"దేనికీ?"

"ప్రశ్నలు వెయ్యకు."

పిస్తోలు బేరల్ మరింతగా నొక్కాడు. మారు మాట్లాడ కుండా దిగాడు అబ్దుల్ చేతిలో మూటతో. అబ్దుల్ చేతిలోని తుపాకీ అందుకున్నా డతను.

చివరిదాకా నడిపించుకుని వెళ్ళి, ఆఖరి వేగన్ ముందు ఆగి అన్నాడు.

"దీంట్లోకి ఎక్కు."

"దేనికీ?"

"ఎక్కు."

అబ్దుల్ ఆ వేగన్‌లోకి ఎక్కాడు ఆ అపరిచిత వ్యక్తి ఆదే శానుసారం. అతనూ వెనకాలే ఎక్కాడు, చేతిలో పిస్తోలుతో అప్రయత్నంగా. అబ్దుల్ జేబులు వెదకి, రాజారావు జేబులోంచి తీసుకున్న పిస్తోలు తీసి తన జేబులో వేసుకున్నాడు.

అతని ముఖం చూద్దామని ప్రయత్నించాడుగాని ఆ చీకటిలో చూడలేకపోయాడు. గుర్తుపట్టలేకపోయాడు.

గూడ్స్‌బండి కదిలి కూత వేసింది.

"ఇప్పుడు రాజారావు లేచినా నువు పారిపోయావనుకుని వుంటాడు. ప్రమాదం లేదు."

"బ్రతికుంటే ఎప్పటికయినా ప్రమాదమే."

"నాకు కాదు. నీకు."

"ఇప్పుడు చెప్పు. ఏమిటి సంగతి?"

లేవబోయాడు అబ్దుల్ మోకాళ్ళమీదనుంచి.

"లేవకు. నేను చెప్పినట్లే కూర్చో" వురిమాడు అతను అబ్దుల్ కదలడం గమనించి.

అబ్దుల్ అతను చెప్పినట్లుగానే మోకాళ్ళమీద కూర్చుని, రెండు చేతులూ మోకాలిచిప్పలకానించి తల చేతులమీదకి వంచి ఆనించి కూర్చున్నాడు.

అలా కూర్చోవడంవల్ల తన అవయవాలమీద, ముఖ్యమయిన చేతులమీదా, కాళ్ళమీదా స్వేచ్ఛపోయింది అబ్దుల్‌కి. ఎదురు తిరిగి దెబ్బతీయడానికి అనువుగాలేదు అలా వుండటంవల్ల. అసలు అతన్ని చూడటానికే పడటంలేదు.

"ఇప్పుడు చెప్పు. ఎక్కడ దాచావు ఆ డబ్బు?"

"ఏ డబ్బు?"

అమాయకంగా అడిగాడు అబ్దుల్.

"నాకు అంతా తెలుసు నీ సంగతి. నా దగ్గర బుకాయించి ప్రయోజనం లేదు. చెప్పు."

ఆలోచిస్తున్నాడు అబ్దుల్. రాజారావు, తను, ఆ డబ్బు సంగతి తెలిసి నతను ఎవరా అని.

"క్విక్. చెప్పు. లేదా గుండు గుండెల్లో దిగుతుంది సూటిగా."

"ఏ డబ్బు?"

తలమీద బలంగా దెబ్బ తగిలింది అబ్దుల్‌కి. పిస్తోలు మడమతో కాదు. బహుశ ఇనపరాయితో కొట్టివుంటాడు ఎడంచేత్తో.

"కమాన్. క్విక్. చెప్పు. ఆ పదిహేను లక్షలు ఎక్కడ దాచావో చెప్పు."

"ఏ పదిహేను లక్షలు."

"నువు బెంగుళూరులో హత్యచేసి సంపాదించిన, దోచుకున్న పదిహేను లక్షలు. అమాయకత్వం నటించి ప్రయోజనం లేదు బ్రదర్. నీ చేత ఎలా నిజం కక్కించాలో తెలుసు నాకు."

మళ్ళీ మోదాడు తలమీద ఇంకా బలంగా.

"అబ్బా" అరిచాడు అబ్దుల్ బాధగా. లేవడానికి ప్రయత్నించాడు.

"లేవకు."

మళ్ళీ తలమీద మోదాడు ఆ కొత్తవ్యక్తి.

18

రాజారావు పట్టాలన్నీ దాటి, రోడ్డునీ స్టేషన్‌నీ అడ్డుగావున్న కంచెదాటి వూళ్ళోకి ప్రవేశించాడు.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. అప్పుడే వెలుగు రేఖలు ఉదయిస్తున్నాయి.

రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. బిచ్చగాళ్ళు మాత్రం అక్కడక్కడా పడుకుని వున్నారు పేవ్‌మెంట్స్‌మీద. మనుషులు ఎవరూ తిరగడం లేదు.

అందుకే సిగ్గుపడకుండా, చొక్కా లేకపోయినా ఒంటిమీద కేవలం కాకినిక్కర్‌తో నడుస్తున్నాడు రాజారావు.

రాజారావు దృష్టి కొంచెం దూరంలో తెరచివున్న ఒక హోటల్‌మీద పడ్డది. గబగబా అడుగులువేసి, లోపలకి వెళ్లాడు. ఆకలివేస్తోంది రాజారావుకి బాగా.

సాధారణంగా ఆ హోటల్‌కి వచ్చేది రాజారావు లాంటి బట్టలు సరిగా వుండీవుండని వాళ్లేకాబట్టి, అక్కడ కూర్చున్న నలుగురయిదుగురు రాజారావుని అట్టే పట్టించుకోలేదు.

రాజారావు రెండు పెద్ద బ్రెడ్‌లు, బన్ తిని, టీ తాగాడు రెండు కప్పులు. తను స్పృహ తప్పించిన రైల్వే పోలీసుజేబు లోంచి దొంగిలించిన చిల్లర డబ్బులు ఇచ్చి బయటపడ్డాడు.

ఆకలి తీరటంవల్ల తీరిగ్గా నడవసాగాడు.

రాజారావు దృష్టి ఓ ఇంటిముందున్న బోర్డుమీద పడింది. క్లినిక్ అది. ఆ ఇంటి అరుగుమీద కూర్చున్నాడు రెండు మూడు గంటలసేపు.

అబ్దుల్‌మీద ఎంతయినా కోపం వచ్చింది తన దగ్గరనుంచి డబ్బంతా కొట్టేసినందుకు, పైసా అయినా వుంచకుండా. పదిహేను లక్షలు సంపాదించినా ఇంకా కక్కుర్తే వెధవకి.

క్లినిక్ తలుపులు తెరిచాక, ఎనిమిదింటికి లోపలకి వెళ్ళాడు రాజారావు. నమస్కారం పెట్టాడు డాక్టర్‌కి వంగి.

"ఏమిటి?" అడిగాడు డాక్టర్, రాజారావుని, అతని అవతారాన్ని గమనించి.

"దెబ్బ తగిలింది బాబయ్యా. మీరే రక్షించాలి. బాధతో చచ్చిపోతున్నాను."

కట్టువంక చూపించాడు.

డాక్టర్ కట్టు విప్పి గాయంవంక పరీక్షగా చూసి తలవూపి అడిగాడు.

"ఎలాతగిలిం దీ దెబ్బ?"

"రైల్లోంచి పడ్డాను. లోపల ఏదో ముక్క ఇరుక్కున్నట్లుగా వుంది."

"ఆపరేషన్ చెయ్యాలి. ఇష్టమేనా?"

''ఇష్టమే. కాని బీదవాణ్ణి బాబయ్యా. ఇప్పుడేం ఇచ్చుకోలేను వెంటనే. కాని మీ కష్టం వుంచుకోను.''

డాక్టర్ చిరునవ్వు నవ్వి, రాజారావు భుజం తట్టి అన్నాడు.

''ఫర్వాలేదు లేవోయ్.''

''ఆపరేషన్ ఎప్పుడు చేస్తారు బాబయ్యా?''

''ఇంకో అరగంట లోపల. నర్స్ మీ గాయాన్ని డ్రస్‌చేసి ఇంజక్షన్ ఇస్తుంది.''

నర్స్‌ని పిలచి ఏవేవో సూచన లిచ్చాడు డాక్టర్.

నర్స్ తలూపి, రాజారావుని తీసుకువెళ్ళింది కూడా. రాజారావుని ఓ బల్లమీద పడుకోబెట్టి గుండు తగిలినచోట శుభ్రం చేసింది. బాధగా మూలిగాడు.

''రక్తం కారిపోయింది చాలా. బహుశ ఎక్కించాల్సి వుంటుందేమో'' అన్నది నర్స్.

సిరంజిలోకి ఇంజెక్షన్ ఎక్కించి రాజారావు జబ్బలో ఇంజక్షన్ చేసింది. కళ్ళుమూసుకుని పడుకున్నాడు రాజారావు. నరాలు లాగటం ఆగింది. శరీరం తేలి కవుతున్నట్లుగా అనిపించింది.

కొంచెం కొంచెం మత్తు ఎక్కుతున్నట్లుగా ఫీలయ్యాడు.

నిద్ర పట్టింది రాజారావుకి.

నర్స్ రాజారావుని కదిపిచూసింది. కదలలేదు. మార్ఫియా పూర్తిగా పనిచేసింది వెంటనే.

డాక్టర్ వచ్చాడు గదిలోకి.

''నిద్రపోతున్నాడు. దేనికీ అంత త్వరగా మార్ఫియా ఇవ్వమన్నారు'' అడిగింది.

డాక్టర్ తన చేతిలోని రెండు రోజులక్రితం దినపత్రికలో ప్రచురింపబడ్డ అయిదుగురు జైల్లోంచి తప్పించుకున్న ఖైదీల

ఫోటోలలోని రాజారావు ఫోటోనీ, రాజారావునీ మార్చి మార్చి చూసి అన్నాడు.

"ఇతను హంతకుడు."

"మై హెవెన్స్."

"అవును. ఫోటోపడ్డది పేపర్‌లో చూడు."

పేపర్ నర్స్‌కి అందించి, టెలిఫోన్ అందుకుని పోలీస్ స్టేషన్ నంబర్ తిప్పుతూ అన్నాడు.

"నాకు చూడగానే అనుమానం వేసింది. నుదుటిమీద ఆ కాలినమచ్చ. మొన్న పేపర్‌లో వార్త గుర్తొచ్చి వెంటనే పేపర్‌లోని ఫోటో చూస్తే ఇద్దరూ ఒకరే. వీడిపేరు రాజారావు."

"హలో. పోలీస్‌స్టేషన్?" అడిగాడు డాక్టర్, అవతలనుంచి ఓ కంఠం వినబడగానే.

"డాక్టర్, ఇతన్ని పట్టుకున్నందుకు అయిదువందల రూపాయలు బహుమానం," అన్నది నర్స్, ఆనందంగా పేపర్ పూర్తిగా చదివి.

19

ఐ.జి. ఆఫీస్‌లోని ఓ పెద్దహాల్ అది. కాన్ఫరెన్స్‌కి వుపయోగిస్తారు ఇనస్పెక్టర్ జనరల్ కార్యాలయంలో ఆ పెద్దహాల్‌ని.

ఆ హాల్‌నిండా కుర్చీలు వేసివున్నాయి, కాన్ఫరెన్స్ టేబిల్‌కి చుట్టూ.

వాటిల్లో కూర్చుని వున్నారు, డాక్టర్, ముసలాయన, ముసలాయన పెళ్లాం, సాగర్, రమణి, 'శాలివాహన'లో నలుగురు నేరస్థులచేత బాధకి గురికాబడ్డ ప్రయాణీకు లందరూ—ఒక్కరు తప్ప.

పత్రికా విలేఖరుల సౌకర్యం కోసం ఆ ఏర్పాటు చేయబడింది.

ఈ మధ్యలో అంత పెద్ద సంచలనం కలిగించే నేరం ఎక్కడా జరగలేదు కాబట్టి, ఆ బస్‌లో జరిగిన పూర్తి విశేషాలన్నీ సేకరించి ప్రచురించడానికి నిర్ణయించాయి అనేక ఆంధ్ర, ఆంగ్ల పత్రికలు.

వుమ్మడిగా ఆ పత్రికా ప్రతినిధులు చేసిన అభ్యర్థనని పురస్కరించుకుని ఏర్పాటు చేసారు ఐ. జి.

ముందర జరిగిందంతా అంతా కలపి చెప్పారు. షార్ట్ హేండ్‌లో రాసుకున్నారు గబగబా. అక్కడక్కడ ఏమయినా ఒకళ్లు మర్చిపోయినా మిగతావాళ్లు అందించారు.

గంటలో వాళ్లు బస్సులో ఎక్కినది మొదలు, మళ్ళీ దిగేదాక జరిగిందంతా తు. చ. తప్పకుండా రాసుకున్నారు పత్రికా విలేఖరులు.

తర్వాత విడివిడిగా ప్రతీ ఒక్కరి అభిప్రాయాలనీ, అనుభవాలనీ అడిగి వ్రాసుకున్నారు.

అనేకమంది పోలీస్‌లకి ఫోన్‌చేసి కనుక్కొన్నారు ప్రతీ అరగంటకీ, గంటకీ 'శాలివాహన' పరిస్థితి—ఎక్కడ వుందీ, ఎలా వుందీ, లోపల వాళ్లు ఎలా వున్నారు మొదలయిన వివరాలు అనేకమంది.

పోలీసులు రహస్యంగా మైలుదూరం వెనకవుండి ఆ బస్‌ని ఫాలో చేస్తూనే వున్నారు.

కాని బస్‌లోని ప్రయాణీకుల క్షేమం దృష్ట్యా స్వతంత్రంగా నేరస్థులని బంధించే నిర్ణయం తీసుకోలేకపోయారు.

అప్పటికీ ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సాహసం చేసి బలయిపోయాడు, భిక్షపతి విసరిన కత్తికి.

అనేకమంది సానుభూతి వుత్తరాలు వ్రాసారు ఆ బస్‌లోని ప్రయాణీకుల కుటుంబాలకి—తెలియనివాళ్లు కూడా, కేరాఫ్

పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి, వాళ్ళకి అందజేయమని.

ఐ. జి. పత్రికా ప్రతినిధులకి చెప్పాడు ఆ సంగతులన్నీ.

భిక్షపతి గుండెలో దిగిన గుండు ఆపరేట్ చేసి, తీసారని, అతని పరిస్థితి మెరుగుగా వుందనీ, ప్రస్తుతం పోలీస్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడని తెలియచేసాడు.

మరిడేశ్వర్ భుజంలో దిగిన పిస్తోలు గుండు కూడా ఆపరేట్ చేసి తీసారని, అదే హాస్పిటల్‌లో కోలుకుంటున్నాడని తెలియచేసాడు.

మూడో నేరస్థుడు రాజారావు కూడా రెండువందల ఏభై మైళ్ళ దూరంలో వున్న ఓ వూళ్లో పట్టుపడ్డాడనీ, హైద్రాబాద్ లోని పోలీస్ హాస్పిటల్‌కి తరలిస్తున్నామనీ తెలియచేసాడు.

నాలుగో నేరస్థుడు అబ్దుల్ కోసం ప్రయత్నం చేస్తున్నామని, మైసూర్ రాష్ట్రం పోలీస్‌లతోపాటు, మన రాష్ట్రం పోలీసులు కూడా కృషి చేస్తున్నారని తెలిపాడు.

తర్వాత ఆ బస్సులో ప్రయాణం చేసిన వాళ్ళనందరినీ ఓ గ్రూప్ ఫోటో కాన్‌ఫరెన్స్ హాల్‌లోనూ, 'శాలివాహన' బస్‌లో వాళ్ళు ఆ నలుగురు నేరస్థుల ఖైదీలుగా వున్నప్పుడు ఎలా కూర్చుని వున్నారో, ఆ సీట్లలో అలాగే కూర్చోపెట్టి ఫోటోలు తీసారు, పేపర్‌లో పబ్లిష్ చెయ్యడానికి.

ముసలాయన—రచయిత జరిగిందంతా ఓ కథ రాయబోతున్నాననీ, దానిమీద వచ్చే రాయల్టీ తమకోసం, రమణి శీలం కోసం ఆహుతయిపోయిన ఆ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కుటుంబానికి ఇవ్వడానికి నిశ్చయించుకున్నాడనీ చెప్పాడు హర్షధ్వానాలమధ్య.

అంతేకాదు. ఇంతవరకు పట్టుపడ్డ ఆ ముగ్గురి నేరస్థులవల్ల పోలీస్ డిపార్ట్‌మెంట్ ఇచ్చే నగదు బహుమతిని దుర్మరణానికి గురయిన ఆ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కుటుంబానికి గ్రహీతలు ఇచ్చారనీ తెలియచేసాడు ఐ. జి.

సారీ సార్ - పాలధర, విపరీతంగా పెరిగింది మరి-

ఛీ ఛీ - నువ్వందంగా లేవని కాదు నా నెక్స్టు పిక్చర్ - 70 m.m లో తీస్తాని - అందులో నువ్వే హీరోయినవి -
: సినీ నిర్మాత :

హాస్పిటల్‌లో కోలుకొంటున్న ఆ పట్టుపడ్డ ముగ్గురి నేరస్థుల ఫోటోలు తీసుకోడానికి అనుమతించాడు ఐ.జి. రమణి సాగర్‌ల ప్రేమగురించి కూడా చెప్పాడు.

గంట తర్వాత ముగిసింది ఆ పత్రికా విలేఖరుల గోష్ఠి.

అయితే, అందరిలోనూ ఒకటే ప్రశ్న మిగిలిపోయింది సమాధానం లేకుండా.

పిస్తోలు తీసుకుని రాజారావు, అబ్దుల్ వెంట పరిగెత్తి నతనెవరు ?

20

అతను చూస్తూండిపోయాడు జరిగేదంతా—రాజారావుని రైల్వేపోలీస్, వేగన్‌లోంచి లేపిన దగ్గరనుంచి, రాజారావు ఆ పోలీస్ టోపీ పారేసి స్టేషన్‌లోంచి బయటపడేదాకా.

అంతసేపటి వరకూ అలాగే మోకాళ్ళమీద కదలకుండా కూర్చుండిపోయాడు అబ్దుల్ అతని భయంవల్ల.

పావుగంట తర్వాత కదిలింది గూడ్సుబండి. అంతవరకూ లేవనేలేదు ఆ పోలీస్ వుద్యోగి. గూడ్సుబండి స్టేషన్‌లోంచి బయటికివచ్చి స్పీడు అందుకున్నాక అడిగాడు అతను అబ్దుల్‌ని.

"చెప్పు ఆ డబ్బు సంగతి?"

"ఏ డబ్బు సంగతో తెలియదు నాకు."

మళ్ళీ ఇనపరాయితో ఈసారి ఇంకా బలంగా మోదాడు అబ్దుల్ తలమీద.

ఖంగున తగిలింది రాయి. తల చిట్లింది. నెత్తురు కారుతోందని గ్రహించాడు అబ్దుల్, వెచ్చగా మెడమీద నెత్తురు ధార తగలగానే.

"చెప్పు. ఎందుకు అనవసరంగా చస్తావ్?"

"నిజంగా నాకు తెలియదు."

మళ్ళీ తలమీద మోదుతాడనుకున్నాడు అబ్దుల్. మోదలేదు.
"చేతులు వెనక్కి చాపు," అన్నాడు. చేతులు చాపాడు అబ్దుల్.
కాని అరచేతులని ముట్టుకోలేదు అతను. తాడుతో బిగించి కట్టాడు రెండుచేతులూ కలపి.
"ఏం చేస్తావ్?" అడిగాడు అబ్దుల్ భయంగా వెనక్కి తిరిగి.
"నిజం కక్కిస్తాను."
"నిజంగా నాకు తెలియదు. నాతోపాటు దోపిడీకి వచ్చిన మరో అతను తీసుకువెళ్ళాడు దాన్ని. నన్ను పట్టుకున్నారు. వాడు ఎక్కడ దాచాడో నాకు నిజంగా తెలియదు."
"నువ్వొక్కడివే వెళ్ళావు దోపిడీకి. ఆ దోపిడీ సంగతంతా పేపర్లో చదివాను. నిన్ను వురితీసే సంగతికూడా తెలుసుకుని, కావాలని జైల్లోకి వచ్చిపడ్డాను నేను."
"జైల్లోకా?"
"అవును."
"ఏ జైల్లోకి?"
"మీరు నలుగురూ తప్పించుకుని పారిపోయివచ్చిన జైల్లోకే. మీతోపాటు నేనూ తప్పించుకున్నాను. మీరు తప్పించుకోబోయే ముందు జరిపిన సమావేశాలన్నీ నా చెవిన పడ్డాయి."
"మాతోబాటు నువు జైల్లో వున్నావా? నేను చూడలేదే నిన్నెప్పుడూ?"
"ఆ ముందురోజే ఓ సైకిల్ దొంగతనంలో కావాలని జైలుకు వచ్చాను. ఎలాగయినా నీనుంచి ఆ రహస్యం రాబడుదామని. ఇంతలో మీరు పారిపోవడం సంగతి తెలిసి వూరుకున్నాను."

"నీ పేరు.... రేడియోలో విన్నాను. ఏదో కుమార్ అను కుంటాను."

"కృపాకర్."

"అవును. కృపాకర్."

"మీతోపాటు బస్సులోకూడా వచ్చాను నేను."

"శాలివాహనలో!"

"అవును. మాట్లాడలేదు నేను. అందుకే గొంతు గుర్తు పట్టలేదు నువు."

"మా అందరికన్నా ప్లాన్‌డ్‌గా వచ్చా వన్నమాట నువు ముందే."

"అవును."

"తల పగలకొట్టావు. నొప్పెడుతోంది బాగా. రక్తం కారకుండా ఏదయినా కట్టు కట్టు."

"అన్నీ చేస్తాను. నేనడిగింది చెప్పు" అన్నాడు కృపాకర్.

"ముందర కట్టు కట్టు. లేకపోతే చచ్చిపోతాను" అన్నాడు అబ్దుల్.

"అంత త్వరగా చావనివ్వనులే."

నవ్వాడు కృపాకర్.

అబ్దుల్‌ని లేవదీసాడు.

"ఏమిటి? ఏం చేస్తున్నావు?" అడిగాడు అబ్దుల్ ఖంగారుగా కృపాకర్ తనని వేగన్ అంచుకు లాగగానే.

కృపాకర్ సమాధానం చెప్పలేదు. అబ్దుల్ రెండుకాళ్ళు పట్టుకున్నాడు గట్టిగా.

"ఏమిటి? ఏం చేస్తున్నావ్?"

కృపాకర్, అబ్దుల్ రెండు కాళ్ళకి తన రెండుచేతులూ మెలి వేసి పట్టుకుని అబ్దుల్ శరీరాన్ని నడుంనుంచి తలదాకా పూర్తిగా కిందకి దించాడు వేగన్‌మీదనుంచి.

"ఇప్పు డెలావుంది?" అడిగాడు కృపాకర్.

కళ్ళు తిరిగినట్లయ్యాయి అబ్దుల్‌కి. తల కిందులుగా వ్రేలాడు తున్నాడు రైల్వే వేగన్ మీదనుంచి గాలిలో. కళ్ళకి ఎదురుగా రైల్వే కారేజ్ చక్రాలు రెండూ కనపడుతున్నాయి గిరగిరా తిరుగుతూ.

వేగంగా కదిలిపోతున్నట్లుగా వున్న పట్టాలు చూచాయగా కనబడుతున్నాయి. చక్రాల హోరు వినబడుతోంది చెవిలో. ఇంకో పావుగజం కిందకి జారేస్తే చాలు. తన తల రైలు పట్టాల ప్రక్కనవున్న రాళ్ళకి కొట్టుకుని చిన్నాభిన్నమవుతుంది దోక్కుపోయి.

కెవ్వున అరిచాడు అబ్దుల్.

"చెప్పు. ఎక్కడ దాచావ్. వదిలేస్తున్నాను."

"వదలద్దు. చెప్తాను. పైకి లాగు."

రైలుచక్రాలు పట్టాలు మారటం స్పష్టంగా చూసాడు అబ్దుల్. తల, కళ్ళు తిరుగుతున్నాయి.

"చెప్పు. నేను పది లెక్కపెట్టే లోపల చెప్పాలి. లేకపోతే నా తంటాలు నేను పడతాను. నీ చావు నువు చావు. ఇలా మోస్తూ ఎంతసేపుకూర్చోను నిన్ను నేను?" అన్నాడు కృపాకర్.

"బెంగుళూర్‌లో, మా ఇంట్లో, పెరడులో, నీళ్ళగదికి ఎదురుగావున్న ... .పైకిలాగు చెబుతాను."

కృపాకర్ పైకిలాగాడు అబ్దుల్‌ని.

"చెప్పు."

"వుండు. నన్ను తేరుకోనీ. అబ్బ. చూడు నా గుండెలు ఎలా కొట్టుకుంటున్నాయో?"

"త్వరగా చెప్పు?"

"నన్ను నీతోపాటు తీసుకెళ్ళరాదూ?"

''వూహూ. చెప్పు.''

వూపిరి పీల్చుకుని, ఆయాసం తీర్చుకోసాగాడు అబ్దుల్.

''పెరడులో నీళ్ళగదికి ఎదురుగా?''

తొందర పెట్టాడు అబ్దుల్ని కృపాకర్.

''ఎదురుగా బాదంచెట్టు వుంది. ఆ బాదంచెట్టు కింద నాలు గడుగుల కింద ఇనపపెట్టెలో వుంది బేంక్ లాకర్ కీ.''

''బేంక్ లాకర్ కీ?''

''అవును, బేంక్ లాకర్ కీ.''

''బేంక్ లాకర్లో పెట్టావా వాటిని?''

''అవును. అక్కడయితే సేఫ్టీగా వుంటాయి. బేంక్ లాకర్లో పెట్టుకోపోవడంవల్లనే కదా నేను సంపాదించ గలిగాను వాటిని. బయట ఎక్కడయినా వుంచితే ఇంకెవరయినా కొట్టుకుపోతారని.''

''నువు సంతకం పెట్టి, నువే ఓపెన్ చేయాలా ఆ లాకర్ని?''

''అవును.''

''నిజమేనా నువు చెప్పేది?''

''అవును. నిజమే.''

''అబద్ధం అయితే తర్వాత విచారించాల్సి వుంటుంది నువు.''

''అబద్ధం అవుతేగా నేను విచారించడానికి.''

చిన్నగా నిట్టూర్చాడు కృపాకర్.

''తొందరపడకూడదు అందుకే దేనికయినా. చూడు తల ఎలా పగలకొట్టావో?''

కృపాకర్ మౌనంగా వుండిపోయాడు.

''తలకి కట్టు కట్టమ్మా త్వరగా.'' అన్నాడు అబ్దుల్ నవ్వుతూ.

"నువు చెప్పేది నిజమేనా?" అడిగాడు మళ్లీ కృపాకర్ అబ్దుల్‌ని కాస్సేపాగి.

"నిజమే."

కృపాకర్ దిగాలు పడటం గమనించి నవ్వుకున్నాడు అబ్దుల్.

"నీకు ఆరువేళ్లు కదా?"

"అవును."

"ఆరు వేళ్లుంటే అదృష్టం. ఎందుకు బాధపడతావు?"

"ముగ్గురిని వదిలించుకున్నావు ఇప్పటిదాకా. నేనో లెక్కా నీకు?"

కాస్సేపాగి తర్వాత అన్నాడు అబ్దుల్.

"నాకు తెలుసు ఇలాంటిదేదో అవుతుందని. అందుకనే నా ప్రమేయం లేకుండా ఆ డబ్బు రాకుండా ఏర్పాటు చేసుకున్నాను."

కృపాకర్ ఆలోచిస్తున్నాడు ఏం చేయాలా అని. అబ్దుల్‌తో నమ్మి బెంగుళూరు వెళ్లచ్చా. వెళ్లకూడదా??

వెళితే తనకేమయినా అపాయం సంభవించవచ్చేమో?

(ముగింపు వచ్చే సంచికలో)

విలేఖరి:—రచయితగారూ! మీ జీవితంలోని మరుపురాని సంఘటన ఒకటి చెప్పండి.

రచయిత:—నా మొదటి సీరియల్ 'వీడని బంధం' తిరిగొస్తే, చిత్తుకాగితాలకు అమ్మాను. అది తిరిగి చింతపండు పొట్లంగా కొన్ని కాగితాలు నా దగ్గరికే వచ్చాయి. ఆ సీరియల్‌కు, నాకు గల బంధమే—వీడని బంధం!!

—కె. పరశురామారావు, మచిలీపట్నం.

హమేషా హంగామా

వ్యామోహం!

రచన: కంచర్ల రమణ

అబ్బ! వినోద్ ఖన్నా యెంత అందంగా ఉన్నాడు!

అసలు హిందీ నటులకు యింత అందం యెక్కడ్నుంచి వస్తుందో? అలా అయ్యుండదు! అందంగా వున్నవాళ్ళనే, చూపి మరీ తీసుకుంటారు కాబోలు సినిమాల్లోకి.

ఆపైన రోజూ యెక్సర్‌సైజెస్ చేసి, తమ శరీరాన్ని పోషించుకు వస్తారు.

అదే మన తెలుగుతార లయితేనా?

నాలుగు సినిమాల్లో బుక్ అయ్యేసరికి, తళతళలాడే బట్టతల. బానలాంటి కడుపు వచ్చేస్తాయి. తాము నటులు, శరీరం జాగ్రత్తగా పోషించుకోవాలనే విషయమే మర్చిపోతారు.

సంవత్సరం తిరగకుండానే, పోతవిగ్రహాల్లా ఏది నడుమో, ఏది ఛాతీయో తేడా తెలియనంతగా పెరిగిపోతారు.

"ఏమే తల్లీ! నీ సింగారం యీరోజు తెములుతుందా? అసలు, యీ రోజు ఆఫీసుకు వెళ్తున్నావా? శెలవు పెట్టేశావా కొంపదీసి."

అమ్మ కేక వంటింట్లోంచి.

ఈ అమ్మ ఒక్కర్తి! ఒక్క నిముషం నన్ను శాంతంగా వుండనివ్వదు.

ఎన్ని గంటలకు ఆఫీసుకు వెళ్ళాలో నాకు తెలీదూ! మధ్య దీనికెందుకు? తనే ఆఫీసులో పనిచేస్తున్నదానిలా హైరానా పడి పోతుంది.

"ఇదిగో! అయిపోయిందమ్మా! వెళ్తున్నాను" అని కేక వేశాను.

కాని, అల్మయిరా తీసి బంగారం గొలుసులు మెడలో వేసుకోవాల్సివుంది యింకా.

గబగబా అల్మయిరా తీశాను.

బంగారం గొలుసులు మెడలో వేసుకుంటూ, ఒక్కసారి మళ్ళా అద్దంలో నా ముస్తాబు చూసుకున్నాను.

ముస్తాబు తృప్తిగా వుంది. నవ్వాను. అద్దంలో నా రూపం తిరిగి నవ్వింది.

హేండ్‌బేగ్ తీసుకుని, జోళ్ళల్లోకి కాళ్లు దూరుస్తూ,

"వెళ్తున్నానమ్మా!"

అమ్మకు విన్పించేలా అన్నాను.

"వెళ్ళిరా!"

అమ్మ జవాబు.

వాచీ చూసుకున్నాను.

పావు తక్కువ తొమ్మిదయింది. వెంటనే బస్సు దొరికితే, యిరవై నిముషాల్లో నేవల్‌బేస్ చేరుకోగలను.

ఫరవాలేదు. తొమ్మిదిన్నర లోపల ఆఫీసుకు వెళ్ళిపోతాను.

అయినా, అప్రయత్నంగా, తొందరగా అడుగులు వేయ సాగాను. అదంతా, అమ్మ నాలో కలిగించిన తొందరవల్లనే.

'గద్దార్' సినిమాలో వినోద్‌ఖన్నా బ్రహ్మాండంగా నటిం చాడు. మొదటిసారి తాను దొంగల ముఠాకు చిక్కిపోయినపుడు, తనుకూడా ఓ చిన్నసైజు దొంగనని చెప్పుకున్నాడు. అతడు అలా అంటుంటే, తన మనస్సు దిగులుతో క్రుంగిపోయింది.

వెధవది! దొంగ, రౌడీ, హంతకుడు పాత్రలు తప్ప ఇంకో రకం దొరకలేదా అతడికి? పాపం! ఆయనేం చెయ్యగలడు? ఈమధ్య ప్రేక్షకులు అలాంటి పాత్రలంటేనే మోజు కనబరుస్తున్నారు.

కాని, తాను దొంగల్ని పట్టడానికి దొంగగా నటించిన సి. బి. ఐ. ఆఫీసరునని చెప్పగానే, తన ఆనందం చెప్ప నలవి కాదు.

అయినా, దొంగపాత్రలు యికముందు నటించవద్దని అతనికి ఉత్తరం రాయాలి. అలాంటి పాత్రలు వేస్తే నేను ఆ సినిమాలు చూడనని గట్టిగా చెప్పాలి.

మలుపు తిరిగి బస్టాపువైపు చూశాను. నా కోసమే అన్నట్టుగా ఓ ఖాళీబస్సు అక్కడ నిలుచుంది.

పూర్తిగా నిండేవరకూ అది కదలదు. కానీ, కూర్చోవడానికి సీటు దొరకాలంటే, త్వరగా వెళ్ళడం మంచిది.

జోరుగా అడుగులు వేశాను. బస్సును చేరుకున్నాను.

అమ్మయ్య! నాకు కావాల్సిన సింగిల్ సీటు దొరికింది. వెళ్ళి కూచున్నాను.

ప్రక్కనున్నవాళ్ళ చెమటకంపు గాలి పీల్చే దుస్థితి ఉండదు. రోడ్డుమీదకు చూస్తూ ప్రక్కకు తప్పుకునే కార్లను, బస్సుల్ని చూస్తూ, కాలక్షేపం చెయ్యొచ్చు.

బస్సు యిప్పుడప్పుడే కదిలేటట్టు లేదు. హేండ్ బేగ్ తెరిచాను. ఇంగ్లీషు నవల తీసి చదవసాగాను.

రెండు పేజీలు చదవడం పూర్తిచేశానో లేదో, బస్సు కదిలింది.

బస్సు కదులుతుండగా, చదవడం నాకు యిష్టంలేదు. అక్షరాలు పదేపదే కదులుతుండగా, పుస్తకం చదివితే కళ్ళు పోతాయని నా భయం.

పుస్తకం మూసేసి. యథాలాపంగా బస్సులోకి చూశాను. జనంతో బస్సు క్రిక్కిరిసిపోయి ఉంది.

నాకు దగ్గరగా నిలుచున్న వ్యక్తివైపు చూశాను. నా గుండెలు ఆనందోద్రేకంతో కొట్టుకోసాగాయి.

అతనెవరోగాని అచ్చు వినోద్ ఖన్నా లాగున్నాడు. జులపాలు కూడా వినోద్ ఖన్నాలాగే పెంచాడు.

అంతవరకూ నావైపే చూస్తున్నాడు కాబోలు.

నేను అతని ముఖంలోకి చూడగానే, ఇంకోవైపుకు చూపులు మరల్చాడు.

నా కళ్ళు అతనిమీంచి వెనక్కి రానని మొరాయిస్తున్నాయి. వినోద్ ఖన్నాను యెదురుగానే చూస్తున్నట్లుగా వుంది నాకు. ఏమనుకుంటాడో అని బలవంతంగా నా కళ్ళని కాసేపు డ్రైవరుమీదికి పోనిచ్చి, మళ్ళా అతనివైపే మరల్చాను.

అతను తెలుగువాడయ్యుండడు. ఏ ఉత్తరాదివాడో అయ్యుంటాడు. లేకపోతే, ఆ రంగు, ఆ పొడుగు, ఆ శరీర దారుఢ్యం వుండవు.

నేను యిలా అతడివైపు చూడగానే. అతడు మళ్ళా తన మొహం ఇంకోవైపు తిప్పేసుకున్నాడు.

అతను తెలుగువాడా? ఉత్తరాదివాడా?

తెలుగువాడయితే బావుండును. నా మనస్సు ఆశతో రెపరెపలాడింది కాస్సేపు.

అతడు ఎవరితోనయినా మాట్లాడితే, తెలిసిపోతుంది. చెవులు రిక్కించి వినసాగాను.

అతను ఎవరితోనూ మాట్లాడడే. నా ఆరాటం యెక్కువయిపోతోంది.

బస్సు ఆగింది. కొందరు పాసింజర్లు దిగారు.

టికెట్టు డబ్బులు వసూలు చెయ్యడానికి కండక్టరు నా దగ్గరకు రాగానే, అతను నా వెనక్కి జరిగి నిలుచున్నాడు. కండక్టరు వెళ్ళిపోయాక అతనెక్కడున్నాడో అని చూశాను.

అతను నా తలవెనక నున్న రాడ్ పట్టుకుని నిలుచున్నాడు. నా కనుకొనల్లోంచి చూస్తే అవుపించింది.

అతని చెయ్యికి నా తల తగులుతుందేమోనని, నా తల ముందుకు వంచాను.

నా సీటుకు వెనుగ్గా, ఫుట్‌బోర్డుమీద వాళ్ళు పట్టుకొని నిలుచోవడానికి వీలుగా యింకో రాడ్ వుంది.

నేను తలముందుకు వంచడం గమనించినట్టున్నాడు నా తల వెనకాల ఉంచిన తన చెయ్యి చప్పున తీసేశాడు. నా వీపుకు దగ్గరగా, నా సీటుకు వెనుగ్గా వున్న రెండో రాడ్ పట్టుకున్నాడు.

బస్సు కదులుతుంటే, అతడి చేతివ్రేళ్ళు నా వీపుకు తగులుతున్నాయి యిప్పుడు.

అతడి బుద్ధి నా కిప్పుడర్థమయిపోయింది.

నేను యిబ్బంది పడిపోతానేమో నన్నట్టుగా, నా తల వెనుక ఉన్న రాడ్ మీంచి చెయ్యి తీసేశాడు. కాని, నా వీపుకు దగ్గరగా వున్న ఇంకో రాడ్ మీద చెయ్యివేసి నా వీపుకు తన వ్రేళ్లు తగిలిస్తున్నాడు.

మొన్న మంజులకు కూడా ఇలాగే జరిగిందట. యెవడో రవుడీ వెధవ వెనుకనుంచున్నట్టు నించుని, కాసేపు వ్రేళ్లు తగిలించి, చెయ్యి తగిలించి మొత్తంమీద వీపు నిమిరి వెళ్ళిపోయాడట.

వాడి గురించి చెప్పిచెప్పి మంజుల తెగనవ్వింది.

రోజూ ఆ త్రోవగుండా పోయే కుర్రాళ్లు అలాంటి సాహసాలు చెయ్యడానికి పూనుకోరు. యెప్పుడో ఒకసారి ప్రయాణం

చేసేవారే, తమని అవతలి వారు పోల్చి చూసుకునే అవకాశం లేదు కదా అని ఆడవాళ్ళను తాకాలని, చిలిపి పనులు చెయ్యాలని ఉబలాటపడతారు.

అతడి వ్రేళ్ల నా వీపుకు తగులుతున్నాయి పదేపదే.

'చూడండి మిష్టర్! మీ వేళ్లు తగులుతున్నాయ్' అనేద్దామని పించింది. కాని 'సారీ మేడమ్! బస్సు రష్‌గా వుంది. క్షమించండి' అని అతడు తేలిగ్గా అనేసాడంటే నేను అందరిలో చిన్నబోవాలి.

అందుకే వూరుకున్నాను.

అతను చేతివేళ్లు తగిలించడం మానలేదు. అంతేకాదు. మెల్లగా తన చేయిని నా మెడమీదకు పోనిచ్చాడు.

అతడి వేళ్లు నా మెడకు తగులుతున్నాయి ఇప్పుడు.

ఇదేం సరదావో యీ మగాళ్ళకు చేతులు, వ్రేళ్లు ఆడవాళ్ల ఒంటికి తగిల్చి మురిసిపోవడానికేం ఉందో అందులో?

లేచి అతన్ని గసురుదామా అనిపించింది. కాని యెందుకో నాకు మనస్కరించలేదు.

అయినా ఇంకో అయిదు నిముషాల్లో బస్సు దిగిపోతున్నాను. అనవసరంగా సీను క్రియేట్ చెయ్యడం యెందుకు?

అతని పిచ్చి ఆనందంలో అతడ్ని వుండనీ! మితమీరితే అప్పుడే చూసుకోవచ్చు.

ఊరుకున్నాను. 'నేను అలా చెయ్యడం అతడ్ని పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాననుకున్నాడేమో!

నా మెడలోని గొలుసు అటూ ఇటూ లాగడం చేస్తున్నాడు. వెధవ కొంటె పనులు! మగబుద్ధి అలాంటిది. అతడు వినోద్ ఖన్నాలా వున్నా, అంతే బుద్ధి.

దిసీజ్ టూమచ్! అయినా, నా స్టాప్ వచ్చేసింది.

బస్సాగింది. మగవాళ్లు దిగి వెళ్ళేంతవరకూ ఆగి నేను లేచాను.

నేను బస్సు దిగుతుంటే, ద్వారం దగ్గరగా నిలుచున్నాడు అతడు.

అతడు చేసిన అల్లరికి కాస్తంత మందలింపు చెయ్యాలనిపించింది నాకు.

నేను తెచ్చుకోగలిగినంత కోపం తెచ్చుకుని, అదంతా నా కళ్ళల్లో కనిపించేలా అతడి వైపుకు చూశాను.

అతడి ముఖం తెల్లబోయింది, మొహంమీద చిరుచెమటలు లేచాయి. ఒక్కసారిగా అతడి కళ్ళల్లో భయంతొంగి చూపింది.

అంత అందమైన మొహం అలా భయంతో విచిత్రంగా మారిపోవడం చూచి, నా గుండె ఒక్కసారిగా దేవినట్టయిపోయింది.

ఛ! యేమిటిది? అతడు సిల్లీగా ప్రవర్తిస్తే, నేను కూడా అలాగే ప్రవర్తించాలా?

యేదో వెకిలి చేష్టలు చేశాడు! నన్నేం చేశాడని యీ మందలింపు?

వెంటనే చిర్నవ్వు ముఖంమీదకు తెచ్చుకుని, ముందుకు సాగిపోయాను క్లీనరుకు నా టిక్కట్టు అందించి.

మనిషిని పోలిన మనిషి వుండడంటారు. కాని అతడి విషయంలో నిజంకాదు. అచ్చు వినోద్ ఖన్నాలా వున్నాడు.

అతన్ని బస్సులోగాని, బయటగాని చూడడం ఇదే మొదటిసారి. యీ రూట్ వెంబడి, యింతకు ముందెప్పుడూ వచ్చినట్టు లేదు.

అతడు యీలాగే రోజూవస్తే బావుణ్ణు. ఆ తలంపు కలిగేసరికి, నా మనస్సెందుకో ఆనందంతో చిందులు వేయసాగింది.

పది నిముషాల్లో ఆఫీసు చేరుకున్నాను. సెక్షన్‌లో హేండ్ బేగ్ వుంచి 'టాయ్‌లెట్'కు వెళ్ళాను.

టాప్ దగ్గర చెయ్యి కడుక్కుంటూ, గోడకున్న అద్దంలో కనిపిస్తున్న నా ముఖాన్ని పరామర్శించాను పనిలో పనిగా.

మొహం జిడ్డుగా లేదు. రెండు మూడు తల వెంట్రుకలు మాత్రం గాలికిరేగాయి. వాటిని యథాస్థానంలోకి సర్ది వేశాను మునివ్రేళ్ళతో.

వెళ్ళిపోబోతూ. మళ్ళా ఇంకోసారి చూసుకున్నాను తృప్తి కోసం అద్దంలోకి.

అంతే!

యీ సారి నా కళ్లు నా మెడమీదపడ్డాయి.

నా గుండె ఆగిపోయింది.

ఉదయం నేను మెడలో వేసుకొన్న రెండు బంగారు గొలుసుల్లో ఒకటే కనిపిస్తోంది.

యేమయిందది?

అపర వినోద్ ఖన్నాగారి ముఖంలోకి నేను కోపంగా చూడగానే అతడి మొహంలో భయం యెందుకవుపించిందో ఇప్పుడర్థమయింది నాకు!

అప్పటికే చాలా ఆలస్యమయిపోయింది. ★

డిటెక్టివ్ వాక్శుద్ధి ??

రచన : శుభ

పెర్రీమేసన్, షెర్లాక్ హోమ్స్, జేమ్స్ హాడ్లీ ఛేజ్, అగాథా క్రిస్టీ తదితర క్రైమ్ డిటెక్టివ్ సాహిత్యాన్ని వంటబట్టించుకుని, చదివిన నవల్నే మళ్ళీ మళ్ళీ చదువుతూ మధిస్తూ, కాలం

గడుపుతూ వచ్చిన శ్రీ వెంకట్రమణమూర్తి బి. ఏ. డింక్ కొట్టటంతో చింతించలేదు గానీ, ఇక ముందేం చెయ్యాలి అనే బెంగ పట్టుకుంది పాపం.

అసలింత వరకు చదవటమే గగనప్రాయమైన విషయమైంది అతగాడికి. తనకి ఆస్తులూ లేవు, అంతస్తులూ లేవు. ఎం. ఏ, లు ఎం. ఎస్‌సీ లో సర్టిఫికేట్లు దొంతరలుగా కట్టుకుని కాపీలకు కాపీలు తీయించి, అడ్డమైన అడ్వర్టయిజ్‌మెంట్లకు సమాధానాలుగా పంపుతూ, రిగ్రెట్ కార్డులు కూడా ఒక్కోసారి రాక అవస్థపడుతూంటే బి. ఏ. కూడా దాటలేని తనకు అప్లికేషన్ ఫారమైనా వచ్చే ఉద్యోగ ముంటుందా! ఏం చెయ్యాలి.

బ్రహ్మాండమైన ఐడియా, ఉక్కులాంటి ఐడియా, తన మిత్రు లెవ్వరూ కల్లోకూడా ఊహించనేరని ఐడియా తట్టింది మూర్తికి.

మనమే ఒక షెర్లాక్ హోమ్స్ ఐపోతే....?

చదువుకంటే తనకి డిటెక్టివ్ సాహిత్యమే ఒంట బట్టింది. ఒక ప్రైవేట్ డిటెక్టివ్ కంపెనీ పెట్టేస్తే, తన దశ తిరిగిందంటే, ధనవర్షం....

అయితే మొదట్లోనే పెద్ద డిటెక్టివ్‌లలాగా, హంగామా చేయడానికి తగిన స్తోమతా, అవకాశాలూ లేవు మూర్తికి. ఏవో సెక్రటరీలని, ఆధునిక మెషినరీలని, ఏర్పాటు చేసుకోవడం అప్పుడే వీలుపడదు. డబ్బు రావాలి, హంగులన్నీ కూర్చుకోవాలి.

అయినా, ముందు కొన్ని కనీసపు ఏర్పాట్లు తప్పవు. వీటికైనా కొంత పెట్టుబడి, గట్రా కావాల్సిందేగదా!

రెండు రోజులు అదే పనిగా ఆలోచించగా, మూర్తికి ఒక ఆశారేఖ మనస్సులో మెరిసింది.

తన మేనమామ కొడుకు పరంధామయ్య తన ఈడువాడే. తండ్రి చిన్నప్పుడే పోవడంచేత, ఊళ్లోనే వుంటూ వ్యవసాయం చూచుకుంటున్నాడు. అదీ చాలీచాలని వ్యవసాయంగా వుంటూ వుంది. వాడికీ వేరే ఏదైనా వ్యాపారం లాంటిది చెయ్యాలని వుంది. పోనీ వాడ్ని తనకి సహాయంగా రమ్మంటే, కొంత పొలం అమ్మి డబ్బు తీసుకురావడానికి కూడా వాడు సిద్ధపడ వచ్చునని తన అంచనా.

ఉత్తరాలతో పని చకచకా సాగదని వెంకటరమణమూర్తి, స్వయంగా, పారుపల్లి గ్రామానికి బయలుదేరాడు.

వారం రోజులు గ్రామంలో మకాంవేసి, పరంధామయ్యను ఒప్పించ గలిగాడు. రెండెకరాలు వెంటనే బేరం పెట్టారు. రెండెకరాలకు ఇరవై వేలకు బేరం సెటిల్ చేసుకుని, పదివేలు అడ్వాన్సుగా తీసుకున్నారు.

ట్రంకురోడ్డులో బట్టల దుకాణాలు ప్రారంభించే స్థాయిలో, ఒక హాలులాంటి దానిని రెండువేల పగ్గీ ఇచ్చి నెలకు వందా ఏభై రూపాయల అద్దెకు తీసుకున్నారు.

ముచ్చటగా "మూర్తి అండ్ పరం" అనే సైన్ బోర్డు చేయించి "క్రైమ్ అండ్ సోషల్ ఇన్వెస్టిగేటర్స్" అని తమ పేర్ల క్రింద రాయించి, హాలుముందు ఎత్తుగా దూరాన్నుంచి చూసేవాళ్ళకి కూడా కనుపించేట్లు తగిలించారు.

తమకి, ఫ్యూన్ తప్పని సరిగదా! పరంధామయ్యే తన వూర్నుంచి, రంగయ్య అనే తన కమతంలో మనిషిని వెంటబెట్టు కుని వచ్చాడు.

పెద్ద టేబులు, నాలుగు కుర్చీలు, ఒక పుస్తకాల రాక్, పేనాలు, పెన్సిళ్ళు, భూతద్దాలు (ఫింగర్ ప్రింట్స్ చూడ్డానికి) పనికిమాలిన కొన్ని పుస్తకాలు, ఆష్ట్రేలు, ఎవరైనా ఖర్మ

కాలి క్లయింట్స్ వస్తే, వాళ్ళకి టీ తెప్పించడానికి కప్పులు సాసర్లు....ఇట్లా కొంత ఇన్వెస్ట్‌మెంటు తప్పని సరైంది మిత్రద్వయానికి.

పెద్ద పెద్ద మహా నగరాల్లోనే ప్రైవేట్ డిటెక్టివ్‌ల పని అంతంత మాత్రంగా వుందని వింటున్నామే మరి జిల్లా కేంద్రంలో ఎంతవరకు కక్షీదార్లని రాబట్టగలం అనే సంశయం వెంకటరమణమూర్తికి కలక్కపోలేదు. కానీ కొత్తొక వింత పాతొక రోత అనే సామెత వుండనే వుంది గదా! మరి ఈ ఊళ్లో గాడ్రెజ్ బీర్వాల షాపు ప్రారంభించిన తర్వాత చాలా కాలం వరకు అమ్మకాలే లేవట. ఎందుకు ప్రారంభించాంరా ఈ వ్యాపారం అద్దె ఖర్చులు పైన పడుతున్నాయి తప్ప అని అనుకున్నారట ఆ కంపెనీ వాళ్లు. క్రమంగా ఇప్పుడు పుంజు కొంది. విపరీతమైన లాభాలు గుంజుకుంటున్నారు.

దేనికైనా కాలం, ఖర్మం కలిసిరావాలి మరి! ధైర్యేసాహసే లక్ష్మీ అన్నారు మన పెద్దాళ్ళు!!

పదివేల రూపాయల అడ్వాన్సులో క్రమంగా చిల్లి పడు తోంది. పరంధామయ్య ఒక వైపు పరాచికాలు పడుతూ, మరో వైపు దిగులు పడిపోతున్నాడు; ఈ వ్యవహారం గట్టెక్కేనా, పెట్టేనా అని!

స్థానికంగా ఒక ఇరవై వార పక్ష పత్రికలు వున్నాయి. వాటిల్లో ఒక నాలుగింటిని ఘనాపాటీవి అని చెప్పుకోదగ్గ వాటిని సెలెక్టు చేసి వాటిల్లో మొదటి పేజీలో, బాక్సుకట్టి ప్రకటనలు వేయించాడు మూర్తి.

''ఎన్నో నేరాలు, మానభంగాలు, చోరీలు, కిడ్నాప్ కేసులు వేయేల లెక్కలేనన్ని పోలీసుల చేతుల్లో పత్తాలేకుండా పోతు న్నాయి. మేం కొత్తగా క్రైమ్ డిటెక్షన్ ఏజన్సీ స్థాపించాం.

కేసు పట్టామంటే ఫలితం ఖాయం. రేట్లు సరసం. ఫలం అధికం'' అంటూ ధీమాగా రాయించారు.

మిత్రు లిద్దరూ ఆఫీసు రూములో కూర్చుని, పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

"ఇంక వారం రోజులు చూచిం తర్వాత మకాం ఎత్తేసి. శుభ్రంగా మా వూరికి పోయి, వ్యవసాయం చూసుకుంటాను. నీ పాట్లు నువ్వు పడు'' అని అంటున్నాడు పరంధామయ్య.

ట్రణ్ .... ట్రణ్ ....

కాలింగ్ బెల్ మోగుతోంది. రంగయ్య వాకిట్లో వుంటే కాలింగ్ బెల్ మోగదు. ఎవరైనా వస్తే అతనే లోపలికి వచ్చి చెబుతాడు. బహుశా టీ తాగడానికి ఏ సీమా హోటలుకో వెళ్లాడేమో! తానే వెళ్ళి చూడ్డం మంచిదని మూర్తి లేచి వెళ్ళి, ఆఫీసు రూము త్రోపుడు తలపులపైనుంచి తొంగి చూచాడు.

ఎవరో వరండా ప్రక్కగా నిల్చొని వున్నాడు. ఫుల్ సూటు చేతిలో పెద్ద సూట్ కేసు.

పిట్ట ఏదైనా ఇప్పటికి వల్లో పడిందా అని మూర్తి ముఖాన్ని ఆనందఛాయలు ఫులుముకున్నాయి.

వెంటనే మామూలుగా మొఖం పెట్టేసి, "కమిన్ సర్.'' అన్నాడు.

"పత్రికలలో మీ ప్రకటన చూచాను సార్. ఇలాంటి చొరవకు మీరు పూనుకోవడం చాలా సంతోషకరంగా వుంది. మీ కంపెనీ ఈ పయొనీరింగ్ ఎఫర్ట్‌లో తప్పక పైకి వస్తుంది.'' అన్నాడు ఆగంతకుడు.

మూర్తి తొణక్కుండా పరంధామయ్య వైపు 'చూశావుట్రా, మనం విజయాన్ని వరించక పోవటమేమిటి!' అన్నట్లు ఒక చూపు పిసిరి, మందహాసం చేశాడు.

"ప్రజల ఆదరాభిమానాలుంటే, పైకి రాకపోవడమనే ప్రశ్నే లేదు. అయినా కొత్త కాబట్టి జనాన్ని ఈ ఐడియాతో ఆకట్ట డానికి కొంత టైము పట్టవచ్చు" అన్నాడు మూర్తి.

"మీకు మేము ఎలా సహాయపడగలం? చోరీయా, కిడ్నా పింగా, పిల్లలనెత్తుకుపోవడమా, ఏమిటి మీకు వచ్చిన కష్టం? చెప్పండి, ఏదైనా పరిశోధిస్తాం, మీకు సంతృప్తి కలిగిస్తాం."

"క్షమించాలి! నేను కేసును తీసుకువచ్చినవాణ్ణి కాదు. మీ పరిశోధనలకి సహాయికారిగా వుండే కెమెరాలు నావద్ద వున్నాయి. మామూలివి కాని, కలర్‌వి కాని, ఏవైనా సప్లయి చేయగలం. మీ ఇన్వెస్టిగేషన్‌కి కెమెరాలు తప్పనిసరిగా అవసరమవుతాయి గదా!" అన్నాడు సూట్‌వాలా.

తృటికాలం రమణమూర్తి, పరంధామయ్య ఒకరి మొహం ఒకరు చూచుకున్నారు. కథ ఇలా అడ్డం తిరిగినందుకు నిర్విణ్ణు లైనప్పటికీ, వెంటనే సంబాళించుకున్నారు.

"మా దగ్గర ఫారీన్ కెమెరాలు ఒక అరడజను వున్నాయి సార్. ఢిల్లీలో మా క్రైమ్ డిటెక్షన్‌కి సంబంధించిన జైలాల్ సింగ్ లండన్‌నుంచి వస్తూ మాకూ కెమెరాలు తెచ్చి ఇచ్చాడు. ప్రస్తుతం మాకు కెమెరాలు కొనే అవసరం లేదు." అన్నాడు మూర్తి. ఆగంతకుడు సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

"రంగయ్యా, నువ్వు బయటికి వెళ్లేటపుడు చెప్పి వెళ్తూండు! ఎవరన్నా వస్తే పనేమిటో కనుక్కొని, వచ్చి చెప్పు. ఎవరంటే వాళ్లు వచ్చి టైమ్ వేస్టుచేస్తున్నారు." అని రంగయ్యకి వార్నింగ్ ఇచ్చారు మిత్రద్వయం.

పరంధామయ్య పెట్టిన గడువు దాటిపోవస్తున్నది. మూర్తికీ ఇక ఈ కంపెనీని కొనసాగించడం తెలివిగల పనేనా అనే సందేహం పట్టుకున్నది. ఆ రాత్రికి తీరిగ్గా కూచుని, ఆలోచించి తమ భవిష్యత్తు గురించి నిర్ణయానికి రావాలనుకున్నారు.

బ్లాంక్

EXAMINATION HALL
పరీక్షలలో ఏదైనా సరె
నాకు రాంకు టిమంటావే?
మహాబాక్ - అందుకే
ఇంటర్వ్యూలో లేటెప్పుచేస్తారు-

మధ్యాహ్నం మూడు గంటలకి, రంగయ్య హడావిడిగా లోపలికి పరుగెట్టుకొచ్చాడు.

"ఎవరో కోటువేసుకుని సంచీ పట్టుకుని వచ్చాడు. తమర్ని తక్షణం చూడాలంటున్నాడు. పనేమిటంటే మీతోనే సరాసరి మాట్లాడా లంటున్నాడు," అన్నాడు రంగయ్య.

"తిరుపతి వెంకటేశ్వరుడికి తల నీలాలిస్తామని మొక్కుకుందాంరా. ఇది నిజంగా కేసైతే, మనం పేరు తెచ్చుకుంటే!" అన్నాడు మూర్తి.

లోపలికి వచ్చిన వ్యక్తిని ఏమని అంచనా వెయ్యాలో తెలీ లేదు మనవాళ్ళకి. కూర్చోమనకుండానే కూర్చున్నాడా పెద్ద మనిషి. మంచినీళ్లడిగి పుచ్చుకుని, ఒక నిముషంసేపు అటూ ఇటూ చూచి కళ్లు మూసుకున్నాడు.

"మేమొక పెద్ద రాయిటింగ్ కేసుగురించిపరిశోధనలో మునిగి వున్నాం. తమ కేసు అర్జెంటైతే క్లుప్తంగా చెప్పండి. మా అభి ప్రాయం చెప్తాం," అన్నాడు మూర్తి, ఒక తస్సా తగిలిస్తూ.

కోటులోని వ్యక్తి కర్చీఫుతో మొఖం తుడుచుకుని చిన్న చిరునవ్వు నవ్వి ప్రారంభించాడు:

"మీకు కష్టం కలిగిస్తున్నందుకు నన్ను క్షమించాలి. నే నే కేసుకోసమూ రాలేదు. ఈ బిల్డింగ్ చాలాకాలంగా లిటిగేషనులో వుంది. బహుశా మీకు తెలిసుండొచ్చుకూడా, ఆఖరున ఇది వేలానికొచ్చింది సార్. నేను 50 వేల రూపాయలకి వేలంలో పాటపెట్టి ఈ బిల్డింగ్‌ని కొనేశాను. బట్టల దుకాణం ఇక్కడ తెరవాలనే ఉద్దేశంతో ఈ వేలంపాట పాడాను. మీరేదో డిటెక్టివ్ ఏజన్సీ అని ఏదో నడుపుతున్నారు గనుక, ఒక వారం రోజులు టైము తీసుకోండి. వారంలోగా ఇది ఖాళీచేసి అప్పగిం చెయ్యండి. మీరు పెద్దమనుషులు, చదువుకున్నవారు గనుక,

కోర్టు అమీనాలను పిలిపించి ఖాళీ చేయించే పరిస్థితి తీసుకు రాదల్చుకోలేదు. ఇదుగో నా చిరునామా, మీరు ఖాళీ చేసేటపుడు నాకు తెలియజెయ్యటానికి!'' అన్నాడాయన.

సమాధానానికికూడా ఎదురుచూడకుండా ఆయన వస్తానంటూ లేచి వెళ్లిపొయ్యాడు.

''బలే, నీకు వాక్శుద్ధి వున్నట్టుందిరా పరంధామయ్యా'' అని రమణమూర్తి టేబులుమీద వాలిపొయ్యాడు. ★

కథ అడ్డం తిరిగింది!!

రచన: జె. సుబ్బారావ్

''టక్, టక్'' మని తలుపు చప్పుడవటంతో, ఆవులిస్తూ లేచి తలుపులు తీసాను.

''రాజుగారి ఇల్లు ఇదేనాండి'' అని అడుగుతున్నాడు ఆ ఆగంతకుడు. కళ్ళు నులుముకుని అతన్ని పరీక్షగా చూసాను. కనీసం అతని ముఖమైనా ఎక్కడా, చూసిన గుర్తులేదు నాకు.

''ఆ! నేనేనండి రాజును'' అన్నాను.

''ఓ! గ్లాడ్ టు మీట్ యు సార్'' అన్నాడు చెయ్యి జాపుతూ.

''సేమ్ టు యు'' అంటూ కరచాలనం చెయ్యక తప్పింది కాదు నాకు.

నాకు కొత్తవాళ్ళంటె చికాకు! ఎంతో బాగా తెలిసినవాళ్లైతే తప్ప నేను మాట్లాడను, బాగా చనువుంటే గాని వాళ్ళతో కలిసి తిరగను.

నేనేం మాట్లాడకపోవటం చూపి అతను ''ఈ గదిలో

వుండేది మీ రొక్కరేనా....'' అంటూ అర్థోక్తిలో ఆగి పొయ్యాడు.

అసలు అతనెవరో ముందు తెలుసుకోవా లనిపించింది; ''మీరు....''. అందుకున్నా డతను. ''ఓ! ఐ యామ్ సారి! నే నెవరో మీకు చెప్పనేలేదు కదూ! ఐ యామ్ శేఖర్, బి.ఎ.'' అన్నాడు నవ్వుతూ.

అతను శేఖరుడైతే నాకెందుకు, సుకుమారుడైతే నా కెందుకు! అతనికి, నాకు, నా గదితో పనేం వచ్చింది, అది కావాలి నాకు. అదే అడిగాను.

''సార్! నిజంగా మీలాగా నిర్మొహమాటంగా వుండే వాళ్ళంటే నాకెంత ఇష్టమో నేను చెప్పలేను'' అన్నాడు పరవ శించిపోతూ.

నాకు ఒక్కసారి కోపం ముంచుకువచ్చింది. కమ్మటి నిద్ర పాడుచెయ్యడమే గాకుండా, బోరెత్తిస్తున్నాడు. ఇటువంటి వాళ్ళంటే నాకు చెడ్డ మంట!

''పనేమిటి'' సూటిగా అడిగాను.

అతను బిత్తరపోయినట్టు కనిపించినా సర్దుకొని ''మరేం లేదండి, నా కెక్కడా రూమ్ దొరకలేదు, దొరికినా నా ఒక్కడికి అంతంత అద్దెలు పెట్టడం వేస్ట్ అనిపించింది....''

నాకు చిర్రెత్తుకొచ్చింది. ''ఐ యామ్ సారీ! ఈ గది నాకే చాలటంలేదు'' అన్నాను, అతన్ని మరీ ముందుకెళ్ళ నివ్వడం ఇష్టంలేక.

''సార్! సార్! మీరలా అంటే నేను అన్యాయంగా చచ్చి పోతాను. యట్‌లీస్ట్ నాకు రెండు నెలలైనా చోటివ్వండి ప్లీజ్'' దాదాపు కాళ్ళమీద పడి ఏడ్చినంత పన్చేసాడు.

ఈసారి బిత్తరపోవటం నా పనయ్యింది, ఎక్కడినించో

హఠాత్తుగా వూడిపడి, చోటివ్వమనే ఈ 'వామను' డెవడా అనిపించింది నాకు. సరే ఇదేమిటో చూద్దామనిపించింది. ఆ మాటే అనేసాను.

"థాంక్యు సార్! థాంక్యు వెరీ మచ్! మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను! మెనీ థాంక్స్" అన్నాడతను నేనేదో అతని ప్రాణం కాపాడినట్టుగా.

"సరే సార్! నేను రేపు వచ్చేస్తాను" అన్నాడు హడావుడిగా వెళ్ళిపోతూ. అతనలా పరిగెత్తటం చూస్తుంటే నాకు నవ్వాగ లేదు.

ఆ రోజు ఆదివారం. స్వయంపాకాన్ని సస్పెండ్ చేసి, హోటల్‌లో భోంచేసి, మార్నింగ్ షోకి వెళ్ళొచ్చి తీరిగ్గా నిద్ర పోదాం కదా అని పడుకుని ఇలాకునుకు తీసానో లేదో అలా అత నొచ్చాడు.

ఇంతలో ఆవలింత పరామర్శించటంతో, ఆలోచనలకు స్వస్తి చెప్పి, తలు పేసి మళ్ళీ మంచంపైన వాలాను.

* * *

కాలచక్ర పరిభ్రమణంలో మూడునెలలు గిర్రున తిరిగి పొయ్యాయి. మూడునెలల్లో శేఖర్, నేను ఎంతగా కలిసిపొయ్యా మంటే, బహుశా మా లాంటి స్నేహితులు ఈ ప్రపంచంలో వుండరేమో ననిపించింది నాకు.... సారీ.... మాకు.

ఇదివరకు ఒంటరిగా కాలం ఎలా గడిపానో.తలుచుకుంటే నాకే ఆశ్చర్యమేస్తుంది. చివరికి ఆఫీసు కెళ్లటానికికూడ శేఖర్ నా వెంట వుండవల్సిందే ఇప్పుడు!

శేఖర్‌ని పేరుపెట్టి పిలవడం, శేఖర్ నన్ను 'సార్' అన టానికి బదులుగా 'గురువుగారు' అనటం; అప్పటికి, ఇప్పటికి జరిగిన మార్పులు.

కానయితే నాకు నచ్చింది ఒకటే. మొదటిరోజునే నేను వంట మొదలుపెడితే, "చూడండి. ఈ స్వయంపాకం అవస్థ మనకొద్దు. హోటలే మన పెళ్ళాం" అని బలవంతం చేసి, వంట పేరెత్తనీయకుండా చేసాడు.

నాకు మరో విషయంకూడ ఆశ్చర్య మనిపించింది. యట్లీస్ట్ రెండునెలలైనా రూములో చోటివ్వమని కాళ్ళా వేళ్ళా పడ్డ వాడు మూడునెలలైనా రూము వెతికే ప్రయత్నాలే చెయ్యటం లేదు.

* * *

ఆరోజు ఆఫీసునించి వచ్చేసరికి రూముకు తాళం వేసుంది. మా ఆఫీసు అయిపొయ్యే టైముకి, అక్కడికి శేఖర్ రావటం, ఆ తరువాత ఇద్దరం కలిసి రూమ్‌కి రావటం ఆనవాయితీ. ఆ రోజు ఆఫీసుకి రాకపోవడమే కాకుండా, రూమ్‌కికూడ రాక పొయ్యేసరికి నేను కించిత్తు ఆశ్చర్యపొయ్యాను.

డూప్లికేట్‌తో తాళం తీసి లోపలికి అడుగుపెట్టిన నేను, స్తంభించిపొయ్యాను. కారణం రూమ్‌లో శేఖరానికి సంబంధించిన వస్తువొక్కటీ లేదు. చివరికి శేఖర్ అగ్గిపెట్టె, సిగిరెట్ కేస్‌కూడ లేవు. కళ్లు గట్టిగా నులుముకుని మళ్ళీ చూసాను. కాని దృశ్యం మారలేదు. నా కళ్లు తిరిగిపోతున్నట్టుగా అనిపించి కళ్లు మూసుకుని మంచంమీద కూలబడ్డాను. మనసంతా శూన్యంగా వుంది. మెదడు మొద్దుబారిపోయింది.

శేఖర్ లేని ఆ గదిలో ఇంకొక్క క్షణంకూడ వుండలేక పొయ్యాను.

మళ్ళీ రూముకి తాళంవేసి నా కాళ్ళు నడిపించిన చోటికల్లా నడిచాను. ఇంతలో కారు హారన్ 'బొయ్' మని వినిపించటంతో వులిక్కిపడి, రోడ్డుమీదనించి ఫుట్‌పాత్‌మీదకి వచ్చాను.

"ప్రైవేటు డిటెక్టివ్ వర్మ" అన్న సైన్‌బోర్డు కనిపించింది ఎదురుగా. అప్పు డర్థమయింది నాకు; ఒక్కొక్కసారి ఆవేదన మనిషిని ఎంతదూరమైనా నడిపిస్తుందని.

నాకున్న మంచి స్నేహితుల్లో వర్మ మొదటివాడు. అతన్ని చూస్తేనే నాకు పెద్ద రిలీఫ్.

హుషారుగా మేడమెట్లెక్కి అతని ఆఫీసు గదికేసి నడిచాను. బ్లాక్ అంబాసిడర్ షూస్,బ్లూ కలర్ టెరికాట్ ప్యాంట్, టక్ చేసిన వైట్ షర్ట్, దానిమీద బ్లూ కలర్ కోటు వర్మ అందాన్ని, హుందాని రెట్టింపు చేస్తున్నాయి. ఆంధ్ర జేమ్స్ బాండ్ 'కృష్ణ'కే మాత్రం తీసిపోడనిపించింది నాకు.

నా వూహకి నేను నవ్వుకుంటూ స్ప్రింగ్ డోర్స్ తోసుకుని లోపలి కడుగు పెట్టాను. నన్ను చూస్తూనే డిటెక్టివ్ వర్మలేచి "వాట్ ఎ వండర్ కమాన్! కమాన్" అంటూనే, టేబిల్ పైన వున్న బెల్ నొక్కాడు. మళ్ళీ నా వైపు తిరిగి "కమాన్! సిడౌన్ మైడియర్ బాయ్! ఏమిటిలా దారి తప్పి వచ్చావు" అన్నాడు కరచాలనం చేస్తూ.

నేను కుర్చీలో కూర్చుంటూ "యు ఆర్ కరెక్టు! నేను దారి తప్పే వచ్చాను" అన్నాను.

"అయితే నా మీద ప్రేమ కాదనమాట" కనురెప్పలు కొద్దిగా కిందికి వాల్చి, కింద పెదవి విరుస్తూ అన్నాడు, ఆ ఫోజులో వర్మ మరింత బాగున్నాడు.

నేను నవ్వేస్తూ "నో! నో! డోంట్ మిస్ అండర్‌స్టాండ్‌మి. నేను దారి తప్పింది నీ కోసమే" అన్నాను.

"ఐసీ! ఐయామ్ ప్రైసింగ్ యువర్ ఎడ్జస్టమెంట్" అన్నాడు నవ్వుతూ.

ఇంతలో నౌకరు కుష్బాడు కాబోలు వచ్చాడు "ఏంటిసార్" అంటూ.

"చూడు హోటల్ కెళ్ళి రెండు ప్లేట్ల గులాబ్ జామ్‌లు,రెండు ప్లేట్ల బూంది, కూల్‌డ్రింక్స్ పట్టుకురా" అంటూ పది రూపాయల నోటుతీసి వాడికిచ్చాడు.

కుట్టాడు తుట్టుమన్నాడు. "చూడు నేను స్వీట్లు గీట్లు ఏం తినను" అన్నాను.

"సిల్లీబాయ్! స్వీట్లు, గీట్లు నిన్నెవడు తినమన్నాడు. గులాబ్ జాములు, కాస్త హాట్, ఆ తరువాత కూల్‌డ్రింక్ బస్" అన్నాడు డిటెక్టివ్ వర్మ నవ్వుతూ. నేనేం మాట్లాడలేక పొయ్యాను.

మరో అర్ధగంటలో కుట్టాడు తెచ్చిన కూల్ డ్రింక్స్‌తో సహా అన్నీ అయిపొయ్యాయి. వర్మ సిగరెట్టు అంటించి నాకొకటి అందించాడు.

నేను సిగరెట్టు అంటించగానే "ఆ! ఇప్పుడుచెప్పు రాజు!" అన్నాడు డిటెక్టివ్ వర్మ. ఆశ్చర్యపోవటం నావంతయ్యింది. "ఏమిటి చెప్పేది" అన్నాను.

"ఏం లేదూ! అయితే నీ ముఖం అట్లా ఎందుకు వాడిపోయింది! తప్పకుండా ఏదో వుంది. నాతో చెప్పటానికి సందేహమెందుకు" అన్నాడు వర్మ.

ఆవలించకుండానే దంతాలు లెక్కపెట్టే వ్యక్తి వర్మ.

నిజానికి నేనక్కడికి వచ్చింది రిలీఫ్‌కోసం. ఆ రిలీఫ్ దొరకడమే కాకుండ ఆ సమయాన్ని చక్కగా ఎంజాయ్ చెయ్యగలిగాను. శేఖర్ విషయమే మర్చిపొయ్యాను.

నేను వర్మకి, నాకు శేఖర్ మధ్య జరిగిన విషయాన్ని క్లుప్తంగా వివరంగా చెప్పేసాను.

"అయితే రూములో నీకు సంబంధించిన వస్తువొక్కటీ పోలేదన్నమాట" అన్నాడు డిటెక్టివ్ వర్మ అంతావిని.

"ఈవెన్ చిన్న కాయితం ముక్క కూడ పోలేదు. అయినా అతనలాంటి వాడు కాడు" అన్నాను నేను నమ్మకంతో.

వర్మ నవ్వి "రాజు! మనుషులకి కాయితం ముక్కలతో పనుండదు. అయినా మరొక్కసారి జ్ఞాపకం చేసుకో" అన్నాడు.

నేను కళ్లు మూసుకుని రూమ్‌లో ప్రతి వస్తువును పరీక్షగా చూసాను. "నో! అన్నీ సురక్షితంగా వున్నాయి. అయినా శేఖర్‌లాంటి వాడికి, నా రూమ్‌నించి కావాల్సిన వస్తువు లేముంటాయి" నన్ను నేనే ప్రశ్నించుకొన్నాను.

"సర్లే! ఈ విషయాన్ని ఇంతటితో మర్చిపో! మళ్ళీ ఎప్పుడైనా ఆ శేఖరం కనిపిస్తే, నా దగ్గరకు తీసుకురా" అన్నాడు వర్మ.

వర్మ ఆలోచనలేమిటో నాకు బొత్తిగా అర్థంకాలేదు. "సరే అలాగే" నని చెప్పి- "గుడ్ నైట్" అన్నాను లేస్తూ.

"ఓ. కె. గుడ్‌నైట్, థాంక్యూఫర్ యువర్ కైండ్ విజిట్" అన్నాడు వర్మ నవ్వుతూ.

"నో మెన్షన్! నా కర్తవ్యాన్ని గుర్తుచేసినందుకు థాంక్స్! థాంక్యు వెరీమచ్" అన్నాను నేను భావగర్భితంగా నవ్వుతూ.

* * *

సాయంత్రం, కాఫీ చప్పరిస్తూ, పేపరు చదువుతున్న నేను తలుపుదగ్గర గాజుల చప్పుడవటంతో తలెత్తి చూసాను.

ఒక్కసారిగా ఆనందాశ్చర్యాలలో మునిగి పొయ్యాను నేను.

ఎప్పటి సుజా! నా వూహలరాణి!!

ఒకప్పుడు మే మిద్దరం ప్రాణపదంగా ప్రేమించుకున్నాం. పెళ్ళికూడ చేసుకోవాలనుకున్నాం. కాని విధిప్రాబల్యం వల్ల, పరిస్థితులు అనుకూలించనందువల్ల మే మిద్దరం శాశ్వతంగా విడిపొయ్యాం. 'సుజా' మరొకరి సొత్తయిపోయింది.

"సుజా....ఓ! సారీ....రా సుజాత నిన్ను చూపి ఎన్నాళ్ళయింది" అన్నాను నేను మెరిసే కళ్ళతో ఆమె వంక చూస్తూ.

"ఛీ! ఎంత తియ్యగా మాట్లాడుతున్నావు. నువ్వు తేనె పూసిన కత్తివి. తడి గుడ్డతో గొంతుకోసే, నీచుడివి" నన్ను అసహ్యంగా చూస్తూ, నిలువెల్లా వణికిపోతూ అంది సుజాత.

అనుకోని ఈ సుడిగాలేమిటో అర్థం కాలేదు నాకు. "ఏమిటి సుజాత," అన్నాను కంగారుగా.

"ఏమిటా! ఒకప్పుడు నిన్ను ప్రేమించిన పాపానికి నువ్విచ్చిన బహుమతి" అంటూ తన చేతిలోని కాగితాలు విసిరి నా ముఖం మీద కొట్టింది.

ఆశ్చర్యంగా చూస్తూనే, వాటిని కింద పడిపోకుండా పట్టుకున్నాను. అవి రెండు ఉత్తరాలు. పిన్ చేసున్నాయి. పైది ...

అప్పట్లో, అంటే నేను, సుజాత ప్రేమించుకునే రోజుల్లో సరదాగా నేను రాసిన ఉత్తరానికి, సుజాత ఇచ్చిన జవాబే ఆ ఉత్తరం.

కిందది...

"మై డియర్ స్వీట్ సుజా,

ఒకప్పుడు నువ్వు నాకు రాసిన ఉత్తరం, మళ్ళీ నీకెందుకు పంపించానని ఆశ్చర్యపోతున్నావు కదూ! అవును అది సహజమే మరి! కాని సుజా ఈ ఉత్తరాన్ని మరొకరు... ఎవరో ఎందుకు నీ ఆరాధ్యదైవం, నీ పతిదేవుడు చూసాడంటే ఏమవుతుందో ఆలోచించు. ఆ! ఆ! ఆగు! అప్పుడే కోపం వచ్చి ఉత్తరాన్ని చింపెయ్యబోతున్నావు కదూ! కాస్త ఆగు! నువ్వీ ఉత్తరాన్ని చింపేస్తావనే అనుమానంతోనే ఒక చిన్న పనిచేసాను.

నువ్వు నాకు రాసిన ప్రతి వుత్తరాన్ని అందమైన డిజై

నులో కొన్ని వందలకాపీలు తయారు చేయించాను. నువ్వీ ఉత్తరాన్ని చింపేస్తే, మరో కాపీ నీకు పంపించి, పది కాపీలు నీ పతిదేవుడికి పంపిస్తాను. అలాగని ఈ ఉత్తరాన్ని జాగ్రత్తగా దాచుకునేవు సుమా। నేను కిందచెప్పిన పని చేస్తే ఎవ్వరికి, ఏ బాధా వుండదు। ఇది ఎవ్వరికి తెలీకుండా చాల రహస్యంగా వుంచాలి.

మై డియర్ స్వీట్ గర్ల్! మరో పదిరోజుల తరువాత సరిగ్గా సాయంత్రం ఆరుగంటలకి పదివేల రూపాయల చెక్కు పట్టుకుని సరాసరి ఆంజనేయులు గుడికి వచ్చి, అక్కడ నా ఉత్తరంతో కాచుక్కూచున్న నా అనుచరుడి కిచ్చేయి. పాపం, పెద్ద మొత్తమే। కాని, ఏం చేస్తాం। మన అవసరాలు అటువంటివి.

—నీ ప్రియమైన, రాజు.''

నా స్థితి అయోమయంగా తయారయింది. ఇలా నా సంత కంతో ఉత్తరం రాసి, నన్ను, సుజాతని కలవరపరచవలసిన అవసరం ఎవరికుందో, ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు.

''నాకేమీ అర్థం కావటంలేదు'' అన్నాను నేను, నన్నింకా అసహ్యంగాను, అనుమానంగాను చూస్తున్న సుజాత నుద్దేశించి.

ఇంతలో డిటెక్టివ్ వర్మ మాటలు జ్ఞాపకం వచ్చాయి. షాక్ కొట్టినట్లయింది నా మెదడుకి. గబగబ వెళ్లి పెట్టెలన్ని వెతి కాను. నా క్కావల్సింది కనిపించలేదు. నా చర్యలేమీ అర్థం కాలేదు కాబోలు, బిత్తరపోయి చూస్తోంది సుజాత.

నే నా కంగారులోనే గబా గబా ప్యాంటు, షర్టు తగిలించు కుని, ''సుజాతా, దైవసాక్షిగా చెప్తున్నాను. నేనా ఉత్తరం రాయలేదు. దయచేపి నువ్వు నా వెంట రా'' అన్నాను.

మరో పదినిముషాలలో మేం ఎక్కిన 'ఆటో' డిటెక్టివ్ వర్మ ఆఫీసు ముందర ఆగింది. సుజాత ఆశ్చర్యంగా నావైపు చూసింది.

నేను దాదాపు పరిగెత్తుతున్నట్లుగా మెట్లెక్కి, ఒక్కవుదుటున ఆఫీసుగదిలోకొచ్చి వర్మ కెదురుగావున్న కుర్చీలో కూర్చున్నాను. సుజాత నా వెనకాలే ప్రవేశించింది.

వర్మ ఆశ్చర్యంగా చూసాడు నావైపు. వర్మకి విషయమంతా చెప్పి, సుజాతని చూపించి, ఉత్తరాలిచ్చాను.

వర్మ ఉత్తరాలు చదివి సుజాతవైపు చూసాడు.తరువాత కుర్చీ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. నా బాధ్యతంతా అతనిమీద పెట్టేసినట్టనిపించింది నాకు. ఎంతో హాయిగా ఫీలయ్యాను.

రెండునిముషా లయిం తరువాత వర్మ లేచి, సుజాత నుద్దేశించి, "చూడండి సుజాతగారు! ఇవి రాజు రాసిన ఉత్తరాలు కావు. అతని దగ్గర మీరు రాసిన ఉత్తరాలేవీ లేవుకూడ. ఇవి రెండు పచ్చినిజాలు కనుక, డబ్బు ప్రసక్తి అసలు లేదు. మీరింటికి వెళ్ళి విశ్రాంతి తీసుకోండి." అన్నాడు స్థిరనిశ్చయంతో. సుజాత నావైపు సందేహంగా చూసి వెళ్ళిపోయింది.

వర్మ నా భుజంమీద చెయ్యేసి, "రాజూ, నువ్వు నిర్దోషివని నాకు తెలుసు. రేపటిలోగా ఆ బ్లాక్ మెయిలర్‌ని పట్టుకుని పోలీసుల కప్పగించే బాధ్యత నాది.డోంట్ వర్రీ"అన్నాడు నవ్వుతూ.

మనసులోనే వర్మకి కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

* * *

అప్పుడే ఫస్ట్ షో నించి వచ్చి తలుపు తెరవబోయాను. ఇంతలోనే పక్కింటి కుర్రాడు పరిగెత్తుకుంటూ వచ్చి, "మీకు ఫోనొచ్చిందండి. తొందరగా రమ్మంటున్నారు" అన్నాడు.

నా కింత అర్జెంటుగా ఫోన్ చేసిం దెవరా అనుకుంటూ, రిసీవర్ అందుకుని, "హలో, రాజు స్పీకింగ్" అన్నాను. అవతలనించి డిటెక్టివ్ వర్మ కంఠం వినిపించింది.

"రాజూ! ఇప్పుడే నాకు సుజాత ఫోనుచేసింది. తనని ఎవరో బెదిరించారని, చాలా భయంగా వుందని, సమయానికి తన భర్త కూడ లేడని, వీలైనంత తొందరగా రమ్మని అడిగింది. నేనిప్పుడు అక్కడికే వెళ్తున్నా. నువ్వు కూడ రా! ఇల్లు చిరాగ్ గల్లీలో పానుషాపు ఎదురుగా" అని ఫోను పెట్టేసాడు.

నేనుకూడ రిసీవర్ క్రెడిల్‌పైన పెట్టేసి, గబా గబా బయటికి పరిగెత్తి కనపడ్డ టాక్సీలో ఎక్కేసాను.

టాక్సీ చిరాగ్ గల్లీలో ఆగింది. అక్కడే వర్మ కారు కనిపించింది. టాక్సీ ఫేర్ చెల్లించి, కారు దగ్గరికి నడిచాను. వర్మ కూడ అప్పుడే వచ్చినట్టున్నాడు, నావైపు చూసి, "అదిగో, ఇల్లదే" అంటూ గబగబ అటువైపు అడుగువేసాడు.

ఇంతలోనే ఒక వ్యక్తి ఆ ఇంట్లోంచి పరిగెత్తుకుంటూ వచ్చి మమ్మల్ని ఢీకొన్నాడు. మేము తృళ్ళిపడి అతనివైపు చూసాం. కళ్ళకు వెడల్పాంటి గంతలున్నాయి. ముఖాన్నంతా కప్పేసినట్టున్న ఫెల్టు హాటు, షర్టంతా రక్తమయం. చూడటానికి భయంకరంగా వున్నాడు మనిషి.

అతను మమ్మల్ని చూసి పరిగెత్తబోయాడు. వెంటనే వర్మ అతని రెక్కలు విరిచిపట్టుకుని జేబులోంచి రివాల్వర్ తీసి గురిపెట్టి, "పిచ్చి పిచ్చి వేషాలు వేసావంటే ప్రాణాలు పోతాయ్ జాగ్రత్త! చెప్పినట్టు నడుచుకో," అంటూ ముందుకు తోసాడు.

ముగ్గురం ఆ ఇంటి లోపలకు వెళ్ళాం.

లోపలంతా చీకటిగా వుంది. వర్మ బ్యాటరీ లైటు గోడమీద ఫోకసు చేశాడు. స్విచ్ కనిపించింది. వెంటనే స్విచ్‌నొక్కాను.

ఒక్కక్షణం కళ్ళు మూసుకుని, తెరిచి చూసాను.

అంతే! అదిరిపడి, అప్రయత్నంగా నాలుగడుగులు వెనకేసాను.

మంచంమీద నించి నేలమీదకు వొరిగిపోయున్న సుజాత శరీరం, తోటకూరకాడలా వేల్లాడిపోతోంది. బట్టలు అస్త

వ్యస్తంగా వున్నాయి. శరీరం అంతా రక్తమయం. బొడ్డులో పిడివరకు దిగబడిన కత్తి భయంకరంగా వుంది.

ఇక, నేనా దృశ్యాన్ని చూడలేక వెనక్కి తిరిగాను. వర్మ కూడ పరీక్షగా చూస్తున్నాడు. కాని వర్మ రివాల్వర్ అతన్ని జాగ్రత్తగా కాపాడుతోంది.

ఈ సారి నేనతని వైపు పరీక్షగా చూసాను. ఒక్కవుదుటున దగ్గరకెళ్ళి కళ్ళ గంతలు పీకేసి, హాట్ తీసి విసిరి కొట్టాను.

సందేహం లేదు అతను శేఖరే! నాతో మూణ్ణాళ్ళ ముచ్చటగా స్నేహంచేసి హఠాత్తుగా పాటిపోయిన శేఖరం!

శేఖరం తలవంచుకున్నాడు.

*   *   *

"కంగారు పడకు రాజు! ఇతను సుజాత భర్త శేఖరే: సుజాతకి తండ్రి ఇచ్చిపోయిన ఆస్తికోసం ఇతను ఆశపడ్డాడు. చిన్నప్పట్నుంచి ఇతనికి వున్న దురలవాట్లు తెలిసిన సుజాత ఇతనికి ఒక్క పైసా ఇవ్వటానికి ఒప్పుకోలేదు. దాంతో దయానా, భయానా ఆమెని బెదిరించి లాభంలేక పొయ్యింది. దాంతో అడ్డదోవలు తొక్కి నీకు ప్రియాతి ప్రియ మిత్రుడిగా మారి నీకు సుజాత రాసిన ఉత్తరాలు చేజిక్కించుకుని ఈ ప్లాన్ వేసాడు. కాని కథ అడ్డం తిరిగి ప్లాన్ పాడయిపోయింది. దానిక్కారణం సుజాత సరాసరి నీ దగ్గరకి రావటం. దాంతో వెర్రెత్తిపోయి సుజాతని హత్య చేసాడు శేఖరం" అన్నాడు వర్మ పోలీస్ స్టేషన్నించి ఇంటికి వెళ్తూండగా.

ఒక్కొక్కమాట ఒక్కొక్క పిడుగయింది నా పాలిట.

"శేఖర! ఓహ్ ఎంత స్నేహంగా నటించాడు. స్కౌండ్రల్!" నాలో నేను గొణుక్కున్నాను. ★

చెప్పుకోండి చూద్దాం ?

సేకరణ: కె. చందర్‌రావు

1. తుపాకి పేల్చినపుడు, పేల్చిన వారి చేతుల మీద తుపాకిమందు కణాలు కనిపిస్తాయా?

2. మంచుగడ్డపై ఉప్పు చల్లితే, మంచు తొందరగా కరుగుతుందా?

3. మన వయస్సు పెరిగినకొద్దీ వేలిగుర్తులు మారుతుంటాయా?

4. కోర్టులోని న్యాయవాది ప్రపంచంలోని అతి చిన్న విషయంకూడా తెల్సినవాడయి వుండాలా?

5. ఒకరి శరీరాన్ని చీల్చుకుంటూ బయటకు వచ్చిన 'బుల్లెట్' ప్రక్కనున్న మరొకరి శరీరంలోకి దూరగల్గుతుందా?

6. ఒక రాతికి గురిచూసి పేల్చబడిన 'బుల్లెట్' రాతికి తగిలి, తిరిగి బంతిలాగా 'రివర్స్' రాగలుగుతుందా?

7. వేలిముద్రలున్న ఒక బుల్లెట్ ఒకరి శరీరంలోకి పేల్చబడిన తర్వాత, పోస్టుమార్టమ్‌లో ఆ బుల్లెట్‌పై వేలిముద్రలు అగుపిస్తాయా?

★

జవాబులు:

1. మైక్రోస్కోప్‌తో చూస్తే కనిపిస్తాయి. 2. కరగదు. 3. మారవు. 4. అవును. చిన్న విషయాలుకూడా ఎప్పుడో ఒకప్పుడు పనికి వస్తాయి. 5. ఆ బుల్లెట్ స్పీడ్ రేంజ్ ఎక్కువగా వుంటే దూరగలదు. 6. రాజాలదు. 7. అగుపించవు.

మరణానికి శరణం

రమణశ్రీ

"సర్! గ్రాండ్ సక్సెస్. మన కృషి ఫలించింది సర్" చిన్న పిల్లలా కేరింతలు కొడుతూ ఆనందంగా చెప్పింది సరోజ.

"వెరీగుడ్ రోజా! రేపే నీ థీసెస్ సబ్మిట్ చేయవచ్చు. మరోనెల రోజులకు నీకు పి. హెచ్‌డి గ్యారంటీ" గాజు పరీక్ష నాళికలో వేడిపొగలు క్రక్కుతున్న పంచరంగుల ద్రవాన్ని చూస్తూ అన్నాడు ప్రొఫెసర్ రావుజీ.

"థాంక్యూ సార్! మీ శిక్షణ, సహాయం నా జన్మలో మర్చిపోలేను. మరి నేను శెలవు తీసుకుంటాను" కర్చీపుతో ముఖం తుడుచుకొంటూ అంది సరోజ.

"చూడు సరోజా! టైమ్ చాలా అయింది. నువ్వు ఒక్కదానివే వెళ్ళగలవా? లేక నిన్ను మీ ఇంటివరకు డ్రాప్ చేసి రానా?" అడిగాడు ప్రొఫెసర్.

"నో థాంక్స్ సర్! బయట ఏదో టాక్సీ దొరక్కపోదు."

"అమ్మా సరోజా! ఇంత రాత్రివేళ టాక్సీకోసం నువ్వు ఒంటరిగా వెయిట్ చేస్తావా? పోనీ యీ రోజుకు నా కారు తీసుకు వెళ్ళమ్మా" ఆప్యాయంతో నిండిపోయింది ప్రొఫెసర్ గొంతు.

"థాంక్యూ సర్!" ప్రొఫెసర్ అందించిన ఇగ్నీషన్‌కీ అందుకొని బయటకు నడిచింది సరోజ.

'పిచ్చిపిల్ల! విజ్ఞానం చివరి అంచు చూడాలని పట్టుబట్టింది' నైట్ గౌను అందుకొంటూ మనసులో అనుకున్నాడు ప్రొఫెసర్.

గాలి చల్లగా వీయసాగింది. కిటికీల షట్టర్స్ అన్నీ దించేసి ట్రిబుల్ ఫైవ్ వెలిగించి బెడ్‌పై వాలాడు ప్రొఫెసర్.

మూడు నిమిషాలు గడిచాయి. సిగరెట్ పీక అష్ట్రేలో పడేయడానికి లేచాడు ప్రొఫెసర్. అదే క్షణంలో గణగణమంటూ ఫోన్ మోగింది.

ఆశ్చర్యపడుతూ వెళ్ళి రిసీవరు అందుకొని "హల్లో ప్రొఫెసర్ రావూజీ స్పీకింగ్!" అన్నాడు.

"హల్లో ప్రొఫెసర్! టైమ్ ఎంత అయింది?" అవతల నుండి వినబడింది.

"పన్నెండు గంటలయింది. అన్నట్లు మీరెవరు?"

"నే నెవరో మీకు తర్వాత తెలుస్తుంది. అన్నట్లు ఓ ముఖ్య విషయం జాగ్రత్తగా వినండి."

"ఎస్. చెప్పండి."

"మిష్టర్ ప్రొఫెసర్! మీరు మరో పన్నెండు గంటలలో చచ్చిపోవాలి!" కర్కశంగా వినపడింది.

"వాట్! వాడ్డూయూ మీన్?" గట్టిగా అడిగాడు ప్రొఫెసర్.

"ఎస్ ప్రొఫెసర్. మరో 12 గంటలలో మీరు చచ్చిపోవాలి."

"నో. నేను చావను. ఎందుకు చావాలి?"

"మీరు చావకపోతే చంపుతాను. బై ది బై మీరు వూరికే చచ్చిపోవద్దు. మీరు మరణించడానికి మేము కొంత భరణం చెల్లిస్తాము. మీ మరణానికి ఎంత భరణం కావాలో కోరుకోండి."

"వాట్ నాన్సెన్స్ యు ఆర్ టాకింగ్! నే నెవరినో నీకు తెలుసా?" అరిచాడు ప్రొఫెసర్.

"తెలుసు ప్రొఫెసర్! ఒకరి మరణానికి కారణమైన వ్యక్తివి. ప్రస్తుతం మృత్యుదేవతకు భుక్తివి. ఆల్‌రైట్ నీ మరణానికి మా భరణం పాతిక వేలు. లాస్ట్ గుడ్‌నైట్!" ఫోన్ క్లిక్ మంది.

2

సర్కార్ ఎక్స్‌ప్రెస్ వేగంగా పరిగెడుతూంది. ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంటులో ఒక్కడే కూర్చొని వున్నాడు అనంతం.

అతని మనస్సులో ఆలోచనలు ఎక్స్‌ప్రెస్ కన్న వేగంగా పరి గెడుతున్నాయి.

"రామనాధాన్ని చంపాలి! అవును రామనాధాన్ని చంపాలి! ఎలా చంపాలి?"

రామనాధాన్ని తలచుకొంటున్న కొలది అనంతం రక్తం ఉడికిపోతున్నది. అతని హృదయం మండిపోతున్నది. ఆ దృశ్యం అతని కళ్ళముందు ఇంకా కనబడుతూనే వుంది. ఆ ఆర్తనాదం అతనికి ఇంకా వినబడుతూనే వుంది.

తన జేబులో ఉన్న పిడిచాకును మరోసారి తడుముకున్నాడు. 'రామనాధాన్ని యీ రోజు చంపేస్తాను' అనుకున్న తరువాత అతని హృదయం తేలిక పడింది.

రైలు ఆగింది. అనంతం క్రిందకు దిగాడు.

తను సరాసరి రామనాధం ఇంటికి వెళ్ళాలా? ఒక్కక్షణం ఆలోచించాడు అనంతం.

ఛ! పిరికిపందలా దొంగచాటుగా రామనాధాన్ని చంపితే లాభంలేదు. తను అతన్ని ఎందుకు చంపబోతున్నాడో ముందుగా తెలియపరిచి మరీ చంపాలి?

చకచక ప్రక్కనే వున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోకి నడి చాడు. రిసీవరు ఎత్తి నంబర్ డయల్ చేశాడు. అవతలనుండి "హల్లో" అని వినబడగానే మూడు పదిపైసల నాణెములు బాక్స్‌లో వేశాడు....

చటుక్కున బ్రేక్ పడింది మూర్తి కలానికి. సిగరెట్ కేస్ లోంచి సిగరెట్ తీసి వెలిగించాడు.

ఈ కథ మొదలుపెట్టి సరిగ్గా మూడు రోజులయింది. ప్రఖ్యాత డిటెక్టివ్ రచయిత మూర్తి ఇంతవరకు మొదలుపెట్టిన కథ, పూర్తి అవకుండా ఆపలేదు. మరి యీ కథ ఎందువలనో అను క్షణం ఆపవలసి వస్తూంది.

తీవ్రంగా ఆలోచించసాగాడు మూర్తి. ఆరిపోతున్న సిగరెట్‌తోనే మరొక సిగరెట్ అంటించుకున్నాడు.

అనంతం రామనాథానికి ఏమని ఫోన్ చేస్తాడు? అక్కడ కారణం ఎలా రాస్తే పాఠకులను ఆకట్టుకుంటుంది? ఫోన్‌చేసిన తరువాత అనంతం రామనాథాన్ని ఎలా చంపుతాడు? చివరకు అనంతాన్ని ఏం చెయ్యాలి?

మూర్తి ఆలోచనలను చెదరకొడుతూ టేబుల్‌పై ఫోన్ మ్రోగింది.

రిసీవరందుకొని "హల్లో! ఎస్. మూర్తి స్పీకింగ్!" అన్నాడు.

"గుడ్‌మార్నింగ్ సార్! మీరేదో బిజీగా ఉన్నట్లున్నారు!"

"అవును. ఓ కథ వ్రాస్తున్నాను."

"ఐ.సీ. నేను మిమ్ములను కలుసుకోవాలను కొంటున్నాను. ఎప్పుడు వీలవుతుందో తెలియచేస్తారా?"

"మీ పేరు, మీరు నన్ను ఎందుకు కలుసుకోవాలను కొంటున్నారో తెలియచేస్తే, తప్పకుండా మీకు ఒక టైమ్ ఫిక్స్ చేస్తాను."

"థాంక్యూ! పెద్ద పనేమీ లేదు. నేను చెప్పిన పని మీరు చేయగలిగితే, మిమ్ములను కలుసుకొనవలసిన అవసరం లేదు. అంతేకాదు, మీరు చేయబోవు పనికి ప్రతిఫలముంటుంది."

"ఏమిటా పని?"

"వెరీ సింపుల్. మరో పన్నెండు గంటలలో మీరు చచ్చిపోవాలి" ఒకొక్క మాట తూచితూచి చెప్పాడు.

అదిరిపోయాడు మూర్తి. "హూ ఆర్ యు? డర్టీ ఫెలో! నీకేమీ పనిలేదా? జాగ్రత్త. ఇలాంటి పిచ్చిపిచ్చి ఫోనులు యింకెప్పుడూ చేయకు" హెచ్చరించాడు.

అవతలనుండి బిగ్గరగా నవ్వు వినబడింది.

"నో. నో. మిష్టర్ మూర్తీ! నా మాట జరిగి తీరాలి. నీ అంతట నువ్వు చచ్చిపోతే చాలా మంచిది. లేకపోతే నేనే కల్పించుకోవాల్సి వస్తుంది. మరో మాట! నువ్వు ఊరికే చచ్చిపోనక్కరలేదు. నీ మరణానికి మేము కొంత భరణం చెల్లిస్తాము. ఆ అవకాశంగూడా నీకే వదిలిపెడుతున్నాను. నీ మరణానికి ఎంత భరణం కావాలి?"

"యూ షటప్! రాస్కెల్!" గట్టిగా అరిచాడు మూర్తి.

"ఆల్ రైట్ మూర్తీ, నీ మరణానికి మా భరణం పదివేలు. విష్ యు గో టు హెల్!" ఫోన్ క్లిక్‌మంది.

రిసీవరు ఫోన్‌మీద పెట్టేసి, నుదురు నాక్రమించిన చిరుచమటను కర్చీఫుతో తుడుచుకొని ఫాన్ ఆన్‌చేశాడు మూర్తి.

తనకు ఫోన్‌చేసిన వ్యక్తి ఎవరో ఊహించసాగాడు. ఎంతసేపు ఆలోచించినా, అతను మూర్తి ఊహకు అందలేదు.

అలాగే ఆలోచిస్తూ చల్లని ఫాన్ గాలిలో నిద్రలో కూరిగిపోయాడు మూర్తి.

3

ఉదయం ఏడుగంటలయింది.

అప్పుడే నిద్రమేల్కొని బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు ప్రొఫెసర్ రావూజీ.

రాత్రి వచ్చిన ఫోన్‌కాల్ గుర్తుకువచ్చి క్షణంసేపు నవ్వుకున్నాడు. పాపం, ఎవరో పిచ్చాసుపత్రి నుండి పారిపోయుంటాడు. అతను రాత్రి తనతో మాట్లాడిన తీరు భలే గమ్మత్తుగా వుంది. ఆ విషయమంతా ప్రెస్‌కు యిద్దామనుకున్నాడు.

వెంటనే రాత్రి ఆ అపరిచిత వ్యక్తి తనతో ఫోన్‌లో మాట్లాడిన విధమంతా తన లెటర్ పాడ్‌పై వ్రాసి టేబుల్‌పైన పెట్టాడు ప్రొఫెసర్.

బాత్‌రూంలోకి వెళ్ళబోతున్న రావూజీ టెలిఫోన్ ట్రింగ్ మనడం విని, చటుక్కున రిసీవరు ఎత్తాడు.

"హల్లో ప్రొఫెసర్, నేను లాయర్ రాజారావును మాట్లాడు తున్నాను. రాత్రి సెకండ్ షోకి వెళ్ళి మధ్యలో బోర్‌కొట్టి యింటికి వస్తున్న సమయంలో, రోడ్ మీద ఒక కారు ఆగిపోయి వుంది. అనుమానంగా ఆగి పరిశీలిస్తే, డ్రైవింగ్ సీట్‌లో ఒక అమ్మాయి స్పృహతప్పి పడిపోయి వుంది. వెంటనే ఆ అమ్మా యిని మా యింటికి తీసుకువెళ్ళి ప్రథమ చికిత్స చేశాను. ఇప్పుడే స్పృహ వచ్చింది. మీ పేరు చెప్పగానే మీకు ఫోన్ చేశాను. ఒకసారి మా యింటికి, ఐ మీన్ 23-11-77, సత్య నారాయణపురం రాగలరు" కంగారుగా విన్పించింది.

అంతే, ప్రొఫెసర్ నైట్ డ్రస్‌తోనే బయటకు పరిగెత్తి కనబడ్డ టాక్సీని పిలచి అడ్రస్ చెప్పి ఎక్కాడు.

మరో పది నిమిషాలలో టాక్సీ ఆ అడ్రస్‌కు చేరుకుంది. పదిరూపాయల కాగితం డ్రైవరు కందించి చిల్లర తీసుకోన కుండానే లోపలకు పరిగెత్తాడు ప్రొఫెసర్.

లోపలకు ప్రవేశించిన ప్రొఫెసర్ ఎదుటి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు.

ఎదురుగా నల్లటి రివాల్వర్ పుచ్చుకున్న వ్యక్తి "హార్టీ వెల్‌కం మిష్టర్ ప్రొఫెసర్" అన్నాడు.

"మిష్టర్, ఎవర్నువ్? ఏమిటీ దారుణం? సరోజ ఎక్కడ?" కంగారును అణుచుకుంటూ అడిగాడు ప్రొఫెసర్.

నవ్వాడతను, "అంతా నాటకం ప్రొఫెసర్! రాత్రి ఫోన్‌లో చెప్పిన విషయం మర్చిపోయావా?"

అదిరిపోయాడు ప్రొఫెసర్. "అయితే రాత్రి ఫోన్‌చేసింది నువ్వేనన్నమాట! నేనెవరో పిచ్చివాడనుకున్నాను. ఆల్‌రైట్,

నువ్వు నన్ను ఎందుకు చంపదలచుకున్నావు? నీకేమన్నా పిచ్చా? లేదా డబ్బు కావాలంటే అడుగు. ఇస్తాను.''

మళ్ళీ నవ్వాడు రివాల్వర్ వ్యక్తి. అతని రెండు కళ్ళూ అగ్నిగోళాల్లా మండుతున్నాయి.

''మిష్టర్ ప్రొఫెసర్! ఒకరకంగా దేశంలో అందరూ పిచ్చి వాళ్ళే! అయితే తలా ఒకరకం పిచ్చి. నువ్వు డబ్బు పిచ్చి గాడివి. డబ్బుకు గడ్డి తింటావు. అలాగే నేను ప్రాణాల పిచ్చి గాడిని. నాకు కావలసినది నీ మరణం. నువ్వేమీ బాధపడొద్దు మిష్టర్, నీ మరణానికి భరణం చెల్లింపబడుతుంది. ఎంతో తెలుసా, పాతికవేలు!'' పిడుగులు వర్షిస్తున్నట్లు మాట్లాడాడు.

తెల్లబోయి చూశాడు ప్రొఫెసర్. అతనేదో మాట్లాడ బోతుండగానే, ఆ వ్యక్తి చేతిలోని రివాల్వర్ మూడుసార్లు సైలెన్సుగా పేలింది.

అంతే, ప్రొఫెసర్ కీచుమని అరుస్తూ, నేలపై పడిపోయాడు. రెండు క్షణాలు తీవ్రంగా మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు.

అతను జేబులోనుండి సరికొత్త వందరూపాయల నోట్లు తీశాడు.

''ప్రొఫెసర్! ఇదిగో, నీ మరణానికి నా భరణం పాతిక వేలు. హహ్హహ్హా!'' అంటూ వికృతంగా నవ్వుతూ, ఆ వంద రూపాయల నోట్లను శవంపై వెదజల్లాడు.

వెంటనే తన గుర్తులు అక్కడ ఏమీలేకుండా జాగ్రత్తపడి, శవాన్ని గదిలోనే వుంచి గదితలుపులు దగ్గరగావేసి బయటకు నడిచాడు.

4

కుర్చీలోనే కూర్చుని నిదురబోతున్న మూర్తి ఉలిక్కిపడి నిద్రలేచాడు. గోడ గడియారం తెల్లవారుజాము ఐదుగంటలు

చూపిస్తూంది. స్టూలుమీద కథ వ్రాస్తున్న కాగితాలు ఫాన్‌గాలికి చెల్లాచెదురై, గదంతా ఆక్రమించి వున్నాయి.

మూర్తి గబగబా కుర్చీలోంచి లేచి ఆ కాగితాలన్నీ ఏరి వరుసప్రకారం పెట్టుకున్నాడు.

హఠాత్తుగా రాత్రి వచ్చిన ఫోన్‌కాల్ గుర్తుకు వచ్చింది. వెంటనే కలం తీసుకొని కథకు పేరుపెట్టాడు. 'మరణానికి భరణం' అన్నపేరును నీటుగా మరోసారి దిద్దాడు.

ఒకసారి రాసినంతవరకు కథ చదువుకున్నాడు. అనంతం రామనాధానికి ఫోన్ చేయబోతున్నాడు.

అంతే, మూర్తి కలం చకచక కదిలింది. రాత్రి ఆ అపరిచిత వ్యక్తి తనకు ఎలా ఫోన్ చేశాడో, అలాగే అనంతం రామనాధానికి ఫోన్‌చేసి చెబుతాడు. కథ సాగిపోతూంది. రెండు గంటల తరువాత కలం మూసేసి ఊపిరి పీల్చుకున్నాడు మూర్తి.

కథ కవరులో పెట్టి చక్కగా అడ్రస్ వ్రాసి, టేబుల్ సొరుగుతో పడేశాడు. గడియారం చూశాడు. ఏడున్నర కావస్తున్నది.

అంతలోనే గణగణమంటూ కాలింగ్‌బెల్ మోగింది.

గబగబ వెళ్ళి తలుపు తెరిచాడు.

"గుడ్‌మార్నింగ్ సార్!" గుమ్మందగ్గర చిన్న సూట్‌కేస్ పట్టుకొని నిలుచునివున్న అపరిచిత వ్యక్తి విష్‌చేశాడు.

"లోపలకు రండి. ఎవరు మీరు?" ప్రశ్నించాడు మూర్తి.

"నేను 'క్రైమ్' పత్రిక తరపున ప్రత్యేక ప్రతినిధిగా వచ్చాను. నా పేరు జానీ."

"వెరీగ్లాడ్ టు మీట్ యు" కరచాలనం చేశాడు మూర్తి.

"సేమ్ టు యు" చిన్నగా నవ్వాడతను.

"క్షమించండి. రాత్రి చాలాసేపు ఓ కథ కోసం ఆలోచించవలసి వచ్చింది. చివరకు ఆ కథ పూర్తిచేసి పడుకునే టప్పటికి బాగా పొద్దుపోయింది. అందువలనే ఇప్పటివరకూ లేవలేదు."

"నో. నో. క్షమించవలసినది మీరు. తదుపరి సంచికలో మీ పరిచయాన్ని పాఠకులకు అందించదలచుకున్నాము. త్వరగా వెళ్ళిరమ్మని ఎడిటర్‌గారు పంపించారు. అందువలన ప్రొద్దున్నే వచ్చాను."

"ఫర్వాలేదు లెండి. రోజూ ఆరుగంటలకే లేచేవాడిని. ఈ రోజు 8 గంటలయింది."

"డియర్ సర్! ఓ అరగంట మిమ్మలను ఇంటర్వ్యూ చేయడానికి నాకు అవకాశం ఇవ్వాలి" రిక్వెస్టు చేశాడు జానీ.

"ష్యూర్‌విత్ ప్లెజర్ రండి. ఇదే నా డ్రాయింగ్ అండ్ బెడ్ రూం. ఫ్యామిలీ పుట్టింటికి వెళ్ళారు. జస్టు పది నిమిషాలు కూర్చోండి. నేను బాత్‌రూంలోకి వెళ్ళివస్తాను" అన్నాడు మూర్తి.

"థాంక్యూ. ఈ లోగా మీరు వ్రాసిన కథ ఏదైనా వుంటే ఇవ్వండి. చదువుతూంటాను."

"తప్పకుండా! రాత్రే వ్రాశాను చదవండి,"టేబుల్ సొరుగు లోంచి కథ తీసి ఇచ్చాడు.

టూత్‌పేస్టు, టవల్, సోప్ తీసుకొని బాత్‌రూం వైపు నడిచాడు మూర్తి.

జానీ కథ చదవడంలో లీనమై పోయాడు.

పది నిమిషాలు గడిచాయి.

తెల్ల పైజమామీద సిల్కులాల్చీ వేసుకొని లోపలకు వచ్చాడు మూర్తి.

ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ, "అడగండి మీ ప్రశ్నలు" అన్నాడు.

కథ చదవడం పూర్తిచేసి ప్రక్కన పెట్టాడు జానీ.

"ఈ కథ చాలా గమ్మత్తుగా వ్రాశారు. చాలా బాగుంది.

మీకు యీ అయిడియా ఎలా వచ్చింది?" అడిగాడు.

చిన్నగా నవ్వాడు మూర్తి "అదో వింతకథ. రాత్రి ఓ కథ వ్రాద్దామని కూర్చున్నాను. అనంతం రామనాధానికి ఫోన్ చేయడం వరకు రాగానే కథ ఆగిపోయింది. ఆలోచిస్తూ కూర్చున్న నాకు ఎక్కడినుండో ఫోన్ వచ్చింది. ఎవరో.పాపం, పిచ్చివాడు ఏదోదో వాగుతూ ఫోన్ చేశాడు. అంతా విని నాలుగు తిట్టి ఫోన్ పెట్టేశాను. అనుకోకుండా ఆ ఫోన్ చేసిన వ్యక్తి నాకు ఉపయోగపడ్డాడు. మళ్ళీ కథ కంటిన్యూ చేశాను."

"ఒక చిన్న అనుమానం. రామనాధాన్ని చంపి అనంతం చివరకు పోలీసులకు చిక్కినట్లు వ్రాశారు. అలా పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు అవకాశం లేదా?"

"ఉండవచ్చు. కానీ కథ చివరకు సుఖాంతము కావాలను కున్నాను. అందుకని అలా వ్రాశాను."

"మీకు ఎవరో ఆ వ్యక్తి ఫోన్ చేయకపోతే, మీరు యీ కథ ఏ విధంగా ముగించేవారు?"

"ఏమో, నేనెలా చెబుతాను!" చిన్నగా నవ్వాడు మూర్తి.

"మీకు ఆ విధముగా ఫోన్‌చేసిన వ్యక్తి పిచ్చివాడను కుంటున్నారా?"

"పిచ్చివాడు కావచ్చును. లేక ఎవరైనా సరదాగా చిన్న చిలిపిపని చేసివుండవచ్చు."

"మరి, మీరు యీ విషయం సీరియస్‌గా తీసుకోవడం లేదా?"

"ఏసీజ్ సిల్లీ థింగ్. దానిని గురించి బుర్ర బద్దలు చేసు కోవడం దేనికి?"

"ఒకవేళ అది సీరియస్ విషయమే అయితే...."

ఆశ్చర్యంగా చూశాడు మూర్తి. "మీరు మాట్లాడే దేమిటో నాకు అర్థం కావడం లేదు. ఎవడో నువ్వు చచ్చిపో, నీకు

డబ్బులిస్తానంటే, అది సీరియస్‌గా తీసుకోవాలా?''

''అతనెవరో నిజంగానే ఫోన్ చేశాడనుకుంటున్నాను!''

''అందుకు ఆధారం?''

''ఆ ఫోన్ చేసినది నేనే గనుక.'' పిడుగుల్లా వినపడ్డాయి మాటలు.

అదిరిపడి తల పైకెత్తాడు మూర్తి. ''మీరు చాలా ఆశ్చర్యకరమైన వ్యక్తి. బహుశా నన్ను పరీక్ష చేయడానికి ఆ విధముగా ఫోన్ చేసివుంటారు. అవునా?''

''లేదు. నేను నిజంగానే ఫోన్ చేశాను. మీ రనుకొంటున్నట్లు నేను ఏ పత్రికకూ ప్రత్యేక ప్రతినిధిని కాను.''

''అయితే, యూమీన్....'' ఆశ్చర్యంగా లేవబోయాడు మూర్తి.

''మెదలకుండా కూర్చో మిష్టర్ మూర్తీ'' చేతిలో నల్లగా మెరుస్తున్న రివాల్వర్‌ను చూపిస్తూ అన్నాడు జానీ.

''మిష్టర్, నువ్వు నన్ను ఎందుకు చంపాలనుకుంటున్నావ్? నీకు డబ్బు కావాలంటే చెప్పు. ఎంత కావాలంటే అంత ఇస్తాను'' అరిచాడు మూర్తి.

చిన్నగా నవ్వాడు జానీ. ''మిష్టర్, నాకు డబ్బులకు కరువు లేదు. నీ మరణానికి నేనే పదివేలు భరణం చెల్లిస్తాను. ఆ భరణం చాలదంటే చెప్పు. అవకాశముంటే నీ మరణానికి భరణం పెంచుతాను.''

''యూఫూల్! చచ్చిపోయిన వ్యక్తి డబ్బు ఏం చేసుకుంటాడు?''

''నువ్వు డబ్బుకు గడ్డి తిన్నప్పుడే చచ్చిపోయినట్లు మిష్టర్! ప్రస్తుతం నీ శవం మరోసారి చస్తుంది. అంతే!'' ఎర్రబారిన కళ్ళతో అన్నాడు జానీ.

"ఆల్‌రైట్! నన్ను ఎందుకు చంపుతున్నావో చెప్పు. కనీసం ఆ ఆత్మతృప్తితోనైనా చచ్చిపోతాను."

"నో. నువ్వు తృప్తిగా చావడం నా కిష్టంలేదు. తీరని అశాంతిలో నువ్వు చచ్చిపోవాలి" జానీ చేతిలోని రివాల్వర్ నిప్పుకణాలు గక్కింది.

ఒకటి.... రెండు....వరుసగా ఆరు బుల్లెట్లు అతని శరీరంలో చోటు చేసుకున్నాయి.

అంతే, నోట మాటగూడా రాకుండా క్రింద పడిపోయాడు మూర్తి.

తన వెంట తీసుకువచ్చిన సూట్‌కేస్ తెరిచాడు జానీ. అందులోనుండి సరికొత్త వందరూపాయల నోట్లను రెండు చేతులతో తీశాడు.

క్రింద రక్తపు మడుగులో కొట్టుకుంటున్న మూర్తి శవంపై పదివేల రూపాయలు గుమ్మరించాడు.

ఒక్కక్షణం శవం వంక క్రూరంగా చూసి, తన గుర్తులేవీ లేకుండా జాగ్రత్తపడి బయటకు నడిచాడు జానీ.

మరో గంటలో సైరను వూదుకుంటూ పోలీస్ కంట్రోలు కారు వచ్చి అక్కడ ఆగింది. ఇనస్పెక్టర్ నిరంజన్ గబగబ లోపలకు పరిగెత్తాడు.

5

సత్యనారాయణపురంలోని ఒక భవనం ముందు పోలీస్ వాన్, కంట్రోలు కారు ఆగివున్నాయి.

లోపల వేలిముద్రల నిపుణులు, ఫొటోగ్రాఫర్స్ ఎవరి పనిలోవాళ్ళు నిమగ్నులై వున్నారు.

ఇనస్పెక్టర్ నిరంజన్ తలపై కాప్ సవరించుకొంటూ, "మొట్టమొదటగా యీ శవాన్ని చూసి మాకు ఫోన్ చేసిం

దెవరు?'' అడిగాడు.

ఓ నలభై ఏళ్ళ వ్యక్తి ముందుకు వచ్చాడు.

''నేనేనండి. ఎవరో పి. డబ్లు. డి. లో వర్కు చేస్తున్నానని, ఓ ఇల్లు కావాలని నిన్న వచ్చి అడిగాడు. ఇల్లు చూపించాను. అతనికి ఇల్లు నచ్చింది. వెంటనే చేరిపోయాడు. రేపు ఆఫీసులో జీతం తీసుకొని అడ్వాన్స్ ఇస్తానన్నాడు. అందుకని ఇవ్వాళ అడ్వాన్స్ ఇస్తాడేమోనని వెళ్ళాను, తలుపులు తట్టేసరికి తెరచుకొన్నాయి. లోపలకు అడుగుబెట్టిన నాకు యీ శవం కన్పించింది. వెంటనే మీకు ఫోన్ చేశాను'' చెప్పాడు.

నిరంజన్ శవం దగ్గరకు నడిచాడు. శవం నేలమీద బోర్లా పడి వుంది. శవాన్ని వెల్లకిలా తిప్పాడు.

ఆశ్చర్యపోతూ, ''ప్రొఫెసర్ రావూజీ'' మెల్లగా గొణుక్కున్నాడు.

అరగంటలో జరగవలసిన తతంగమంతా జరిగిపోయింది.

శవాన్ని మార్చ్యురీకి పంపి, ప్రొఫెసర్ ఇంటికి బయలుదేరాడు ఇనస్పెక్టర్ నిరంజన్.

ప్రొఫెసర్ మరణవార్తను విన్న భార్యాబిడ్డలు ఒక్కసారిగా గొల్లుమన్నారు. వారికి ధైర్యం చెప్పి లోపలకు నడిచాడు నిరంజన్.

ప్రొఫెసర్ బెడ్ రూంలోకి అడుగుబెట్టిన నిరంజన్ దృష్టి టేబుల్‌పైన వున్న లెటర్ పాడ్‌పై పడింది. గబగబ వెళ్లి, ఆ పాడ్‌ను అందుకొని చదివాడు.

పత్రికా సంపాదకులకు, ఒక విచిత్ర వార్త:—

రాత్రి పన్నెండు గంటలకు ఎవరో ఒక పిచ్చి వ్యక్తి నాకు ఫోన్ చేశాడు. మరో పన్నెండు గంటలలో నన్ను చచ్చిపొమ్మని, లేదా చంపుతానని బెదిరించాడు. నేను మర

ణి స్తే, నా మరణానికి భరణం చెల్లిస్తాడట! నేను కారణ మడిగితే ఏమేమో చెప్పాడు. ఎవరైనా పిచ్చివాడు పిచ్చాసుపత్రి నుండి తప్పించుకున్నాడేమో. ఆసుపత్రి సూపర్నెంటు గమనించగలరు.

ఇట్లు,
ప్రొఫెసర్ రావూజీ.

లెటర్ పాడ్‌లోని ఆ కాగితం చింపి జేబులో పెట్టుకున్నాడు నిరంజన్.

రాత్రి వచ్చిన ఫోన్ కాల్‌కు, యీ హత్యకు సంబంధం వుందా? ఒక్కక్షణం ఆలోచించాడు.

చటుక్కున శవంమీద పడివున్న సరికొత్త వందరూపాయల నోట్లు గుర్తుకు వచ్చాయి.

అయితే ఫోన్ చేసిన వ్యక్తి పిచ్చివాడు కాదన్నమాట! కావాలని ఫోన్‌చేసి చెప్పి మరీ చంపాడు. కానీ మరణానికి భరణం ఏమిటి?

నిరంజన్ సర్వీసులో యిలాంటి హత్య ఎప్పుడూ చూడలేదు. బ్లాక్‌మెయిల్ చేసేవాళ్ళు డబ్బుకోసం హత్యలు చేస్తారు. ఆస్థికోసం దాయాదులు హత్య చేస్తారు. కానీ హత్యచేసి హతునికి వేలసంఖ్యలో డబ్బు యివ్వడం యిదే ప్రథమం.

హంతకుని ఆలోచన ఏమిటి? హతునికి - హంతకునికి గల సంబంధ మేమిటి?

ఇంట్లోవారినందర్నీ ప్రశ్నించాడు. వచ్చిన సమాధానముల వలన ఉపయోగమేమీ కనబడలేదు.

ఇంతలో కారుడ్రైవరు లోపలకు పరిగెత్తుకు వచ్చాడు.

"సార్! కంట్రోల్ రూంనుండి వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది. అర్జంటుగా మీరు కావాలట!" చెప్పాడు.

గబగబ కంట్రోలు కారుదగ్గరకు నడిచాడు. డోర్ తెరిచి లోపల కూర్చుని, రిసీవరు అందుకొని "ఎస్ నిరంజన్ హియర్" అన్నాడు.

కంట్రోలు రూంనుండి ఇన్‌చార్జి గొంతు వినబడుతూంది.

"గుడ్‌మార్నింగ్ సార్! ఇప్పుడే బకింగ్‌హాం పేటనుండి మరోహత్య జరిగిందని రిపోర్టు వచ్చింది సార్."

"హత్యా! మై గాడ్! ఎవరా వ్యక్తి?"

"ప్రముఖ డిటెక్టివ్ రచయిత మూర్తి సార్. అనిబిసెంట్ రోడ్‌లో యిల్లు సార్. ఇప్పుడే ఆ యింటికి యిద్దరు రిజర్వు కానిస్టేబుల్సును పంపిస్తున్నాను."

"అలాగే. నేను వెంటనే అక్కడకు వెళుతున్నాను. వెంటనే వేలిముద్రల నిపుణులకు, ఫొటోగ్రాఫర్సుకుకూడా ఫోన్‌చేసి అక్కడకు పంపించు" వైర్‌లెస్ ఆఫ్ చేశాడు ఇన్‌స్పెక్టర్ నిరంజన్.

నిరంజన్ మెదడు వేడెక్కిపోతూంది. అలాగే కూర్చుండిపోయి డోర్‌ను విసురుగా లాగాడు.

డ్రైవరు ప్రశ్నార్థకంగా నిరంజన్‌వైపు చూశాడు.

"మరో మర్డర్. అనిబిసెంట్ రోడ్‌కు పోనీ" చెప్పాడు నిరంజన్.

మరుక్షణంలో కంట్రోలు కారు వేగంగా కదిలింది.

6

సాయంత్రం ఆరుగంటలయింది. బార్ అండ్ రెస్టారెంట్ 'నందన్' కళకళలాడుతూంది.

అప్పుడే హోటల్ ముందు ఓ ఫియట్ కారు వచ్చి ఆగింది. ఆ కారులోంచి ఓ వ్యక్తి దిగి లోపలకు నడిచాడు. సరాసరి

బార్ లోపలకు నడిచాడు. కాన్ఫిడెన్షియల్ రూం నెంబర్ 7 లోకి వెళ్ళాడు.

ఆ వ్యక్తి పేరు రాజారావు. గెజిటెడ్ ఆఫీసర్. ఆ హోటల్‌కు రెగ్యులర్ కష్టమర్.

రాజారావు రూంలోకి వెళ్ళి కూర్చోగానే, సర్వర్ విస్కీ బాటిల్, షోడా బాటిల్స్. కప్పులు తీసుకువచ్చి టేబుల్‌పై పెట్టి వెళ్ళాడు.

అయిదునిమిషాలు గడిచాయి. అప్పుడే రాజారావు రెండు పెగ్‌లు లాగించాడు. అంతలో ఎవరిదో అడుగుల సవ్వడి వినిపించి తల పైకెత్తాడు.

ఎదురుగా ఒక యువకుడు నిలబడి వున్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మి సర్. రూమ్స్ ఏవీ ఖాళీ లేవు. ఇవ్వాళ నన్ను మీ కంపెనీగా స్వీకరిస్తే కృతజ్ఞుడ్ని" వినయం ఉట్టిపడుతూంది అతని మాటలలో.

"విత్ ప్లెజర్. కమాన్. టేక్ యువర్ సీట్" సాదరంగా ఆహ్వానించాడు రాజారావు.

"నేను ఎలక్ట్రిసిటీ ఆఫీసులో పనిచేస్తున్నాను. కొత్తగా యీ వూరు వచ్చాను. నా పేరు రామ్" తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"నా పేరు రాజారావు. గెజిటెడ్ రాంక్" పెగ్ అందిస్తూ చెప్పాడు.

"థాంక్యూ" కప్పు అందుకొని మరో బాటిల్‌కు ఆర్డరిచ్చాడు రామ్.

ఇద్దరూ మాటల్లో పడ్డారు.

"డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు వున్నాయి. కాపీ సంపాదించడమే కష్టం," రాజారావు చెబుతున్నాడు.

"ఎస్ సార్. బై దిబై మీకు డబ్బు సంపాదించే ఉపాయం ఒకటి చెప్పనా?"

"చెప్పండి!" ఆతృతగా చూశాడు రాజారావు.

"చాలా చిన్నపని. ఒక చిటికలో చేయవచ్చు. ప్రతిఫలం పదివేల రూపాయలు."

"ఈజిట్?" ఆశ్చర్యపోయాడు రాజారావు."చిటికలో చేసే పనికి పదివేలా? ఇంతకూ ఏమిటా పని? అంత డబ్బు యిచ్చే దెవరు?"

"నేనే, అంత డబ్బు యిచ్చేది."

"ఆ పని ఏమిటి?" అడిగాడు రాజారావు, అతనిని ఆశ్చ ర్యంగా చూస్తూ.

"మీరు తప్పకుండా చేస్తానంటే చెబుతాను."

"తప్పకుండా చేస్తాను. ప్రామిస్" మెరుస్తున్న కళ్ళతో అన్నాడు.

"ఇవిగో పదివేలు. డబ్బు ముందుగానే యిస్తున్నాను. తీసు కోండి" చిన్న సూట్ కేస్ అందించాడు రామ్.

టేబుల్పైన ఆ సూట్ కేస్ పెట్టి తెరిచాడు. కళ్ళు జిగేల్ మన్నాయి. అన్నీ సరికొత్త వందరూపాయల నోట్లు.

"ఊ....ఇప్పుడు చెప్పండి" పెట్టి మూసేస్తూ అడిగాడు రాజారావు.

"మీ రు చ చ్చి పో వా లి." ఒకొక్క అక్షరం వత్తి వత్తి పలికాడు రామ్.

నిర్ఘాంతపోయాడు రాజారావు.

"మిష్టర్, ఏమిటా మాటలు?"

"ఎస్, మిష్టర్ రాజారావు! నువ్వు చచ్చిపోవాలి. ఊరికే చచ్చిపోవద్దు. నీకు డబ్బు యిచ్చినది నువ్వు చచ్చిపోవడానికే! నీ మరణానికి మా భరణం పదివేలు!"

"మిష్టర్, పరాసికాలాడుతున్నావు. డబ్బు సంపాదించడానికి ఉపాయం చెబుతానని, యిదా నువ్వు చెప్పేది?" గట్టిగా అడిగాడు రాజారావు.

"ఏం? ఇదిమాత్రం డబ్బు సంపాదించడం కాదా? నువ్వు చచ్చిపోవడం వెరీ సింపుల్. ఇదిగో యీ మాత్ర వేసుకో. చిటికలో చచ్చిపోతావు. ఈ చిన్నపనికి పదివేలు వస్తున్నాయి. చాలవా?"

"మిష్టర్! హాస్యానికికూడా హద్దుంటుంది. నీకు కంపెనీ యివ్వడం నాదే పొరబాటు. ప్లీజ్ గెటవుట్!"

"నో మిష్టర్ రాజారావు! నీ మరణానికి నేను భరణం చెల్లించేశాను. నువ్వు ప్రామిస్ చేశావు, నేను చెప్పిన పని చేస్తానని. క్విక్ ...."

"నో. నేను చావను. చావకపోతే ఏం చేస్తావు?"

"వెరీ సింపుల్. చంపేస్తాను. ఇదిగో, యీ గుండుసూదిలో పవర్‌ఫుల్ పాయిజన్ వుంది. నీ శరీరంలో యిది గ్రుచ్చుకున్న వెంటనే నీ ప్రాణం పోతుంది."

"నేను అరుస్తాను గట్టిగా..." అరవబోయాడు రాజారావు.

"నీకా శ్రమ అక్కరలేదు మిష్టర్ రాజారావు. ప్లీజ్ గో టు హెల్" అంటూ గట్టిగా అతని నోరుమూసి, గుండుసూదిని అతని శరీరంలోకి బలంగా దింపాడు రామ్.

అంతే, కొద్ది సెకన్సులోనే రాజారావు తల టేబుల్‌పై వాలిపోయింది. సూట్‌కేసును పట్టుకొని వున్న అతని కుడిచేయి మరింత బిగుసుకుపోయింది.

నిశ్శబ్దంగా తలుపు తెరచుకొని బయటకు నడిచాడు రామ్.

7

రాత్రి పదిగంటలవుతూంది.

ఇనస్పెక్టర్ నిరంజన్ అప్పుడే భోజనం చేసివచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాడు.

ధన్ హిల్స్ సిగరెట్ వెలిగించి గుండెల నిండుగా పొగ పీల్చి వదిలాడు. అతని మస్తిష్కం వేడెక్కిపోతూంది.

నిరంజన్ సర్వీసులో ఇంతవరకు ఇలాంటి హత్యలు ఎప్పుడూ జరగలేదు. హత్యచేసి మరీ డబ్బు ఇస్తున్న హంతకు డెవరో అర్థం కావడం లేదు.

ఒక్కరోజులో మూడు హత్యలు జరిగాయి. ఉదయం ఆరు గంటలకు ప్రొఫెసర్ హత్య. 9 గంటలకు మూర్తి హత్య. సాయంత్రం 7 గంటలకు రాజారావు హత్య.

అన్నీ మరణానికి భరణం ఇచ్చిన హత్యలే!

టేబుల్ సొరుగులాగి మరణానికి భరణం కేసు తాలూకు ఫైల్ తీశాడు.

ప్రొఫెసర్ ప్రెస్ వాళ్ళకు వ్రాసినదంతా మరోసారి చదివాడు.

మూర్తి కేసు పరిశీలిస్తుంటే, అతని కథలో ఓ చోట నిరంజన్ కళ్లు ఆగిపోయాయి.

అనంతం రామనాధానికి ఫోన్ రింగ్ చేశాడు.

అవతలనుండి రామనాధం ఫోన్ అందుకున్నాడు.

"మిష్టర్ రామనాధం! నువ్వు వెంటనే చచ్చిపోవాలి."

రామనాధం వులిక్కిపడ్డాడు. "మిష్టర్, ఎవర్నువ్? నీకేమైన పిచ్చా?"

"లేదు రామనాధం, పగ! నువ్వు చచ్చిపోయి తీరాలి. లేకపోతే చంపుతాను. పోనీలే, నువ్వు వూరికే చచ్చిపోవద్దు. నీ మరణానికి పదివేలు భరణం చెల్లిస్తాము. ఏమంటావు?" అడిగాడు అనంతం.

—చదవడం ఆపి ఆలోచనలో పడ్డాడు నిరంజన్. అతనికి మూర్తి నెత్తురు మడుగులో దొరికిన పదివేలు గుర్తుకువచ్చాయి.

అయితే ఇద్దరికీ హత్య చేయడానికి ముందే ఫోన్ చేశాడన్న మాట! అయితే ఇద్దరూ యీ విషయాన్ని సిల్లీగా తీసుకొని వుంటారు. కాకపోతే ప్రొఫెసర్ తనకు వచ్చిన ఫోన్ కాల్‌ను విచిత్రంగా తీసుకొని ప్రెస్‌కు పంపిద్దామని వ్రాశాడు. మూర్తి సమయానికి అందిన ఫోన్ కాల్‌ను కథలో కుపయోగించుకున్నాడు.

మరి రాజారావుకు గూడా హంతకుడు ఫోన్ చేశాడా! లేదా?

తీవ్రంగా ఆలోచిస్తున్న నిరంజన్ తత్తరపాటుతో తల పైకెత్తాడు. కానీ అప్పటికే సమయం మించిపోయింది.

"హాండ్సప్ మిష్టర్ నిరంజన్" చిన్న గర్జన వినబడింది. ఎదురుగా నల్లటి రివాల్వర్ పుచ్చుకొని ఒక ఆజానుబాహుడు నిలబడి వున్నాడు.'

"మిష్టర్! ఎవర్నువ్?" తీవ్రంగా ప్రశ్నించాడు నిరంజన్.

చిన్నగా నవ్వాడా వ్యక్తి. "మిష్టర్ నిరంజన్ నాకు నీతో చిన్న పని వచ్చింది. నా పేరు జానకిరామ్."

"నాతో నీకేం పని?" అడిగాడు.

"వెరీ సింపుల్. నువ్వు ఆ పని చేస్తావని అనుకుంటున్నాను."

"ఏమిటా పని?" తీక్షణంగా అడిగాడు.

చిన్నగా నవ్వా డా వ్యక్తి. "మిష్టర్, నిరంజన్! నువ్వు చచ్చిపోవాలి!"

అదిరిపడ్డాడు నిరంజన్.

"వాట్ మాన్! నీకేమన్నా పిచ్చా? అసలు నువ్వు లోపలకు ఎలా వచ్చావు?"

"అదంతా నీకు అనవసరం నిరంజన్. నేను చెప్పినట్లు నువ్వు చచ్చిపోవాలి. నిన్ను వూరికే చచ్చిపొమ్మనడం లేదు. పాతిక వేలు తీసుకొని మరీ చావు."

"మైగాడ్! అయితే నువ్వు....మరణానికి భరణం కేసులో

హంతకుడివన్న మాట! ప్రొఫెసర్, మూర్తి, రాజారావులను చంపిన కర్కోటకుడివి. నీ కన్ను నామీద పడిం దేమిటి?'' ఆశ్చర్యపోతూ అడిగాడు నిరంజన్.

''అవును మిష్టర్ నిరంజన్. నాలిస్టులో చివరివాడివి నువ్వు. నిన్ను చంపితే నా లక్ష్యం నెరవేరినట్లే! నా పగ చల్లారినట్లే!''

''వాట్ మిష్టర్! ఏమిటాపగ? నామీద నువ్వు ఎందుకు పగ బట్టావు?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''నీకు గుర్తు లేదు మిష్టర్. బహుశా, అధికారంతో నీ కళ్లు మూసుకుపోయుంటాయి.''

"ఆల్ రైట్! పోనీ మమ్మలను ఎందుకు చంపాలనుకుంటు న్నావ్?'' తప్పించుకోవడానికి మార్గం వెదుకుతూ అడిగాడు నిరంజన్.

ఒక్క క్షణం గట్టిగా నిట్టూర్చాడు జానకిరామ్.

''మిష్టర్ నిరంజన్, ఇంతవరకు నా గుండెలలో రగులు తున్న బడబాగ్ని నేడు నీ ముందు లావాలా ప్రవహించ బోతూంది. జాగ్రత్తగా వినండి'' చెప్పడం ప్రారంభించాడు:

''పది సంవత్సరాల క్రితం నాకొక అక్కయ్య వుండేది. పేరు అరుణ. బహుశా మీకు గుర్తుండే వుంటుంది. అపురూప మైన అందం ఆమెది. బియ్యే వరకు చదువు చెప్పించాము. అరుణకు యుక్తవయస్సు వచ్చింది. వివాహ సంబంధాలను చూడటం మొదలుపెట్టాము.

మన సంఘం ఎంత కుళ్ళిపోయిందో తెలుసా నిరంజన్, మొలత్రాడు కట్టిన ప్రతి మగవాడూ వేలకువేలు కట్నం అడ గడమే! మేమా బీదవాళ్ళం మా నాన్న బడిపంతులుగా జీవితం సాగిస్తూ బ్రతకలేక బ్రతుకుతున్నాడు.

వచ్చే పెళ్ళికొడుకులకు మా అక్క అందము, చదువు దృష్టి

లోకి రావడంలేదు. ఎంతవరకు, కట్నం పదివేలు యిస్తావా, పదిహేనువేలు యిస్తావా? అని అడగడమే.

మొదటగా ప్రొఫెసర్ రావూజీ మా అక్కాయిని చూడటానికి వచ్చాడు. పిల్ల అణుకువతనం, అందము అన్నీ నచ్చాయి? కానీ అతగాడికి 25 వేలు కట్నం కావాలట! మేము అంత డబ్బు కలలోగూడ చూడలేదు. అలాంటివాళ్ళం అంత కట్నం ఎలా యివ్వగలము?

తరువాత మూర్తి వచ్చాడు. అతను అప్పటికే సంఘంలో కొంచం పేరు తెచ్చుకుంటున్న రచయిత. ఏవేవో ఆదర్శాలంటూ కథలు వ్రాసేవాడు. కానీ అతగాడు అకస్మాత్తుగా తల్లిచాటు బిడ్డ అయిపోయాడు. ఆవిడగారు తన కొడుకుకు 10 వేలు కట్నం కావాలని అడిగింది. ఆ సంబంధం కాన్సిల్ అయింది.

ఇక అరుణకు పెళ్ళిచూపులంటే విరక్తి పుట్టింది. అదంతా ఓ 'తంతు' అనుకుంది.

చివరకు మాకు తెలిసినవాళ్ళు ఒక ఎల్డీసీని తీసుకువచ్చారు. అతనే రాజారావు. అతగాని దాహం 10 వేలని తెలిసింది. 'సరే తరువాత చెబుతామని' చెప్పి పంపేశాము.

స్త్రీకి పెళ్ళి జరగలేదని, వయసుతోబాటు పెరిగే కోరికలు ఆగవు కదా!

నువ్వు ఒక్కసారి గతంలోకి తిరిగి చూసుకో నిరంజన్. అప్పట్లో నువ్వు మా యింటికి ప్రక్కయింట్లో వుండేవాడివి. ఎలాగైతే, మా అక్కయ్యను ఆకర్షించావు.

నీ పైపై మెరుగులు చూసి మోసపోయింది అరుణ. తన సర్వాన్ని నీకు అర్పించింది. ఫలితంగా నీ ప్రతిరూపాన్ని తనలో యిముడ్చుకుంది.

తరువాత నువ్వు మెల్లగా తప్పుకోవాలని చూశావు.

తను తల్లి కాబోతున్నానని, నీ ఇల్లాలుగా చేసుకొమ్మని కాళ్ళావేళ్ళా పడి ప్రతిమిలాడుకుంది. కానీ నువ్వు ససేమిరా వినలేదు.

ఈ విషయం ఇంట్లో తెలిసింది. నాన్న నెత్తీ నోరు బాదుకుంటూ వచ్చి నీ కాళ్ళమీద పడ్డాడు. అప్పుడు నువ్వేమన్నావో గుర్తుందా నిరంజన్!

"పాతికవేలు కట్నమిస్తే అరుణను చేసుకుంటానన్నావు! లేకపోతే నాకేమీ సంబంధం లేదన్నావు!!"

నాన్న గుండె ఆగిపోయి అక్కడే ప్రాణం విడిచాడు. తెల్లవారేసరికి అక్క శవం నూతిలో తేలుతూంది.

అప్పుడు నాకు పదిహేనేళ్ళు. నాలో పగ రేగింది. ఈ వరకట్న పిశాచానికేగా నా అక్క బలి అయింది. అంతే పగ పట్టాను. ఒకొక్కరినీ కాటేస్తూ వచ్చాను. వాళ్ళు ఎంతడబ్బుకు ఆశపడి నా అక్క బలిని కోరారో, అంత డబ్బే ఇచ్చి వాళ్ళను బలి తీసుకున్నాను. ఇప్పుడు నీ వంతు" ముగించాడు జానకిరామ్.

"మిష్టర్, కొందరు వ్యక్తులు ఏవో కొన్ని ఘాతుకాలు చేశారని, చట్టాన్ని మీ చేతులలోకి తీసుకోవడానికి మీకేం అధికారముంది?" అడిగాడు నిరంజన్.

"హుఁ. చట్టం! అధికారం!! నువ్వు సబ్ ఇనస్పెక్టర్‌గా వుండి చేసిన ఘనకార్యమేమిటి? నీతి తప్పిన తరువాత చట్టం లేదు, న్యాయం లేదు. నీకు లేని చట్టం నాకు ఎందుకు?" కర్కశంగా అన్నాడు.

"అలా అనకు జానకిరామ్...." సరిదిద్దబోయాడు.

"మిష్టర్, ఇక మాటలు అనవసరం. నీ చావు ఖాయం. భగవంతుడ్ని తలుచుకో!"

"మిష్టర్ త్వరపడుతున్నావ్!" టేబుల్ సొరుగులో చేయి పెట్టి రివాల్వర్ తీస్తూ అన్నాడు నిరంజన్.

అప్పటికే ఆలశ్యమైపోయింది. జానకిరామ్ చేతిలోని రివాల్వర్ పొగలు గ్రక్కింది.

'సర్' మంటూ రెండు బుల్లెట్లు దూసుకువెళ్ళి నిరంజన్‌ను తాకాయి. చివరి క్షణంలోకూడా కర్తవ్యం వీడని ఇనస్పెక్టర్ గుండెలు పట్టుకొని నేల కూలుతూ, రివాల్వర్‌ను జానకిరామ్ వైపు గురిపెట్టి కాల్చాడు.

ఇనస్పెక్టర్ ఆఖరి గురి వృధా కాలేదు. జానకిరామ్ మెలికలు తిరిగిపోతూ నేలపై ఒరిగిపోయాడు.

రెండు నిమిషాల గాఢ నిశ్శబ్దంలో మృత్యువుతో హోరా హోరీగా పోరాడిన యిరువురూ అలసి సోలిపోయారు.

అప్పుడే కిటికీలోనుండి రివ్వుమంటూ కొట్టిన గాలికి జానకిరామ్ జేబులోనుండి క్రిందపడిన పాతికవేల రూపాయలు నిరంజన్ శవంపై చల్లాచెదురుగా పడ్డాయి. ★

మేష్టారు చైనా పాఠం చెబుతున్నారు.

"చైనా జనసంఖ్య అధికం. అంటే జననాలు, మరణాలు కూడా ఎక్కువేనన్నమాట. మనం ఒక్కసారి గాలిపీల్చి వదిలేసరికి చైనాలో ఒకడు చచ్చిపోతుంటాడు."

ఇంతలో ఒక పిల్లవాడు రొప్పుతూ ఉండటం చూసి, మేష్టారు అడిగాడు.

"ఏమిటది, ఒంట్లో బావులేదా?"

"కాదండీ! చైనావాళ్ళను చంపేస్తున్నాను" అన్నాడా విద్యార్థి.

—పి. విజయసారథి, శ్రీకాకుళం.

పాఠకుల పరిశోధన పోటీ

—రమణశ్రీ

46. రావుగారి చావు!!

(బహుమతి రు. 30 లు నగదు)

కారు దిగి డిటెక్టివ్ ధర్మేంద్ర లోపలకు నడిచాడు.

లోపల విశాలమైన హాలు. దాని మధ్యలో ఒక సోఫా. ఆ సోఫాలో ఒక స్త్రీ కూర్చుని ఏడుస్తున్నది.

దాని కెదురుగా వున్న సోఫాలో ఇద్దరు యువకులు విచారంగా కూర్చున్నారు.

ధర్మేంద్రను చూడగానే ఇనస్పెక్టర్ రంజన్ దగ్గరకువచ్చి చెప్పడం ప్రారంభించాడు:

"నేడు ఉదయం 5-30 గం॥లకు నాకు ఫోన్ వచ్చింది. రావుగారు మరణించారని, వెంటనే రమ్మని చెప్పారు. నేను వచ్చేసరికి తోటలో వున్న బావిలో శవం వుంది. వెంటనే శవాన్ని పైకి తీపి మార్చ్యురీకి పంపించాను. ఇదిగో పోస్టుమార్టం రిపోర్టు" కొన్ని కాగితాలు, ఫొటోలు ధర్మేంద్ర కిచ్చాడు.

పోస్టుమార్టం రిపోర్టు యీ విధంగా వుంది.

ఊపిరి ఆడనందువలన చావు సంభవించింది. శరీరమంతా పరిశీలించగా అనుమానాస్పదంగా ఏమీ లేదు. కడుపులో కొంత జీర్ణంకాని ఆహారపదార్థములు తప్ప ఇంకేమీ లేదు.

ఇద్దరూ కలిసి హతుని బెడ్ రూంలోకి నడిచారు.

గది మధ్యలో ఒక పెద్ద మంచము వుంది. దానిమీద వున్న దుప్పటి, దిండు బాగా నలిగిపోయి వున్నాయి. ఒక మూలగా బీరువా వుంది. మంచము ప్రక్కనే టేబుల్ వుంది. దానిమీద రకరకకాల పుస్తకాలు. ప్రక్కనే గార్డినాల్, కొసావిల్, కోడో పైరిన్ మొదలగు మాత్రల సీసాలు వున్నాయి.

"ఈ గదిలో దొరికినన్ని పాదముద్రలు, వేలి ముద్రలు సేకరించాము. చూడండి." మరికొన్ని కాగితాలు ధర్మేంద్రకు ఇచ్చాడు రంజన్.

గదిలో నేలమీద రావుగారివి, రావుగారి భార్య రాధామణివి, రావుగారి తమ్ముడు రామేశ్వర్‌వి, రావుగారి బావమరిది కామేశ్వర్‌వి పాదముద్రలున్నాయి. మంచము పట్టెమీద రావుగారివి, రాధామణివి వేలిముద్రలు వున్నాయి.

అవన్నీ పరిశీలించి, "పదండి.హాలులోని వారిని కొన్ని ప్రశ్నలడగాలి" అంటూ ముందుకు నడిచాడు ధర్మేంద్ర, రంజన్‌తో.

రాధామణి వద్దకు నడిచాడు. చిన్నగా తలఎత్తి డిటెక్టివ్ ధర్మేంద్ర వైపు చూసింది.

ఆమె కళ్లు ఎర్రగా వున్నాయి.

"శవాన్ని మొదటగా చూపిందెవరు?" అడిగాడు ధర్మేంద్ర.

"తొటమాలి. ఉదయం నీళ్ళు తోడటానికి బావిదగ్గరకు వెళ్ళి బక్కెట్ బావిలో వేసేటప్పటికి, శవం తగిలింది."

"నిన్న ఆఖరుసారిగా రావుగారిని మీరెప్పుడు చూశారు?"

"నిన్న భోజనాలు పూర్తయిన తరువాత ఆయన గది శుభ్రంగా వూడ్చి, ఆయన మంచముమీద దుప్పటి, దిండు మార్చివేసి కొత్తవి వేశాను. తరువాత ఆయనకు ఒక గార్డెనాల్ మాత్ర ఇచ్చి, నేను వచ్చేశాను."

"రాత్రి వారు మీకు ఏదైనా విశేషం చెప్పారా?"

"రాత్రి భోజనాలు చేస్తుండగానే, తను వీలునామా మార్చి నట్లు, ఎవరెవరికి ఎంత ఆస్థి ఇచ్చినట్లు వ్రాసింది చెప్పారు. తర్వాత నాకు మళ్ళీ అదే చెప్పారు."

"వీలునామాలోని వివరాలు నేను తెలుసుకోవచ్చా?"

"ఆఁ, ఆయన తదనంతరం ఒక లక్షరూపాయల ఆస్థి నాకు వస్తుంది. యాభై వేల రూపాయలు నా తమ్ముడు కామేశ్వరానికి వస్తాయి. ఆయన తమ్ముడు రామేశ్వరానికి లక్షరూపాయల ఆస్థి సంక్రమించేటట్లు చేస్తూ, ఆ ఆస్థికి కామేశ్వరాన్ని గార్డియన్‌గా నియమించారు."

"అలా చేయడానికి కారణం?"

"రామేశ్వరానికి అనేక దురలవాట్లు ఉన్నాయని, అతని చేతిలో ఆస్థివుంటే హారతి కర్పూరంలా హరించుకుపోతుందని అలా చేశారు."

ధర్మేంద్ర రామేశ్వర్ వద్దకు నడిచాడు.

"మిష్టర్ రామేశ్వర్! మీ అన్నగారిపై మీ అభిప్రాయం?"

"అన్నయ్య చాలా మంచివాడు. ఒకరకంగా ఆయన ఆత్మ హత్య చేసుకోవడానికి కారణం, నేనే. నేను స్నేహితులవలన బాగా చెడిపోయాను. ఆయనను అనేక విధాల డబ్బుకోసం పీడించేవాడిని."

"మీరు మీ అన్నయ్యగారిని చివరిసారిగా ఎప్పుడు చూశారు?"

"రాత్రి భోజనంచేసిన తరువాత టక్ చేసుకుని సినిమాకు వెళ్ళబోతూ, అనవసరంగా జేబులో ఎక్కువ డబ్బు దేనికని, కొంత డబ్బు అన్నయ్యకు యిద్దామని ఆయన గదిలోకి వెళ్లాను. ఆయన నిద్రపోతుంటే, లేపడం యిష్టంలేక ఆయన తలక్రింద దిండుఎత్తి డబ్బుపెట్టి వచ్చేశాను."

ప్రక్కనే కూర్చునివున్న కామేశ్వరాన్ని "మీరు చివరి సారిగా మీ బావగారిని ఎప్పుడు చూశారు?" అడిగాడు ధర్మేంద్ర.

"రాత్రి అంతా నిద్రపోయిన తరువాత, వీలునామా గురించి బావతో మాట్లాడదామని ఆయన గదిలోకి వెళ్ళాను. బావ గాఢంగా నిద్రపోతున్నాడు. లేపడం యిష్టంలేక బయటకు వచ్చేశాను." చెప్పాడు కామేశ్వర్.

[ఇదీ కథ. దీనిలో రావుగారు హత్య చేయబడ్డారా, ఆత్మహత్య చేసుకున్నారా? ఒకవేళ హత్య చేయబడితే హంతకు లెవరు? సవివరంగా ఒక (పోస్ట్) కార్డుపై వ్రాసి, యీనెల 15 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. కేసుని చక్కగా పరిశోధించినవారి పేర్లను మార్చి '74 నెల సంచికలో ప్రకటిస్తూ, అత్యుత్తమంగా కేసుని నిరూపించిన ముగ్గురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/- లు చొప్పున బహుమతి పంపగలము. తుదినిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్.]

పోటీ నెం. 44 [ఫలితాలు]

హంతకుడు—గోవిందరావ్.

1. గోవిందరావ్ తన సంజాయిషీలో, తాను వాడిపారేసిన సీసాలో క్లోరోఫాం పెట్టి వుండొచ్చునని చెప్పాడు. అటువంటప్పుడు సీసాపై గల అతని వేలిముద్రలు కొంతవరకైనా చెరిగిపోయి వుండాలి. కాని అతని వేలిముద్రలు స్పష్టంగా వున్నాయి సీసాపైన.

2. "మీ వేలిముద్రలు గల సీసా హత్యాప్రదేశంలో దొరికింది"—అన్నాడు ఇన్స్పెక్టర్. అందులో ఏమి వున్నదో చెప్పలేదు. అయితే గోవిందరావుకు ఆ సీసాలో క్లోరోఫాం వున్నట్లు ఎలా తెలుసు?

3. హతుడు వెంకట్రావుది బలిష్టమైన శరీరం. అట్టి బలవంతుని నొక్కిపెట్టి క్లోరోఫాం ఇవ్వగల శక్తి ఒక సామాన్య స్త్రీకి వుండదు. కాబట్టి సత్యవతి నిర్దోషి.

4. శ్రీహరిరావు కాల్చిపారేసిన సిగరెట్ పీక హత్యాప్రదేశంలో వుంది. కాని అది పడవేసినచోట ఏ విధమైన మరకలు లేకుండా నేల చాలా శుభ్రంగా వుంది. అంటే ఎప్పుడో అతను కాల్చిపారేసిన సిగరెట్ పీకను ఎవరో కావాలని తెచ్చి అక్కడ పడవేసినట్లు తెలుస్తున్నది. దానివలన శ్రీహరిరావుకూడా నిర్దోషి అనేది స్పష్టమవుతున్నది.

—పై ఆధారాల మూలంగా కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ముగ్గురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/- లు చొప్పున బహుమతిని యీ నెలాఖరులోగా అందజేయగలము.

(1) శ్రీమతి ఎన్. సావిత్రి, కేరాఫ్—ఎన్. క్రిష్ణారావ్, 28/ఏ, బి. ఎన్. జె. జె. ఎన్. కాలనీ, వాల్తేరు.

(2) శ్రీ జి. లక్ష్మరెడ్డి, (టీచర్) 5-83, ఉప్పరివాడ వీధి, కల్వకుర్తి (మహబూబ్‌నగర్ జిల్లా).

(3) శ్రీ జె. వి. బి. నాగేశ్వరరావు, (బి. ఎస్‌సి.) కేరాఫ్—జె. లలిత, 65/26-ఏ, న్యూ రోడ్, నరసన్న నగర్, కాకినాడ-3.

కేసుని సక్రమంగా పరిశోధించిన ఇతర పాఠకులు:

1. సి. దాక్షాయణి, విజయవాడ. 2. పెనుబోతు ధర్మారావు, మచిలీపట్టణం. 3. మిస్. మధుబాల, విజయవాడ. 4 ఎన్. సుధాకర్, మదనపల్లి. 5. విమలామెల్కొారు, మద్రాసు. 6. డి. యస్. రాజు, కంటబాంజి. 7. పమిడిమర్తి వెంకటరమణ, విజయవాడ. 8. జి. శ్రీహరి, క్రాప. 9. ఆర్. లక్ష్మయ్య, గోల్కొండ. 10. ఎస్.ఎల్. ఉమాదేవి, ప్రొద్దుటూరు.

11. పి. మైథిలి, ఆకివీడు. 12. డాక్టరు ఐ. ఎస్. మూర్తి, హైద్రాబాద్. 13. కె. ఎస్. నారాయణ, తిరుపతి. 14. డి. నిర్మలాదేవి, విద్యానగర్. 15. ఎన్. నాగేశ్వరరావు, యలమంచిలి. 16. పి. యం. మూర్తి, బొంబాయి. 17. సి. హెచ్.

దామోదరరావు, విజయవాడ. 18. ఎస్.సత్యనారాయణ, సదాశివ నగర్. 16.డి.యాదయ్య,సికింద్రాబాదు. 20.ఐ.కమల,బేగంపేట.

21. పి. త్రివేణిబాయి, హిమాయత్ నగర్. 22. ఎస్. సుల్తాన్ మొహిద్దీన్, గుంతకల్. 23. పి. ప్రభాకరరావు, రామాజిపల్లి. 24. యు. నాగరాజరావు, ఆలూరు. 25. టి. రాంచందర్‌రావు, తడకమల్లి. 26. బాదంపూడి గణేశ్వరరావు, విశాఖపట్టణం. 27. ఏ. శ్రీరంగం, గుంతకల్. 28. మిస్. కోహినూర్, గుంటూరు. 29. టి. వి. గోపినాథ్, విశాఖపట్టణం. 30. జి. రఘురాంరెడ్డి, గౌలీగూడ.

31. కడియాల విజయలక్ష్మి, విజయవాడ. 32. సి. స్వరాజ్యలక్ష్మి, గుడివాడ. 33. లలితారెడ్డి, కల్వకుర్తి. 34. పి. రత్నకుమారి, ఆకివీడు. 35. వి. సౌందర్‌రాజన్, తాడేపల్లిగూడెం. 36. టి. బుచ్చయ్య, నల్లకుంట. 37. ఎల్. వీరారెడ్డి, కొడంగల్. 38. బి. రాఘవరావు. మారేడుపాక. 39. జోకర్, గుడివాడ. 40. మువ్వా కాశేశ్వరరావు, కడప.

41. మట్టేరాజా. ఏలేశ్వరం. 42. కుమారి మీనా, కాకినాడ. 43. కురుమద్దాలి విజయలక్ష్మి, విజయవాడ. 44. జె. విజయకుమార్, మానూరు. 45. కాశీ అనంతలక్ష్మి, విశాఖపట్టణం. 46. ఎమ్. మధుబాబు, నెల్లూరు. 47. ఏ. వి. సుకుమార్, తిరుపతి. 48. టి. మహమ్మద్ యూసఫ్, ప్రొద్దుటూరు. 49. సి. సురేందర్‌బాబు, సికింద్రాబాదు. 50. సందా వెంకటరమణ, కడప.

51. ఆర్. అప్పలాచారి, హైద్రాబాద్. 52. పీసపాటి నవనీతం, కటక్. 53. కోకా అన్నపూర్ణ, ఖైరతాబాద్. 54. పెంటకోట సోమినాయుడు, ఎలమంచిలి. 55. బి. నసీర్‌ఖాన్, ప్రొద్దుటూరు. 56. విజయకుమార్, పెద్దపల్లి. 57. పి. ఎల్. నాగేశ్వరరావు, నెల్లూరు. 58. నీలం రామమూర్తి, కోరాపుట్. 59.సి.రామకృష్ణ,నెల్లూరు. 60.పి.జగ్గారావు, నారాయణపురం. ★

చిరునవ్వు పకోడీలు

అందమైన అమ్మాయి.

తెల్ల ఫుల్‌వాయిల్ చీరె, సన్న బోర్డర్ నల్ల రవికె, చేతులకు సింపిల్‌గా రెండే రెండు గాజులు. రిస్టువాచీ, మెళ్లో సన్నని గొలుసు, గుండ్రటి ముఖం. మెరిసే కళ్లు. నవ్వే పెదిమలు.

ఓ క్షణం ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాను.

ఎందుకోగాని ఆ మెటిసేకళ్ళు ఎర్రబడి వున్నాయి. ఆ నవ్వే పెదిమలు బిగుతుగా నవ్వగూడదంటున్నాయి. నవ్వుతూ చూశాను ఆమె వంక.

"మే ఐ హెల్పియు మేమ్" అన్నాను అందమైన అమ్మాయిలకోసం ప్రత్యేకించిన నా నవ్వు పెదిమల మీదికి తెచ్చుకొంటూ.

ఆమె ఓ క్షణం నా వంక సందేహిస్తూ నిలబడిపోయింది చూస్తూ. "డిటెక్టివ్ సిన్హాగార్ని కలుసుకోవాలి" అన్నది.

"దయచేసి కూర్చోండి. మీ పేరు?"

"సుజాత. సిన్హాగార్ని వెంటనే కలుసుకోవాలి."

"ష్యూర్. ఒక్క నిముషం. ఆయన బిజీగా వున్నారేమో చూసి వస్తాను" అన్నాను సిన్హాగారి కన్‌సల్టింగ్ రూమ్‌లోకి నడుస్తూ.

గది మధ్య సీలింగ్‌ఫాన్ క్రింద రివాల్వింగ్ చైర్లో సిన్హాగారు విశ్రాంతిగా 'మొరాకో' కాలుస్తూ 'క్రైమ్‌ఫాక్ట్స్' మాగజైన్ చదువుకొంటున్నారు.

నేను లోపలకు రావడం చూసి నోట్లో చుట్ట తియ్యకుండా పళ్ళమధ్య బిగించి సాదరంగా నవ్వారు.

"శ్యామ్! ఆ అమ్మాయిని వెంటనే లోపలకు పంపించు" అన్నారు గంభీరంగా.

నేను ఆశ్చర్యంగా సిన్హాగారి వంక చూశాను.

"ఆశ్చర్యపడడం నీకు అలవాటయిపోయింది. ఆశ్చర్య పడకు. ఆలోచించు. ఉదయాన్నే నీ ముఖం దివిటీలా వెలిగి పోవడానికి కారణం ఊహించగలను" అన్నారు సిన్హా చేతిలో పుస్తకాన్ని జాగ్రత్తగా మడిచి సొరుగులో పెడుతూ.

నేను తిరిగి సుజాతను లోపలకు తెచ్చేప్పటికి తాపీగా ఫైల్సు తిరగేస్తున్నారు.

"వీరు సుజాత. మిమ్మల్ని అర్జెంట్‌గా కలుసుకోవాలని వచ్చారు" అన్నాను.

"కూర్చోమ్మా!"

సుజాత సిన్హాగారి కెదురుగా వున్న కుషన్ చైర్లో పొందికగా కూర్చొంది.

సిన్హాగారు నా వైపు అర్థవంతంగా చూశారు. నేను లోప లికి కెళ్ళి మరునిముషంలో మూడు కప్పుల కాఫీతో బయటి కొచ్చాను.

సుజాత నిశ్శబ్దంగా ఆయన వంకే చూస్తూ కూర్చొంది. నేను వాళ్ళిద్దరికీ చెరో కప్పు ఇచ్చాను.

సుజాత నా వంక కృతజ్ఞతగా చూసింది. నేను తృప్తిగా నా కాఫీ సిప్‌చేయసాగాను.

సిన్హాగారు కాఫీ త్రాగడం పూర్తిచేసి, మరో మొరాకో వెలి గించి సాదరంగా ఆమె వైపు చూశారు.

"అమ్మాయ్! విషయం ఏమిటో సందేహించకుండా చెప్పు" అన్నారు.

సుజాత ఒక్కక్షణం ఆలోచించి గొంతు సవరించుకొని చెప్పసాగింది:

"మూడ్రోజుల క్రితం మా నాన్నగారు మరణించినట్లు తెలు పుతూ, నన్ను వెంటనే బయలుదేరి రమ్మని నాకు టెలిగ్రామ్

మీకు తెలుసా ?

1. 1969లో 'జాన్ మాసిన్' అనే బెల్జియం దేశ స్తుడు 40 టన్నుల బరువుగల రైలుబండిని తన నోటి పళ్ళతో లాగాడు.

2. తపాల పద్ధతిని గురించి మొదట 1840లో గ్రేట్ బ్రిటన్ దేశస్తులు కనుగొన్నారు.

3. మన శరీరంలో అన్నిటికన్నా ఎక్కువ బరువు కన్ను వుంటుంది.

4. ప్రఖ్యాత సినీనటి ఎలజబెత్ టేలర్ 'క్లియో పాత్ర'లో నటించడానికి 70,00,000 డాలర్స్ తీసు కొన్నది.

5. ఒక ప్యాసింజర్ ప్లేన్ 1961లో గంటకు 675 మైళ్ళ వేగముతో ప్రయాణించేది.

6. జపాన్ దేశంలో 1594 అడుగుల పొడవు, 1000 అడుగుల ఎత్తు 150 అడుగుల వెడల్పు వున్న 'గోపురము' నిర్మించబడింది.

7. రష్యాలోని ఒక కొండపై 270 అడుగుల ఎత్తు గల నగ్న 'స్త్రీ' విగ్రహాన్ని నెలకొల్పారు. ఆ ప్రదే శానికి 'మదర్‌లాండ్' అని నామకరణం చేశారు.

—కె. చందర్‌రావు.

వచ్చింది. నేను సాగర్ యూనివర్సిటీలో యమ్మెస్సీ చదువు తున్నాను. అక్కడినుండి ఇక్కడకు రావడానికి మామూలుగా ఇరవై నాలుగ్గంటలపైనే పడుతుంది ప్రయాణం. రైల్వే ఎంప్లాయిస్ స్ట్రైక్ మూలంగా ఆ ప్రయాణం మరింత ఆలస్యం అయి నిన్న సాయంత్రానికి ఇక్కడకు చేరాను. నేను వచ్చేప్పటికే నాన్నగారి దహనక్రియలు కూడా జరిగిపోయాయి. కనీసం చివరి చూపుగూడా నోచుకోలేదు నేను.''

ఆమె చెపుతున్నదంతా గందరగోళంగా వుంది. ఆమె నాన్నగారెవరో, ఆయనెందుకు చనిపోయారో, ఇదంతా దేనికి చెపుతోందో అర్థంకావడంలేదు నాకు.

అయినా క్లయింట్ మాట్లాడుతున్నప్పుడు అనుమానాలు దాచుకొని శ్రద్ధగా వినమన్న సిన్హాగారి హితోపదేశం గుర్తుకొచ్చి శ్రద్ధగా ఆమె ముఖాన్నే చూస్తూ కూర్చున్నాను.

''....మా నాన్నగారి పేరు మాధవరావు. ఒకప్పుడు షేర్ బ్రోకర్‌గా వుండేవారు. దాదాపు రెండు లక్షల ఆస్థి సంపాయించారు. వయసు పైబడ్డాక వ్యాపారం మానేసి ఇంట్లోనే విశ్రాంతిగా కాలం గడుపుతున్నారు. మా అమ్మ నాకు అయిదోఏడు నడుస్తున్నప్పుడు కలరా తగిలి చనిపోయింది. ఆ తర్వాత నాన్నగారు రెండేళ్ళ తర్వాత తన ఆఫీసులో పనిచేస్తున్న మీనాక్షి అనే ఆవిణ్ణి పెళ్ళిచేసుకొన్నారు. అంటే మీనాక్షి నాకు పిన్ని అన్న మాట. ఆవిడకు నాన్నగారికి దాదాపు పదిహేనేళ్ళయినా తేడా వుంటుంది.ఆవిణ్ణి పెళ్ళి చేసుకొన్నా. నాన్నగారికి నా మీద ప్రేమ తగ్గలేదు. నన్ను ఎప్పటిలాగానే ప్రేమగా చూసుకొనేవారు. కాని హఠాత్తుగా ఇప్పుడే ఘోరం జరిగిపోయింది.''

సుజాత హఠాత్తుగా వెక్కివెక్కి ఏడవసాగింది. నా గుండెల్ని ఎవరో పిండుతున్నట్లనిపించింది.

"టేకిట్ ఈజీ మై బేబీ, టేకిట్ ఈజీ" అన్నారు సిన్హాగారు అనునయంగా.

ఆమె చటుక్కున ఏడ్వడం ఆపి సిన్హాగారి వైపు చూసింది.

"సిన్హాజీ! నాన్నగారు గుండెపోటువల్ల మరణించారని మా ఫ్యామిలీ డాక్టరు, మీనాక్షీ, నాన్నగారి మిత్రులు అంటున్నారు. కాని డిటెక్టివ్ సాబ్! నాన్నగారి చావు సహజమైంది కాదని నా కనిపిస్తోంది. ఎంత గుండె జబ్బువున్నా, ఆయనెప్పుడూ ఎంతో ఉల్లాసంగా వుండేవారు. ఆ గుండె జబ్బుకూడా ప్రమాదకర మైంది కాదని, బలహీనత వలన వచ్చిందనీ డాక్టరు చెప్పాడు. వారి మరణం సహజమైనది అంటే నేను నమ్మలేను. దీని వెనుక ఏదో కుట్రవుంది. ఇది హత్య. సిన్హాజీ! దయచేసి మీరు ఈ కేసు పరిశోధించండి. నాన్నను చంపిన అపరాధిని పట్టి శిక్షించండి" అందామె తీవ్రంగా.

సిన్హాగారు చిరునవ్వు నవ్వి, సానుభూతితో తల పంకించారు. "అమ్మాయ్! మాధవరావుని చంపడం వలన లాభించే దెవరు?" అన్నారు.

నేను సిన్హాగారి వంక విభ్రమంగా చూశాను.

ప్రొఫెషనల్‌కూ, అమెచ్యూర్‌కూ తేడా ఇక్కడే వుంది. ప్రొఫెషనల్ డిటెక్టివ్ కథలో అసలు పాయింట్‌కు కళ్ళు మూసుకొని నడిచి ఒచ్చేస్తాడు. సుజాత ఇందాకణ్ణుంచి హత్య జరిగింది అంటుంది కాని, కారణమేమిటి అనే విషయం చెప్పలేదు అనే విషయం నా కింతవరకూ తట్టలేదు.

"నాన్నగారు చనిపోతే లాభం పొందే వాళ్ళం ముగ్గురే వున్నాం. నేను, మీనాక్షి, మీనాక్షి ప్రియుడు" అన్నది సుజాత.

ఆమె పదే పదే పిన్నిని మీనాక్షి అని పేరుతో ఉచ్చరించడం వలన మీనాక్షంటే ఆమెకు గౌరవంలేదనే విషయం స్పష్టమౌతోంది.

"మీ నాన్నగారు వీలునామా వ్రాశారా?" అడిగాన్నేను.

సుజాత అవునన్నట్లు తలాడించింది.

"నాన్నగారు మీనాక్షిని పెళ్ళి చేసుకొన్న సంవత్సరమే వీలునామా వ్రాశారు. దాని ప్రకారం ఆస్థిని రెండు భాగాలు చేసి ఓ భాగం నాకు, రెండవభాగం మీనాక్షికి, ఆమెకు పుట్టబోయే పిల్లలకు తన తదనంతరం చెందాలని వ్రాశారు. కాని మళ్ళీ నాన్నగారికి పిల్లలు కలుగలేదు. అంటే నాన్నగారు పోవడం వలన మీనాక్షికి దాదాపు లక్షరూపాయల ఆస్థి వస్తుంది."

పిన్నాగారు సాలోచనగా తల పంకించారు. "అయితే ఈ మూడో వ్యక్తి ఎవరు?"

సుజాత పిన్నాగారి వైపు ఒక్కక్షణం బేలగా చూసింది.

"సుబ్రమణ్యం. అతని పేరది. నాన్నగారికి మంచి మిత్రుడు. మీనాక్షికి, అతనికి ఎలా పరిచయం మొదలయిందో నాకు తెలియదు. బహుశా నాన్నగార్ని కలుసుకోవడానికి వస్తున్నప్పుడే అయ్యుండాలి. మీనాక్షికి, నాన్నగారికీ వేరు వేరు పడక గదులుండేవి. నేను ఇక్కడ వున్నప్పుడే అతను రాత్రులు మీనాక్షి గదిలోంచి బయటికి వెళ్ళడం చాలాసార్లు చూశాను. ఒకసారి మీనాక్షిని నిలదీసి అడిగాను కూడా. తనింట్లో తన ఇష్టం వచ్చినట్లు వుంటాను, నాకు అనవసరం అన్నది. నాన్నగారికి ఈ విషయం చెప్పాలా వద్దా అని నేను చాలా ఆలోచించాను. ముసలితనంలో ఆయనను వ్యధపెట్టడం ఇష్టంలేక ఊరుకొన్నాను."

నేను చిన్నగా దగ్గాను. "అడుగుతున్నందుకు క్షమించండి. ఎంత వేరు వేరు గదుల్లో పడుకొన్నా తన ఇంటికి రాత్రులు ఎవరో పరాయి వ్యక్తి వస్తున్నట్లు మీ నాన్నగారు గ్రహించలేదంటే ఆశ్చర్యంగా వుంది. మీ నాన్నగారు బాగా మొద్దు నిద్దర పోతారా?"

సుజాత నా వైపు చురుగ్గా చూపింది.

"లేదు. మీనాక్షి మీద నాన్నగారికి ఏ అనుమానం లేదు. కళ్ళతో చూసేవరకూ నేనూ ఎప్పుడూ అనుమానించలేదు. కాని నాన్నగారికి అప్పుడప్పుడూ నిద్రమాత్రలు వేసుకొనే అలవాటు వుంది. అదీగాక నాన్నగారు బిజినెస్ చేస్తున్న రోజుల్లో ఒకో సారి వారం పదిరోజులు కాంప్‌లో వుండిపోయేవారు?"

సిన్హాగారు అర్థమయినట్లు తల వూపారు.

"ఇంట్లో సర్వెంట్స్‌కి ఈ విషయం తెలుసా?"

"పనివాళ్ళను ఏ రకంగా చెప్పుచేతల్లో వుంచుకోవాలో మీనాక్షికి బాగా తెలుసు."

సిన్హాగారు మొరాకో పొగపీలుస్తూ ఆలోచనలో వుండి పోయారు.

ఆయన ఏ మాలోచిస్తున్నారో ఊహించగలను. శవంలేదు. హత్యా ప్రదేశం లేదు. అసలు హత్యో కాదో తెలుసుకొనే ఆధారంలేదు. శవపరీక్ష లేదు. డాక్టర్ రిపోర్ట్ లేదు. కేవలం సుజాతకు, మీనాక్షి మీద వున్న అనుమానం వలన ఆమెను హంతకురాలుగా చట్టం ఎదుట నిలబెట్టమంటే ఎలా?

నేను సుజాతవైపు వెర్రివాళ్ళా చూస్తూ కూర్చుండిపోయాను.

సిన్హాగారు మొరాకో ఆష్ట్రేలో ఆర్పేసి సుజాతవైపు సూటిగా చూశారు.

"అమ్మాయ్! మీ నాన్న నిజంగా హత్య చెయ్యబడ్డాడో, సహజంగా మరణించాడో కనుక్కోవడం చాలా కష్టం. దాదాపు అసంభవం. మీనాక్షికి, సుబ్రమణ్యంతో అక్రమ సంబంధం వుండడంవలన, మీ నాన్న చచ్చిపోతే ఆస్తంతా అతన్తో కలసి అనుభవించొచ్చని, మీనాక్షి హత్య చేసి వుండొచ్చు అనేది కేవలం ఒక ఊహమాత్రమే. అదే నిజమనీ, అబద్ధమనీ తేల్చ డానికి మీ నాన్న శవంకానీ, కనీసం హత్య చెయ్యబడ్డారు అన

డానికి సరైన ఆధారం అంటే హత్యాయుధంకాని, విషప్రయోగం చేసిన సూచనలుగాని లేవు.

"కాని నిన్ను చూస్తే నాకెందుకో జాలేస్తోంది. ప్రస్తుతం నాకు అర్జెంట్ కేసులు కూడా లేవు. మీనాన్న హత్య చెయ్యబడకపోతే, అతని మరణం సహజమైందే అని అయినా నిరూపించి నీకు తృప్తి కలిగేట్లు చేస్తాను. ఒకవేళ నిజంగా హత్యే అయితే దొంగలు తప్పించుకోలేరు. ఏదో ఒక పొరపాటు చెయ్యక మానరు. వాళ్లని పట్టుకొని తీరతాను" అన్నారు.

2

"మాధవరావు ఎలా చనిపోయాడో తెలుసుకోవడం మన పరిశోధనకు చాలా అవసరం"

అన్నారు సిన్హాగారు కారులో ఎక్కి కూర్చొంటూ.

నేను తల ఊపి కారు స్టార్ట్ చేశాను. మాధవరావు డెత్ సర్టిఫికేట్ మీద సంతకం చేసిన వాళ్ళఫ్యామిలీ డాక్టర్ ఇంటి వైపు కారు పోనిచ్చాను.

ఆ రోజు ఆదివారం. క్లినిక్‌కు శెలవు కావడం వలన డాక్టర్ శిఖామణి ఇంటిముందు లాన్‌లో ట్రేన్సిస్టర్ పాటలు వింటూ విశ్రాంతి తీసుకొంటున్నాడు. నేను పరిచయాలు పూర్తి చెయ్యగానే మావంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఆశ్చర్యం! మాధవరావుగారి చావు గురించి మీకు ఇంట్రస్టు కలగడానికి కారణమేమిటో అర్థం కావడం లేదు" అన్నాడు విభ్రమంగా శిఖామణి.

సిన్హా కులాసాగా నవ్వారు.

"సింపిల్ డాక్టర్! మాధవరావు కూతురు సుజాతకు అది సహజమైన మరణం కాదేమోనని అనుమానంగా వుంది. అఫ్ కోర్స్! అది హత్య అని నిరూపించే సాక్ష్యం ఏమీ లేదనుకోండి.

కనీసం హత్యకాదు అనయినా ఆ అమ్మాయికి నిరూపించాలని నా తాపత్రయం.''

డాక్టర్ శిఖామణి విచిత్రంగా భుజా లెగరేశాడు.

''సుజాతకు నేను నిన్నే చెప్పాను. మాధవరావుగారి మరణంలో అసహజత ఏమీ లేదని. ఓ. కె. మీ అనుమానా లేమిటో అడగండి,'' అన్నాడు.

సిన్హాగారు కోటు జేబులోంచి 'మొరాకో' తీసి వెలిగించి పొగ పీలుస్తూ నిశ్శబ్దంగా అతని వైపు ఓ క్షణం చూశారు.

''మాధవరావు ఎలా చనిపోయాడో వివరంగా చెప్పండి'' అన్నారు.

డాక్టర్ శిఖామణి సిగరెట్ టిన్ తెరచి నాకోటి ఆఫర్ చేశాడు. నేను వద్దన్నట్లు తలాడించి నా సిగరెట్ వెలిగించుకొన్నాను.

అతనూ సిగరెట్ వెలిగించి చెప్పసాగాడు:

''బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు క్లినిక్‌లో నా ప్రైవేట్ రూమ్‌లో రెస్టు తీసుకొంటుండగా మాధవరావుగారికి ఒంట్లో బాగానలతగా వుందని, విపరీతమైన, గుండెనొప్పి కడుపునొప్పితో బాధపడుతున్నారని వెంటనే రమ్మని మాధవ రావుగారి భార్య మీనాక్షి నాకు ఫోన్ చేసింది. నేను వెంటనే మాధవరావుగా రింటికి వెళ్ళాను.

ఇక్కడ ఒక విషయం మీకు ముఖ్యంగా చెప్పాలి.

మాధవరావుగారు చూపులకు చిన్న సైజు మనిషిలా కనిపించినా, ఆయన తిండి సైజు మాత్రం పెద్దదే. ఎంత తిన్నా ఆయనకు ఎప్పుడూ ఏదో ఒక జబ్బువచ్చి మనిషి మాత్రం బలహీనంగా కనిపించేవాడు. అప్పుడప్పుడూ మైల్డ్ హార్ట్ ఎటాక్ వచ్చేది. ఇది కాకుండా ఆయన ఎప్పుడూ అజీర్ణంతో బాధపడు

తుండేవాడు. దీనికి తోడు షుగర్ కంప్లెయింట్ వుంది. తీపి పదార్థాలు, కొవ్వుపదార్థాలు, అజీర్ణంచేసే వస్తువులు ముట్టుకో వద్దని ఆయనకు ఎన్నిసార్లో చెప్పాను. చెప్పిన రెండు మూడు రోజులు మామూలుగా డైట్ తీసుకొనేవారు. మర్నాటినుండి మామూలే.

మాధవరావు అప్పటికి రెండ్రోజుల నుంచి డయోరియాతో బాధపడుతున్నారు. ఆ రోజే కాస్త విరోచనాలు కట్టుబడినయ్. వెంటనే జీడిపప్పు పకోడీలు చెయ్యమని వంటవాడికి పురమా యించారట. వద్దని ఆయన భార్య ఎంత చెప్పినా వినకుండా పకోడీలు తినే వరకూ కదల్నని డైనింగ్ హాల్లోనే తిష్ట వేసుకు కూర్చున్నాడట.

రెండు గంటలప్పుడు, పకోడీలు తిని తన గదికి వెళ్ళి పడు కొన్నారు. ఆ తర్వాత ఓ గంటకు, కడుపునొప్పి, గుండెమంట అంటూ హడావిడి చెయ్యడం మొదలెట్టారట. వెంటనే వాంతులు అవడం ప్రారంభమయినాయట. ఒక వాంతి కాగానే స్పృహ తప్పి పడిపోయారు.

నేను మాధవరావు గారింటి కెళ్ళేప్పటికి అప్పుడే తెలివి వచ్చివుంది. నేను వెంటనే విషయం తెలుసుకొని చకచకా కోలుకోవడానికి ఇంజక్షన్ చేసి, నా కార్లోనే క్లినిక్ కు తీసు కొచ్చాను" శిఖామణి ఓ క్షణం ఆగాడు.

నేను సిన్హాగారి వంక చూశాను. ఆయన రెండు కళ్ళూ మూసుకొని తృప్తిగా 'మొరాకో' పీలుస్తూ డాక్టర్ శిఖామణి కథనం వింటున్నారు.

"సాయంత్రానికి మాధవరావుగారి పరిస్థితి మెరుగైంది. కడుపు నొప్పి దాదాపు తగ్గిపోయింది. ఇహ ఇంటికి పంపిం చేద్దామను కొంటుండగా హఠాత్తుగా గుండె నొప్పి మొంచు

కొచ్చింది. ఇది వరకెప్పుడూ అంత వుధృతంగా ఆయనకు గుండె నెప్పి రాలేదు. నేను నెప్పి తగ్గడానికి ఇంజెక్షన్ చేస్తుండ గానే ఆయన ప్రాణం పోయింది. హార్ట్ఎటాక్, లోబ్లెడ్ ప్రషర్, అంతా నిముషాల్లో అయిపోయింది. ఇందులో అనుమానిం చాల్సిన దేమీ లేదు. నేనే డెత్ సర్టిఫికేట్ ఇచ్చాను.''

డాక్టర్ శిఖామణి చెప్పడం ముగించి సగంలో ఆరిపోయిన సిగరెట్ తిరిగి వెలిగించాడు.

''అయితే మాధవరావుకు కడుపునొప్పి, వాంతులు ఎందు కయినవంటారు?'' అడిగాను.

శిఖామణి నా వంక విసుగ్గా చూశాడు.

''మాధవరావుగారు డయోరియానుండి ఆ రోజే కోలుకొన్నా రని చెప్పాను. ఎంత బలమైన జీర్ణకోశం వున్న మనిషయినా, వెంటనే జీడిపప్పు తింటే అరగదు. అందులో జీడిపప్పు త్వరగా జీర్ణమయ్యే పదార్థం కాదు. అంచేత రిపల్షన్ వల్ల వాంతులు, విరేచనాలు అయినాయి. చావుకు కారణం అవికావు. అసలే గుండెజబ్బు, షుగర్ కంప్లెయింట్ వున్న మనిషి, ఈ ట్రబుల్స్ వల్ల మరీ వీక్ అయి లోబ్లడ్ప్రషర్, తద్వారా గుండెపోటు వచ్చాయి. ఒకరకంగా ఆయన చావుకు ఆయనే కారణం అని చెప్పుకోవాలి''—అన్నాడు ట్రాన్సిస్టర్ ఆన్ చేస్తూ.

సిన్హాగారు లేచి నిలబడ్డారు.

''థాంక్స్ డాక్టర్! మళ్ళీ అడుగుతున్నందుకు ఏమీ అనుకో నంటే రెండు ప్రశ్నలు వేస్తాను'' అన్నారు.

''ష్యూర్! అడగండి'' అన్నాడు డాక్టర్ శిఖామణి.

''మాధవరావుగారే జీడిపప్పు పకోడీలు చెయ్యమని పట్టు పట్టారని చెప్పిం దెవరు?''

''ఆయన భార్య! మీనాక్షి!''

సిన్హాగారు తల పంకించారు. "రెండు. మాధవరావు మరణా నికి కారణం గుండెనెప్పేనని నిశ్చయంగా చెప్పగలరా?"

"వాటీజ్ దిస్ నాన్సెన్స్! అదే కారణం" అన్నాడు శిఖామణి కోపంగా.

సిన్హాగారు నవ్వుతూ గేటువైపు నడిచారు.

"మాధవరావు ఇంటికి పోనియ్!" అన్నారు వెనకసీట్లో ఎక్కికూర్చొని హుందాగా.

3

మాధవరావు ఇల్లు బాగా విశాలంగా వున్న స్థలంలో అందంగా కట్టబడి వుంది. రెండంతస్థుల మేడ.

ఇంటిముందు కారాపి ప్రహరీగోడ గేటు తెరుచుకొని లోప లకు నడిచాము.

ఇంటికీ, ప్రహరీకి మధ్య చిన్నసైజు గార్డెన్ వుంది. ప్రహరీ ప్రక్కనే క్రోటన్స్, పచ్చగన్నేరు, విక్రమానియాలు గుబుర్లుగా పెరిగివున్నాయి. ఇంటికి ఆనుకొన్న వరుసలో ఓ ప్రక్క మల్లె తీగె, గులాబీలు, దిల్‌బహార్, నైట్‌క్వీన్ కనిపిస్తున్నాయి. వరండా ముందు బోగన్‌విల్లా గుత్తులు ఎర్రటి తోరణాలు కట్టినయ్.

మేము లోపలకు అడుగుపెట్టగానే వరండాలో కూర్చున్న నౌకరు మా వంక ప్రశ్నార్థకంగా చూశాడు. "సుజాతగారు కావాలి!" అన్నాను నేను హుందాగా.

అతను మాకు కూర్చోవడానికి సోఫా చూపెట్టి సుజాతను పిలవడానికి మేడపైకి వెళ్ళాడు.

"మనం ఏదైనా చెయ్యబోయే ముందు ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్‌కు తెలియజేయడం మంచిదేమో" అన్నాను.

సిన్హాగారు నా వంక చిత్రంగా చూశారు. "డాక్టర్ శిఖామణి

క్వాలిఫైడ్ డాక్టర్. అతను సాక్ష్యం చెప్పిన తరువాత ఇక మనం అనుమానించాల్సింది ఏమీ లేదనుకొంటాను. ఇక్కడకు రావడంలో ఉద్దేశ్యం మనకు తెలిసిన విషయాలు నిజమో, కాదో తేల్చుకోవడం కోసమే.''

సుజాత మేడ దిగివచ్చింది.

''అమ్మాయ్! పిన్ని ఇంట్లో వుందా?'' అడిగారు సిన్హాగారు.

''మేడమీద తనగదిలో వుంది'' అన్నది సుజాత.

''మమ్మల్ని ఆవిడకు పరిచయం చెయ్యి. రెండు ప్రశ్నలడగాలి'' అన్నారు సిన్హాగారు.

''ఆవిడ మీతో సహకరిస్తుందనుకోను.''

''అమ్మాయ్! నిర్దోషులు భయపడాల్సిన అవుసరంలేదు.''

మీనాక్షిని చూశాక, భార్య పోయినా ముసలితనంలో మాధవ రావు ఆవిడ్ని ఎందుకు పెళ్ళాడాడో అర్థమయింది.

నిజం చెప్పుకోవాలంటే సుజాత వయసులోవున్నా, మీనాక్షి ఆకర్షణ ముందు దిగదుడుపే. నా కళ్ళు సుజాత మీదనుండి మీనాక్షివైపు అప్రయత్నంగా మళ్ళసాగినయ్. సుజాత అన్నట్లు కాక, మీనాక్షి చాలా జాలిగా, అర్థం చేసుకొన్న మనిషిలా మాట్లాడింది.

''సిన్హాగారూ! మావారి మరణం గురించి మీకు ఇంట్రెస్టు కలగడానికి కారణం ఊహించలేకండా వున్నాను'' అన్నది మీనాక్షి.

''మీనాక్షీ! నిజం చెప్పడం మంచిదని నా ఉద్దేశ్యం. మాధవ రావు అసహజంగా మరణించాడని, అతను హఠాత్తుగా చని పోయాడంటే నమ్మశక్యంగా లేదని సుజాత అంటోంది. ఈ విషయం గురించి పోలీస్ కంప్లెయింట్ ఇస్తే అనవసరంగా రభస అవుతుంది. అంచేత వివేకవతి గనుక, నిజానిజాలు

కనుక్కోమని నా వద్దకు వచ్చింది. నీవూ మాతో సహకరిస్తే మంచిది'' అన్నారు సిన్హాగారు.

మీనాక్షి నిశ్శబ్దంగా తల ఊపింది.

''సుజాత అనుమానమేమిటో నాకు తెలుసు. నేనే ఆయన్ని చంపానేమోనని ఆమె అనుమానం. అడగండి. మీరు అడగదలచుకొన్నదేమిటో.''

సుజాత లేచి నిలబడి, ''మాట్లాడుతూ వుండండి. కాఫీ తెస్తాను'' అని లోపలకు వెళ్ళిపోయింది.

నేను సుజాతను మనసులో అభినందించకుండా వుండలేకపోయాను. సాక్షులనుగాని, అనుమానితుల్ని గాని ప్రాథమిక పరీక్షలో ప్రశ్నిస్తున్నప్పుడు ప్రైవెసీ చాలా అవసరం.

''మాధవరావు చనిపోయేరోజు మధ్యాహ్నం పకోడీలు తిన్నారని తెలిసింది. అవి ఆయన చేయమని చెప్పారా? లేక మీరే చేశారా?'' అడిగారు సిన్హాగారు.

నేను సిన్హాగారివైపు విభ్రమంగా చూశాను. ఒకవేళ మాధవరావు హత్య చేయబడడం అంటూ జరిగితే ఆ తిన్న పకోడీల్లోనే ఏదన్నా కలిసుండాలి.

ఎందుకంటే అతన్నెవరూ కత్తితో పొడవలేదు, పిస్తోలుతో కాల్చలేదు, గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి చంపలేదు. ఇక మిగిలిన పద్ధతి విషప్రయోగమే. ఎందుకంటే మాధవరావుకు వాంతులు, విరేచనాలు అవడంలో విషప్రయోగం జరిగిందేమోనన్న అనుమానం కలక్కపోదు. ఆ పాయింటుకు సిన్హాగారు సూటిగా రాకెట్‌లా దూసుకువచ్చారు.

''ఆయనే చెయ్యమన్నారు. వద్దని నేను ఎంత చెప్పినా నా మాట వినలేదు. అప్పటికీ వంటవాడు ఇంట్లో వుంటే వాణ్ణి బెదిరించి చేయించుకొంటారని సరుకులు తేవడానికి బజారుకు

హిహి.. నేను జేబుదొంగను కాన్లెండి-సార్-నాకు
పది రూపాయల్నోటుకి చిల్లరకావాలి-
మీదగ్గరుందేమో
నని-అంతే.

ఈమధ్యన బొత్తిగా మందు పనిచెయ్యడం
లేదు డాక్టర్-ఏదైనా
మంచి టానిక్కు
రాసివ్వండి-

పంపాను. అయినా వినలేదు. వాడొచ్చేవరకూ ఆగమన్నా ఆగకుండా తనే వంటగదిలోకి జొరబడి మూకుడు స్టౌమీద పెట్టారు. ఇక చేసేదిలేక నేనే వెళ్ళి తయారుచేశాను. సగం చేస్తూవుండగా వంటవాడు వచ్చాడు. అప్పటివరకూ అయినవి తిని తనగదికి వెళ్ళి నిద్రపోయారు'' అన్నది మీనాక్షి.

మాధవరావు తిండి ఆతృతకు జోహారు చెయ్యాలనిపించింది.

''అంటే మాధవరావు మీరు చేసినవే తిన్నారన్నమాట.''

''అవును! వంటవాడు మిగతావి అందరికీ చేసిపెట్టాడు.''

సిన్హాగారు తల పంకించారు.

నేను మాత్రం ఆలోచనలో పడిపోయాను. మీనాక్షి నిర్దోషేనేమో. లేకపోతే ఇంత నిర్భయంగా జరిగినది జరిగినట్లు ఎందుకు చెపుతుంది. మీనాక్షికి అబద్ధం చెప్పవలసిన అవుసరం కూడా లేదు.

ఒకవేళ మీనాక్షి తనుచేసిన పకోడీల్లో ఏదన్నా విషం కలిపి మాధవరావుకు పెట్టినా ఆ విషయం నిరూపించే సాక్ష్యం ఇప్పుడేమీ లేదు.

హోప్‌లెస్. సిన్హాగారు ఇలా కాలాన్ని ఎందుకు వృథాచేస్తున్నారో అర్థం కావడంలేదు.

''అయితే సుజాత వచ్చేవరకూ మీరు మాధవరావు శవాన్ని వుంచకపోవడానికి కారణ మేమిటి?''

మీనాక్షి మా వంక దిగులుగా చూసింది.

''బుధవారం సాయంత్రం ఆయన పోయారు. వెంటనే సుజాతకు టెలిగ్రామ్ ఇచ్చాము. ఆ మర్నాటి సాయంత్రం వరకూ సుజాతకోసం వేచివున్నారు. శవం దుర్గంధం వస్తోంది. బంధుమిత్రుల వత్తిడి ఎక్కువయింది. అంచేత శవాన్ని దహనం చెయ్యక తప్పలేదు. శుక్రవారం సాయంత్రానికిగాని సుజాత ఇక్కడకు రాలేదు. అప్పటికే అంతా అయిపోయింది.''

"సుజాతకు టెలిగ్రామ్ ఇచ్చిం దెవరు?"

"సుబ్రమణ్యంగారని, వారి స్నేహితుడు" మీనాక్షి గొంతులో తొట్రుబాటు లేదు.

"దయచేసి ఆయన అడ్రస్ చెప్పండి."

మీనాక్షి చెప్పింది. నేను చకచకా నోట్ చేసుకొన్నాను. సిన్హాగారు మీనాక్షివంకే కాసేపు సూటిగా చూస్తూవుండిపోయారు.

"వంటవాడు ఇంట్లోనే వున్నాడా?" అడిగాన్నేను.

"వంటగదిలో వున్నాడు. పిలవమంటారా?" అన్నది మీనాక్షి.

"అక్కర్లేదు. మేమే అక్కడికెళతాము. అతను కాక ఇంట్లో వేరే నౌఖర్లు ఎంతమందున్నారు?" అడిగాను.

"తోటమాలి, మరో ముసల్ది, ఆయన స్వంత నౌఖరు వున్నారు" అన్నది మీనాక్షి.

"దయచేసి వాళ్ళను పిలవండి."

వాళ్లు ముగ్గురు చెప్పినవి, డాక్టర్ శిఖామణి కథనం, మీనాక్షి చెప్పినవి అన్నీ ఒకలాగే వున్నాయి. క్రొత్త విషయాలేమీ లేవు. నేను నిస్పృహగా సిన్హాగారివైపు చూశాను. సుజాత లోపల్నుండి బయటకు వచ్చింది.

"వంటవాడు కాఫీ తెస్తున్నాడు. ఆలస్యం అయినందుకు క్షమించండి" అన్నది.

సిన్హాగారు లేచి నిలబడి, "పదమ్మాయ్! మీ వంటగది చూస్తాను" అన్నారు.

4

వంటవాడు చెప్పిందాంట్లోనూ, వంటింట్లోనూ క్రొత్తదనం ఏమీలేదు. కాని వంటవాడికి మీనాక్షిమీద ఎందుకో కోపం వున్నట్లుమాత్రం గ్రహించాను. వాడు చేసిన కాఫీ బావుంది.

"అబ్బాయ్, నీ పేరేమిటి?" అడిగారు సిన్హాగారు.

"కుముదంనాయర్ సార్" అన్నాడు అతను బొంగురుగా.

"చూడు నాయర్! మాధవరావు చావుమీద నీ అభిప్రాయం ఏమిటి?"

"ధర్మప్రభువులు సార్! నాయర్ నీవంటే లేకపోతే ఇంత కాలం ఎలా బ్రతికేవాణ్ణో అంటుండేవారు. ఆయన చచ్చిపోయారంటే నేను వెంటనే నమ్మలేకపోయాను."

"నాయర్! పకోడీలు తిన్న తరువాతే ఆయన వాంతులు చేసుకొన్నారు అంటున్నావు గదా. మరి అవే పకోడీలు మిగతా వాళ్ళుగూడా తినివుండాలి గదా. వాళ్ళకేమీ అవలేదా?" అడిగాను నేను.

"నేనూ, మిగతా పనివాళ్ళం తిన్నాం సార్! ఏమీ కాలేదు."

"నాయర్! బాగా గుర్తుతెచ్చుకొని చెప్పు. మామూలు పకోడీలకు, ఆ రోజు పకోడీలకు తేడా ఏమన్నా వుందా?"

నాయర్ ఏదో గుర్తు తెచ్చుకొంటున్నట్లు ఒకక్షణం ఆలోచించాడు. "అవును సార్! ఎందుకనో ఆ రోజు పకోడీలు రుచిగా లేవు. ఏదో ఒకరకమైన రుచి వచ్చినయ్."

"అంటే చేదుగానా? వగరుగానా? ఏ విధంగా?"

"ఏమో సార్ చెప్పలేను. తినడానికి బావుండలేదు. బహుశా పిండి అమ్మగారు కలిపినందువలన పాళ్లు కుదరలేదేమో అనుకొన్నాను" అన్నాడు.

సిన్హాగారి కళ్ళల్లో ఏదో తళుక్కున మెరిసినట్లనిపించింది.

సుజాతను మళ్లీ కలుసుకొంటామని చెప్పి బయటికి నడిచాము.

సిన్హాగారు మాధవరావు ఎదురింటివైపు నడిచారు.

మేజర్ చౌదరి (రిటైర్డ్) అనే బోర్డు ఇంటిముందు ఫెన్సింగ్‌కు వేళ్ళాడుతోంది.

వరండాలో ఓ బట్టతలాయన ప్రొద్దుటి దినపత్రిక కాబోలు శ్రద్ధగా పరీక్షలకెళ్ళే పదోతరగతి విద్యార్థిలా చదువుకొంటు న్నాడు.

మమ్మల్ని పరిచయం చేసుకోగానే ఎంతో శ్రద్ధగా లేచి నిల బడి, "గ్లాడ్! అయామ్ వెరీ గ్లాడ్! రండి, ప్లీజ్ సిడౌన్! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ!" అన్నాడు ఎంతో ఉత్సాహంగా మేజర్ చౌదరి.

సిన్హాగారు చుట్ట పళ్ళమధ్య బిగించి మేజర్ చౌదరివైపు ఆప్యాయంగా చూశారు. "థాంక్యూ మేజర్! మాధవరావుగారు మీకు తెలుసా?" అడిగారు.

మేజర్ చౌదరి తలాడించాడు. "యస్! దట్ ఓల్డ్ చాప్! హి యీజ్ మై ఫ్రండ్! రోజూ సాయంత్రం మేమిద్దరం సర దాగా చదరంగం ఆడుతుండేవాళ్ళం. పాపం! హఠాత్తుగా పోయాడు. మధ్యాహ్నం మూడున్నరకు నిద్ర లేచేప్పటికి కడుపు నొప్పని హాస్పిటల్‌కు తీసుకెళ్ళారని తెలిసింది. అంతకు ముందు రోజు నన్ను మేట్‌లో పెట్టి కూర్చున్నాడు. ఎల్లా తప్పించు కోవాలా అని ఆలోచించి ఎత్తు వెయ్యడానికి రడీగా వున్నాను. సాయంత్రం రాగానే తన వ్యూహం పటాపంచలు చెయ్యా లనుకొంటున్నాను. ఇంతలో చావు కబురొచ్చింది. హి యీజ్ ఎ గుడ్ చెస్ ప్లేయర్ యు నో!" అన్నాడు ఏకబిగిన.

"ఐ సీ!" సిన్హాగారు తలాడించారు, వరెండాలో ఫొటోల వంక చూస్తూ. "మీరు ఆర్మీ డాక్టర్లనుకొంటాను" అన్నారు.

"యస్. దటీజ్ రైట్. సర్జికల్ స్పెషలిస్టును."

"బహూశా మాధవరావు శవాన్ని మీరు చూసివుంటా రను కొంటాను" అన్నాడు సిన్హా.

"యస్! అఫ్‌కోర్స్! మీ ఉద్దేశ్యమేమిటి?"

"శవంలో విషప్రయోగం కలిగిన లక్షణా లేమన్నా కనిపించాయా?"

"వాట్!" ఆశ్చర్యంగా చూశాడు మేజర్ చౌదరి.

"నేనంత పరీక్షగా గమనించలేదు. ఆర్మీలోంచి రిటైర్ అయిపోగానే ప్రాక్టీస్ మానేశాను. అయిదారేళ్ళు కావస్తోంది. అయినా మీరంటే గుర్తొస్తోంది. మాధవరావు ఛాయ పచ్చని పసిమి. కాని చనిపోయిం తరువాత పెదిమలు, ముక్కు రంధ్రాల దగ్గర, చెంపల క్రింద, చేతివేళ్ళ చివర కాస్త నల్లగా వున్నట్లు తోచింది. జనరల్‌గా హార్ట్ స్ట్రోక్‌వల్ల పోయినవాళ్ళ వళ్ళంతా పాలిపోయినట్లు కనిపిస్తారు. కాని నాకెందుకో స్ట్రయిక్ కాలేదు" అన్నాడు చౌదరి.

పిన్నిగారు నా వంక విజయగర్వంతో చూశారు.

నేను ఆలోచిస్తున్నాను. చదివిన ఆర్గానిక్ కెమిస్ట్రి అంతా గుర్తు తెచ్చుకొంటున్నాను. ఏ విషం ప్రయోగిస్తే మొదట ఎఫెక్ట్ కనిపించకుండా, తర్వాత హఠాత్తుగా ప్రాణం పోయేది ఆలోచిస్తున్నాను. కారు నడుపుతున్నా నా మనసు ఇక్కడలేదు. ఎప్పుడో చదివిన ఫోర్సెనిక్ మెడిసన్ టెక్ట్స్ పుస్తకాలు తిరగేస్తోంది.

పిన్నిగారు రియర్‌వ్యూ మిర్రర్‌లోనుండి నా వంక చూసి జాలిగా నవ్వారు.

"లాభంలేదు బోయ్! మాధవరావు ఏ విషంవల్ల చనిపోయాడో తెలుసుకొన్నందువల్ల ప్రయోజనంలేదు. చౌదరి ప్రాక్టీస్ మానేసి చాలాకాలమైంది. ఏ తెలివైన లాయరైనా చౌదరి సాక్ష్యాన్ని క్రాస్ ఎగ్జామినేషన్‌లో ముక్కలు ముక్కలు చెయ్యగలడు. డాక్టర్ శిఖామణికూడా సరిసమానంగా క్వాలిఫై అయిన డాక్టరని మరచిపోకు. మీనాక్షి హత్య చేసిందేమోనని

ఇప్పుడిప్పుడే అనిపిస్తోంది. నిజంగా హత్యచేసుంటే ప్రట్టానికి దొరక్క మానదు. కాని దానికి బలమైన సాక్ష్యం మనం సంపాయించాలి?''

''ఎలా? మాధవరావు చచ్చిపోయి నాలుగురోజులయింది?'' అన్నాను. ''పైగా అతను తిన్న పకోడీలనే పనివాళ్ళు, వంట వాడూ తిన్నారని మరిచిపోకండి.''

సిన్హాగారు మళ్లీ నవ్వారు. ''లేదు మరిచిపోలేదు. మాధవ రావు తిన్న పకోడీలు మాత్రమే మీనాక్షి చేసిందని, మిగతావి నాయర్ చేశాడనే విషయంకూడా మరచిపోలేదు. అంటే వాటిల్లో మాత్రమే ఏదన్నా కలిపే అవకాశం వుందిగదా.''

అవునన్నట్లు తల ఊపాను.

''కాబట్టి మీనాక్షి వండిన పకోడీల్లో విషపదార్థం కలిపిందన్న సంగతి మనం రుజువుల్తో సహా నిరూపించగలిగితే కేసు నిలు స్తుంది. కాని, ఎలా? మాధవరావు తినగా మిగిలినవి వంటవాళ్ళు, పనివాళ్ళు తినేశారు. ఇది జరిగి నాలుగురోజులయింది. జీడిపప్పు డబ్బా, శెనగపిండీ పరీక్షించినా మనకేమీ దొరకదు. ఏదో లింక్ మిస్సవుతున్నా మనిపిస్తోంది. మీనాక్షి వండిన పకోడీల్లో ఏదో కలిపివుంటే, తప్పకుండా ఏదో ఋజువు దొరుకుతుంది. ఏమి టది? అదే తట్టడంలేదు'' సిన్హాగారు తన ఆలోచనల్ను తనే బయటికి చెపుతున్నారు.

బుర్రకు ఎంతో పనిపెడితేగాని ఆయన అలా చేయరు.

నేనూ ఆలోచించసాగాను. పకోడీలు-జీడిపప్పు, శెనగపిండి పకోడీలు. జీడిపప్పు పకోడీలు, విషం. అవును ఏదో మరిచి పోతున్నాం. ఏమిటది?

ఏమిటది? ఏదో గుర్తొచ్చినట్టే వుండి గుర్తు రావడంలేదు- ఆలోచిస్తున్నాను. తల పగిలిపోయేట్లు ఆలోచిస్తున్నాను.

కారు అరవై మైళ్ళ వేగంతో పరుగెడుతోంది.

"స్టాపిట్!" అరిచారు సిన్హా గారు.

నేను కారుకు సడెన్ బ్రేక్ వేశాను.

"డామిట్! ఇంత సేపు ఎందుకు తట్టలేదో అర్థంకావటం లేదు, కారు వెనక్కు తిప్పు చెపుతాను"

అన్నారు మొరారో కిటికీలోంచి సైడుకాలవలోకి విసిరేస్తూ.

5

సిన్హాగారు టేబిల్ ప్రక్కనే నిలబడి టెలిఫోన్ వంకే దీర్ఘంగా చూస్తూ నిలబడ్డారు.

ఎత్తైన మనిషి, విశాలమైనఛాతి, బిస్మార్కు మీసాలు, ఎక్సరేకళ్ళు, బిగించిన పెదిమలు, పెదిమలమధ్య రావణాసురుడి కాష్టంలా వెలుగుతున్న చుట్ట. ఈ మనిషిని ఇంకా అమెరికా వాళ్లెందుకు కొనుక్కొని పోలేదా అని అనిపిస్తుంటుంది నాకు.

టెలిఫోన్ మ్రోగింది.

"యస్? సిన్హా స్పీకింగ్!"

అవతల పోలీస్ లాబ్ ఫోర్సినిక్ మెడిసన్ ఎక్స్పర్ట్ గొంతు స్పష్టంగా వినిపిస్తోంది.

"మీ అనుమానం రైటే! మీరు పంపిన నూనె హైడ్రో క్లోరిక్ ఆసిడ్‌తో కలిస్తే నీలి రంగు వస్తోంది.అంటే అందులో 'థెవిటియా నెరిపోలియా' విత్తనాల రసం కలిపి వుందన్న మాట. చాలా ప్రమాదకరమైన విషం. ఎంత మోతాదులో వుందో తెలుసుకోవడానికి ఇంకా టైం పడుతుంది."

"థాంక్స్ డాక్టర్! అది చాలు ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్‌కు ఫోనివ్వండి" అన్నారు సిన్హా.

డాక్టర్ శిఖామణికి మాధవరావు మీద విషప్రయోగం జరిగిందని ఎందుకు తెలియలేదో ఇప్పుడు అర్థమయింది. 'థెవిటియా నెరి

ఫోలియా' విత్తనాలు. వృక్ష శాస్త్రానికి సంబంధించిన మాట అది. అచ్చ తెలుగులో చెప్పాలంటే పచ్చగన్నేరు కాయల్లో విత్తనాలన్న మాట. చాలా విషపూరితమైనవి. శరీరంలో ఆ విషం ప్రవేశించిన రెండు మూడు గంటల్లో మనిషి హఠాత్తుగా చనిపోతాడు. గుండెమీద పని చేస్తుంది.

అవును మాధవరావు ఇంట్లో ప్రహరీ గోడ ప్రక్కన క్రోటన్స్‌తో బాటు 'పచ్చ గన్నేరు' చెట్లుకూడా చాలా వున్నాయి. మీనాక్షి వాటికోసం వెదకక్కరలేదు.

"యస్ ఇన్‌స్పెక్టర్! వెంటనే వెళ్ళి మీనాక్షిని అరెస్టు చెయ్యండి. రుజువులూ, సాక్ష్యాలు రెడీగా వున్నాయి."

సిన్హాగారు,ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్‌తో మాట్లాడుతున్నారు. నాకు మీనాక్షి మీద జాలేసింది.

పాపం, ఆ రోజు పకోడీలు చేసిన నూనెను అలవాటుకొద్దీ నాయర్ ఓ సీసాలో పోసి వుంచకపోతే- మీనాక్షి యీపాటికి హాయిగా సుబ్రహ్మణ్యంతో తిరుగుతుండేది. ★

లాయర్:—మీ వాడికి మరణశిక్ష తప్పిస్తే, లక్ష రూపాయలు ఫీజు వస్తుందని ఆశపడ్డాను. కాని, నాకా అదృష్టం లేదు.

క్లయింట్:—వుంది, మీకు అదృష్టం!

లాయర్:—ఎలా?

క్లయింట్:—హత్య మీరే చేసినట్లుగా జడ్జిగారితో చెప్పండి!!?

—ఎమ్. విద్యుల్లత, విశాఖపట్టణం.

ఈ నెల జోక్స్ —ఎస్. వాహిద్

"ఇంతకీ అమ్మాయికి పెళ్ళి వెంటనే చేయాలంటావ్?"

"అవున్నా. దానికోసం నల్గురు తన్నుకు చచ్చారు. ఇద్దరు పిచ్చాళ్ళై వీధులు పట్టారు. ఇక నువ్వే చెప్పు ఆమెకిక పెళ్ళి అవసరమా? కాదా?"

"అవసరమే. మరి నా భయమేమిటంటే, అమ్మాయిని చేసుకునే వాడెక్కడ గుండె ఆగి చస్తాడోననే."

♦ ♦ ♦

"ఈ పేదరికం భరించలేక మా పెద్దోడు బాగా సంపాదించు కొస్తానని దేశాలుపట్టి పోయాడు. పట్టుదలట."

"ఏ మాత్రం సంపాదించుకొచ్చా డేమిటి?"

"ఇంకా రాలేదుకాని మొన్న పేపర్లో వాడి ఫొటోవేసి, ఆచూకీ తెల్పినవారికి ఏభై వేలు బహుమానం అని రాశారు; దాని క్రింద."

♦ ♦ ♦

పోలీస్ సెలెక్షన్స్ జరిగాయి. సెలెక్ట్ అయిన వాళ్ళని రివాజు ప్రకారం జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన ప్రశ్న లేస్తున్నాడు ఆఫీసర్.

ఓ అభ్యర్థి నడిగాడు. "హైద్రాబాద్ నుంచి సికింద్రాబాద్ కెన్ని మైళ్ళు?"

ఆ అభ్యర్థి కెందుకో ఒళ్ళుమండింది. "అంతదూరం బీట్

వేయడానికే నాకు మీరు పోలీస్ ఉద్యోగం ఇస్తున్నట్లైతే నా కొద్దు. హాయిగా పొలం దున్నుకోగలను."

♦ ♦ ♦

జైన్ ఓ పార్టీలో ఓ అందగత్తెతో పరిచయం చేసుకున్నాడు. ఓ చోట కూర్చుని కోకకోలా తాగుతూ ఇద్దరూ పిచ్చాపాటి మాట్లాడుకోసాగారు.

జైన్ అన్నాడు "ఓ రకంగా మీ రదృష్టవంతులు!"

"ఎలా?" అడిగిందామె.

"మా మేనేజర్ ఈ ఫంక్షన్‌కి రాలేదు. ఏనుగులాంటి మనిషి. పంది మొహం. అంత భీకరాకారుణ్ణి చూడకపోవడం కూడా 'లక్కే' కదా?"

"మిస్టర్" అందామె సడన్‌గా కోపంగా. "నే నెవరో మీకు తెల్సా?"

"నాట్ ది ఫెయింటెస్ట్ ఐడియా...."

"మీ మేనేజర్ భార్యని."

"మరి నే నెవరో మీకు తెలుసా?" తడుముకోకుండా అడిగాడు జైన్.

"తెలీదు."

"థాంక్‌గాడ్!" అనేసి గుంపులో కలిసిపోయాడు.

♦ ♦ ♦

"అమ్మా! తల్లీ! ఒక అర్థరూపాయ దానం చేయండి తల్లీ. మా అమ్మదగ్గరికి వెళ్ళాలి" అడిగాడో పిల్లవాడు.

ఆ పిల్లభిక్షగాడి మాటలకు ఆ తల్లి కెంతో జాలి కలిగి, అర్థరూపాయ ఇచ్చేసి అడిగింది...."ఎక్కడుంది నాయనా మీ అమ్మ?"

"బాలాజీ థియేటర్‌లో."

♦ ♦ ♦

"త్రాగే నీటిలోని హానికరమైన సూక్ష్మజీవులు నశించాలంటే తీసుకోవాల్సిన ప్రికాషన్స్ ఏమిటి?" అనడిగాడు మెడికల్ ఆఫీసర్ ఓ సైనికుణ్ణి.

"ముందు ఆ నీటిని వేడి చేయాలి."

"గుడ్."

"తర్వాత వడగట్టాలి."

"ఎక్సలెంట్. ఆ తర్వాత" అన్నాడా సార్జెంట్.

"ముందు జాగ్రత్తగా కొంత బీర్ సేవించాలి."

♦ ♦ ♦

"ఏమన్నావురా రాస్కెల్. నా భార్య మొహం మా కుక్క మొహంలా వుంటుందా?"

"లక్షమార్లు చెప్తాను. ఏం? ఏం చేస్తావ్?"

"రారా, బయటికి. చంపేస్తాను.నా కుక్కని అంత మాటన్న వాణ్ణి ఊర్కే ఒదల్ను."

♦ ♦ ♦

"అమ్మా!" అన్నాడు ఓ గుజ్జుబ్బండి వాడు—రైల్వేస్టేషన్ మంచి బస్టాండ్‌కి ఎక్కవచ్చి డబ్బులిచ్చేసి దిగుతున్న ఓ లావు

పాటి పాసింజర్‌తో."దయచేసి నా గుజ్జుం కళ్ళు బడకుండా అలా ప్రక్కగా వెళ్తారా?"

"ఏం?" అడిగిందామె.

"అర్థరూపాయకి రెండుమైళ్లు తనేం మోసుకొచ్చిందో తెలిస్తే, నా గుజ్జుం మూర్ఛపోవచ్చు.".

♦ ♦ ♦

ఓ బిజినెస్ ట్రిప్‌లో ప్రొద్దుటూర్ వెళ్ళాను. ఆ రోజు వుదయం ఏదో హోటల్‌లో టిఫిన్ తీసుకుంటుండగా ఎవరో బలిష్ఠుడైన వ్యక్తి హోటల్‌లోకి ప్రవేశించాడు. అతనికి అందరూ గౌరవంగా లేచి నమస్కరించారు.

ఆ దృఢకాయు డెవరో ఉస్తాద్ అనుకుంటూ, ప్రక్కనున్న తన్ని అడిగాను. "ఎవరా మనిషి? కుస్తీలు పడ్తాడా?"



"లేదు" అన్నాడతను. "అంతకన్నా గొప్పపని చేశాడు."

"ఏమిటది" ఉత్సుకతతో అడిగాను.

"గత శనివారం సర్కస్‌లో సరిగ్గా షో మధ్యలో ఓ సింహం బోన్‌లోంచి దూకి భీకరంగా అరుస్తూ ప్రేక్షకుల మధ్యకు వచ్చేసింది. అందరూ కకావికలై పారిపోయారు."

"అరెరె....! తర్వాత?!"

"అప్పుడీ దృఢకాయుడు అతిశాంతంగా కుర్చీలోంచి లేచెళ్ళి సింహం బోనులో దూరి మూతేసుకున్నాడు."

♦ ♦ ♦

మా చెల్లాయి ఓ మారు తన ఫ్రెండ్ బర్త్‌డే పార్టీకి వెళ్లొచ్చాక మా అమ్మ అడిగింది. "అక్కడ నువ్వేమీ అవక తవక పని చేయలేదు కదా?"

చదువుతున్న "అపన" మీంచి దృష్టి మరల్చి, చెవులు రిక్కించాను, సమాధానం కోసం.

"లేదమ్మా" అంది చెల్లాయి. "పొరబాటున టేబిల్ క్లాత్ మీద ఊచినప్పుడల్లా వాళ్ళకి 'సారీ' చెప్పాను."

♦ ♦ ♦

మోడల్‌గర్ల్ పోజివ్వడానికి గుడ్డలు తీసే వేళకి ఎందుకో ఆర్టిస్టుకి తలపోటు ప్రారంభమైంది. ఆమెతో "మిస్. ఈ రోజెందుకో తలనొప్పి ప్రారంభమైంది. మీ రింటికెళ్ళిపోండి. కాఫీ చేసుకుని తాగి, కాసేపు విశ్రాంతి తీసుకుంటాను."

"కాఫీయా," అందా మోడల్ గర్ల్. "మీకెందుకు శ్రమ. నే చేసిపెడ్తాను."

"థాంక్స్."

మోడల్ గర్ల్ వెంటనే కాఫీ తయారుచేసి తెచ్చింది. ఇద్దరూ ఏదో మాట్లాడ్తూ కాఫీ తాగుతున్నారు. అంతలో బయటేదో హారన్‌తోపాటు కారాగిన శబ్దం వినిపించింది.

"మై గాడ్!" కంగారుగా లేస్తూ అన్నాడా ఆర్టిస్ట్, "నా భార్య వస్తూంది. క్విక్. గుడ్డలు తీసేయండి."

♦ ♦ ♦

"నీకు తెల్సా? నటరాజు భార్య కవలల్ని కంది."

"అందులో ఆశ్చర్యమేముంది. పెళ్ళికాకముందామె టెలి ఫోన్ ఆపరేటర్. అందుకే అతనికీ రాంగ్‌నంబర్ (రెండు) ఇచ్చింది."

♦ ♦ ♦

రాజూ, రాణీ హనీమూన్‌కని హైద్రాబాద్ వెళ్ళారు. ఓ హోటల్ ముందు వాళ్ళ సామాన్లు దింపి టాక్సీ వెళ్ళిపోయింది.

రాజు, రాణి చెవిలో—"మనం పాత దంపతులమైనట్లు ప్రవర్తిద్దామా?" అన్నాడు.

"ఓ. కె. నాకేమీ అభ్యంతరం లేదు" అందామె.

విలాసంగా వ్యానిటీ బాగ్ ఊపుతూ ముందడుగేస్తూ, "ఆ సామాన్లన్నీ మోసుకురండి" అందావిడ భర్తతో.

♦ ♦ ♦

సులోచన తన భర్తతో విడాకులకై కోర్టుకు వెళ్ళింది. అది తెల్సి ఓ స్నేహితురాలామెని కల్సుకుని సావకాశంగా కారణా లడిగాక, మరో ప్రశ్నడిగింది. "ఇంతకీ లాయరేం ఛార్జ్ చేస్తున్నాడు?"

"నథింగ్" అంది సులోచన." నా లాయర్ మా ఆయనకి ఫ్రండట. ఆయనకేదో ఉపకారం చేస్తున్నానని నన్నేమీ ఫీజు అడగలేదు."

♦ ♦ ♦

ఓ లక్షాధికారి కూతురు, ఆగర్భదరిద్రుణ్ణి ప్రేమించింది. ఆమెని తనకిచ్చి చేయమని ఆ ప్రేమికుడు ఆమె నాన్నని అడి గాడు, వెళ్ళి.

"అసంభవం" అన్నాడా లక్షాధికారి. "నీలాటి ఫకీర్‌గాడికి నా కూతుర్నిచ్చి కట్టబెట్టడానికి నాకేమన్నా పిచ్చా?"

"అది కాదండి!" అన్నాడా యువకుడు. "మీదీ ప్రేమపెళ్ళే

నని,అప్పుడు మీరూ నాలా నిరుపేదేననీ చెప్పుతుంటారే అంతా?''



''నిజమే. నిజమే....'' ఒప్పుదలగా తల పంకిస్తూ అన్నాడా లక్షాధికారి. ''పెళ్ళయాక పదేళ్ళు మామామ ఎప్పుడు చస్తాడాఅని ఎదురుచూశా. ఇప్పుడు నిన్నూ అలా చేయనిస్తాననుకున్నావా?''

♦ ♦ ♦

మద్రాస్‌లో వున్న ఓ డిటెక్టివ్ సంస్థ ఒక హంతకుడి ఆచూకీ తీయమని, హైదరాబాద్‌లో కొత్తగా నియమితుడైన తమ ఏజెంట్‌కి, ఆ హంతకుడి అరడజను ఫోటోలు పంపింది.

వారంరోజుల్లో ఆ ఏజెంట్‌నుంచో ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరం వచ్చింది. ''మీరు పంపిన ఆ ఆరుగుర్లో ఐదుగుర్ని పోలీసులకి పట్టించాను. ఆరోవాడికై అన్వేషిస్తున్నాను.''

♦ ♦ ♦

''అవునూ....! ఇంతకీ ఆ లక్షాధికారి కూతుర్నెలా వల్లో వేసుకున్నావు?!''

''ఏముంది? ఆమె 26వ బర్త్‌డేకి 16 గులాబీ లిచ్చానంతే.''

♦ ♦ ♦

అపరాధ పరిశోధన పోటీ-64 [ఫలితాలు]

నవంబర్ '73 నెల "అపరాధ పరిశోధన"లో నిర్వహించబడిన 'అపరాధ పరిశోధన పోటీ_64'కి సరియైన సమాధానాలు:

1. ఇజ్రేల్‌కు.
2. మధ్యం.
3. జానపదం.
4. బ్లాక్ మెయిలర్స్.
5. స్నేహం కోసం.

పై జవాబుల ప్రకారం ఇద్దరు మాత్రం ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి ఫిబ్రవరి 74 నెలనుండి సంవత్సరముపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక గాని, "సప్లిమెంట్" గాని ఉచితంగా పంపబడుతుంది. "సప్లిమెంట్" పొందగోరిన విజేతలు ఆ విషయం యీ నెల 10వ తేదీ లోగా మాకు తెలియజేయగోర్తాము.

1 శ్రీమతి జి. శైలజారెడ్డి,
తండ్రి పేరు__జి. రామచంద్రారెడ్డి,
(బి.ఏ., బి.ఎల్.)
మైపాడు__పోస్టు.
నెల్లూరు జిల్లా.

2 శ్రీ జల్లు బాబ్జీ,
పార్వతీపురం,
శ్రీకాకుళం జిల్లా.

వి.యస్.
చెన్నూరి.

ట్రింగ్-ట్రింగ్-ట్రింగ్!

ట్రింగ్-ట్రింగ్-ట్రింగ్!!

అదేపనిగా మోగుతోంది టేబుల్‌మీది టెలిఫోను. డిటెక్టివ్ రచయిత శ్రీధర్ అదేమీ వినిపించుకోవడం లేదు. దీక్షగా రాసుకుపోతున్నాడు.

టెలిఫోను గొంతు చించుకుంటోంది. శ్రీధర్‌కి విసుగేసింది. ఎడంచేత్తో రిసీవర్ని తీసుకున్నాడు.

"ఎస్! శ్రీధర్ హియర్! ఎవరు మీరు? ఏం కావాలి?" విసుగ్గా ప్రశ్నించాడు.

"నేను గురూ, బదరీనాథ్‌ని! మిమ్మల్ని డిస్టర్బ్ చేశానేమో క్షమించు గురూ!"

బదరీనాథ్ పేరు వినగానే శ్రీధర్ గతుక్కుమన్నాడు. గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. శరీరం ఆపాదమస్తకం వొణికింది.

'మొన్ననేగా మూడొందలు పట్టుకెళ్ళాడు? అప్పుడే తయారయ్యాడేమిటి? స్కౌండ్రల్! వీడి పీడ విరగడయ్యేలా లేదు. ఏ జన్మలో బాకీయో వీడికి, నిలబెట్టి వసూలుచేస్తున్నాడు.'

వెంటనే కోపంకూడా ముంచుకొచ్చింది. "ఏమిటి బ్రదర్ విశేషం? అర్జంటుగా డబ్బు కావాలా?" వ్యంగ్యంగా ప్రశ్నించాడు. ఆ ప్రశ్నలో కోపంకూడా ధ్వనించింది.

"ఛ ఛ! మరీ నన్నంత కర్కోటకుడిగా లెక్కకట్టకు గురూ! మొన్ననేగా పట్టుకెళ్ళింది? డబ్బుక్కాదు గురూ! మీ ఫేవర్ కావాలి! మీ నవల 'బ్లాక్ మెయిలర్' పిక్చర్ తియ్యబోతున్నారటగా? ఆ పిక్చర్‌కి పాటలూ, మాటలూకూడా తమరే రాస్తున్నారని విన్నాను."

"అవును!-అయితే?"

"ఆ నవల నేను చదివాను గురూ. అందులో ఆ బ్లాక్ మెయిలర్ పాత్రుంది చూశావూ మార్వెలస్! పోర్షన్ చిన్న దయినా పాత్ర మెరికలాంటిది! మెరుపులా మెరిసి యిట్టే మాయమైపోతుంటాడు. నాకా వేషం వెయ్యాలని వుంది గురూ. తమరు రెకమండ్ చేస్తే నాకా పాత్ర తప్పకుండా లభిస్తుంది. కాస్త పుణ్యంకట్టుకో గురూ! నీ మేలు జన్మలో మరిచిపోను. ప్లీజ్!"

స్కౌండ్రల్! అందితే జుట్టు! అందకపోతే కాళ్ళు! పాముకి పాలుపోసి పెంచినా సమయం చూచి కాటెయ్యక మానదు. వీడికి చేసే సాయం మరో అనామకుడికి చేస్తే పేరయినా చెప్పు కుంటాడు.

"నిజమే మిస్టర్ బదరీనాథ్, నీవా పాత్రకి అన్నివిధాలా సరి పోతావు. నువ్వా పాత్రకు న్యాయం చేకూర్చగలవన్న నమ్మకం నాకు లేకపోలేదు. నిజం చెప్పాలిసొస్తే నువ్వా పాత్రలో జీవించగలవు. కానీ, పిక్చర్ తీస్తూన్నది 'ది గ్రేట్ ప్రభంజన రావ్.' ఆ పిక్చర్‌కి ప్రొడ్యూసరూ, డైరెక్టరూ రెండూ ఆయనే. ప్రభంజనరావుగార్ని గురించి నువ్వు వినేవుంటావు. సినీ ఫీల్డులో ఆయన కెదురువిల్చే ధీరుడు లేడు. ఒక్క సినీ ఫీల్డులోనే కాదు. ఏ బిజినెస్ ఫీల్డులో అయినా ఆయనకు ఆయనే సాటి! ఆయన మాట కెదురులేదు. అలాంటి వ్యక్తికి సలహా యిచ్చేపాటి స్థోమత వుందంటావా నాకు?"

"ఓ మైగాడ్! మిస్టర్ ప్రభంజనరావుగారా మీ ప్రొడ్యూసరు? చచ్చాం పో! ఆయనగారి పలుకుబడి ఇటు రాష్ట్రప్రభుత్వంలోనే గాక, అటు కేంద్రప్రభుత్వందాకా వ్యాపించిందనికూడా విన్నాను. ఆయనగారు గనక కాకితో కబురంపితే ఇటు ముఖ్యమంత్రి నుండి, అటు కేంద్రమంత్రులదాకా రెక్కలుకట్టుకు వాలుతారట.

అంతపలుకుబడీ, పరపతీ వున్న వ్యక్తిముందు మనం ఏపాటి గురూ!....కానీ....నువ్వా యూనిట్‌లో పనిచేస్తున్నావు గనక, రచయితగా నీ కాయనతో బాగా పరిచయముంటుంది గనక, రెకమండేషన్‌లా కాకుండా, సమయం చూచి ఓ రిక్వెస్టు పడెయ్యొచ్చు. వాడు నాకు బాగా కావలసినవాడు, ఏ మాత్రం అవకాశమున్నా ఓ ఛాన్సు యిప్పిస్తే ఆ పాత్రకు తప్పకుండా న్యాయం చేకూరుస్తాడని. ఏమంటావు గురూ?"

"ఏమో! నాకు ధైర్యం చాలడంలేదు."

బదరీనాథ్ పకపకా నవ్వాడు.

"నాకు తెలుసు గురూ, నువ్వెంత గొప్ప రచయితవైనా లౌక్యం తెలీదు నీకు. గొప్పవారితో పరిచయమవ్వాలే గానీ, ఛాన్సు వొదులుకుంటామా? అదను చూచి అమాంతం ముందుకి చొచ్చుకుపోవాలి! ఇలాంటివాళ్ళు తలుచుకుంటే ఏమైనా చెయ్యగలరు! నిక్షేపమైన వ్యక్తిని నిలువునా రూపుమాపాలన్నా, అనామకుడైనవాడ్ని అమాంతం అందల మెక్కించాలన్నా వీళ్ళకో లెక్కకాదు! అవకాశం వుండికూడా వుపయోగించుకోని వాడు వొట్టి దద్దమ్మేనన్నమాట! అయినా యిదంతా ఫోన్‌లో ఎందుగ్గానీ....నువ్వు ఇంట్లోనే వుంటావుగా? ఇప్పుడే బయలుదేరుతున్నా! నీతో ముఖాముఖీ మాట్లాడాలి! ఎక్కడికీ చెక్కెయ్యకేం?" అంటూ రిసీవర్‌ని ఫోన్‌మీద పెట్టేశాడు.

అవతలివేపు ఫోన్ డిస్‌కనెక్ట్ కాగానే శ్రీధర్ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. రిసీవర్‌ని ఫోన్‌మీద పెట్టేసి సిగరెట్టు వెలిగించుకున్నాడు. గట్టిగా దమ్ముపీల్చి ఆలోచన్లోపడ్డాడు.

'ఇలాంటివాళ్లు తలుచుకుంటే ఏమైనా చెయ్యగలరు.' ఇంత క్రితం బదరీనాథ్ ఫోన్‌లో చెప్పిన మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నయ్.

'అవును! ఇలాంటి చీడపురుగుల్ని సమూలంగా నాశనం చెయ్యాలన్నా వీళ్ళే సమర్థులు!' అనుకున్నాడు.

అతని బుర్రలో మెరుపులా మెరిసిందో ఆలోచన. అతని ముఖం సంతోషంతో విప్పారింది.

తక్షణం డ్రాయర్ తెరిచి, సరికొత్త లెటర్‌పాడ్ తీసి, వ్రాయడాని కుపక్రమించాడు.

2

తెలుగు సినీఫీల్డులో చిల్లర వేషగాడుగా స్థిరపడ్డాడు బదరీనాథ్. వేషాలద్వారా అతనికి లభించే పైసలు అతని సరదాలకే చాలవు. అయినా, అతడెప్పుడూ డబ్బుకి ఇబ్బందిపడలేదు. అతని జల్సాలు చూచి, వెనక అతనికేదో ఆస్తి వుందని భ్రమ పడ్డవాళ్ళు చాలామంది వున్నారు. అయినా అది నిజం కాదని చాలా కొద్దిమందికే తెలుసు.

బదరీనాథ్‌ది డైనమిక్ పర్సనాలిటీ! మాటల్లో ఎంతటివాడ్నయినా బోల్తా కొట్టించగల చాకచక్యముంది. ఫీల్డులో పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్న వ్యక్తులందరితోనూ అతనికి పరిచయముంది. కొందరికి అత్యంతఆప్తుడుగా కూడా మసలుకునేవాడు. స్వతహాగా తెలివితేటలున్నవాడు కావడం మూలాన వారి వ్యక్తిగత జీవితంతోకూడా ప్రమేయం కల్పించుకుని, వారి రహస్యాలను తన గుప్పెట్లో దాచుకుని, అతి జాగ్రత్తగా కాపాడేవాడు. వాళ్ళ జీవిత రహస్యాలను అంత జాగ్రత్తగా కాపాడుతున్నందుకు వారిదగ్గర ఫీజుకూడా పుచ్చుకునేవాడు.

ఫీజు పుచ్చుకునే విషయంలో అతనికి చిన్నాపెద్దా తారతమ్యం లేదు! ఒక్కొక్కప్పుడు కఠినంగా ప్రవర్తించవలసి వచ్చినా వెనుకంజ వేసేవాడుకాడు. అంత నిక్కచ్చిగా వుండకపోతే తన వ్యాపారం సవ్యంగా సాగదని అతనికి బాగా తెలుసు.

వ్యాపార నిబంధనల్ని తు. చ. తప్పకుండా పాటించగలుగుతున్నాడు గనకనే డబ్బుకి ఇబ్బంది పడకుండా జీవితాన్ని 'పూలితేరు'లా లాక్కు పోగలుగుతున్నాడు.

బదరీనాథ్ ప్రవర్తన, బాగా వున్నవాడికి అంత కష్టంగా కనిపించకపోయినా, వుండీ-లేకా, ఓ మోస్తరు జీవితాన్ని గడిపే వ్యక్తులకి మాత్రం కంటకప్రాయంగానే వుండేది. బదరీనాథ్ పేరు వింటేనే గుండెల్లో దడ పుట్టుకొచ్చేది. శ్రీధర్ యీ రెండవ రకం వ్యక్తుల జాబితాలోకి వస్తాడు.

'మానవుడన్నవాడు ఎప్పుడో ఒకప్పుడు, తెలిసో తెలీకో పొరబాట్లు చేస్తాడు. ఎప్పుడో చేసిన చిన్న పొరబాటుకి జీవితాంతం బాధపడాలా? ఈ శని విరగడయ్యే మార్గం లేదా?'— అని ఆలోచించేవాడు డిటెక్టివ్ రచయిత శ్రీధర్.

3

"లాభంలేదు మిస్టర్ బదరీనాథ్! నే నీ విషయంలో నీకేలాంటి సాయమూ చెయ్యలేను. ప్రభంజనరావుగారి వ్యాపార దక్షతని గురించి నీకు తెలీకపోయినా వినే వుంటావు. ఇలాంటి విషయాల్లో ఆయన ఎవరి సలహాలూ పాటించడు. అంతేకాదు రెకమండేషన్లూ, రిక్వెస్టులూ పని చెయ్యవు!" అన్నాడు శ్రీధర్.

"అయితే, నాయాశఫలించే మార్గమే లేదంటావా?" ప్రశ్నించాడు బదరీనాథ్ నీరుగారిపోతూ.

శ్రీధర్ అతని ప్రశ్నకి జవాబు చెప్పలేదు. రెండు సెకండ్లపాటు ఏదో ఆలోచిస్తూ వుండిపొయ్యాడు.

"మార్గంలేదని నేననడంలేదు. నువ్వా పాత్రకి న్యాయం చేకూర్చగలవన్న నమ్మకం కలిగితే, ఒకరి ప్రమేయం లేకుండా అతడే నీకా వేషం యివ్వగలడు! అందుకు సందేహంలేదు."

"అదెలా సాధ్యం గురూ? నేనేమన్నా కేరక్టర్ యాక్టర్గా

పేరు ప్రఖ్యాతులు సంపాయించుకున్నవాడ్నా? అడపాదడపా 'ట్రుమీ' వేషాలు వేసేవాడ్ని. నేనా పాత్రకి న్యాయం చేకూర్చ గలనో లేనో ఆయన కెలా తెలుస్తుంది? ఆయన కా నమ్మకం కలిగించడమెలా?''

''మార్గంలేక పోలేదు మిస్టర్ బదరీనాథ్! నువ్వు నాకు ఫోన్‌చేసి నప్పటినుండీ యిదే ఆలోచిస్తూ కూచున్నాను! నాకో ఆలోచన తట్టింది. అంతకంటే మార్గం లేదు.''

''ఏమిటా ఆలోచన? చెప్పుగురూ! నువ్వేం చెబితే అది చేస్తాను. చివరకి బంగాళాఖాతంలో దూకమన్నా దూకుతాను!'' అన్నాడు బదరీనాథ్ హుషారుగా.

''ప్రప్రథమంగా బ్లాక్‌మెయిలర్. ఘరానా వ్యక్తిని కలుసు కున్నప్పుడు, ఆ యిద్దరి మధ్యా జరిగే సంభాషణను మొన్ననే రాశాను. ఆ సంభాషణల్ని ప్రొడ్యూసర్ ప్రభంజనరావుగారికి వినిపించి, నిన్ననే ఓకే చెయ్యించుకున్నాను కూడా. నువ్వా సంభాషణల్ని వ్రాసుకుని 'మగప్' చెయ్యి! మాంచి 'మాడ్యులేషన్'లో నీ నటనా చాతుర్యాన్ని జోడించి, ప్రభంజనరావు ముందు ప్రదర్శించు! నువ్వాయన్ని మెప్పించగలిగితే నీ పంట పండిందన్న మాటే.''

''ఓకే గురూ, అలాగే!'' ఎగిరి గంతేశాడు బదరీనాథ్.

''మరో ముఖ్య విషయం!''

''చెప్పుగురూ!''

''నువ్వు వేషం కోసం వచ్చావన్న విషయం గనక తెలిస్తే ఆయన నిన్ను గదిలోకి కూడా రానివ్వడు. 'పర్సనల్' అని చెప్పి ప్రవేశం సంపాయించు! అదనుచూచి నీ ప్రతిభను ప్రదర్శించు! ఈ డైలాగులు యింత క్రితం ఒకసారి విన్నవిగనుక, మొదట ఫలానా అని గుర్తించకపోయినా, తరువాత తప్పకుండా గుర్తిస్తాడు. మూడ్‌లో పడితే నీ డైలాగులకి రెస్పాన్స్ కూడా

రావచ్చు ఆయన్నుండి. కంగారు పడకు! ప్రతిభ చూపి పట్బం గడుపుకో!''

''అలాగే గురూ. అలాగే.''

''నువ్విప్పుడు కలుసుకోబోతున్నది మామూలు ప్రొడ్యూసర్‌ని కాదు. పేరు కంటే భయంకరుడు ప్రభంజనరావు! ఆయనచుట్టూ యమకింకరుల్లా పహిల్వానులు తిరుగుతుంటారు. నువ్వు జాగ్రత్తగా వ్యవహరించవలసి వుంటుంది. పిట్ట పెద్దది గదా, వృచ్చులో పడితే హెచ్చుగా వసూలు చెయ్యొచ్చని, వెర్రిమొర్రి వేషాలు గనక వేస్తే ప్రాణాలతో బైటపడలేవు.''

పకపకా నవ్వాడు బదరీనాథ్.

''అదేమిటి గురూ, అనువుగానిచోట అధికులమనరాదు! నాకా మాత్రం తెలీదా ఏమిటి?''

''దట్సాల్‌రైట్! ఇక నువ్వీ సంభాషణల్ని నీ డైరీలో కాపీ చేసుకోవచ్చు! రేపు ఆదివారం కదూ, సాయింత్రం ఆరు తరువాత ఆఫీసులోనే వుంటాడు వొంటరిగా. విజిటింగ్ కార్డు లోపలికి పంపి పర్మిషన్ వచ్చిం తరువాత లోపలికి వెళ్ళు! విష్ యూ గుడ్ లక్!''

''థాంక్ యూ గురూ, థాంక్ యూ! నీ మేలు జన్మ జన్మాలకీ మరిచిపోలేను గురూ!'' బదరీనాథ్ తన కృతజ్ఞతని తెలియ పరచుకున్నాడు శ్రీధర్‌కి.

డైలాగ్స్ కాపీ చేసుకుని, శ్రీధర్ వద్ద సెలవు పుచ్చుకుని వెళ్ళిపొయ్యాడు.

4

సాయింత్రం ఆరయింది.

కాంపౌండు గేటుదాటి, పూల మొక్కల మధ్యగా వెళుతోన్న తారురోడ్డుమీద పది నిమిషాలు ప్రయాణంచేసి, ఆవరణ మధ్య

అందమైన భవనం ముందు, పోర్టికోలో ఆగింది లాంబ్రెట్టా. లాంబ్రెట్టా మీంచి క్రిందికి దిగి, మెట్లెక్కి కారిడార్‌లోకి చేరు కున్నాడు బదరీనాథ్.

ఎదురొచ్చిన దర్వాన్ ఎటెన్‌షన్‌లో నిల్చుని సెల్యూట్ చేసి రిసెప్షనిస్టు గదికేసి చెయ్యి చూపాడు.

బదరీనాథ్ గది గుమ్మం దాటి ఫ్లోర్‌మీద పరిచిన కార్పెట్ మీద కాలెట్టాడు. ఎదురుగా డెకోలమ్ టేబుల్ పక్కన ఆసొ లేటింగ్ చైర్‌లో బైటాయించి, ఏదో రాసుకుంటోన్న అందాల దొరసాని, తలెత్తి చూచి, చిన్నగా నవ్వి "ఎస్ ప్లీజ్" అంది కిన్నెర మీటినట్టు.

"ఐ వాంటు మీట్ మిస్టర్ ప్రభంజనరావ్" అన్నాడు బదరీనాథ్.

"ఈజిట్ అఫిషియల్?"

"నో ప్రైవేట్."

అందాల దొరసాని గిరుక్కున టేబుల్‌కేసి తిరిగి, డ్రాయర్ లోంచి ఓ స్లిప్‌తీసి, పెన్సిల్ చేతికి తీసుకుంది.

"మే ఐ నో యువర్ నేమ్ ప్లీజ్!"

"బదరీనాథ్."

స్లిప్‌లో అతని పేరు రాసి, దర్వాను చేతికిచ్చి, "ప్లీ సబీ సీటెడ్ యిన్ విజిటర్స్ రూమ్ టిల్ యూ గెట్ ఎ కాల్ ఫ్రం అవర్ బాస్" అంది అందాల దొరసాని ఎదురుగావున్న విజిటర్స్ రూముకేసి చూపుతూ.

బదరీనాథ్ విజిటర్స్ గదికేసి నడిచాడు. సోఫాలో కూల బడ్డాడు. అందమైన ఆ గదినీ, క్రిందపరిచిన ముఖమల్ తివాసీనీ, విలువైన సోఫాలనీ, రౌండ్ టేబుల్‌మీది ఫ్లవర్‌వాజునీ, గోడ లకి వ్రేలాడుతోన్న విలువైన తైలవర్ణ చిత్రాలనీ చూస్తూ ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిపాడు.

"ఎస్ సార్, ఇక మీరు వెళ్ళొచ్చు! మేడమీదికి లిఫ్టులో వెళ్ళండి!" అన్నాడు ఇంతక్రితం స్లిప్ తీసుకువెళ్ళిన దర్వాను తిరిగివచ్చి.

బదరీనాథ్ సోఫాలోంచి లేచి దర్వాను చూపిన లిఫ్ట్‌కేసి బయలుదేరాడు. అతడు లోపలికి చేరగానే లిఫ్ట్‌మాన్ బటన్ నొక్కాడు. లిఫ్ట్ తలుపులు మూసుకున్నాయ్. మూసుకున్న పది సెకండ్లకి మళ్ళీ తెరుచుకున్నాయ్.

"ఎదురుగా కనిపిస్తూన్నదే ఆఫీసు రూము. అక్కడికి వెళ్ళండి" అన్నాడు లిఫ్ట్‌మాన్.

బదరీనాథ్ ఆఫీసు రూములో అడుగెట్టాడు. ఎదురుగా కనిపించిన ఆబోతుల్లాంటి ఆసాముల్ని చూడగానే అతగాడి గుండెలు ఆగిపోయినయ్. ఆబోతుల్లాంటి ఆ ఇద్దరూ నోళ్ళు కదపలేదు. లోపలిగది ముందు స్వింగ్ డోర్స్‌కి అటూ ఇటూ బొమ్మల్లా నిల్చుని వున్నారు, కళ్ళార్పకుండా అతనికేసే చూస్తూ.

గది మధ్య టేబుల్ ముందు కూచుని వున్న సుందరాంగి "కమిన్ మిస్టర్ బదరీనాథ్! మీరు బాస్‌ని చూడవచ్చు! టాప్ ది డోర్ బిఫోర్ యూ ఎంటర్!" అంది చిర్నవ్వు చిందిస్తూ.

బదరీనాథ్ స్ప్రింగ్ డోరు కేసి బయలుదేరాడు. గదిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. అతని గుండె గుబగుబలాడుతోంది. అడుగులు తడబడుతున్నాయ్. ఎలాగో ద్వారం వద్దకి చేరుకున్నాడు. ద్వారాని కిరువేపులా నిల్చుని వున్న భయంకరాకారాల కేసి చూడకుండా ద్వారంవద్ద నిల్చుని డోర్‌మీద మెల్లగా తట్టాడు ఊపిరి బిగబట్టి.

"ఎస్, కమిన్" లోపలినుండి వినిపించిందో గంభీరమైన కంఠం.

వెన్నెముకలోంచి పుట్టుకొచ్చింది చలి. ఎలాగో తమాయించుకున్నాడు. లోపలికి అడుగుపెట్టాడు.

ఎదురుగా, టేబుల్‌ముందు, ఆరడుగుల నిండు విగ్రహం కూచుని వుంది. నల్ల కోటూ, నల్ల సూటూ తొడుక్కున్నాడు. తెల్లని చొక్కామీద ఎర్రని నెక్‌టై. గంభీరమైన కోలముఖం. గుబురుగా పెరిగిన కనుబొమలు. మెలితిప్పిన మీసాలు. తల వొంచుకుని ఏవో కాగితాలు తిరగేస్తున్నాడు.

బదరీనాథ్ లోపలికి చేరుకుని రెండు నిమిషాలు దాటినా అతడు తలెత్త లేదు. కూచోమని చెప్పలేదు.

విశాలమైన గదినీ, విలువైన ఫర్నిచర్నీ చూస్తూ, జారే గుండెల్ని ఎగదోసుకుంటూ నిశ్చలంగా నిల్చుండిపోయ్యాడు బదరీనాథ్.

"ప్లీజ్ సిడౌన్!" నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ పలికిందా గంభీరస్వరం వొంచిన తల ఎత్తకుండానే.

బదరీనాథ్ కుర్చీలో కూలబడ్డాడు.

మరో రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయినయ్!

"ఎస్ మిస్టర్ బదరీనాథ్! ఎవరు మీరు? ఏం పనిమీద వచ్చారు?" తిరగేస్తోన్న కాగితాల్లోంచి తలెత్తకుండానే ప్రశ్నించాడు ప్రభంజనరావ్.

బదరీనాథ్ ధైర్యాన్ని కూడ దీసుకున్నాడు. గొంతు సవరించుకున్నాడు. కుర్చీలోంచి లేచాడు.

"మిస్టర్ రావ్! నే నెవరో,ఏం పనిమీద ఇక్కడికి వచ్చానో చెప్పే ముందు, కొంత ఉపోద్ఘాతం కూడా అవసరం. సావధానంగా వినండి!"

బదరీనాథ్ మరోసారి గొంతు సవరించుకున్నాడు.

"మీరు సంఘంలో గొప్ప వ్యక్తులుగా చలామణీ అవుతున్న పెద్ద మనుషులు! మీ యశశ్చంద్రికలు దశదిశలా వ్యాపించాయి! మీ గౌరవ ప్రతిష్ఠలు దేశమంతటా ప్రాకాయి! వ్యాపార

సంస్థల్లోనూ, పాలకవర్గంలోనూ మీకున్న పలుకుబడీ, పరపతీ మరో ప్రాణికి లేదంటే అతిశయోక్తి కాదు! మీరు పట్టింది బంగారం! మీరు చెప్పింది వేదం! మీరు ఆడింది ఆట! మీరు పాడింది పాట! మీరు ఎంతకైనా సమర్థులు!—

"కాని, యీనాడు మీరు పొందుతున్న యీ గౌరవ ప్రతిష్ట లకీ, పలుకుబడికీ, పరపతికీ వెనక—ఎన్ని అమానుషాలు, ఎన్ని అఘాయిత్యాలు దాగివున్నాయో ఎవరికీ తెలీదు. మీ స్వార్థానికి ఎందరు అమాయకులు బలిఅయ్యారో, మీ విలాసాలకి ఎందరు అబలలు ఆహుతయ్యారో లోకానికి తెలీదు!"

"వాట్?" ప్రభంజనరావు తలెత్తి బదరీనాథ్‌కేసి చూశాడు, దెబ్బతిన్న బెబ్బులిలా. అతని కళ్ళు ఎరుపెక్కాయి.

బదరీనాథ్‌లో హుషారు హెచ్చింది. 'తన డైలాగ్ డెలివరీ ప్రభంజనరావులో చలనం కలిగించింది. గురుడు మూడ్‌లోకి వచ్చేసినట్టున్నాడు. టెంపో చెడకుండా లాక్కురావాలి!!' అను కున్నాడు.

"ఎస్ మిస్టర్ రావ్! ప్రతి గొప్పవాడి జీవితంలోనూ ఇలాంటి రహస్యాలు కోకొల్లలు! రహస్యాలు రహస్యాలుగా వున్నంత కాలం ఫరవాలేదు. రహస్యం బట్టబయలయిందా, అతగాడి పతనం ప్రారభించిందన్నమాటే. అందుకనే ఎవరి రహస్యా లను వాళ్ళు జాగ్రత్తగా కాపాడుకోవాలి! నాకు మీ రహస్యాలు చాలా తెలుసు! మచ్చుకి ఒకటి వినిపించమన్నారా?" జవాబు కోసం ఆగాడు బదరీనాథ్ అతని కళ్ళల్లో చూస్తూ.

"ఊఁ" మూలిగాడు ప్రభంజనరావ్, కంటిమీద రెప్ప వాల్చ కుండా అతనికేసే చూస్తూ.

బదరీనాథ్ కోటు జేబులోంచి సిగరెట్టు కేసు తీసి లైటర్‌తో సిగరెట్టు వెలిగించుకున్నాడు. స్టైయిల్‌గా ఓ దమ్ములాగి గాల్లోకి

వదిలాడు. పక్కకి తిరిగి ఓ అడుగుముందు కేశాడు. కుడికాలు టీపాయ్‌మీద పెట్టి "చెబుతున్నా వినండి!" అన్నాడు.

ప్రభంజనరావ్ నిశ్చలంగా బదరీనాథ్ కేసే చూస్తున్నాడు.

"ఇప్పటికి సరిగ్గా ఐదేళ్ళనాడు జరిగిన సంఘటన. ఆ రోజు మీ ఆఫీసు గదిలో కూచుని ఏవో కాగితాలు తిరగేస్తుండగా ఓ అందాల సుందరి మిమ్మల్ని కలుసుకోవడాని కొచ్చింది. ఆమె పేరు సరిత. సరితకు పాతికేళ్ళుకూడా వుండవు. మహాశిల్పి చెక్కిన దంతపు బొమ్మలా వుంటుంది. ఉద్యోగంకోసం మిమ్మల్ని ఆశ్రయించింది. ఆమె అందం చూచి మీరు ముగ్ధులై పొయ్యారు. ఆమె అవివాహిత అనీ, అనాధ శరణాలయంలో పెరిగిందనీ తెలీగానే ఆమెమీద కాంక్ష పెరిగింది. ఎలాగయినా ఆమెను అనుభవించాలన్న కోరిక విజృంభించింది. తప్పకుండా సాయం చేస్తాననీ మరుసటి ఆదివారం సాయింత్రం ఆరుగంట లకు బంగళాలో కలుసుకోవలసిందనీ చెప్పారు. పాపమా అభాగ్యురాలు తన అదృష్టానికి మురిసిపోతూ థాంక్స్ చెప్పి వెళ్ళిపోయింది.

"మరుసటి ఆదివారం సరిగ్గా ఆరు గంటలకు చక్కగా అలంకరించుకుని తయారైంది సరిత. మీరామెను ఆహ్వానించి ఆదరించారు. టీకి పిలిచి కబుర్లు చెబుతూ మీ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కాని ఆమె అందుకు ఒప్పుకోలేదు. 'మీరు నా తండ్రిలాంటి వారు. ఇలాంటి కోరికను కోరడం భావ్యంకాదు' అని బ్రతిమిలాడింది. కాని మీరు వొప్పుకోలేదు. ఆమెను బల వంతం చెయ్యబొయ్యారు. ఆమె మీ ముంజేతిని కొరికి తప్పిం చుకు పారిపోవడానికి ప్రయత్నించింది. వెంటనే మీరు మీ ప్లేటు ఫిరాయించారు.

'లేనినవ్వు తెచ్చుకున్నారు. 'నీ శీలాన్ని పరీక్షించేందుకుయిలా చేశాను. నిజానికి నువ్వంటే నాకలాంటి అభిప్రాయం లేదు. భయపడకు!' అని వోదార్చారు. 'రేపు ఉదయం పదింటికల్లా నన్ను ఆఫీసులో కలుసుకో. నీ పని చేసిపెడతా'నని వాగ్దానం చేశారు.

"ఆ రాత్రే ఆమె అపహరింపబడింది. అడయారులోని మీ విశ్రాంతి భవనంలో హాజరు చెయ్యబడింది. మీరామెను నగ్నంగా అనుభవించారు. ఆమె అవయవాలతో ఆడుకున్నారు. రహస్యం బయట పడుతుందేమోనన్న భయంతో ఆమె నోటిని శాశ్వతంగా నొక్కేశారు. అంతే! ఆమె జాడలేదు. వారం రోజుల తరువాత, సముద్రపుటొడ్డున, చిరిగిన ఆమె జాకెట్టూ, రక్తపు మరకలతో నిండిన లంగామాత్రం పోలీసుల చేజిక్కింది. కాని ఏం ప్రయోజనం? ఆమెకోసం పోలీసులు ఇంకా గాలిస్తూనేవున్నారు. మీ ముంజేతి మీద ఆమె మిగిల్చిపోయిన పళ్ళగాట్లు మాత్రం పోలేదు."

"యూ స్కౌండ్రల్!" ప్రభంజనరావ్ కోటు జేబులోంచి రివాల్వర్ పైకి తీశాడు. పళ్ళు పటపట లాడించాడు. కళ్ళల్లోంచి నిప్పుకణాలు కురిపించాడు.

వెంటనే బదరీనాథ్ బిగ్గరగా వికటాట్టహాసం చేశాడు.

"మిస్టర్ రావ్ మీరు నన్నేమీ చెయ్యలేరు! మీ బెదిరింపులకి నేను లొంగను! కానీ వొక్క విషయం వినండి! నేను మీ రహస్యాన్ని బైటపెట్టి మిమ్మల్ని పోలీసులకి అప్పగించడానికి రాలేదు. మీ యీ రహస్యాన్ని భద్రంగా నా గుప్పెట్లో దాచి వుంచినందుకు, బహుమానం పుచ్చుకునేందుకే నే నిక్కడికి వచ్చాను. నా బహుమానం నాకిచ్చి పంపుతారో, అనవసరంగా పోలీసుల చేజిక్కుతారో తేల్చుకోండి!' అన్నాడు.

"ముందు మీ బహుమానం పుచ్చుకోండి మిస్టర్ బదరీనాథ్

పోలీసుల సంగతి తరువాత ఆలోచిద్దాం!'' అంటూ ప్రభంజన రావ్ తన రివాల్వర్‌ని బదరీనాథ్ గుండెలకి గురిపెట్టాడు. బొటన వ్రేలు ట్రిగ్గర్‌ని గట్టిగా నొక్కింది.

బదరీనాథ్ గజగజలాడి పోయ్యాడు. ఏదో చెప్పబోయేంతలోనే సైలెన్సర్ ఫిక్స్‌చేసిన రివాల్వర్‌లోంచి బైటికొచ్చిన బుల్లెట్, బదరీనాథ్ గుండెల్లోంచి. సర్రున దూసుకుపోయింది.

బదరీనాథ్ నేలగూలాడు.

అతని కళ్ళల్లోంచి తొంగిచూచిన ఆశ్చర్యం అనంతంగా వుండిపోయింది.

5

బదరీనాథ్ ఫోన్ చేస్తాడేమోనని ఆ రాత్రంతా ఎదురు చూశాడు శ్రీధర్. కాని అతన్నుండి ఫోన్‌కాల్ రాలేదు. మరుసటి రోజంతా గదిలోంచి ఎక్కడికీ వెళ్ళకుండా ఫోన్‌కాల్ కోసం ఎదురు చూస్తూ గడిపాడు. కానీ ప్రయోజనం కనిపించలేదు.

బదరీనాథ్‌కి వేషమే గనక లభించివుంటే తనకి తప్పకుండా ఫోన్ చేసేవాడు.కనీసం అతడు ప్రభంజనరావు గదిలోంచి ప్రాణాలతో బయటపడివుంటే తన్ను తప్పకుండా కలుసుకునేవాడు.

అతడు తనకు ఫోన్ చెయ్యలేదు. కనీసం, స్వయంగా నయినా కలుసుకోలేదు. అంటే అర్థం ఏమిటి?—అతడు ప్రభంజనరావు గదిలోంచి ప్రాణాలతో బయటపడలేదన్న మాట!తాను విసిరిన పాచిక పనిచేసినందుకు సంతోషించాడు. ఈ పీడ ఇంతటితో నయినా విరగడైనందుకు తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

'స్కౌండ్రల్! నిప్పుతో చెలగాట మాడుతాడా?' తృప్తిగా నవ్వుకున్నాడు డిటెక్టివ్ రచయిత శ్రీధర్.

★

పోటీ నెం. 36

1 ఒకటి నుండి తొమ్మిది వరకుగల అన్ని అంకెలను వాడి (జవాబుతో సహా) ఏడు లెక్కలను తయారు చేయండి. ఏ లెక్కలోనైనా ఒకసారి వాడిన అంకెను మళ్ళీ వాడకూడదు.

ఉదా : $1963 \times 4 = 7852$.

—కోడూరి నీలకంఠారెడ్డి, ప్రొద్దుటూరు.

2 ఈ క్రింది పదాలకు అయిదు అక్షరాలతో వచ్చే జవాబులను చెప్పండి చూద్దాం? అన్ని జవాబులకు మొదటి అక్షరాలు ఒకటే. చివరి అక్షరాలు ఒకటే.

1. సింగారము 2. చీకటి 3. ఆహారములేక 4. కీడు చేయుట 5. పొగరు 6. సందేహము 7. పరాభవము 8. ప్రేమ 9. సమయము 10. స్వల్పగుణము.

—ఎస్. కె. గౌస్‌బాష, నెల్లూరు-1.

3 రాము, సోము, సీత, గీత—నలుగురూ బజారుకెళ్ళి ఆపిల్ పళ్ళు కొనుక్కొని వస్తున్నారు. వారి నలుగురివద్ద కలిపి మొత్తం 62 ఆపిల్ పళ్ళున్నాయి.

"మనిద్దరి దగ్గర కలిపి సీత, గీతల దగ్గరున్న ఆపిల్స్‌కంటే 14 తక్కువున్నాయి." అన్నాడు రాము, సోముతో.

"మన దగ్గర వున్న ఆపిల్స్, గీత, రాముల దగ్గర వున్న ఆపిల్స్‌కు సమానం అవుతాయి" అంది సీత, సోముతో.

"నా దగ్గరివి, నీ దగ్గరివి కలిపినా, వారిద్దరి దగ్గరున్న పళ్ళ కంటే నాలుగు తక్కువే వుంటాయి" అన్నాడు రాము, సీతతో.

మరి, ఎవరి దగ్గర ఎన్ని ఆపిల్స్ వున్నాయో చెప్పగలరా ?

—పానుగంటి బదరీ నారాయణరావు, విజయవాడ.

4 45ను నాలుగు భాగాలుగా విభజించాలి. మొదటి భాగమునకు 2 కలిపితే, రెండవ భాగమునుండి 2 తీసివేస్తే, మూడవ భాగమును 2 చేత గుణిస్తే, నాలుగవ భాగమును 2 చేత భాగిస్తే వచ్చే ఫలితము ఒకటే వుండాలి.

మీరు విభజించగలరేమో ప్రయత్నించి చూడండి.

—జి. రామమోహన్‌రావ్, పసుపల్లి.

[పై నాలుగు సమస్యలకు మీ జవాబులను ఒక (పోస్ట్) కార్డుపైన వ్రాసి, యీ నెల 15వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. కరెక్టుగా వ్రాసిన వారి పేర్లను మార్చి' 74 సంచికలో ప్రచురించగలము.—ఎడిటర్].

పోటీ నెం. 34 (జవాబులు)

(1) PANIPAT

(2) కొడవటిగంటి కుటుంబరావు.

(3) వల

(3) 143143

పై జవాబులు కరెక్టుగా వ్రాసిన వారి పేర్లు ఇవి:

1. మిస్. ఐ. హేమప్రభ, బేగంపేట. 2. వి. మణిభూషణాచారి, జమ్మికుంట. 3. వజ్రాల రాజు, కడప. 4. పెండేల నాగేశ్వర రావు, నరసారావుపేట. 5. కోడూరి కమలారెడ్డి, గణిక

వారిపల్లె. 6. సుశీ అండ్ విజ్జీ, కర్నూలు. 7. మాజేటి వెంకట రామారావు, విజయవాడ. 8. ఎన్. మార్కే, సీలేరు ప్రాజెక్టు. 9. ఎమ్. శివబాలసుందరి, తుంబాలి. 10. ఆర్. ప్రభాకరరావు, సూర్యాపేట,

11. డి. కళ్యాణిదేవి, సింగరాయకొండ. 12. ఓ. ఉషా రాణి, వరగలి. 13. డి. ఎల్. సుజాత, బంగారపేట. 14. కోడూరి నీలకంఠారెడ్డి, ప్రొద్దుటూరు. 15. పి. హరిగోపాల రావ్, నరసారావుపేట, 16. ఎస్. విజయలక్ష్మి అండ్ ఎస్. మంజుల, సింగరాయకొండ. 17. పి. రత్నకుమారి, ఆకివీడు. 18. ఎస్. వాహిదాబాను, కడప. 19, కె. చందర్‌రావ్, సికింద్రా బాద్. 20. అహ్మద్ హుస్సేన్, మండపుర్రి.

21. మట్టేరాజా, ఏలేశ్వరం. 22. కురుమద్దాలి విజయలక్ష్మి, విజయవాడ. 23. భారతి, సికింద్రాబాద్. 24 పిల్లే రామచంద్ర రావు, పార్వతీపురం. 25. డి. మోహన్‌రావ్, శ్రీరాంనగర్. 26. వి. బి. కె, ఎమ్. నారపరాజు, మొగల్తూర్. 27. జల్దు బాబ్జీ, పార్వతీపురం, 28. ఎస్. ఆర్. కె. జగపతి రాజబహదూర్, నరసాపూర్. 29, కుమారి జి. నూకరత్నం, విశాఖపట్టణం. 30. కుమారి మీనా, కాకినాడ.

31, రంకిరెడ్డి రాము, తాడేపల్లిగూడెం. 32. సి. హెచ్. శోభారాణి, రాజమండ్రి. 33. ఏ. వీ. సుకుమార్, తిరుపతి. 34. ఏ. పద్మభారతి, ఖైరతాబాద్. 35. నీలం రామమూర్తి, కోరా పూట్. 36. జి. సూర్యప్రకాశ్, రాజమండ్రి. 37. వై. బాబు అండ్ వై. చిన్నారి, మద్రాసు. 38. ఎమ్. మధు, బిలాస్‌పూర్. 39. పమిడిమర్తి వెంకటరమణ, విజయవాడ. 40. పి. ఆనంద విజయకుమార్, విశాఖపట్టణం.

41, ఏ కళ్యాణి, విజయవాడ. 42. మిస్. మధుబాల, విజయ వాడ. 43, విమలాయెల్కార్, మద్రాసు. ★

క్రైమ్‌లో తమాషాలు

దొరికారు దేశద్రోహులు ??

(మొదటి బహుమతి రు. 10 లు పొందిన రచన)

ప్రత్యేకాంధ్రోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. అందుకని భారత ప్రధాని ఆంధ్రప్రాంతం సందర్శించటానికి వస్తున్నట్లుగా తెలిసింది. ప్రధానిమీద కుట్రలు జరుగుతున్నట్టుగా వార్త లందాయి అధికారులకు. వెంటనే సీక్రెట్ బ్రాంచ్ ఏజెంటులను, ప్రయివేట్ డిటెక్టివ్‌లను రంగంలో దింపారు అధికారులు కుట్రదారులను పట్టుకోమని. దానిలోనే మన డిటెక్టివ్ ధనాధన్ కూడా వున్నాడు.

అసిస్టెంట్ ఛటాఫట్‌ని వెంట తీసుకొద్దామనుకున్నాడు ధనాధన్. కానీ దేశద్రోహుల్ని పట్టుకున్న ఖ్యాతంతా తనొక్కడికే దక్కాలని ఒంటరిగానే ప్రవేశించాడు నగరంలోకి.

అర్ధరాత్రివేళ, ఆంజనేయదండకం మనసులోనే చదువుకుంటూ, ఒక ప్రహరీ గోడ చాటున నక్కాడు ధనాధన్.

ఆశ్చర్యం. లోపలి నుంచి మాటలు విన్పిస్తున్నాయి. చెవులు నిక్క బొడిపించేశాడు ధనాధన్.

“ప్రధాన మంత్రిని నేనే చంపుతా!”

“కాదు నేనే చంపాలి. కావాలంటే నువ్వెవర్నయినా మరో మంత్రిని చంపుకో.”

“సారీ గురూ! నీకా అవకాశం ఇవ్వను. ప్రధాన మంత్రిని నేనే చంపేస్తున్నాను.”

"సరే చూద్దాం. ఎవరు ముందు చంపుతారో."

ధనాధన్ అదిరిపోయాడు. 'తసాదియ్యా! నాకే దొరికారే దేశద్రోహులు. గుడ్‌లక్! వాళ్ల ప్రధాన మంత్రిని చంపటానికి బయలుదేరుతున్నారేమో! వాళ్ళని వెంబడించాలి. ఎలా? గోడ దూకాలి. చాల ఎత్తుగా ఉందే! అవును మరి దేశద్రోహుల స్థావరం గదా!'

ఎదురుగుండా కన్పించిన ఖాళీ తారు డబ్బాను చూసి తన అదృష్టానికి మురిసిపోతూ, దాన్ని దొర్లించి తెచ్చి, దాని మీద నుంచి ప్రహరీగోడ ఎక్కి లోనికి దూకేశాడు ప్రాణాలుగ్గబట్టు కుని. మాటలు విన్పిస్తున్న గదిలోకి ప్రవేశించాడు.

అక్కడ తెల్లటి దుస్తుల్లో ఇద్దరు కన్పించారు. మరికొంత మంది మంచాలమీద నిద్రపోతున్నారు. అంటే ముఠా చాల పెద్దదన్న మాట!

డిటెక్టివ్ గుండెలు కొత్తడోలులా మోగిపోతున్నాయి. నాడి చూసుకున్నాడు. నూట ఎనభై సార్లు కొట్టుకుంటోంది గుండె. ఫర్వాలేదు అనుకున్నాడు - వెన్నుచరుచుకున్నాడు. జేబులోని డమ్మీ బుల్లెట్స్ నింపిన పిస్టల్ తీసి పొజిషన్‌లో పట్టుకున్నాడు. వణికిపోతున్న కుడిచేతిని గట్టిగా పట్టేసుకున్నాడు ఎడంచేత్తో.

వాళ్ళు తనని చూశారు. కానీ ఏమీ కేర్ చెయ్యటం లేదు.

'డిటెక్టివ్ వచ్చాడని తెలిసికూడా చేతులెత్తి నించోరేంటి? చచ్చు దద్దమ్మలు...అవును..తను చెప్పాలికదూ చేతులెత్తమని!'

"హేండ్ ....కప్స్" అరిచేశాడు గట్టిగానే.

"ఒరే! ఇప్పుడు తేలిపోతుందిరా మన సంగతి. వీణ్ణి ఎవరు చంపుతారో వాళ్ళకే ప్రధాన మంత్రిని చంపే ఛాన్స్" అన్నాడొకడు.

"సరే."

ఇద్దరూ వచ్చేస్తున్నారు పెద్ద పెద్ద చేతులు చాపుకుంటూ

డిటెక్టివ్ మీదకి.

ధనాధన్ గుండె ఆగిపోయింది. వెంటనే ఎడంచేత్తో 'థనేల్' మని ఒక్క గుద్దు గుద్దుకున్నాడు గుండెలమీద. నిదానంగా కొట్టు కోవటం ప్రారంభించింది మళ్ళీ.

ధనాధన్ వేలు ట్రిగ్గర్‌ని రెండుసార్లు నొక్కేసింది.

"ఢాం....ఢాం" గదంతా దద్దరిల్లి పోయింది. గదిలోని వాళ్ళంతా లేచేశారు. ఇంతలో ప్రక్క గదిలోనుండి ఎవరో ఇద్దరు వచ్చి ధనాధన్ ముక్కు దగ్గర ఏదో పెట్టేశారు—పడి పోయాడు పాపం!

మళ్ళీ స్పృహ వచ్చింతర్వాత చుట్టూ కలయ చూశాడు ధనాధన్. అక్కడ తిరుగుతున్న వారి మెడల్లో వున్న పాముల్నీ, చేతులోని సూదుల్ని చూశాడు. అప్పుడర్థమయ్యింది డిటెక్టివ్ ధనాధన్‌కి తను రాత్రి ప్రవేశించింది పిచ్చాసుపత్రిలోననీ, తనను కూడా పిచ్చోడనుకుని క్లోరోఫాం పెట్టారనీ, మళ్ళీ లేవకుండా మంచానికి కట్టి పడేశారనీ!??

—పెనుబోతు ధర్మారావ్, మచిలీపట్టణం.

హాల్ట్ !!

(రెండవ బహుమతి రు. 5 లు పొందిన రచన)

డిటెక్టివ్ వివేక్ అతి ప్రయాసలతో ఎన్నో కష్టనష్టాల కోర్చి ఓ హంతకుడి రహస్య గృహాన్ని కనుగొన్నాడు. అర్థ రాత్రి సమయాన ఓ పిస్టల్, టార్చి లైట్లతో ఆ గృహంవైపు సాగాడు. దట్టమైన ఓ పెద్ద తోపులో వుందా రహస్యగృహం.

లైట్ వేయకుండా ఆ తోపులోని చీకట్లోకి పదడుగు లేశాక ఎవరో, ఎక్కణ్ణుంచో, "హాల్ట్!" అనర్చారు.

వివేక్ చటుక్కున ఆగి పిస్టల్‌ని సిద్ధంగా పట్టుకుని, అటూ, ఇటూ చూశాడు. నల్లని చీకట్లో అతని కెవరూ కనిపించలేదు.

"సర్, ఆగాను. ఇంకేం చేయమంటావ్?"

"ఏమో?" ఆ చీకటి కంఠం అంది. "మా బాస్ చెప్పలేదు. మూడు మార్లు హాల్ట్ చెప్పి. వచ్చిన మనిషి ఆగకపోతే, షూట్ చేయమన్నాడు!!" —ఎస్. వాహిద్, కడప.

అనుభవం?

ఆ పేటలో ఓ యింటిముందు క్రొత్తగా ఓ బోర్డు వెలిసింది.

ఆ బోర్డులో "దుమారం డిటెక్టివ్ ఏజెన్సీ. జి. దుమారం (ప్రైవేటు డిటెక్టివ్)—మా వద్ద సెక్రెటరీగా పనిచేయుటకు చురుకైన అనుభవజ్ఞుడైన యువకుడు కావలెను." అని ఉంది.

ఆ దారినే పోతున్న ఇరవై రెండేళ్ళ సన్యాసి ఖన్నా యథాలాపంగా ఆ బోర్డు చూసి, ఎగిరి గంతేసినంత పన్జేసాడు. సరాసరి ఆ యింట్లో జొరబడి కుర్చీలో కూర్చున్న డిటెక్టివ్‌ను గుర్తించి, "నమస్కారం సార్," అన్నాడు.

డిటెక్టివ్ దుమారం నొసలు చిట్లించి అడిగాడు, "ఎవర్నువ్?"

"సార్! నా పేరు సన్యాసి ఖన్నా, బి. యే. పాసయ్యాను. మీకు సెక్రెటరీ కావాలంటే వచ్చాను."

"ఓహో! అలాగా! సెక్రెటరీగా అనుభవమేమన్నా ఉందా?"

"ఉంది సార్! డిటెక్టివ్ కుటుంబంగారి దగ్గర మొన్నా, డిటెక్టివ్ సంతానంగారి దగ్గర నిన్నా పన్జేశాను."

"అదేమిటి? రోజు కొకరిదగ్గర పన్జేసేవాడివి. నా దగ్గర మాత్రం ఎన్నిరోజు లుంటావ్?"

"నేనెలా చెప్పగలను సార్?అది మీ మీద ఆధారపడిఉంది."

"అంటే?"

"మీరు డిటెక్టివ్ ఏజెన్సీని ఎన్నిరోజులు నడుపుతారో మరి నాకెలా తెలుస్తుంది సార్?" అన్నాడు సన్యాసి ఖన్నా.

—వి. బాలరాజేశ్వరరావ్, దేవరకొండ. ★

శత్రువులున్నారు
జాగ్రత్త!
కె. శివరాము

సీరియల్

[జరిగిన కథ: జుబీతాకు వివాహం కాలేదు, లూప్ పెట్టించుకుంది. కారణం తెల్సుకోండి_అంటూ కోరాడు దయాళ్, డిటెక్టివ్ యువరాజ్‌ని. దయాళ్ మాటలలో ఏదో నిగూడార్థం దాగివుందని గ్రహించిన యువరాజ్ పరిశోధనకు పూనుకున్నాడు. రాంపల్లికి బయలుదేరిన బస్సు ప్రమాదానికి గురికాగా, అందులో దయాళ్ మరణించాడు.

—ఇక చదవండి.]

(గతసంచిక తరువాయి)

5

"జుబీతా ప్రియుడు ఎవరు సార్?" అడిగాడు సూరి.

"గోడ్‌గాంకర్. పెద్ద రీసెర్చర్. ప్రభుత్వానికి, దేశానికి సహాయకారిగా వుంటున్నాడు." అని డ్రైవర్ తనకు చెప్పిన విషయాలు చెప్పాడు యువరాజ్, సూరికి.

"ఈ వయసులో జుబీతాతో అతడికి ప్రణయమేమిటి?" ఆశ్చర్యపోయాడు సూరి.

"కామానికి వయసుతో నిమిత్తం లేదేమో!"

"అయితేమాత్రం జుబీతా యెలా బోల్తా పడింది?"

"ఆ విషయాలు తెల్సుకోడానికే దయాళ్ మన సహాయం కోరాడేమో?"

"ఆ విషయమైతే చెప్పేవాడేగా! జుబీతా లూప్ పెట్టించుకుంది. ఎందుకు? తెల్సుకోవాలని దయాళ్ అన్నాడు."

"దాని వెనుక యేదో మర్మం వుంది. ఆ మర్మం మీకే తెలుస్తుంది అని చెప్పివున్నాడు దయాళ్. మఱచిపోకు" అని చెప్పాడు యువరాజ్.

"గోడ్‌గాంకర్ గురించి మీ అభిప్రాయం?" అడిగాడు సూరి.

"ఇకమీదట తెల్సుకోవాలి. అతను కోళ్ళ పెంపకానికి కని పెట్టు మందులేమిటి? ఇండియాలో గల 17 రాష్ట్రాలనుండి వచ్చు యువతులకు అతనిచ్చు శిక్షణేమిటి? పూర్తిగా తెల్సుకుంటాను" అనన్నాడు యువరాజ్.

"అయితే జుబీతా విషయం?"

"నీవు జాగ్రత్తగా మెలగి వివరాలు తెల్సుకో." అని చెప్పాడు యువరాజ్.

"యస్సార్!" అనంటూ సూరి వెంటనే బయలుదేరాడు. టాక్సీలో జుబీతా యింటికెళ్ళాడు. అక్కడ జుబీతా లేదు. జానీ క్లబ్‌కు బయలుదేరాడు.

జుబీతా అక్కడే వుంది.

జుబీతాను చూసిన సూరి నైస్‌గా నవ్వుతూ విష్‌చేశాడు.

"ఏమిటి లేట్‌గా వచ్చారు?" అడిగింది జుబీతా.

"ఏమీ లేదండి. పనుంటె....?" నసిగాడు సూరి.

"మీ పేరు?" అడిగింది జుబీతా.

"జానీ!" అబద్ధమాడాడు సూరి.

"మీ పేరు?"

"జుబీతా!"

"స్వీట్ నేమ్! ఏం పని చేస్తున్నారు?"

"గోడ్‌గాంకర్ దగ్గఱ కార్యదర్శిని!"

"ఇంత అందంగా వున్నావు. పెళ్ళి చేసుకోకపోయావా?"

"సరైనవాడు దొరకాలిగా?"

"సరైనవాడంటే?" అడిగాడు సూరి.

"అందంగాను, బలంగాను వుండాలి." చెప్పింది జుబీతా.

గతుక్కుమన్నాడు సూరి. ఆమె నైజం అవగాహన చేసుకో డానికి రెండు నిముషాలు పట్టింది, సూరికి.

"అందం, బలం వుంటే చాలా యీ కాలంలో? డబ్బు అక్కరలేదా" అడిగాడు సూరి.

"డబ్బు నే సంపాదిస్తాను."

"ఎలా?"

"ఎన్నో రకాలు."

సూరికి ఆమె తత్వం బోధపడిపోయింది.

"అయితే మీరు సంపాదనకు అవలంబించు మార్గం అతనికి నచ్చకపోతే?"

"నచ్చినవాడే మొగుడవుతాడు," చెప్పింది జుబీతా.

సూరి తల వొంచుకుని మౌనం వహించాడు.

"ఆఁ....మిస్టర్ జానీ, మీ కే దేశం నచ్చింది? అంటే మీకు నచ్చిన దేశమేది?" అనడిగింది జుబీతా.

ఆ ప్రశ్న సూరికి సంభ్రమం కలిగించింది. "ఎందు కడిగారు?"

"పనుంది గనక!"

"లక్సంబర్గ్ దేశం. ఈ లక్సంబర్గ్ ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీదేశాల మధ్య వుంది. ఈ దేశంలో వుద్యోగాలు చేయని వారంటూ లేరు. అంటే నిరుద్యోగులు లేరన్నమాట! అల్లర్లు, ఆర్భాటాలు, విప్లవాలు జరుగవు. సమ్మెలు జరగవు. స్త్రీలు ఆడంబరంగా, ఆకర్షణీయంగా వుంటున్నారు. పన్నులు చాలా చాలా తక్కువ. అక్కడి పోలీసులకు వాహనాల రాకపోకలు గమనించు పని తప్ప వేరే పనిలేదు. గనక ఆ దేశం నాకు నచ్చింది." అని చెప్పాడు సూరి.

"నేను ఆ దేశం వెళ్లిపోతాను."

"ఎలా వెళ్ళుతావు?"

"గోడ్‌గాంకర్ దగ్గఱ యిక కొంతకాలమే పనిచేస్తాను. ఆ కొంత కాలంలో కావలసిన డబ్బును ప్రోగుచేసుకుని పలాయనం చిత్తగిస్తాను," చెప్పింది జూలీతా.

"ఎందుకని?" అడిగాడు సూరి.

"సమయం వచ్చినపుడు చెప్తాను. కమాన్!" అనంటూ జూలీతా లేచింది.

"ఎక్కడికి?" అడిగాడు సూరి.

"మా యింటికి."

"మీ యింట్లో యెవరూ లేరా?"

"పేరుకు నాన్న వున్నాడు. కానీ అతను నాన్నకాదు!" చెప్పింది జూలీతా.

సూరి అదిరిపడ్డాడు. జూలీతా సంగతులు ఆశ్చర్యం గొలిపేవిగా వున్నవి. జూలీతాను వీలైనంత వఱకు వలలో వేసుకుని వివరాలు సేకరించాలనుకున్నాడు సూరి. జూలీతాను అనుసరించాడు.

హెరాల్డ్ కారు జూలీతా యింటి ముందాగింది.

అందముగా అలంకరించబడిన యిల్లు. ఖరీదైన వస్తువులు. నేలమీద తివాసీ, సూరి చూస్తూ నిలబడ్డాడు.

"కమాన్" పిలిచింది జూలీతా. అనుసరించాడు. పడకగదిలో కెళ్ళింది, వానిటీబాగ్ విసిరి అవతల పడవేసింది.

"కూర్చో" అన్నది.

సూరి కూర్చున్నాడు.

అద్దం ముందు నిలబడ్డ జూలీతా తన చీరను విప్పేసింది. లోలంగా వుంది. ఆ లంగా మోకాళ్ళ వఱకుంది, లంగా గుండా తొడల నునుపు స్పష్టంగా కనబడుతూ, సూరికి మత్తెక్కు-

తూంది. జాకెట్టు తీసేసింది. లోబాడీ కూడా తీసేసింది. నగ్నంగా వున్న వక్షోజాలు సూరిని మతి చలింపజేశాయి.

గుడ్డలు లేకుండా, నగ్నంగా సినిమాలలో నటించాలని పేరు మోపిన హాలీవుడ్ సినీతారలు మోజు చూపుతున్నారట! ఎందుకనో ఆడది తన శరీర సౌష్టవాన్ని నగ్నంగా ప్రదర్శించడానికి ఆశపడుతుంది. ఈ జుబీతా, తనని రెచ్చగొట్టడానికని సూరి గ్రహించాడు.

అంతలో, తలుపు తట్టిన చప్పుడైంది.

6

సూరి జుబీతా యింటికి బయలుదేరి వెళ్ళగానే, యువరాజ్ గోడ్‌గాంకర్ యింటికి వెళ్ళాలనుకున్నాడు, గోడ్‌గాంకర్‌తో మాట్లాడితే వివరాలు యేవైనా తెలియవచ్చు.

తన డ్రస్సింగ్‌రూములో కెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చాడు.

అంతలో ఇన్స్‌పెక్టర్ ధనార్జనరావు ప్రవేశించాడు.

"ఏమిటి యిలా వచ్చారు?" అడిగాడు యువరాజ్.

"పని వుంది. ఎక్కడికో బయలుదేరా రనుకుంటాను" అనంటూ ధనార్జనరావు కూర్చున్నాడు.

యువరాజ్ కూడా కూర్చున్నాడు. "ఎక్కడికి లేదులెండి, విషయమేమిటి?" అనడిగాడు.

"రాంపల్లికి వెళ్ళే బస్సు ప్రమాదానికి గురైంది!" చెప్పాడు ధనార్జనరావు.

"ప్రమాదానికి కారణ మేమిటి?"

"పాము!"

"ఒక పాము మూలంగా, అంతపెద్ద బస్సు ప్రమాదానికి గురైందా?" అని ఆశ్చర్యపడుతూ యువరాజ్ అడిగాడు.

"ఒక పాములవాడు, తన పామున్న బుట్టను బస్సు మీదుంచి

ప్రయాణిస్తున్నాడు. పాము బుట్ట అదురుళ్ళకు తెలుచుకుని, పాము బయట కొచ్చి, డ్రైవర్ సీటు దగ్గర కెళ్ళింది. డ్రైవర్ బెంబేలు పడిపోయి స్టీరింగ్ కంట్రోలును వదిలాడు. ఫలితంగా బస్సు యాక్సిడెంట్ అయింది,'' అని చెప్పాడు ధనార్జనరావు.

''విశేషాలేమిటి?''

''ఇరవై మంది మరణించారు. మరణించిన వారిలో దయాళ్ అనునతను వున్నాడు'' అని ధనార్జనరావు ఒక డైరీని యువ రాజ్‌కు అందిస్తూ, ''ఈ డైరీ అతని జేబులో వుంది. మీకు అప్పగించినట్లు, కేసును గురించి వ్రాసుకుని వున్నాడు. పైగా మీరు నాకు మొన్న చెప్పారు కూడా!'' అన్నాడు.

యువరాజ్ డైరీ పేజీలు తిరగవేశాడు. చూస్తున్నాడు.

''ఎవరితను? ఏ వూరు? బంధువు లెవరు? తెలియడం లేదు'' అని చెప్పాడు ధనార్జనరావు.

''ఆ విషయాలు విచారించలేదు. అడ్రసు యిమ్మంటే హోటల్ జోకర్‌లో బసచేసినట్లు చెప్పాడు'' అంటూ యువ రాజ్ డైరీ పేజీలు గమనిస్తున్నాడు.

డైరీలో, ఒక పేజీలో ఇలా వుంది.

''జుబీతా లూప్ పెట్టించుకున్న విషయం యువరాజ్‌కు చెప్పాను. యువరాజ్ పరిశోధనకు పూనుకుంటాడు, విషయా లన్నీ తెల్సుకుంటాడు.''

మరోపేజీలో—''గోడ్‌గాంకర్ దగ్గర జరగబోయే కుట్రను యువరాజ్ పసిగట్టగలుగుతాడు. నేను పసిగట్టలేననే జుబీతా పేరుతో కేసును యువరాజ్‌కు అప్పగించాను! రాంపల్లిలో కుట్రకు గల ఆచూకీ తెలియవచ్చు'' అని వుంది.

''ఈ డైరీలో గోడ్‌గాంకర్ దగ్గర జరుగబోయే కుట్రను నేను పసిగట్టగలనని దయాళ్ వ్రాసుకుని వున్నాడు. ఏమిటా

కుట్ర? వెనక వున్న గూడుపుఠాణి దారులెవరు? తెల్సుకోవాలి."
"ఇంతకీ యీ దయాళ్ యెవరు?"
"సీక్రెట్ బ్రాంచ్‌కు సంబంధించిన వాడై వుండాలని నా వూహ. సీక్రెట్ బ్రాంచ్ డైరెక్టర్ బడోద్కర్‌కు ట్రంకాల్ చేసి తెల్సుకుందాం," అని చెప్తూ టెలిఫోన్‌ను డయల్ చేశాడు యువరాజ్.

"మీరు గోడ్‌గాంకర్ గురించి వాకబు చేయండి. అతని గురించి మీ కేవైనా విషయాలు తెల్సింటే చెప్పండి," అనడిగాడు యువరాజ్.
"గోడ్‌గాంకర్‌కు ప్రభుత్వరంగంలో మాంచి పలుకుబడి వుంది. సైంటిస్టు, గ్రేట్ రీసెర్చర్!" అని చెప్పాడు ధనార్జనరావు.
"మీకు తెల్సింది అంతేనా?"
"అంతే!"
యువరాజ్ మౌనంగా దయాళ్ డైరీని తిరగేస్తున్నాడు. ధనార్జనరావు, "నేను వెళ్ళుతాను" అన్నాడు.
"అలాగే!" చెప్పాడు యువరాజ్.
ధనార్జనరావు వెళ్ళిపోయాడు.
టెలిఫోన్ గణగణ మ్రోగింది. యువరాజ్ రిసీవరందుకున్నాడు. "యువరాజ్ స్పీకింగ్!" అన్నాడు.
"బడోద్కర్ హియర్!" అని వినబడింది.

"మీ బ్రాంచ్‌లో దయాళ్ అనునతను యెవరైనా వున్నారా?" అనడిగాడు యువరాజ్.
"దయాళ్ యెలా వుంటాడు?" అడిగాడు బడోద్కర్.
"బక్కపలుచగా వుంటాడు. వెనుకకు దువ్విన వెంట్రుకలు, సూటిగా వున్న ముక్కు, కోలముఖం, బలమైన శరీరం." చెప్పాడు యువరాజ్.

"జస్ట్ వెయిట్ ఎ మెనిట్!" అని బడోద్కర్ అయిదు నిముషాలు మౌనంగా వుండిపోయాడు. యువరాజ్ ఆత్రుతగా టెలిఫోన్‌లో మాటలకు యెదురు చూస్తున్నాడు.

"మిస్టర్ యువరాజ్, దయాళ్ సీక్రెట్ బ్రాంచ్ ఏజెంట్! విషయం యేమిటి?" అడిగాడు బడోద్కర్.

"దయాళ్ బస్సు ప్రమాదంలో మరణించాడు" అని చెప్పాడు యువరాజ్.

"ఓ మైగాడ్! దయాళ్ ఒక వున్నత శ్రేణికి చెందిన ఏజెంట్!" అనంటూ బడోద్కర్ తన విచారాన్ని తెలియపఱిచాడు. వెంటనే, "అతనిని గుఱించి మీరెందుకు అడుగుతున్నారు?" అని ప్రశ్నించాడు.

"నా కొక కేసుని అప్పగించాడు. దయాళ్ మీకేవైనా రిపోర్టులు పంపివున్నాడా?" అనడిగాడు యువరాజ్.

"ఆఁ....పంపివున్నాడు. వాటి సారాంశం, గోడ్‌గాంకర్ దగ్గర యేదో కుట్ర జరుగబోతుందని, ఆ కుట్ర అతిభీకరంగా, దారుణంగా వుండవచ్చని, అందుకు జూబీతా అనే అమ్మాయిని పాచికలా వాడుకుంటున్నాడని, తనకు సాధ్యపడడం లేదు గనక యువరాజ్ సహాయం అర్థించానని రిపోర్టిచ్చాడు." అని చెప్పాడు బడోద్కర్.

"అయితే మీరు వేరే ఏజెంట్లను పంపలేదా?"

"పంపాను. వాళ్ళనుండి రిపోర్ట్ అందలేదు."

"ఆ జరుగబోయే కుట్ర ఆచూకిని గురించి వివరాలేవైనా తెల్సాయా?" అడిగాడు యువరాజ్.

"తెలియడంలేదు యువరాజ్! మీరు పూనుకుని ఛేదించండి. ప్రస్తుతం విదేశ కుట్రదారుల, గూఢచారుల, కలాపాలు మితిమించి పోతున్నవి. ప్రతి భారతీయుడు ఆ కలాపాలను అరికట్టక